ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ అష్టమి రా. 10.08 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: కృత్తిక ఉ.10.34 వరకు, అనంతరం రోహిణి; అమృతకాలం: ఉ. 8.15 నుండి 9.45 వరకు, తె. 6.10; వర్జ్యం: రా. 1.40 నుండి 3.10 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00వరకు; యమగండం: మ.3.00 నుండి 4.30వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!



సంపుటి:56 • సంచిక:313 • శుక్రవారం 23 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

• ప్రగతి భవన్‌కు గవర్నర్ దంపతులు...



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ దంపతులు. చిత్రంలో మంత్రి కేటీఆర్

వివరాలు 10లో...

19వేల ఎకరాల్లో ఫార్మా క్లస్టర్

ఐటీ నెం 1 లైఫ్ సైన్సెస్‌లో

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మొండి వ్యాధులు అతితక్కువ ఖర్చుతో వ్యాకిన్లు అందించిన ఘనత తెలంగాణలోని ఫార్మా దిగ్గజాలదే. ఇప్పటికే వందకు పైగా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలు హైదరాబాద్‌లో ఉన్నాయి. మరెన్నో ప్రపంచ దిగ్గజ ఫార్మా కంపెనీలు తెలంగాణకు రాబోతున్నాయి. హైదరాబాద్ వాతావరణం, సీఎం కేసీఆర్ సహకారం అందిస్తున్న ప్రోత్సాహమే కారణం. అన్నిరంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉంది.

- గ్లోబల్ వ్యాక్సిన్ హబ్‌గా హైదరాబాద్
- ప్రపంచ వ్యాక్సిన్లలో 33% ఇక్కడివే
- ఆసియాలోనే అతిపెద్ద క్లస్టర్‌గా
- జీనోమ్ వ్యాలీ... మరింత విస్తరణ
- నూతన ఆవిష్కరణలు, పరిశోధనల్లో
- వందకుపైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు
- ఇమ్యునాలజీ, నానో మెడిసిన్‌లో
- కొత్త కోర్సులు ప్రారంభిస్తాం

నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు... ఉత్పాదక రంగాలపై పరస్పర చర్చ, సహకారానికి సదస్సులు దోహదం

బయో ఏసియా సదస్సులో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐటీ, ఫార్మారంగాలలో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకునేందుకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు సారథ్యంలో ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారక రామారావు చెప్పారు. అందులో భాగంగానే 19 వేల ఎకరాలలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా ఇంక్యుబేటర్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ యోచి స్తున్నట్లు కేటీఆర్ చెప్పారు. గురువారం హెచ్ఐసీసీలో బయో ఏషియా -2018 సదస్సును మంత్రి ప్రారంభించారు. ఈ సదస్సు ఈ నెల 24వరకు మూడ్రోజుల పాటు జరుగుతుంది.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రపంచమంతా ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టిసారించిందని, ఈ రంగానికి తెలంగాణలో తయారవుతున్న వ్యాక్సిన్‌లు ఇతర ఔషధాలు ఉపయోగపడు తున్నాయని తెలిపారు. చారిత్రక హైదరాబాద్ నగరంలో 15వ బయో ఏషియా సదస్సు నిర్వహించడం ద్వారా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు, ఉత్పాదన రంగాలపై పరస్పరం చర్చించుకునే అవకాశం ఉందన్నారు. ఐర్లాండ్, మలేషియా,దక్షిణ కొరియా తదితర దేశాలకు చెందిన ఫార్మా కంపెనీల దిగ్గజాలు, ప్రతినిధులు, పరిశోధకులు ఈ సదస్సుకు హాజరుకావడం సంతోషంచదగ్గ విషయమన్నారు. ఫార్మా రంగంలో 35 శాతం ఉత్పాదనలు తెలంగాణ నుంచే కావడం రాష్ట్రం ఇస్తున్న సహకారానికి నిదర్శనమన్నారు. హైదరాబాద్ గ్లోబల్ వ్యాక్సిన్ హబ్‌గా 2వ పేజీలో...



హెచ్ఐసీసీలో జరిగిన బయో ఏసియా సదస్సులో వివిధ దేశాల పారిశ్రామిక దిగ్గజాలతో ఐటీ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ కార్యదర్శి జయేష్ రంజన్

వ్యవసాయ అభివృద్ధి చర్యలు క్షేత్రస్థాయికి చేరవేతకు

రైతు కార్పొరేషన్

లాభాపేక్ష లేకుండా నడిచేలా సంస్థ ఏర్పాటు • తెలంగాణ రాష్ట్ర సమన్వయ సమితి ఏర్పాటుపై సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరిట రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ ప్రారంభించాలని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. వ్యవసాయాభివృద్ధి-రైతు సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు, చర్యలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు ఈ కార్పొరేషన్ వారధిగా ఉంటుందని ఆయన ప్రకటించారు. లాభాపేక్షలేని సంస్థ(నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్) తరహాలో ఈ కార్పొరేషన్ పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. ఈ సంస్థకు సమకూరిన నిధులను సంస్థేర్పాటు లక్ష్యాల సాధన కోసమే వినియోగిస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల తరహాలోనే త్వరలో జిల్లా, రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితులు కూడా ఏర్పాటవుతాయని ఆయన చెప్పారు. రైతు సమన్వయ సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలను నిర్ణయించడంతో పాటు ఈనెల 25, 26తేదీల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సులపై గురువారం ఆయన ప్రగతి భవన్‌లో సమీక్షించారు. విత్తనం నాటిన దగ్గరనుంచి పంటకు మద్దతు ధర వచ్చే వరకు ప్రతీ దశలోనూ రైతు సమన్వయ సమితులు చురుకైన పాత్ర పోషించేలా వారికి విధులు, బాధ్యతలుంటాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతు సమన్వయ సమితిల్లో కనీసం 51 శాతం మంది బలహీన వర్గాలు, మహిళలు ఉండేలా నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే సదస్సుల్లో మండల రైతు సమన్వయ సమితి సభ్యులతోపాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్ పర్సన్‌లు హాజరుకావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. రైతులు పరస్పరం తమ అభిప్రాయాలు పంచుకోవడం కోసం, నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించుకోవడం కోసం పరతీ ఐదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 2630 2వ పేజీలో...

చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి?



కంపెనీ చట్టం ద్వారా కార్పొరేషన్ ఏర్పాటు

డైరెక్టర్లు, చైర్మన్ నియామకానికి తొలగిన అడ్డంకులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేరిట కార్పొరేషన్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కంపెనీ చట్టంకింద ఈ కార్పొరేషన్ ఏర్పాటుతో చైర్మన్, డైరెక్టర్ల నియామకం ఏవిధంగా ఉండాలనే అంశంపై ప్రభుత్వం ప్రాథమికంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కార్పొరేషన్‌కు నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి చైర్మన్ అయ్యేందుకు దాదాపుగా మార్గం సుగమం అయినట్లుగానే ప్రస్తుత 2వ పేజీలో...

ప్రధానికి మారిషస్ సర్కారు నోటీసులు



అంతర్జాతీయ కోర్టుకు ఇందుటెక్ కేసు

న్యూఢిల్లీ: ఇందుటెక్ జోన్ పెట్టుబడుల కేసు మరింత సంక్లిష్టంగా మారింది. ఆ వ్యవహారంలో మధ్యవర్తిత్వం కోసం మారిషస్ ప్రభుత్వం భారత్‌ను అంతర్జాతీయ కోర్టుకు లాగింది. ఒక జాతీయ మీడియా కథనం ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) ద్వారా ఇందుటెక్ జోన్‌లో 49 శాతం వాటాలు దక్కించుకున్న మారిషస్‌కు చెందిన కరిస్సా ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సి మారిషస్ ప్రభుత్వాన్ని ఆశ్రయించింది. కరిస్సా ఎల్ఎల్‌సి మోసానికి గురైంది అని పేర్కొంటూ మారిషస్ ప్రభుత్వం ప్రధాని మోడీ పేరిట ఒక లీగల్ నోటీసు జారీ చేసింది అని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల కల్పన కార్పొరేషన్ (టిఎస్‌ఐఐసి) ఉన్నతాధికారిని సదరు జాతీయ మీడియా సంస్థ ఉటంకించింది. ఇందుటెక్ 3వ పేజీలో...

బీఎస్ఈ లిస్టింగ్‌లో జీహెచ్ఎంసీ

- హైదరాబాద్ సిగ్నల్ ఫ్రీ రహిత పనులకు
- బాండ్ల ద్వారా రూ.200 కోట్లు సమీకరణ
- అన్ని మునిసిపాలిటీలకు జీహెచ్ఎంసీ ఆదర్శం
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి



గంట మోగించి బీఎస్ఈ లిస్టింగ్‌ను ప్రారంభిస్తున్న సీఎస్ ఎస్.కె. జోషి, మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బాండ్ల ద్వారా తొలివిడతగా రూ.200 కోట్ల నిధులను సమీకరించి హైదరాబాద్ నగర పాలక సంస్థ అధికారికంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో నమోదైంది. ఈ నిధులతో హైదరాబాద్ నగరాన్ని సిగ్నల్ ఫ్రీ రహిత నగరంగా చేయడా నికి చేపట్టిన వ్యూహాత్మక రహదారుల పథకాన్ని (ఎస్ఆర్‌డిపి) చేపడతారు. ఆర్థిక క్రమ శిక్షణ, ఆదాయ మార్గాల స్థిరత్వం, అంతర్గత వనరుల వృద్ధి, మిగులు నిధులు తదితర అంశాల్లో నమ్మకమైన పురపాలక సంస్థగా ఏఏ స్టేబుల్ రేటింగ్ సాధించడంతో బాండ్ల జారి సులువైంది. దశల వారిగా ఎస్ఆర్‌డిపి కోసం వెయ్యి కోట్లను బల్దియా బాండ్ల రూపంలో సేకరించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మొదటి దశలో 200 కోట్లను సేకరించింది. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అట్టహాసంగా 3వ పేజీలో...

సింగరేణిపై ప్రయివేటు కత్తి



- కేంద్ర నిర్ణయంపై కార్మికుల్లో ఆందోళన
- తాడిచర్ల తరహాలోనే... మరిన్ని గనులు
- భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు: కార్మిక సంఘాలు
- కార్పొరేట్ పోటీతో జీవన విధ్వంసం
- పర్యావరణవేత్తల ఆందోళన
- కొత్త గనులు ఇక లేనట్టే..?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సింగరేణి భవిష్యత్తుపై ఆందోళనలు ముసురుకుంటున్నాయి. బొగ్గుగనుల ప్రైవేటీకరణకు కేంద్రం పచ్చజెండా ఊపడంతో.. సింగరేణిలోనూ ఇబ్బడిముబ్బడిగా ప్రైవేట్ గనులకు ద్వారాలు తెరుస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. బొగ్గుగనుల్లో ప్రైవేట్‌రంగం ప్రవేశిస్తే దేశవ్యాప్తంగా కార్పొరేట్ చేతుల్లోకి పరిశ్రమ వెళ్తుందని కార్మికసంఘాలు ఆరోపిస్తున్నాయి. బొగ్గుగనుల ప్రైవేటీకరణ ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్రాలకే అందిస్తామని కేంద్రం ప్రకటించడంతో.. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. కార్మికసంఘాలు, కార్మికులంతా ఈ వ్యవహారంపై భగ్గుమంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా నిరసనలకు సన్నద్ధమవుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో గత 130ఏళ్ళుగా బొగ్గు తవ్వకాలు జరుగుతుండగా, ఇప్పటివరకు 1310మిలియన్ టన్నుల బొగ్గుమాత్రమే వెలికితీశారు. ఇంకా సింగరేణి ప్రాంతంలో 10846.17మిలియన్ టన్నుల బొగ్గునిల్వలున్నాయి. ప్రస్తుతం తీస్తున్న ఉత్పత్తి ప్రకారం తీస్తే మరో 150ఏళ్ళకు సరిపడా బొగ్గునిల్వలున్నాయి. ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా 52వేల మంది పనిచేస్తుండగా, కేంద్ర నిర్ణయం అమల్లోకి వస్తే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో లాభనష్టాల బేరీజు వేసుకుని.. కొన్ని గనులకు మాత్రమే కేంద్రం అనుమతినివ్వగా, ఇపుడు మొత్తం పెట్టుబడుల ఉపసంహరణకు, ప్రైవేటుకు గేట్లు బార్లా తెరవడంతో సింగరేణిలోనూ ఇబ్బడిముబ్బడిగా ప్రైవేటు గనులు రానున్నాయి. ఇప్పటికే తాడిచర్ల బొగ్గుగనిని ప్రైవేటు సంస్థ దక్కించుకోగా, అదే తరహాలో పలు గనులకు సంబంధించిన ప్రతిపాదనలపై సింగరేణి ఇప్పటికే కసరత్తులు ప్రారంభించింది. ప్రస్తుతం సింగరేణిలో 18ఓపెన్‌కాస్ట్‌లు, 29 భూగర్భగనులు ఉండగా.. కొత్తగా అనేక గనుల ప్రారంభానికి యాజమాన్యం ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంది. తాజాగా కేంద్ర నిర్ణయంతో ప్రతిపాదనలపై పున:పరిశీలన జరపాలని భావిస్తోంది.

ప్రస్తుతం ప్రభుత్వరంగసంస్థ సింగరేణి కాలరీస్ బొగ్గుతీస్తుంటేనే పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా.. 3వ పేజీలో...



ఫేస్‌బుక్‌లో సీఎంకు సందేశం

రైలు కిందపడి జంట ఆత్మహత్య

పాపను స్టేషన్లో వదిలేసి బలవన్మరణం



మెదక్-తూప్రాన్, ప్రభన్యూస్: వివాహేతర సంబంధం ఇద్దరి మధ్య విడదీయలేని బంధంగా మారింది..వరుసకు తమ్ముడి భార్యతో బావ నడిపిన వ్యవహారం చివరికి ఇద్దరి ప్రాణాలు తీసుకునేలా చేసింది. ఇంతటితో ఆగకుండా 3వ పేజీలో...





నా బ్రాండ్ దెబ్బ తీశారు



- పీఎన్‌బీకి నీరవ్ మోడీ మెయిల్
- చెల్లింపు ప్రణాళికతో రావాలని
- పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రత్యుత్తరం
- రొటోమాక్ యజమాని కొఠారి అరెస్ట్

రైతు కార్పొరేషన్

(మొదటిపేజీ తరువాయి)

రైతు వేదికలను నిర్మించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ రైతు వేదికలను వీలైనంత త్వరగా నిర్మించాలని అధికారులను ఆయన ఆదేశించారు. రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను మండల రైతు సమన్వయ సమితిలు తీసుకోవాలని సూచించారు. రైతు వేదికల నిర్మాణం కోసం అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములనుంచిగానీ, దాతల నుంచిగానీ, కొనుగోలు చేయడంద్వారాగానీ రైతు వేదికల కోసం స్థలం సేకరించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు బి వినోద్ కుమార్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, బాల్క సుమన్, అడ్వొకేట్ జనరల్ ప్రకాశ్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శులు ఎస్ నర్సింగ్‌రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ఏర్పాటు ఉత్తర్వులు జారీ

రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా కార్యాచరణను వేగవంతం చేసింది. రైతు సమన్వయ సమితీలను ఏర్పాటు చేసి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రభుత్వం ఆ దిశలో మరో అడుగు ముందుకు వేసింది. తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి పేర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.లాభాపేక్ష లేని సంస్థగా కార్పొరేషన్ పని చేస్తుంది. 2013 కంపెనీల చట్టం సెక్షన్ 9 ప్రకారం రిజిస్టర్ చేస్తారు. కార్పొరేషన్‌కు చైర్మన్‌గా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్లుగా వ్యవసాయ, ఉద్యాన శాఖకమీషనర్లు వ్యవహరిస్తారు. మేనేజింగ్ డైరెక్టర్‌గా తెలంగాణ రాష్ట్ర రైతు సమితి అధికారి ఉంటారు. ఆర్థిక శాఖ ప్రతిపాదించిన నామిని, 6 నుంచి 15 మంది రైతులు ప్రతినిధులుగా ఉంటారు. మొదటి డైరెక్టర్లుగా వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి పార్థసారథి, కమీషనర్ డాక్టర్ జగన్ మోహన్, ఉద్యాన శాఖ కమీషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ జి లక్ష్మీ బాయి ఉంటారని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. పూర్తి స్థాయి మేనేజింగ్ డైరెక్టర్‌ను నియమించే వరకు వ్యవసాయ శాఖ కమీషనరే కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు, ఉత్పత్తి పెంచేందుకు ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. రైతులకు మద్దతు ధర కల్పించడం, అవసరమైనప్పుడు ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవడం, ఆహార ఉత్పత్తుల్లో నాణ్యతను పెంపొందించడంలో కార్పొరేషన్ విధులు నిర్వహిస్తుంది. అదే విధంగా వ్యవసాయం,ఉద్యాన, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, ఆగ్రోస్, ఆయిల్ ఫెడ్, ఇతర సంస్థలను సమన్వయం చేస్తుంది. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఫుడ్ పార్కుల ఏర్పాటును పరిశీలిస్తుంది.



చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి?

(మొదటిపేజీ తరువాయి)

పరిస్థితి అద్దం పడుతోంది. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ఏర్పాటైన రైతు సమన్వయ సమితులను దీనికి అనుసంధానం చేసే అంశంపై కీలక సూచనలు సేకరించినట్లు సమాచారం. కాగా ఈ నూతన కార్పొరేషన్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేయనుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. తద్వారా ఈ వ్యవస్థ ఫెడరేషన్(సమాఖ్య) తరహాలో సేవలందించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నూతన కార్పొరేషన్‌లో వ్యవసాయ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలకు చోటు దక్కే అవకాశాలు కూడా లేకపోలేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. కాగా రాష్ట్ర రైతు సమన్వయ సమితి, రైతు కార్పొరేషన్ రెండూ వేర్వేరు వ్యవస్థలుగా నడవనున్నాయి. రెండింటికీ చైర్మన్ ఒక్కరే ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండగా, కార్పొరేషన్‌కు మాత్రం ఎండీగా ఐఏఎస్‌ను నియమించేలా కసరత్తు చేస్తున్నారు. 15 మంది డైరెక్టర్లు ఉండేలా కార్యాచరణ చేస్తున్నారు. రాష్ట్రరైతు సమన్వయ సమితిని 42 మందితో ఏర్పాటు చేయనున్నారు. రైతు సమావేశాలకుగానూ రాష్ట్రవ్యాప్తంగా 2630 రైతు వేదికలను నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందుకు అనువుగా ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగనున్నట్లు తెలిసింది. ఒక్కో మందిరానికి దాదాపు 13 లక్షల చొప్పున కేటాయించే అవకాశం ఉంది.



ఐటీ లైఫ్ సైన్సెస్‌లో నెం 1

(మొదటిపేజీ తరువాయి)

మారిందని, ప్రపంచంలో తయారయ్యే వ్యాక్సీన్‌లలో 33 శాతం ఇక్కడి ఫార్మా కంపెనీల నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు. ఫార్మా, ఐటి రంగాలు రాష్ట్ర వృద్ధిరేటు పెరిగేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. 14 వ బయో ఏషియా సదస్సు సందర్భంగా ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పారిశ్రామిక క్లస్టర్లకు స్థానిక అధికారాలు అప్పగించడం జరిగిందన్నారు. దీనివల్ల అనుమతుల విషయంలో జాప్యం జరగదని కేటీఆర్ అన్నారు. నగరంలో ఉన్న జినోమ్ వ్యాలీ ఆసియాలోనే అతిపెద్ద క్లస్టర్‌గా ఆయన అభివర్ణించారు. జీనోమ్ వ్యాలీలో పరిశోధనలు, విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. 10 వేల మందికి పైగా పరిశోధకులు, సాంకేతిక సిబ్బంది బయోసైన్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పని చేస్తున్నారని పేర్కొన్నారు. నగరానికి చెందిన ఫార్మా కంపెనీలు భారత్ బయోటెక్నాలజీ, శాతా బయోటిక్, బయోలాజికల్ ఇవాన్స్ తదితర సంస్థలు తక్కువ ధరకే వ్యాక్సీన్‌లను సరఫరా చేస్తూ రాష్ట్ర ఖ్యాతిని నిలబెడుతున్నాయని ప్రశంసించారు. దాదాపు 100కి పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు నూతన ఆవిష్కరణల పరిశోధనల్లో నిమగ్నమయ్యాయని కేటీఆర్ వివరించారు. ఇమ్యునాలజీ, నానో మెడిసిన్ రంగాలలో కొత్త కోర్సులు ప్రారంభించాలని యోచిస్తున్నామని, కంపెనీల్లో పని చేసే వారికి వృత్తి నైపుణ్యం ఉండాలని భావిచి తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ (టాస్క్) ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వచ్చే పదేళ్లలో ఈ రంగాల ద్వారా పెద్దయెత్తున ఉద్యోగ, ఉపాధి కల్పించాలనే దిశలో ప్రభుత్వం తన కార్యక్రమాలు చేపడుతుందన్నారు.ఈ సదస్సుకు అస్సోం మంత్రి కేశవ్ మహంతి హాజరుకావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గుజరాత్ ప్రభుత్వం కూడా తన సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. ఈ సదస్సులో ఐర్యాండ్‌కు చెందిన పరిశోధకుడు ప్రొఫెసర్ ఆండ్రూ మాట్లాడుతూ, ఫార్మా రంగంలో తమ దేశం ప్రపంచంలోనే మొదటి పది స్థానాల్లో ఉందన్నారు. ఇలాంటి సదస్సులకు తమ సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఐటి శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్, నోవార్టీస్ ప్రతినిధి నవీన్ గొల్లపల్లి, భారత్ బయోటెక్ సీఎండీ డాక్టర్ క్రిష్ణా ఎల్లా, బయలాజికల్ ఇవాన్స్ ఎండి మహిమా దాట్ల, అరబిందో ఫార్మా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మదన్ మోహన్ రెడ్డి, స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రొఫెసర్ మైకెల్ ఎన్ హాల్, తెలంగాణ లైఫ్ సెన్సెస్ అకాడమీ చైర్మన్ డి బాలుసుబ్రమణ్యం, టీఎస్‌ఐఐసి చైర్మన్ ఇవి నర్సింహారెడ్డి,డెలాయిట్ వైస్ చైర్మన్ గ్రేగరి రే, నోవార్టీస్ ఇండియా అధ్యక్షుడు జావేద్ జియా, రెడ్డీస్ లాబోరేటరీ చైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో 52 దేశాలకు చెందిన 16 వందల ప్రతినిధులు పాల్గొన్నారు.

బయోటెక్‌లో పీజీ చేశా: కేటీఆర్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నేను బయోటెక్నాలజీలో పీజీ చదివాను... అందుకే బయో ఏషియా -2018 సదస్సులో పాల్గొనటం సంతోషంగా ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కె తారకరామారావు చెప్పారు.గురువారం బయోఏషియా సదస్సును ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా తన చదువు విషయం కేటీఆర్ వివరించారు. బయోటెక్నాలజీ రంగంలో జరుగుతున్న పరిశోధనలపై తనకు ఉన్న ఆసక్తిని వివరించారు. వచ్చే పదేళ్లలో ఈ రంగంలో 4 లక్షల మందికి ఉపాధి కల్పించాలనేది తమ లక్ష్యమన్నారు.

తెలంగాణ, మలేషియా మధ్య ఎంఓయూ

బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరిశోధనలకై తెలంగాణ రాష్ట్రం , మలేషియాలోని సెంట్రల్ స్పెక్ట్రం, ఎస్డీన్ బిహెచ్‌డి (సీఎస్ఎస్‌బి) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం ప్రారంభమైన బయో ఏషియా -2018 సదస్సులో రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి సమక్షంలో ఎంఓయూ కుదిరింది. తెలంగాణ రాష్ట్రం తరపున టీఎస్ ఐఐసి వైస్ చైర్మన్, ఎండి ఈవి నర్సింహారెడ్డి, మలేషియా దేశానికి చెందిన సీఎస్ఎస్‌బి తరపున సీఈఓ దాతో మహమూద్ అబ్బాస్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వైద్య, ఆరోగ్యం, మెడికల్ డివైజెస్‌పై కూడా రెండు రాష్ట్రా లు పరిశోధనలు జరుపుతాయి.

ప్రొఫెసర్ మైకెల్‌కు జినోమ్ వ్యాలీ అవార్డు

సదస్సులో స్విట్జర్లాండ్‌కు చెందిన బయోజెంట్రం విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ మైకెల్ ఎన్ హాల్‌కు ప్రభుత్వం జినోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు -2018 ని ప్రదానం చేసింది. మంత్రి కేటీఆర్ అవార్డును మైకెల్‌కు ప్రదానం చేశారు.

హెచ్‌ఐసిసిలో శాస్త్ర వేత్తల సందడి

బయో ఏసియా సదస్సుకు వచ్చిన సైంటిస్టులతో హెచ్‌ఐసిసి కలకలలాడింది. 50 కి పైగా దేశాలకు చెందిన 15 వందల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. దాదాపు అందరు కూడా పరిశోధకులు కావడంతో ఒకరినొకరు పరిచయం చేసుకుని వారు చేస్తున్న పరిశోధనలను అడిగి తెలుసుకున్నారు.



సదస్సులో నేడు..

ఉదయం 10 గంటలకు సదస్సు మొదలవుతుంది. అమెరికాకు చెందిన నోవార్టీస్ ఫార్మా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాం ఆరాధ్యే కీలకోపన్యాసం చేస్తారు. పద్మశ్రీ ప్రొఫెసర్ డి బాలసుబ్రమణియన్ (ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి) వక్తను గూర్చి పరిచయం చేస్తారు. 10.20 గంటలకు స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బాసెల్‌కు చెందిన ప్రొఫెసర్ మైకెల్ హాల్ , 10.40 గంటలకు జర్మనీకి చెందిన మెర్క్ లైఫ్ సైన్స్ సీఈఓ డాక్టర్ ఉదిత్ బాత్రా మాట్లాడుతారు. తదుపరి 12.30 గంటలకు జరిగే సెషన్‌లో డెలాయిట్‌కు చెందిన లైఫ్ సైన్సెస్ హెడ్ సుదీప్ క్రిష్ణ కీలకోపన్యాసం చేస్తారు.

నా బ్రాండ్ దెబ్బ తీశారు



- పీఎన్‌బీకి నీరవ్ మోడీ మెయిల్
- చెల్లింపు ప్రణాళికతో రావాలని బ్యాంక్ ప్రత్యుత్తరం



న్యూఢిల్లీ: బ్యాంకు తన వంతుగా అంశాన్ని చేపట్టడంలో ప్రదర్శించిన అత్యుత్సాహం తన ఆభరణాల బ్రాండ్‌ను ధ్వంసం చేసిందని, బకాయిలు తీర్చడం తో తన సామర్థ్యాన్ని సైతం దెబ్బ తీసిందని బ్యాంకుకు రాసిన లేఖలో నీరవ్ మోడీ ఆరోపించారు. మీడియా చేసిన హడావుడి భ్రమపూరిత రుణగ్రస్తతకు దారి తీసింది. ఫలితంగా సోదాలు, స్వాధీన కార్యకలాపాలు వెంటనే మొదలయ్యాయి. తదనంతరం ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ జప్తునకు నోచుకోవడం ఆందోళనలకు దారి తీసింది. ఇది బ్యాంకులకు గ్రూప్ బకాయిల చెల్లింపులో మా సామర్థ్యాన్ని దెబ్బ తీసింది అని అన్నారు. మీరు బహిరంగ ప్రకటన చేయడానికి ఒక రోజు ముందు అం టే ఫిబ్రవరి 13న అలాగే ఫిబ్రవరి 15న నేను ఇవ్వ జూపాల నుకు న్నదాన్ని మీరు తోసి రాజన్నారు. మీకు రావా ల్సిన బకాయిలను వెంటనే వసూలు చేసుకోవాలనే ఆత్రుత లో మీరు తీసుకున్న చర్యలు నా బ్రాండ్‌ను, బిజినెస్‌ను దెబ్బ తీశాయి. అంతేకాక అన్ని బకాయిలను వసూలు చేయడంలో మీ సామర్థ్యాన్ని విచారణకు పరిమితం చేశాయి అని పిఎన్‌బికి రాసిన లేఖలో నీరవ్ మోడీ ఆరోపించారు. కుంభకోణంతో కునారిల్లుతున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) నష్టాన్ని తీర్చడానికి ఒక పటిష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళికతో ముందుకు రావాలని వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీని గురువారం కోరింది. కొందరు బ్యాంక్ అధికారులు జారీ చేసిన ఎల్ఓయూల తో రూ.11,400 కోట్ల విలువైన మోసానికి పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్న నీరవ్ మోడీ రాసిన ఒక మెయిల్‌కు పిఎన్‌బి పై విధంగా స్పందించింది. మీరు కొందరు అధికారుల నుంచి అక్రమంగా, అనధికారికంగా ఎల్ఓయూలు పొందారు. మా బ్యాంక్ ఎట్టి పరిస్థితుల్లోనూ మీకు చెందిన మూడు భాగస్వామ్య కంపెనీలకు అలాంటి సదుపాయాలను కల్పించలేదు అని పిఎన్‌బి జనరల్ మేనేజర్(అంతర్జాతీయ బ్యాంకింగ్ డివిజన్) అశ్వని వత్స్ మెయిల్ పంపించినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పూర్తి రుణగ్రస్తత చెల్లింపులో మీ నిబద్ధత, పూచీకత్తుకు మద్దతుగా ఎలాంటి బయానా మొత్తాలు, కాలవ్యవధులను మీరు సమ కూర్చలేదు. అయి నప్పటికీ తిరిగి చెల్లించడంలో మీ వద్ద ఏదైనా ఒక పటిష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళిక ఉందా అని నీరవ్‌ను అడిగారు.

ముంబై: బకాయిల వసూలుకు చట్టబద్ధమైన మార్గాలను అనుసరిస్తు న్నా మని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) గురువారం తెలిపింది.

1,415 మంది ఉద్యోగుల బదిలీ

కుంభకోణం వెలుగులోకి వచ్చిన అనంతరం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) 1,415 మంది ఉద్యోగులను బదిలీ చేసింది. బ్యాంకు రొటేషనల్ బదిలీ విధానాన్ని అనుసరించి 2018, ఫిబ్రవరి 19నాటి నుంచి 257 మంది సబ్ స్టాఫ్, 437 మంది క్లర్కులు, 721 మంది అధికారులను (మొత్తం 1,415 మంది ఉద్యోగులు) బ్యాంకు బదిలీ చేసిందని పిఎన్‌బి ఒక ప్రకటనలో తెలిపింది. అయితే బ్యాంకు 18,000 మంది ఉద్యోగులను బదిలీ చేసిందనే వార్తలను తోసిపుచ్చింది.

బోలెడు ఆస్తులున్నాయి: పిఎన్‌బి

ముంబై: బకాయిల వసూళ్ళలో చట్టబద్ధమైన పంథాలను అనుసరిస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరించింది. రూ.11,400 కోట్ల కుంభకోణాన్ని బట్టబయలు చేయడం ద్వారా బకాయిల వసూళ్ళకు ఉపకరించే అన్ని దారులను పిఎన్‌బి మూసివేసిందని వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ చేసిన వ్యాఖ్యపై స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు కోరిన వివరణకు పిఎన్‌బి గురువారం పై విధంగా స్పందించింది. ఏదేనీ రుణగ్రస్తతను తీర్చేందుకు సరిపడ ఆస్తులు ఉన్నాయని తెలిపింది.



జమ్మూలో యూత్ కాంగ్రెస్ నేతృత్వంలో ఆందోళన

ఈడీ విచారణకు నీరవ్ డుమ్మా

సాకుగా పాస్‌పోర్టు రద్దు- తాజాగా సమన్లు జారీ

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట హాజరుకాని వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి తాజాగా సమన్లు జారీ చేసినట్టు అధికారులు గురువారం తెలిపారు. నీరవ్ మోడీ తన గైర్హాజరుకు తన పాస్‌పోర్టు తాత్కాలిక రద్దు, అపరిష్కృతంగా ఉన్న వాణిజ్య వ్యవహారాలను కారణంగా చూపుతూ ఈడీ దర్యాప్తు అధికారికి ఇ-మెయిల్ చేసినట్టు వారు చెప్పారు. తాజా సమన్ల ప్రకారం నీరవ్ మోడీ ఈ నెల 26న ముంబైలో ఈడీ ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది.



కార్లు, షేర్లు, డిపాజిట్లు జప్తు

విలువ రూ. 100కోట్లకు పైమాటే: ఈడీ

పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలకు చెందిన రూ.100 కోట్లకు పైగా విలువైన షేర్లు, డిపాజిట్లు, విలాసవంతమైన కార్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం ప్రకటించింది. ఈడీ దాడులు గురువారంతో ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. చోక్సీకి చెందిన రూ.86.72 కోట్ల విలువైన, నీరవ్ మోడీ గ్రూప్ చెందిన రూ.7.80 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్లు, షేర్లు స్వాధీనం చేసు కున్నట్టు అధికారులు తెలిపారు. రెండింటి విలువ రూ.94.52 కోట్లు కాగా, విలాసవంతమైన కార్ల విలువ కొన్ని కోట్ల రూపాయలు ఉంటుందని, దాంతో స్వాధీనం చేసుకు న్నవాటి మొత్తం విలువ రూ.100 కోట్లకుపైగా ఉంటుందని చెప్పారు. కేసులో ఇప్పటిదాకా స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.5,826 కోట్లకు చేరుకుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న విలాసవంతమైన కార్లలో ఒక రోల్స్‌రాయిస్ ఘోస్ట్, ఒక మెర్సెడెస్ బెంజ్, పోర్స్‌చె పనమెర, మూడు హోండా మోడళ్లు, ఒక టొయోటా ఫార్చునర్, ఒక ఇన్నోవా ఉన్నాయి.

మోడీ అండతోనే పలాయనం



నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనలో కుంభకోణధారులు దేశాన్ని సునాయాసంగా వీడిపోవడం ఒక రివాజుగా మారిందని సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ ఆరోపించారు. ఈ మేరకు పీపుల్స్ డెమొక్రసీ తాజా సంచికలో సంపాదకీయం రాశారు. సిబిఐ కుంభకోణంపై దర్యాప్తు ప్రారంభించక మునుపే నీరవ్ మోడీ, ఆయన మేనమామ, కుటుంబసభ్యులు జనవరి మొదటి వారంలో దేశాన్ని సునాయాసంగా వీడిపోయారు. లలిత్ మోడీ, విజయ్ మాల్యా కేసుల్లో కూడా ఇదే జరిగిందని కారత్ అన్నారు. కొందరు బిజెపి నేతలు నీరవ్ మోడీ, చోక్సీలకు సన్నిహితులని ఆరోపించారు. దేశంలో పెట్టుబడిదారులకు వత్తాసుపలికే విధానం, అవినీతి రాజకీయనేతలతో అపవిత్ర బంధం నిరర్థక ఆస్తులు, బ్యాంకింగ్ సంక్షోభానికి మూల కారణమని కారత్ అన్నారు. ఆర్టీఐ దరఖాస్తు ద్వారా పొందిన డేటా ప్రకారం 2017, మార్చి 31వ తేదీతో ముగిసిన ఐదేళ్ళ కాలంలో మొత్తం రూ.612.6 బిలియన్ల విలువైన 8,670 కేసుల రుణ మోసం చోటు చేసుకుందని ఆయన తెలిపారు. తాజా ఆర్థిక కుంభకోణంపై తన అభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తూ సరళీకృత విధానం, బ్యాంకింగ్ రంగంపై అనియంత్రణ, ఎలాగైనా లాభాలు ఆర్జించాలంటూ బ్యాంకులకు ఆదేశాల తాలూకు విపరిణామాలకు కుంభకోణం తార్కాణమని ప్రకాశ్ కారత్ తెలిపారు.

నీరవ్‌కు ఇ-మెయిల్ నోటీసు

నీరవ్ మోడీకి పాస్‌పోర్టు రద్దుపై షోకాజ్ నోటీసును ఇ-మెయిల్ కూడా చేసినట్టు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. పాస్‌పోర్టులు ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ నీరవ్ మోడీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీలకు పంపించిన షోకాజ్ నోటీసుల్లో పేర్కొన్న కాలపరిమితికి కాలం చెల్లుతున్న తరుణంలో రవీశ్ కుమార్ గురువారం పై వ్యాఖ్య చేశారు. మోడీకి పంపించిన నోటీసుపై మాట్లాడుతూ నోటీసు పంపించిన చిరునామాపై కొంత అయోమయం నెలకొందంటూ ఆయన స్పందించారు. ఒక నిర్దేశిత ఇ-మెయిల్ ఐడీకి నోటీసు పంపించాలని అభ్యర్థించారు. తదనుగుణంగా ఇ-మెయిల్ ఐడీకి నోటీసు పంపించాము అని అధికార ప్రతినిధి తెలిపారు. వారు నిర్దేశిత కాల వ్యవధిలోగా సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. వారు సంజాయిషీ ఇవ్వని పక్షంలో మేం చర్య తీసుకుంటాం. మేం ఒకసారి నోటీసు పంపించిన తర్వాత, కొన్నిసార్లు మేం దానిని వారికి ఇ-మెయిల్ చేస్తుంటాం. ఆ విధంగా అతడు నోటీసును అందుకున్నట్టుగా పరిగణిస్తాము. నిర్దేశిత కాల వ్యవధిలోగా నోటీసుకు అతడు సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుందని రవీశ్ కుమార్ తెలిపారు. సంజాయిషీ ఇవ్వకపోయినా, సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోయినా పాస్‌పోర్టు రద్దు అవుతుంది అని చెప్పారు.

ప్రధానికి మారిషస్ సర్కారు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

జోన్ కేసు ఒక క్విడ్ ప్రో క్యూ పెట్టుబడికి సంబంధించినది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి లేపాక్షి నాలెడ్జ్ హబ్ ప్రయివేట్ లిమిటెడ్‌కు 8,844 ఎకరాల భూ కేటాయింపు, ఇందు టెక్‌జోన్ ప్రయివేట్ లిమిటెడ్, ఇందు గ్రూప్‌కు చెందిన పలు హౌసింగ్ ప్రాజెక్టులకు శంషాబాద్ వద్ద 250 ఎకరాల భూకేటాయింపు జరిపించుకున్న ఇందుటెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందుకూరి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అందుకు ప్రతిఫలంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నెలకొల్పిన కంపెనీల్లో భారీగా పెట్టుబడులు పెట్టారు. ఈ అవకతవకలు జరిగిన సమయంలో జగన్మోహన్ రెడ్డి తండ్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి పొందిన ప్రయోజనాలకు సంబంధించి సిబిఐ మూడు అభియోగ పత్రాలను దాఖలు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఈ ఏడాది జనవరిలో శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి చెందిన రూ.117.74 కోట్ల విలువైన మూడు కంపెనీలను జప్తు చేసింది. ఇదే అంశంపై ఈడీ ఒక ప్రకటన చేసింది. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి చేసిన క్విడ్‌ప్రోక్యూ చెల్లింపులకు బదులుగా అన్ని ప్రామాణిక నిబంధనలను పెడదారి పట్టిస్తూ, సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలను పరిశీలించకుండా అప ్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కూకట్‌పల్లి(65 ఎకరాలు), బండ్లగూడ(50 ఎకరాలు), గచ్చిబౌలి(4.575 ఎకరాలు), నంద్యాల(75 ఎకరాలు) వద్ద హౌసింగ్ ప్రాజెక్టులను పొందడం ద్వారా ఆయన అక్రమ ప్రయోజనాలు దక్కించుకున్నారు అని ఈడీ పేర్కొంది.

బీఎస్ఈ లిస్టింగ్‌లో జీహెచ్ఎంసీ



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన ఈ లిస్టింగ్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. జోషి, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు,మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవీలతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్‌కె. జోషి మాట్లాడుతూ, బాండ్ల ద్వారా నిధుల సేకరణతో దేశంలోనే హైదరాబాద్ మహానగరపాలక సంస్థ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక సంస్థలు నిధుల కోసం ప్రభుత్వాలపై ఆదారపడకుండా సొంతంగా సమకూర్చుకోవాలని సూచించారు. ఇందులో ఇతర మున్సిపాలిటీలకు, స్థానిక సంస్థలకు జీహెచ్ఎంసీ ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం రేటింగ్ సంస్థల అంచనా ప్రకారం డబుల్ ఏ స్టేబుల్ స్థాయిని సాధించిన జీహెచ్ఎంసీ భవిష్యతౌక్తులో త్రిబుల్ ఏ పాజిటివ్ సాధించాలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బాండ్ల సేకరణ ద్వారా జీహెచ్ఎంసీ స్టాక్ ఎక్స్చేంజ్ లిస్టింగ్ నమోదు కావడం చారిత్రాత్మక ఘట్టమని జోషి అభినందించారు.

అనంతరం రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రామ కృష్ణారావు మాట్లాడుతూ, దేశంలో ఉన్న 4,041 మున్సిపాలిటీల్లో మెరుగైన పౌర, మౌళిక సదుపాయాల కల్పనకు రూ. 39 లక్షల కోట్లు అవసరమని అహ్లువాలియా కమిటీ పేర్కొన్నదన్నారు. ఇంత భారీ స్థాయిలో నిధులను ఏ ప్రభుత్వాలు కూడా సమకూర్చే పరిస్థితి లేనందువల్ల అంతర్గత వనరులను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఆర్థిక స్తోమతపై అంతగా నమ్మకం ఉండదని... అయితే ఈ విషయాన్ని వమ్మూ చేస్తూ బాండ్ల ద్వారా జీహెచ్ఎంసీ రెండు వందల కోట్ల నిధులను సేకరించడం గొప్ప విషయమన్నారు.

దేశంలో రోజురోజుకు పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో మున్సిపాలిటీలు స్వయం ఆర్థిక వనరుల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ అన్నారు. ఇందుకుగానూ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాల్సిన అవసరముందన్నారు. అంతర్గత లోపాలను సరిదిద్దుకోవడం, పన్నుల వ్యవస్థలను మరింత పటిష్టవంతంగా నిర్వహించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర కార్పొరేషన్లలోనూ అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని అన్నారు.

బిఎస్ఇలో లిస్టింగ్‌అయిన రెండో భారత నగరంగా హైదరాబాద్ ఉండడం గొప్ప విషయమన్నారు. దేశంలోని ఇతర నగరాలకు జీహెచ్ఎంసీ ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మెట్రోరైల్ రెండో దశ పనులను క ూడా త్వరలో ప్రారంభించనున్నట్లు అరవింద్‌కుమార్ తెలిపారు.



కవల జంటలు

సంగెం, ప్రభన్యూస్ : ఒక కాన్పులో తల్లి ఒక బిడ్డకు జన్మనివ్వడం సాధారణం.. అలా కాకుండా ఒక కాన్పులో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలకు జన్మనిచ్చిన తల్లులు ఉన్నారు. ఇలాంటి ప్రత్యేక ప్రసవాలతో జన్మించిన పిల్లల కోసం ఒక రోజు కేటాయించారు. ప్రతి యేటా ఫిబ్రవరి 22న ప్రపంచ కవలల దినోత్సవంగా నిర్వహిస్తుంటారు. ప్రపంచ కవలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ రూరల్ జిల్లా, సెంగెం మండలం షాపురం గ్రామానికి చెందిన కవలలైన రామ్ లక్ష్మణ్‌లు అదే గ్రామానికి చెందిన అక్కాచెల్లెలైన గౌతమి, మమతలతో నిశ్చితార్థం జరుపుకొని కేక్‌ను కట్ చేసి కవలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మొత్తానికి ఈ కవలైన రామ్‌లక్ష్మణ్‌లు ఒకే జననం, ఒకే రూపం, ఒకే చదువు, ఒకే సంస్థలో ఉద్యోగం, ఒకే రోజున మార్చి 8న వివాహం చేసుకుంటూ ఒకే సారుప్యంతో ఉంటూ అకారంలోనే కాదు ఆచరణ, అలవాట్లు అభిప్రాయాల్లోనూ ఒకే రకంగా ప్రత్యేకంగా ఉంటూ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారు.

అమ్మ ఆవేదన..



శస్త్ర చికిత్స చేయించుకొని కటిక నేలపైనే పడుకున్న మహిళలు

నకిరేకల్, ప్రభన్యూస్: నల్గొండ జిల్లా, నకిరేకల్ పట్టణంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన డీపీఎల్ క్యాంపునకు వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నార్కట్‌పల్లి, కేతేపల్లి, శాలి గౌరారం మండలాలకు చెందిన 76మంది మహిళలు ఈ శిబిరంలో ఆపరే షన్‌లు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది ఆపరేషన్‌లు చేయించుకున్న మహిళలకు కనీస వసతులను కల్పించకుండా వారిని కటిక నేలపైనే పడుకోపెట్టారు. దీనికి తోడు మధ్యాహ్నం కరెంటు కోత వల్ల ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఈ శిబిరంలో సర్జన్ డాక్టర్ గోయల్, క్యాంపు ఇంచార్జీ డాక్టర్ వెంకన్న, విజయ్ కుమార్, సూపర్‌వైజర్ టి.వెంకటాచారి సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు విద్యుత్ షాక్

- భారంగా మారుతున్న కరెంటు చార్జీలు
- దక్షిణాది రాష్ట్రాల్లోనే అధిక టారిఫ్‌లు
- 2021 నాటికి రూ.19,316 కోట్లు భారం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పంట పొలాలకు సాగునీరు అందించి వ్యవసాయ రంగం అభివృద్ధికి అండగా నిలవాలన్న లక్ష్యంతో చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ చార్జీలు పెద్ద గుదిబండగా మారుతున్నాయి. రాష్ట్రంలో కృష్ణా,గోదావరి నదులు ప్రవహిస్తున్నప్పటికీ తెలంగాణ భౌగోళిక పరిస్థితులు గ్రావిటీద్వారా సాగునీటి ప్రవాహాలకు అనుకూలంగా లేకపోవటంతో ఇక్కడ వ్యవసాయరంగానికి ఎత్తిపోతల పథకాలే శరణ్యంగా మారాయి. వందల మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసి ప్రధాన కాలువల ద్వారా పంట పోలాలకు తరలించేందుకు అత్యంత శక్తివంతమైన విద్యుత్ మోటార్లను వాడుతున్నారు. అయితే వీటికి సరఫరా చేస్తున్న విద్యుత్ చార్జీలే దడ పుట్టిస్తున్నాయి. రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు ఎత్తిపోతల పథకాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌పై యూనిట్‌కు రూ.6.40 వసూలు చేస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో ఎత్తిపతల పథకాలకు సరఫరా చేస్తున్న విద్యుత్ చార్జీల టారీఫ్ అధికం గానే ఉంటోంది. కర్నాటకలో రూ.2.25, మహారాష్ట్రలో రూ.3.30, కేరళలో రూ.2.80 అంధ్రప్రదేశ్‌లో రూ.5.82 వంతున ఎత్తిపోతల పథకాల టారీఫ్ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో రుతుపవనాల సీజన్‌లో ఏటా 60నుంచి 120 రోజులు మాత్రమే కృష్ణా, గోదావరి నదుల్లో నీటిని ఎత్తిపోతల పథకాలకు ఉపయోగించుకునే వీలుంది. వర్షాకాలం కావటంతో సహజంగానే రాష్ట్రంలో విద్యుత్‌కు అంతగా డిమాండ్ కూడ ఉండదని అయినప్పటికీ డిస్కమ్‌లు విద్యుత్ చార్జీల టారీఫ్‌ను తగ్గంచటం లేదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఎత్తిపోతల పథకాలకు 1359 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు.

యూనిట్ రూ.6.40 వంతున ఏటా ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ వినియోగంపై రూ.1564 కోట్లు డిస్కమ్‌లకు చెల్లిస్తున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో అటు గోదావరి , ఇటు కృష్ణానదిపై కాళేశ్వరం, సీతారామ, పాలమూరు- రంగారెడ్డి వంటి భారీ ఎత్తిపోతల పథకాలు రాబోతున్నాయి. దశల వారీగా రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ వినియోగం కూడా పెరగనుంది. నీటిపారుదల శాఖ అధికారుల ప్రణాళికల మేరకు 2018-19లో 5869 మెగావాట్లు, 2019-20లో 8389 మెగావాట్లు, 2020-21లో 10089మెగావాట్లు, 2021-22లో 12091 మోగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ఇపుడున్న విద్యుత్ చార్జీల ప్రకారం 2021-22నాటికి రాష్ట్రంలో ఎత్తిపోతల పథాకాలపై విద్యుత్ చార్జీల భారం రూ.19316 కోట్లకు పెరిగనున్నట్లు అంచనా వేశారు. ఇంత పెద్దమొత్తంలో ఎత్తిపోతల పథకాలపై విద్యుత్ చార్జీలు చెల్లించే రాష్ట్రం కూడా దేశంలో తెలంగాణ రాష్ట్రమే రికార్డు నెలకొల్పనుంది.

యూనిట్ రూ.4.88కి తగ్గిచాలి:

రాష్ట్రంలో ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని నీటిపారుదల శాఖ డిస్కంలను కోరుతోంది.యూనిట్ చార్జీలను రూ.6.40 నుంచి రూ.4.88కి తగ్గించాలని కోరుతోంది. డిస్కమ్‌లు కూడా నీటిపారదల శాఖ ప్రతిపాదనలను తెలగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పించాయి. ఈఆర్సీనుంచి సానుకూల నిర్ణయం వస్తే రాష్ట్రంలో ఎత్తిపోతల ఫథకాలకు విద్యుత్ చార్జీల్లో పెద్ద ఉపశమనం లభించనుంది. ఇపుడు చెల్లిస్తున్న మొత్తంలో చార్జీల భారం రూ1565.57కోట్ల నుంచి రూ.1193.75కోట్లకు తగ్గిపోనుంది. త్వరలోనే ఇందుకు సంభందిచి ఈఆర్‌సీనుంచి ఆశాజనకమైన నిర్ణయాలు ఉండే అవకాశాలు లేకపోలేదని డిస్కమ్ అధికారులు చెబుతున్నారు.

అవనికి ఎంపీ కవిత అభినందనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: యుద్ధవిమానంలో విహరించి చరిత్ర సృష్టించిన ఫ్లయింగ్ ఆఫీసర్ అవనీ చతుర్వేదికి ఎంపీ కవిత ట్విట్టర్ ద్వారా అభినందించారు. మహిళాపైలట్‌గా రికార్డుకెక్కడం గర్వకారణమని అని గురువారం ట్వీట్ చేశారు.

సింగరేణిపై ప్రయివేటు కత్తి

(మొదటిపేజీ తరువాయి)

ఇక కార్పొరేట్ శక్తులు ప్రవేశించి బొగ్గు తీసేందుకు పోటీపడితే జీవనవిధ్వసం తప్పదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. గ్రామాల తొలగింపు, బొగ్గుతీసే పద్దతుల్లో వేగంతో కోల్‌బెల్ట్ ప్రాంతాలు కాలుష్యకాసారాలు కానుండగా.. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపైనా తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల సంపద ప్రజలకే అన్ననినాదంలో 1973లో అప్పటి ప్రభుత్వం గనులను జాతీయం చేయగా, తర్వాత పలు సందర్భాల్లో ప్రైవేటీకరణ ప్రస్తావన, చర్చలు జరిగాయి. 2000సంవత్సరంలో కోయగూడెంలో సర్ఫేస్‌మైనర్ యంత్రాలను ప్రవేశపెట్టగా, కార్మికులు సమ్మెకు దిగారు. ఆ తర్వాత పలు విభాగాల్లో యాజమాన్యం ఔట్‌సోర్సింగ్ పద్ధతిని ప్రవేశపెట్టింది. తాజాగా కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో గనులే.. ప్రైవేటు చేతుల్లోకి వెళ్ళబోతున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న గనులు కాకుండా.. కొత్తగనులను ప్రైవేటుసంస్థలకు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. గతంలో కోలిండియాలో 20శాతం వాటాను ప్రైవేట్ పరంచేయగా, 204గనులను బహిరంగమార్కెట్లో అమ్మి సొమ్ము చేసుకుంది. ఆ తర్వాత ఆరోపణలు రావడంతో సుప్రీంకోర్టు ఈ కేటాయింపులు రద్దుచేసింది.

ఆన్‌లైన్ వేలం..

విదేశీ బడా కంపెనీలకు బొగ్గుబ్లాక్‌లను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయిస్తామని కేంద్రం ప్రకటించడంతో పాటు ప్రైవేటు గనుల వల్ల బొగ్గుధరలు పడిపోతాయని, విద్యుత్ చౌకధరకే లభిస్తుందని చెబుతోంది. దీనిపై కార్మికసంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే బొగ్గుపరిశ్రమకు ప్రభుత్వాల దన్ను లేకపోగా, వాటి కాళ్లపై అవి నడుస్తూ ప్రభుత్వానికి వేలకోట్ల రాయల్టీ చెల్లిస్తున్న పరిశ్రమను తెగనమ్మే యత్నం చేయడం బాధాకరమని చెబుతున్నాయి. సింగరేణిలో 23నుండి నిరసనలకు దిగుతుండగా, జాతీయ స్థాయిలోనూ కార్మికసంఘాలు సమ్మెకు సన్నద్ధమవుతున్నాయి.

ఢిల్లీ భేటీకి నివేదిక సిద్ధం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్ర్‌ప్రదేశ్‌కి సంబంధించిన పెండింగ్ సమస్యలను చర్చించేందుకు మార్చి మొదటివారంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశం జరిగే అవకాశాలున్నాయి. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలతో పాటు నిధులు, ఇతర ప్రాధాన్యత కలిగిన అంశాలను చర్చించేందుకు కేంద్ర హోం శాఖ ఈ సమావేశాన్ని నిర్వహించాలని సంకల్పించింది. ఫలితంగా తదుపరి తేదీపై సమాచారమివ్వాల్సిందిగా కేంద్ర హోం శాఖ ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను కోరినట్టు సమాచారం. కాగా తొలుత ఈ నెల 21 వ తేదీల జరగాల్సిన సమావేశం రెండు రోజులు వాయిదా పడటం జరిగింది. అయితే అనివార్యమైన పరిస్థితులలో భేటీ వాయిదా పడటంతో తదుపరి తేదీపై కేంద్రం దృష్టిని సారించింది. ఇదిలా వుండగా ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అందిన వర్తమానం నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారయంత్రాంగం పూర్తి సమాచారంతో సిద్ధమైంది.

అదే విధంగా ప్రాధాన్యతా ప్రాతిపదికన మొత్తం 19 అంశాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించడం జరిగింది. ఈ మేరకు నివేదిక కూడా సిద్ధమైంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు వనరుల ప్రాధాన్యత కల్పించడం , పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైల్వేజోన్ ఏర్పాటు , గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ,విశాఖ, విజయవాడ మెట్రో రైల్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు, జాతీయ ప్రాధాన్యత కలిగిన సంస్థల ఏర్పాటు, నెల్లూరులో దుగ్గి రాజపట్నం పోర్టుతో పాటు అసెంబ్లీ సీట్ల పెంపుదల ,అమరావతికి ఆర్థిక సహాయం, పన్నుల సవర ణ,వైఎస్ఆర్ కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ, వైజాగ్,చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటువంటి అంశాలను ప్రస్తావించినట్టు తెలిసింది.

రైలు కిందపడి జంట ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

మృతుడు తన ఫేస్‌బుక్‌లో సీఎంకు తన చావు వివరాలను, అందుకు బాధ్యులను పేర్కొంటూ సందేశం పంపించాడు. వివరాల్లోకి వెళ్ళితే. .కామారెడ్డి జిల్లా కేంద్రం పద్మాజివాడకు చెందిన ఒంటెద్దు కాశీరాం(40) వరుసకు తమ్ముడైన అతని భార్య దేవేంద్ర(35)తో గతకొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. దేవేంద్ర భర్త రవి గత సంవత్సరం బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్ళాడు. అప్పటి నుంచి కాశీరాంకు, దేవేంద్ర మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతూ వచ్చింది. వీరిద్దరి వ్యవహారంపై ఇరు కుటుంబాల పెద్దలు పంచాయితీ పెట్టి మందలించారు. అంతేగాకుండా కాశీరాంకు పెనాల్టీ కూడా విధించడం జరిగింది. వీరిద్దరి విషయాన్ని దేవేంద్ర భర్తకు సమాచారం ఇవ్వడంతో అతను ఆమెను భార్యగా స్వీకరించలేనని, తాను తిరిగి రానని ఖరాకండిగా చెప్పడంతో మళ్ళీ గొడవలు ప్రారంభమయ్యాయి. వీరిద్దరు సహజీవనం కొనసాగించారు. ఈ నేపథ్యంలో దేవేంద్ర తన భర్త వద్దకు దుబాయ్ వెళ్తానని చెప్పడంతో మనస్తాపానికి గునైన కాశీరాం ఆమె వెళ్ళిపోతే తాను చనిపోతానని బెదిరించడంతో ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇద్దరం కలిసే చనిపోదామని నిర్ణయించుకొని బుధవారం సాయంత్రం దేవేంద్ర తన కూతురిని వెంటబెట్టుకొని కామారెడ్డి నుంచి మేడ్చల్‌కు ప్రయాణమయ్యారు. మెదక్ జిల్లా, తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్‌కు రాత్రి 9 గంటలకు చేరుకోగా మేడ్చల్ వెళ్ళేందుకు రైళ్లు లేకపోవడంతో అక్కడే ఉన్నారు. గురువారం తెల్లవారు జామున చిన్నారి పాపను రైల్వే స్టేషన్‌లో వదిలేసి ఎదురుగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరి శరీరాలు తునాతునకలు అయ్యాయి. ఉదయం స్థానికులు చిన్నారి ఏడుపు విని, ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకొని రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తూప్రాన్ ఎస్.ఐ నాగార్జున్‌గౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాగా కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డికి తరలించారు. కాగా చిన్నారిని రైల్వే పోలీసులు కామారెడ్డికి తీసుకువెళ్ళారు.

ఫేస్‌బుక్‌లో....

మృతుడు కాశీరాం తన సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్ ఖాతాలో సీఎంకు చావు సందేశం పెట్టారు. తమ చావుకు మామ మల్లయ్య, అత్త లక్ష్మీ(బాలవ్వ), గంగయ్య, అతని భార్య చినతల్లి కారణమంటూ సందేశం పెట్టారు. వీరంతా కలిసి తమను చావమని చెబుతున్నారని, తమ చావును అంగీకరించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఎండలు మండుతున్నాయ్

- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు
- రాత్రిపూట ఉక్కపోత
- వాతావరణ మార్పులతో అనారోగ్యాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో వేసవి తాపం ప్రారంభమైంది. ప్రారంభ దశలోనే మండుటెండలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 38 నుంచి 40 డిగ్రీల మధ్య నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవు తున్నారు. రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతలు 26 డిగ్రీలు దాటుతున్నాయి. దీంతో ఉక్కపోత పెరుగుతోంది. కూల్‌గా ఉండాల్సిన సమయంలో వాతావరణం ఊహించని విధంగా వేడెక్కుతోంది. గత రెండు రోజు లుగా తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతల తీవ్రత పెరుగు తోంది. మధ్యాహ్న సమయాల్లో ఎండలు నడి వేస వి ని తలపిస్తున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతల్లో 88 సంవ త్సరాల నాటి పరిస్థితులు ఈ ఏడాది పునరా వృతమైనట్లు పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

పగటిపూటే కాదు, రాత్రివేళల్లోనూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ ఉష్ణోగ్రతల తీవ్రత మరో వారం రోజులపాటు కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రెవెన్యూ విపత్తుల నిర్వహణశాఖ అధికార యంత్రాంగం వాతావరణ స్థితిగతులను నమోదు చేసే అనేక ప్రాంతాల్లో 36 నుంచి 38 డిగ్రీల వరకు, కొన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 26 నుంచి 28 డిగ్రీలుగా నమోదయ్యాయి. వాతావరణ శాఖ వద్ద ఉన్న అధికారిక లెక్కల ప్రకారం గత మూడేళ్ళ రికార్డును బద్దలుకొట్టే విధంగా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గాలిలో తేమ 70 నుంచి 85శాతం వరకు రికార్డవుతోంది.

వర్షాకాలంలో రుతు పవనాలు కనిపించక పోవడం, భయంకరమైన తుపా నులు, అల్పపీడనాలు ఏర్పడడం, శీతాకాలం లోనూ తీవ్రమైన ఎండలు కాయడం, వేసవి కాలంలోనైతే 45 డిగ్రీలు దాటిన మండుటెండలతో వందలాది మంది వడ దెబ్బలకు బలికావడం లాంటి ప్రకృతి వైప రీత్యాలు సంభవిస్తున్నాయి. ఈ విధమైన వింత వాతా వరణంపై



శాస్త్రవేత్తలు సైతం స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవిస్తుండడంతో ప్రజలు అనా రోగ్యానికి గురవుతున్నారు. అనేక మందికి జలుబు, జ్వరాలు వస్తున్నాయి. వ్యవసాయ కార్మికులు, నిత్య కూలీలు మధ్యాహ్న సమయాల్లో తగు జాగ్రత్తలు పాటించకపోతే జబ్బుల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వరుసగా నాలుగైదేళ్ళ పాటు తీవ్రమైన వర్షాభావంతో భూగర్భ జలాలు అడుగంటి పోవడం, అనంతరం ఒకటి, రెండేళ్ళు అవసరానికి మించి వర్షాలు కురియడం లాంటి సమతుల్యతలేని వాతావరణం కారణంగానే ఎండల తీవ్రత ఊహించకుండా పెరుగుతోందని భారత వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఎండల తీవ్రతకు కనిపించని కారణాలు

గడిచిన రెండేళ్ళ వాతావరణ పరిస్థితులు ఎలా గున్నా ఈ ఏడాది పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఊహించిన కన్నా ఎక్కువ కష్టాన్ని కలిగే అవకాశాలు న్నాయి. ఒక్కసారిగా పెరుగుతున్న ఎండలు, గాలిలో గణనీయంగా తగ్గిపోతున్న తేమశాతంపై స్పష్టమైన కారణాలు లేకపోవడంతో వాతావరణ శాస్త్రవేత్తలు కూడా ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్ళ నుంచీ వరు సగా సమతుల్యత కోల్పోతున్న వాతావరణం, తీవ్రమైన వర్షాభావంతో దాదాపు 600 నుంచి 800 అడుగుల లోతుకు వెళ్ళిపోయిన భూగర్భ జలాలతో త్వరలో ప్రారంభమయ్యే వేసవిలో తాగునీటి సరఫరా సైతం ప్రశ్నార్థకమయ్యే అవకాశాలు కనిపిన్నాయి.

పెరుగుతున్న కాలుష్యంతో ప్రభావం

అనుకోకుండా సంభవిస్తున్న ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలే ఉష్ణోగ్రతల పెరుగుదలకు దారితీస్తున్నాయని పర్యావరణ, వాతావరణ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ప్రస్తుత సమయానికి గ్రామీణ ప్రాంతాల్లో 32 నుంచి 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోద య్యాయి. వాతావరణ కాలుష్యం అధికంగా ఉండే ప్రాంతాలు, మోటారు వాహనాల సంచారం ఎక్కువ గా ఉండే నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 34 నుంచి 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు మాత్రమే రికార్డయ్యాయి. కానీ ఈసారి తీవ్రత ఒక్కసారిగా పెరిగిపోయింది. రెండ్రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోద య్యా యి, తెలంగాణ రాష్ట్రం కన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకటి, రెండు డిగ్రీలు ఎక్కువగానే నమోదవు తున్నాయి.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018

బుందేల్ ఖండ్‌లు లేనిదెక్కడ?

దేశంలో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వాలన్న డిమాండ్ వచ్చినప్పుడల్లా బుందేల్ ఖండ్‌ను ఆ ప్రాంత రాజకీయ నాయకులు తెరమీదికి తీసుకుని వస్తుంటారు. ఉత్తరప్రదేశ్‌లో హెచ్చు భాగం, మధ్యప్రదేశ్‌లో కొంత భాగం విస్తరించిన కొండ ప్రాంతమే బుందేల్ ఖండ్. ఈ ప్రాంతాన్ని చందేల్ రాజ కుటుంబ వారసులు చాలా కాలం పరిపాలించారు. ఆ తర్వాత ఖాంగర్ రాజవంశీయుల ఏలుబడిలో ఉండేది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజకీయ పార్టీలు ఓట్లు దండుకోవడానికి బుందేల్ ఖండ్ ఓ అస్త్రంలా తయారైంది. బుందేల్ ఖండ్ అభివృద్ధిని విస్మరించడంలో కాంగ్రెస్, సమాజ్ వాదీ, బీఎస్పీ పార్టీలవన్నిటివీ ఒకే తీరు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారణాసి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దృష్ట్యా, త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల లోగా ఉత్తరప్రదేశ్‌కి ఏదో ఒకటి చేయాలనుకోవడం సహజమే. గత మార్చిలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచార సభల్లో బుందేల్ ఖండ్‌కి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించారు. వచ్చే నెల తో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కానున్న దృ ష్ట్యా, ఆయన బుందేల్ ఖండ్ ప్యాకేజీని ప్రకటించారు. ఇందులో తప్పు పట్టేందుకు ఏమీ లేదు కానీ, గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిన తర్వాత దానిని ప్యాకేజీగా మార్చారు. అది కూడా ఇవ్వకపోవడం వల్ల ఆంధ్ర ప్రాంతంలో గడిచిన నెల రోజులుపైగా నిరసనలు సెగలు గక్కుతున్నాయి. వెనకబడిన ప్రాంతాలు ఒక్క ఉత్తరప్రదేశ్‌కో, ఆంధ్రప్రదేశ్‌కో పరిమితం కాదు. ఒడిషాలో కలహండీ జిల్లాలో ఆకలి చావుల వార్తలు దశాబ్దాలుగా వస్తూనే ఉన్నాయి. ఆంధ్రలో రాయ లసీమ కరవు గురించి సభల్లో పదేపదే ప్రస్తావించే నాయకులు అధికారంలోకి రాగానే మరిచి పోతుంటారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లాలో కియా కార్ల ఫ్యాక్టరీని పెట్టిస్తున్నారు. అలాగే, తెలంగాణాలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వలసల జిల్లా అని పేరు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ జిల్లాను దత్తత తీసుకున్నారు. ఈ జిల్లాను తెలంగాణ ఏర్పడిన తర్వాత తెరాస ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాను మరో కోనసీమ చేస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కృషి చేస్తున్నారు. ప్రతి రాష్ట్రంలోనూ వెనకబడిన ప్రాంతాలు ఉన్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు తమకు ఎక్కువ సీట్లు వచ్చిన రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికే ప్రాధాన్యం ఇస్తే, విభజన ఉద్యమాలు బయలు దేరుతాయి. మహారాష్ట్రలో విదర్భ ప్రాంతం రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా చోటు చేసుకున్న ప్రాంతంగా నాయకుల నోట తరచూ వినిపిస్తోంది. ఆ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని యూపీఏ ప్రభుత్వం ప్రకటించింది. బీహార్‌లో అనేక ప్రాంతాలు వెనకబడినవిగా ఇప్పటికే రికార్డుల్లో నమోదు అయ్యాయి.అలాగే,పశ్చిమ బెంగాల్‌లో వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి కోసం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చాలా కాలంగా ఒత్తిడి చేస్తున్నారు.అందువల్ల వెనకబడిన ప్రాంతాల గుర్తింపు అనేది శాస్త్రీయంగా జరగాలి. వర్షాధార ప్రాంతాలను సాధారణంగా వెనకబడిన ప్రాంతంగా పరిగణిస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ,తెలంగాణ,ఉత్తరాంధ్ర జిల్లాలను వెనకబడిన ప్రాంతాలనే వారు. తమ ప్రాంతానికి న్యాయం జరగాలని వెనకబడిన జిల్లాల వారుఆందోళనలు సాగించడం మొదటి నుంచి ఉన్నదే కానీ, వాటిని నిర్వహించిన నాయకుల రాజకీయ లక్ష్యాలు నెరవేరగానే ప్రాంత అభివృద్ధి లక్ష్యాలు వెనక్కి వెళ్ళిపోతున్నాయి. బుందేల్ ఖండ్‌కి ఇరవై వేల కోట్ల రూపాయిల ప్రత్యేక సహాయాన్ని ప్రకటించడం ద్వారా ప్రధానమంత్రి ఇతర ప్రాంత వాసుల్లో కదలిక తెచ్చారు. వెనకబడిన ప్రాంతం నిర్వచనం తరచూ మారుతూ వస్తోంది.మొదట్లో పారిశ్రామికంగా వెనకబడిన ప్రాంతాలనే వెనకబడినవిగా పరిగణించేవారు. తర్వాత ఆర్థిక,సామాజిక వెనకబాటుతనాన్ని ఆధారంగా విభజన చేశారు.ఇప్పుడు వీటికి సాంకేతిక, వాతావరణ మార్పు వంటి అంశాలను జోడించి వెనకబడిన ప్రాంతాలుగా ప్రకటిస్తున్నారు. ఇలా స్థిరత్వంలేకపోవడం కూడా వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి శాపంలా తయారైంది. మౌలిక సదుపాయాలను కూడా ప్రధాన అంశాలుగా అన్ని ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.పరిశ్రమల స్థాపనకు నీరు,విద్యుత్, చాలా అవసరం కనుక,ఈ రెండింటినీ ఆగమేఘాలపై సమకూర్చగలిగినప్పుడే వెనకబడిన ప్రాంతాలు వృద్ధి చెందుతాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఈ విషయాన్నే స్పష్టం చేశారు. పరిశ్రమలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్న డిమాండ్ వచ్చినప్పుడు ఉపాధి కల్పనమాటేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.ఇందుకోసమే యూపీఏ ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండళ్ళను (సెజ్‌లు) ప్రవేశ పెట్టింది.అయితే, ఈ పథకం మీద సరైనపర్యవేక్షణ లేకపోవడం వల్ల సెజ్‌ల కోసం భూములు పొందిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏళ్ళు గడిచినా పరిశ్రమలను స్థాపించకపోవడం,ప్రభుత్వం వద్ద తీసుకున్న భూములను ప్లాట్లుగా విభజించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం వల్ల సెజ్‌ల లక్ష్యం దెబ్బతింది. ప్రత్యేక ప్యాకేజీలు కూడా పక్కదారి పడతాయేమోనన్న అనుమానాలు ముసురుకోవడం వల్లనే ప్యాకేజీల ప్రకటనలు ఎన్నికలకే పరిమితం అవుతున్నాయి.అందువల్ల వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించడం అత్యవసరం. లేనిపక్షంలో ప్యాకేజీలు, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకాలు కాగితాలపైనే ఉంటాయి.

మంచి మాట

అంతరంగంలో భావాల్ని, వైఖరిని మార్చుకోవడం ద్వారా జీవితాన్నే మలుపు తిప్పుకోవచ్చు.

-విలియం జేమ్స్

అవినీతి పంజాకు విలవిల

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫ్రాడ్ కథా..కమామిషు

లాలా లజపతిరాయ్ స్థాపించిన బ్యాంకు.. ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. ఒకే ఒక వ్యక్తి చేసిన మోసం బ్యాంకు స్ట్రాంగ్ రూమ్‌నే శుభ్రం చేసేసింది. 1895లో లాహోర్‌లో దీన్ని ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 4500 శాఖలతో రెండో అతి పెద్ద బ్యాంకుగా పేరొందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు ఓ మోసగాడు, ఒక ఇంటి దొంగచేత చిక్కి, తీవ్రంగా నష్టపోయింది. అసలీ మోసం ఎలా జరిగిందీ.. కారకులెవరు? పటిష్టమైన సాఫ్ట్‌వేర్ వ్యవస్థ ఉన్నప్పటికీ, అనుసంధానం లేకపోవడమే బ్యాంకుకే శఠగోపం పెట్టేయగలగడానికి మూలకారణం.

ఓ బ్యాంకులో ఇద్దరు ఉద్యోగులు సంస్థ భొక్కసాన్ని ఖాళీ చేసేయగలవా.. అంటే అవుననేదే సమాధానం. జాతీయ రంగ బ్యాంకుల్లో నగదును భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌కు రెండు జతల తాళం చెవులుంటాయి. ఒక జతక్యాషియర్ దగ్గర, మరో జత శాఖలోని అకౌంటెంట్ వద్దా ఉంటాయి. ఈ ఇద్దరూ కుమ్మక్కు యుపోతే.. నగదును చాలా తేలిగ్గా కొల్లగొట్టేయవచ్చు. ఒక బ్యాంకును దోచేయాలంటే కేవలం ముగ్గురు కుట్రచేస్తే చాలు. డ్రాఫ్ట్ తయారు చేసేవాడు, దాన్ని తనిఖీ చేసేవాడు, అనుమతించే వాడు(స్విఫ్ట్).. ఒక్కటైతే ఏదైనా చేసేయవచ్చు. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకుల లావాదేవీల ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్స్.. స్విఫ్ట్ అని పిలిచే మెసేజింగ్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీనిద్వారానే అన్ని ఆర్థిక లావాదేవీలు ప్రమాణీకరించి కోడింగ్ విధానంలో నడుస్తాయి. మొదటి ఉద్యోగి మెసేజ్ సిస్టమ్‌కు లావాదేవీని ఫీడ్ చేస్తాడు.. రెండో ఉద్యోగి దాన్ని తనిఖీ చేస్తాడు. మూడో దశలో ఉద్యోగి ఆ లావాదేవీ వాస్తవమైనదని ధ్రువపడితేనే ఆ సందేశాన్ని ఖాతాదారును చేరేందుకు అనుమతిస్తారు. అదే విదేశాలు చేరేదైతే వేరొక చెక్ పాయింట్ కూడా ఉంటుంది. ఆ విషయం చాలామందికి తెలియదు. అందుకే ఒక్కడికే అనుమతి ఉంటుంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని విదేశీ మారక ద్రవ్య విభాగంలో పనిచేస్తున్న గోకుల్ నాథ్ శెట్టి అక్కడ జరిగిన 11వేల 397కోట్ల రూపాయల విలువైన మోసంలో ఏకైక విలన్ అయితే అతనే నాలుగు రకాల పాత్రలూ పోషించి ఉండాలి. ఈ మోసం కారణంగా బ్యాంక్‌లోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా పిఎన్‌బి రక్షణ వ్యవస్థ కుక్కలు చింపిన విస్తరిలా మారిందని చెప్పకతప్పదు. ఏడేళ్లకు పైగానే మోసాన్ని దాచిపెట్టిన ఈ కేసులో బ్యాంకుకు చెందిన వివిధ విభాగాలకు చెందిన మరింత మంది అధికారుల హస్తం ఉండే ఉంటుంది.

అసలేం జరిగింది..

ఫిబ్రవరి 5న భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజికి తమ బ్యాంకులో జరిగిన మోసం గురించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ తెలియజేసింది. 2011నుంచి ఇది వివిధ దశల్లో చోటు చేసుకున్నట్లు ఇదే నెల 14న మరోసారి స్టాక్ ఎక్స్ఛేంజి దృష్టికి తెచ్చింది. ఆ సమయంలో కూడా నీరవ్ మోడీ పేరును వెల్లడించలేదు. బ్యాంకు అధికారులు కొందరు మోడీ కంపెనీలకు ఎల్‌ఓయులను జారీ చేసినట్లు మీడియా దృష్టికి వచ్చింది. ఆ లేఖలే ఇతర బ్యాంకులు అంతర్జాతీయ శాఖల నుంచి రుణాలు పొందేందుకు ఉపయోగపడ్డాయి. ఈ లేఖల ద్వారా జరిగిన లావాదేవీలు అనుమానస్పదంగా ఉన్నాయని, వీటివ్యవహారంపై దర్యాప్తు చేయాలని బ్యాంకు పేర్కొంది.

ఎలా బయటపడింది..

జనవరి 16న మోడీ కంపెనీ ఉద్యోగులు లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ కోసం ముంబై లోని శాఖను సంప్రదించారు. ఆ సమయంలో బ్యాంకు వారిని వందశాతం నగదు మార్జిన్ కావాలని కోరినప్పుడు వారు దాన్ని నవ్వులు చేశారు. ఎప్పుడూ తమ కంపెనీ ఈ సౌకర్యాన్ని పొందుతోందని చెప్పుకొచ్చారు. ఆ సమాధానం మోసాన్ని బయటపెట్టేందుకు దారి తీసింది. స్విఫ్ట్ ద్వారా ఎటువంటి అధికారిక మంజూరు లేకుండానే ఎల్‌యూలను మంజూరు చేసిందని వెల్లడయ్యింది. జనవరి 25నాటికి మొదటి ఎల్ యుల తతంగం జరిగింది. ఇది బ్యాంకుపై 44.2 మిలియన్ డాలర్ల భారాన్ని మోపింది. అక్కడి నుంచి మరిన్ని ఎల్ ఓ యూలు ప్రారంభమయ్యాయి. ఒక్క మోడీ కంపెనీల నుంచే కాక, మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూప్ నుంచి కూడా ఎల్‌ఓ యూలువచ్చాయి. చోక్సీ మోడీ బంధువే. ఫిబ్రవరి 12 నాటికి 11 వేల 304.02 కోట్ల విలువైన అనధికారిక ఎల్ ఓయూలు మంజూరయ్యాయని తేలింది.



మోసం జరిగిన విధానమిది..

ముత్యాలు, వజ్రాలు, ఆభరణాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయించాలని మోడీ భావించారు. కొనుగోలుకు నగదు అవసరమైంది. ఒక్క రూపాయి కూడా రుణం తీసుకోవాలని ఆయన అనుకోలేదు. ఎందుకంటే ఈ వ్యవహారం అత్యధిక ఖర్చుతో కూడుకున్నదే కాక విదేశీ కరెన్సీ ఇబ్బందులు కూడా ఉంటాయి. అందుకే మోడీ విదేశీ కరెన్సీ రుణం కోరుకున్నాడు. అది చౌకయినది కూడా. ఆభరణాల ఎగుమతిలో నిష్ణాతుడైన మోడీకి విదేశీ కరెన్సీ విలువల ఎగుడు దిగుళ్ళపై సమగ్రమైన అవగాహన ఉండడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకూ కథ బానే నడిచింది.

రుణ ఖాతా లేకుండానే బ్యాంకు రుణం పొందాలనుకుని నిర్ణయించుకోవడం దగ్గరే మలుపు తిరిగింది. ఈ దారిలో ఎదురయ్యే ఇబ్బందుల్ని అధిగమించేందుకు మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ రూపంలో గ్యారంటీ తెచ్చుకున్నారు. స్వల్పకాలిక విదేశీ నగదు రుణాలకోసం ఎల్‌యులు దిగుమతిదార్లకు ఉపయోగిస్తాయి. వీటిని మంజూరు చేసే బ్యాంకులు వంద శాతం వరకూ మార్జిన్ గ్యారంటీ అడుగుతాయి. వీటిని ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉంచుతాయి. ఎందుకంటే విదేశీ కరెన్సీ రుణం విలువ కంటే వీటిమీద రిటర్న్స్ ఎక్కువగా ఉంటాయి. వ్యాపారి కూడా అందుకు అంగీకరిస్తాడు. మోడీ విషయంలో పిఎన్‌బి ఎందు కనో మార్జిన్ అడగలేదు. ఇదే పెద్ద మోసానికి దారి తీసి, భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థను కుదిపేసింది.

తొలి సందేశం ఎమ్‌టి 799

2011లో ఒకానొక ఉదయాన ఎమ్‌టి 799 పేరుతో స్విఫ్ట్ నుంచి ఒక కోడ్ సందేశం పంజాబ్ నేషనల్ బ్యాంక్, ముంబై శాఖ నుంచి విదేశాల్లో ఉన్న భారతీయ బ్యాంకులకు ఎల్‌ఓ యూ ఇస్తున్నట్లు వెళ్ళింది. మోడీ కంపెనీల తరఫున అసలు, వడ్డీని చెల్లిస్తామన్నది ఆ ఎల్‌ఓయూ సారాంశం. కళ్ళు మూసుకుపోయిన కొన్ని భారతీయ బ్యాంకులు కొనుగోలు రుణాలను అందించాయి. ఇలా మంజూరైన రుణాలు పిఎన్‌బీ లోని నోస్ట్రో ఖాతాలో చేరుంటాయని భావిస్తున్నారు. విదేశాల్లో ఉన్న బ్యాంకులు విదేశీ మారక ద్రవ్యానికి వినియోగించుకునేలా నిర్వహించే ఖాతానే నోస్ట్రో అని పిలుస్తారు. వాణిజ్య లావాదేవీలకు కూడా దీనిని ఉపయోగిస్తారు.


మోడీకి వజ్రాలను విక్రయించేసంస్థకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ నగదును జమచేసింది. అనంతరం మోడీ సానబెట్టిన వజ్రాలను, ఆభరణాలను విక్రయించి రుణ మొత్తాన్ని బ్యాంకుకు ప్రతి ఎల్‌ఓయు గడువు తేదీకి చెల్లించాలి. దీన్ని పిఎన్‌బి విదేశాల్లోని బ్యాంకులకు జమచేయాలి. ఇదే జరిగుంటే పిఎన్‌బీలో ఫ్రాడ్ జరిగేదే కాదు. కానీ మోడీ ఒక్క పైసా కూడా బ్యాంకుకు చెల్లించలేదు. వచ్చిన మొత్తాన్ని విదేశాల్లో ఆస్తులు పెంచుకోవడానికీ, మార్కెట్‌తో ఆడుకోవడానికీ వినియోగించి ఆనందంగా గడిపి ఉంటారు. ఒక్క పైసా చెల్లించని వ్యక్తిని ఏడేళ్ళ పాటు ఒక బ్యాంకులో సకల సౌకర్యాలు అనుభవించడానికి ఎలా అనుమతించారన్నది సమాధానం లేని ప్రశ్న. చెల్లించడానికి బదులు గోకుల్‌నాథ్ శెట్టిని మరో ఎల్‌ఓయూ మంజూరు చేయాల్సిందిగా కోరి ఉంటారు. ఆ మొత్తం అంతకు ముందు జారీ చేసిన ఎల్‌ఓయు తాలూకు అసలు, వడ్డీకి సరిపోయి ఉంటుంది. రెండో ఎల్‌ఓయూతో అతనికి తాజాగా మరింత ఎక్కువ కొనుగోలు రుణం లభించింది. దానితో అంతకుముందు రుణాన్ని చెల్లించేసారు. ఈ గొలుసు కట్టు వ్యవహారం అలాగే కొనసాగింది. బ్యాంకింగ్ పరిభాషలో ఇటువంటి కార్యాచరణను కైటింగ్ అంటారు. ఒక క్రెడిట్ కార్డుతో ఏటీఎంలో నగదు తీసుకుని, మరో క్రెడిట్ కార్డు రుణాన్ని చెల్లించడమన్నమాట. ఇదే తీరులో మోడీ కూడా వందలాది ఎల్‌ఓయులను పొందారు. దీనివల్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కొనుగోలు రుణం విపరీతంగా పెరిగిపోయింది. చిట్ ఫండ్స్ ఇలాంటి పనులు చేస్తాయి. వినియోగదారులకు పెద్ద మొత్తంలో వడ్డీ రేట్లను ఇస్తుంటాయి. ఒక్కసారిగా వారి ఆదాయం పడిపోతే.. మొత్తం వ్యవస్థే కుప్పకూలుతుంది. ఇదే పిఎన్‌బి విషయంలోనూ చోటుచేసుకుంది. శెట్టి స్థానంలో వచ్చిన కొత్త డిప్యూటీ మేనేజర్ మార్జిన్ లేకుండా కొత్త ఎల్‌ఓయు జారీ చేయడానికి అంగీకరించకపోవడంతో మోడీ వ్యవహారం బయటపడిపోయింది. ఈ దశలో ఇది ఆగక పోయుంటే ఇప్పటికీ మనం మోడీ చాలా చక్కగా వ్యాపారం చేస్తున్నారని నమ్మాల్సి వచ్చేది. గోకుల్నాథ్ శెట్టి పిఎన్‌బి ఫారిన్ ఎక్స్ఛేంజి ముంబై శాఖలో 2010 మార్చి 31వ తేదీ నుంచి ఉంటున్నారు. కొద్దిమంది సహోద్యోగులు మాత్రమే స్విఫ్ట్ మెసేజిలను వినియోగిస్తున్నారు. ఆ శాఖలో మిగిలిన వారెవరికీ ఎల్‌ఓయులు జారీ అవుతున్న విషయం తెలియదు. కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలో ఇలాంటి లావాదేవీలు కనిపించవు. 2017లో శెట్టి పదవీ విరమణ చేసిన తరవాత, ఆ స్థానంలో వచ్చిన ఉద్యోగి మోడీకి మార్జిన్ లేకుండా ఎల్‌ఓయు జారీకి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో అప్పటిదాకా గుంభనంగా సంచిలో ఉన్న పిల్లి బయటకు రాక తప్పింది కాదు. ఎల్‌ఓయులను తనిఖీ చేసే వ్యవస్థ, లేదా రక్షణ విధానం లేకపోవడంతో మోడీ ఆటలు సాగాయి.

ఇంతకాలం ఎలా దాగింది..

ఇన్నేళ్ళుగా వ్యవస్థ కంటిని శెట్టి ఎలా మభ్యపెట్టారనేది సమాధానం లేని ప్రశ్న. అతను పేపర్ మెసేజిలన్నింటినీ తొలగించాని బ్యాంకు అంటోంది. అనధికారిక సందేశాలను స్విఫ్ట్ సిస్టం కనిపెట్టలేకపోయింది. ఆ బ్యాంకులో స్విఫ్ట్ కోర్ బ్యాంకింగ్‌తో అనుసంధానించపోవడం దీనికి కారణం. అది ఉండి ఉంటే అన్ని లావాదేవీలు నమోదై ఉండేవి. స్విఫ్ట్ విధానం లేనప్పుడు బ్యాంకులు టెలిక్స్‌పై ఆధారపడేవి. అంతర్జాతీయంగా నిధుల బదిలీకి అప్పట్లో ఇదే ఆధారం. ఈ సందేశాలు అందడం ఆలస్యమై ఆందోళన కలిగించేది. ప్రతి లావాదేవీని టెలెక్స్ పంపేవారు ప్రతి వాక్యాన్నీ వివరించేవారు. వాటిని అవతలి బ్యాంకు ఊహించి అర్థం చేసుకోవాల్సి వచ్చేది. ఇది అనేక తప్పిదాలకు కారణమయ్యేది. దీన్ని అధిగమించేందుకు 1974 స్విఫ్ట్ విధానాన్ని ప్రారంభించారు. ఏడు అంతర్జాతీయ బ్యాంకులు కో ఆపరేటివ్ సొసైటీగా ఏర్పడి దీన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన విధానం. స్విఫ్ట్ విధానాన్ని సిబిఎస్‌తో అనుసంధానించడం పెద్ద కష్టమేమీ కాదని ఆర్బీఐకి చెందిన ఒక మాజీ డిప్యూటీ గవర్నర్ చెబుతున్నారు. దానికి ఖర్చవుతుంది.. అది కచ్చితంగా 1.77 బిలియన్ డాలర్ల మోసం కంటే తక్కువే అవుతుందన్నారాయన. భారత్‌లోని కొన్ని ప్రైవేట్ బ్యాంకులు సిబిఎస్, స్విఫ్ట్‌లను అనుసంధానించుకున్నాయి. ఎస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ బ్యాంకులూ, ప్రభుత్వ రంగంలో ఎస్‌బిఐ ఇలా రెండు వ్యవస్థలనూ అనుసంధానించుకున్నాయి. ఇది విపత్తును పెద్ద స్థాయిలోనే తగ్గిస్తుంది. కానీ, పూర్తిగా ప్రమాదాన్ని నివారించలేదు.

-సుబ్రహ్మణ్యం వి.ఎస్. కూచిమంచి

జాతీయతను ప్రోదిచేసిన హల్దేకర్



నేడు వర్థంతి

1925 సంవత్సరం విజయదశమినాడు కొంత మంది మిత్రులతో జన్మజాత దేశభక్తుడు డాక్టర్ హెడ్గేవార్ హిందూ సంఘటన విషయమై చర్చించారు. డాక్టర్ కేశవ బలీరామ్ హెడ్గేవార్. వివిధ సామాజిక, రాజకీయ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటూ నిశితంగా అధ్యయనం చేశారు. తీవ్రవాద కార్యకలాపాలలోనూ కాంగ్రెస్ పార్టీలోనూ వారికి ఘనిష్ఠమైన సంబంధం ఉండేది. చివరకు వారు హిందూ సమాజంలోని వ్యక్తులలో జాతీయ భావాన్ని జాగృతం చేసి వారందరినీ సంఘటితపరచడం జాతి ఉన్నతికి ఉత్తమ సోపానమనే నిర్ణయానికి వచ్చారు. హిందూ సంఘటన విషయమే చర్చించారు. ఆనాటి సమావేశంలో సంస్థపేరు విషయాలపై గానీ, నియమ నిబంధనావళి గానీ ఆఫీస్ సైన్ బోర్డ్, పబ్లిసిటీ గానీ చర్చనీయాంశాలు కావు కేవలం హిందూ సమాజం ఉన్నతికి ప్రయత్నం చేయాలన్న విషయం నిశ్చయం చేశారు హెడ్గేవార్. 1926 ఏప్రిల్ వరకు సంఘం పనులు కొనసాగాయి. సంఘం ఆరు నెలల దాకా పేరు లేకుండానే కొనసాగింది. ఆ తరువాత డాక్టర్జీ మోహిత్ వాడ మైదానాన్ని శుభ్రంచేసి 27, 28 మే 1926 రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖను ప్రారంభించారు. దీన్ని వారు ప్రథమ శాఖ అంటారు. 1928 విజయదశమి నాడు స్వయం సేవకులు మొట్టమొదటి ఘోష్ సహిత పథ సంచలనం చేశారు. ఆర్ఎస్ఎస్ మొదట్లో సంస్థ యొక్క అస్థిత్వానికి కృషి చేయవలసి వచ్చింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం జ్యేష్ఠ ప్రచారకుల్లో ఒకరైన శ్రీరామచంద్ర జీ సదాశివ్ హల్దేకర్ 1930 ఫిబ్రవరి 5న మహారాష్ట్రలోని శంభాజీనగర్ జిల్లా హల్దాం గ్రామంలో జన్మించారు. డిగ్రీ విద్యాభ్యాసం కోసం 1953లో హైదరాబాద్ వచ్చారు. బిఎస్‌సి చదువుతున్నప్పుడే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పట్ల ఆకర్షితుడయ్యాడు. 2003 నుండి 10 సంవత్సరాలకు పైగా దక్షిణ మధ్య (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) క్షేత్రానికి కార్యకారిణి సదస్సులుగా బాధ్యతలు వహించారు. మరాఠీ నుంచి కొన్ని రచనలను తెలుగులోకి అనువదించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ జీవిత చరిత్రను నవల రూపంలో గో.ని. దాండేకర్ మరాఠీలో రాయగా దాన్ని హల్దేకర్ జీ పెను తుపానులో దీపస్థంభం పేరుతో తెలుగులోకి అనువదించారు. ఫిబ్రవరి 23న హైదరాబాద్‌లో హల్దేకర్ తుదిశ్వాస విడిచారు.

-కొలనుపాక కుమారస్వామి, 9963720669

అడ్డగించైనా ఆధిపత్యం

పొరుగువారికి సాయపడడం..వారితో మంచిగా మెలగడం భారతీయుల నైజం. అందర్నీ కలుపుకుని పోవాలనేదే మన ధ్యేయం. మనమిలా ఉన్నాం కదా..మిగిలిన వారూ అలాగే ఉంటారని ఆశించడం అంత ప్రమాదం మరొకటి లేదు. అలాగుంటే మన చాపకిందకే నీళ్ళొచ్చేస్తాయి. ఇంతవరకూ పాకిస్తానే మనకు శత్రువనుకున్నాం. ఇప్పుడు దానికి చైనా కూడా తోడైంది. ఇండో-చీనీ భాయీభాయీ అన్న సూత్రానికి అది తిలోదకాలిస్తోంది.


ప్రపంచ రాజకీయాలు ఇప్పుడు ఆసియా దేశాల చుట్టూ తిరుగుతున్నాయి. చైనాను నియంత్రించేందుకు అమెరికా ఇండియాతో మైత్రి సాగిస్తూ అన్ని విధాలుగా ప్రోత్సాహాన్నిస్తోంది. మరోవైపు పాకిస్తాన్‌ను గుప్పిట్లో పెట్టుకొనేందుకు 2 వేల మిలియన్ డాలర్లు ఆయుధ సహాయాన్నందించింది. ఉత్తర కొరియా అణ్వాయుధాలను ఉపయోగించకుండా దక్షిణ కొరియాకు సహాయపడుతోంది.

ఇవి కాకుండా ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియాలలో అమెరికా తన సైనిక దళాలను మోహరించి ఉంచింది. మధ్య ఆసియాలో సౌదీ అరేబియా, ఇరాన్ అణ్వాయుధ సంపత్తి పెరగకుండా అమెరికా అదుపు చేస్తూ ఇజ్రాయెల్ బలం పుంజుకొనేలా చేస్తోంది. ఇండియా, చైనాకు పోటీకి నిలబడకుండా చేయడానికి చుట్టుపక్కల దేశాలను చైనా తన అదుపులో ఉంచుకోడానికి ప్రయత్నిస్తోంది. ఇదేరీతిలో 1962లో వారిపై దండెత్తి ఇండియాలోని మంచు ప్రదేశం ఉత్తర హిమాలయ ప్రాంతాన్ని దాదాపు లక్ష కిలోమీటర్లను ఆక్రమించుకుంది. దండయాత్రలో చైనా నమ్మక ద్రోహం చేసిందని ఇండియా అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆవేదన చెందారు. అప్పటి నుండి ఇరు దేశాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. ఇండియాకు సోవియట్ రష్యా చేదోడు వాదోడుగా నిలిచింది. కాలమే గాయాలను మాన్పుతుందన్నట్లు ప్రధాని రాజీవ్‌గాంధీ 1986లో కె.ఆర్.నారాయణ్‌ను చైనా రాయబారిగా నియమించి సత్సంబంధాలను పునరుద్ధరించారు. చైనా మనతో స్నేహంగానే ఉంటూ తనకంటే బలంగా ఎదుగుతోందని గుర్తించి, తన పెత్తనానికి అడ్డు తగలకుండా జాగ్రత్త వహిస్తోంది. సంబంధాలు మెరుగుపడడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలు దాదాపు 6.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. చైనా వస్తువులు ఇబ్బడి ముబ్బడిగా తరలిరావడంతో మనదేశంలో చిన్న పరిశ్రమలకు దెబ్బ తగిలింది. ఇది గుర్తించేటప్పటికి రెండు దశాబ్దాలు గడిచాయి. జరగవలసిన నష్టం జరిగిపోయింది. దానితో 2016 - 17 కాలంలో చైనా మార్కెట్ల దిగుమతులపై ఆంక్షలను విధించడమే కాక వస్తువుల అమ్మకాలను భారత్ నిషేధించింది. చీకటి మార్కెట్ ద్వారా చైనా వస్తువులు ఇండియా మార్కెట్లకు చేరుతూనే ఉన్నాయి. మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేందుకు చైనా పాకిస్తాన్‌కు ఇతోధికంగా సహాయపడుతోంది. పాకిస్తాన్‌కు ఆయుధాలు సరఫరా చేయడం (లేదా) పాకిస్తాన్ క్షిపణులు తయారు చేయడానికి సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. పాకిస్తాన్ ఇదే అదనుగా తీసుకొని ఇండియా సరిహద్దుల్లో స్మగ్లింగ్‌ను ప్రోత్సహిస్తోంది. మన కరెన్సీ నోట్లను ముద్రించి మన ఆర్థిక వ్యవస్థలో చొప్పించి చిన్నాభిన్నం చేయడానికి యత్నిస్తోంది. పాకిస్తాన్‌కు సహాయపడే నెపంతో ఇండియా - చైనా - పాకిస్తాన్ కారిడార్ ప్రాంతమైన ఉత్తర హిమాలయాలలోని కోరాకారం పాస్ ద్వారా రహదారి నిర్మాణాన్ని చేపడుతోంది. ఇప్పటికే ఆ మంచు ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలు చాలావరకు పూర్తయ్యాయి. తద్వారా ఇండియా పశ్చిమ దేశాలతో భారత వాణిజ్యాన్ని నియంత్రించవచ్చని భావిస్తోంది. ఇండియాలో చమురు ఉత్పత్తులు తక్కువ కనుక వాటిని మధ్య ఆసియా దేశాల నుండి దిగుమతిని నియంత్రిస్తోంది. సౌదీ అరేబియా నుండి గొట్టాల ద్వారా చమురును దిగుమతి చేసుకొనేందుకు పైప్‌లైన్ పాకిస్తాన్ గుండా రావాలి. ఇంతవరకు అది ఖరారు కాలేదు.

పాకిస్తాన్ చొరబాటు దాడులు చేయిస్తూ ఉంటోంది. నేపాల్ సరిహద్దుల ద్వారా అక్రమ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోంది. డ్రగ్స్, మందుల చీకటి వ్యాపారం ఈ ప్రాంతాల గుండా ఇండియాలోకి చొరబడేలా చేస్తోంది. ఇటీవలి కాలంలో భారత ఉత్తరప్రాంత భూభాగంపై చైనా కన్ను వేసింది. మన ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లోకి చొరబడి అల్లర్లు సృష్టిస్తోంది. అరుణాచల్‌ప్రదేశ్ పర్వత ప్రాంతం జనాభా మొత్తం 14 లక్షలు. ఎంతో భూభాగం ఖాళీగా ఉంటుంది. చైనా దేశస్థులకు భూభాగం చాలక చాలాభాగం నీళ్ళలో ఇళ్ళు కట్టుకొని నివసిస్తున్నారు.

అరుణాచల్‌ను ఆక్రమించుకుంటే వారు ఆ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకోవచ్చును. అదీకాక ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయలో అణు ఇంధనం వనరులు బయటపడ్డాయి. మన అణు ఇంధన శాఖ ఈశాన్య రాష్ట్రాలలో యురేనియం తవ్వకాల పనులు ప్రారంభించింది. దాన్ని చైనీయులు తట్టుకోలేక మనదేశంలో ప్రవేశించేందుకు భూటాన్, నేపాల్ పరీవాహక ప్రాంతంలో రోడ్లను నిర్మించేందుకు డొక్లాం నిర్మాణాలను ప్రారంభించారు. దీనిపై భారత్ చైనాకు అభ్యంతరాలను తెలిపింది. అయినా తాత్కాలికంగా విరమించినట్లు చేసి ఆరు నెలల కొకసారి డొక్లాం రహదారి నిర్మాణాలను పునః ప్రారంభిస్తోంది. మనదేశం అందుకు చైనాకు నిరసన తెలియచేస్తూ సరిహద్దు దళాలను పెద్దఎత్తున సైన్యాన్ని ఆ ప్రాంతంలో మోహరించింది. అయినా పదే పదే కవ్వింపు చర్యలకు పాల్పడుతూ భారతదేశం అభివృద్ధిపై పెట్టే దృష్టిని మళ్ళించేందుకు చైనా ప్రయత్నిస్తోంది. మరో పక్క చైనా నుండి వస్తున్న నీటిని బ్రహ్మపుత్ర నదిలోకి రాకుండా సొరంగాలు తవ్వి దారిమళ్ళించడం (లేదా) విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కార్యక్రమాలు చేపడుతోంది.

- డాక్టర్ కె.ఆశయ్య,ఐఐఎస్,8008359912



సాయినాథ్ తోటపల్లి, 9394449777

సినిమాలో నవ్వులూ లెక్కించొచ్చు!

ఏప్రిల్ 27, 1984 న నేను సంభాషణలు రాసిన తొలి చిత్రం సితార రిలీజయిన కొత్తల్లో బి. గోపాల్ మద్రాసులోని పామ్ గ్రోవ్‌లో నన్ను కలిసినప్పుడు ఓ కథ విన్నారు. ఆ కథ నచ్చి నన్ను తీసుకెళ్ళి దగ్గుబాటి రామానాయుడుకు పరిచయం చేశారు. నాయుడు గారిని అంతకుముందే జంధ్యాల గారి దగ్గర నేను కలిశాను. ఈ కారణంగా ఆయన నన్ను ఆప్యాయంగా పలకరించారు. నీపేరు విన్నానయ్యా - ఏడిద నాగేశ్వరరావ్ చెప్పారు. అంటూ కథ విన్నారు. మధ్యాహ్నం 4 గంటలకి తిరిగి ఆఫీసుకు రమ్మన్నారు. ఏ అభిప్రాయం చెప్పలేదేంటి? అని గోపాల్‌ని అడిగా. ఆయనకి నచ్చకపోతే వెంటనే చెప్పేస్తారు.

నచ్చితే చెప్పరు? అన్నారు గోపాల్. ఆ తరవాత నవ్వి .. తటపటాయిస్తూ ఒక నిజం చెప్పాడు. ఆయన మధ్యాహ్నం చెప్తారు అప్పుడు వినండని - ఇదేంటి సస్పెన్స్ ఎందుకు అనుకునే ప్రశ్న వెంటాడుతుండగా మధ్యాహ్నం మళ్ళీ నాయుడు గారిని కలిశాం. పంక్చుయాలిటీ, డిసిప్లిన్, డెడికేషన్, హ్యూమానిటీ లకు మారుపేరైన నాయుడు గారు సరిగ్గా 4 గంటలకి ఆఫీసులో తన ఛైర్లో ఉన్నారు. వెళ్ళి కలవగానే 5 వేల రూపాయల చెక్ రాసుంది..దాన్ని తీసి ఇస్తూ సాయినాథ్ ఏ కథ అయినా నాకు నచ్చితే - లంచ్‌కి ఇంటికి వెళ్ళినపుడు మా ఆవిడకి చెప్పగలిగితే అది హిట్టు... నీ కథ నచ్చింది. రొమాంటిక్‌గా ఫ్రెష్ లవ్ స్టోరీ చాలా సహజంగా - హిలారి యస్‌గా - టెంపోతో చెప్పావ్ - ఇలాగే రేపు సురేష్‌కి చెప్పు అన్నారు. చెప్పాను ఆయన నచ్చిందన్నారు.

మళ్ళీ ఆ కథని రాఘవేందర్‌రావు గారికి ఓ ఉదయం ఆయన ఇంట్లో చెప్పేలా గోపాల్ ఏర్పాటు చేశారు. ఆ కథ విని రాఘవేందర్‌రావు (అప్పటికే నేను జంధ్యాల, సత్యానంద్‌ల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసిన సంగతి బాగా తెలిసిన వ్యక్తి) నువ్వు డైరెక్ట్ చేయాలని రాసుకున్నావా అని అడిగారు - లేదు సార్ ఎవరికైన మంచి సంస్థలో మంచి డైరెక్టర్‌కి చెప్పాలి అనుకున్నాను - అన్నాను. ఆయన సలహా అని తర్వాత రోజు నాయుడుగారు జంధ్యాల గారి దగ్గరకి నన్ను పంపారు. ఆయన విన్నారు అది జరగలేదు. ఇదీ మా తొలి పరిచయం.

ఆ తర్వాత ఆయన సురేష్ కృష్ణ డైరెక్షన్‌లో సురేష్ ప్రేమ చిత్రం తీస్తూ మాటలు రాయమని నన్ను పిలిపించి మరో అడ్వాన్స్ ఇచ్చారు. ఆ చిత్రంతో నేను సురేష్ కృష్ణ మంచి ఫ్రెండ్స్ అయ్యాం. ఆ చిత్రం హిట్ అయింది. ఇది నాకు సురేష్ సంస్థతో, రామానాయుడు గారితో ఉన్న అనుబంధం. నా 35 సంవత్సరాల సినిమా అనుభవంలో ప్రొడ్యూసర్ రామానాయుడు గారంత స్పష్టంగా కథని ఎన్నిక చేసే విధానం, అనలైజ్ చేసే నిశిత అవగాహన పరిశీలన ఉన్నవారిని చూడలేదు. ఓ కథని తను నమ్మితే చాలు అది హిట్ చేయచ్చు అనే ఆత్మవిశ్వాసాన్ని - కొద్దో గొప్పో కె.ఎస్. రామారావులో తప్ప ఇంకెవరిలో నాకు ఇప్పటిదాకా కనిపించలేదు. ఓ సినిమా రిలీజ్ ముందు ప్రొజెక్టర్ వేస్తే తీస్తే ఎన్నిసార్లు నవ్వారు అని అహనా పెళ్ళంట అప్పుడు లెక్కకట్టి మరీ 82 చోట్ల నవ్వుతారయ్యా అంటు జంధ్యాల గారితో రామానాయుడు చెప్పడం నేను స్వయంగా విన్నాను. ఆయన మా స్వాతిముత్యం ప్రొజెక్షన్‌కి వచ్చి ఎవిఎమ్ రాజేశ్వరిలో గోపాల్‌తో వచ్చి చూశారు.

మార్చి 13, 1985న ఒకేరోజు స్వాతిముత్యం, బి.గోపాల్ ప్రతిధ్వని రిలీజయ్యాయి. మా సినిమా చూసి ఆయన ఒక్కమాట అన్నారు. అది ఇప్పటికీ నాకు గుర్తు. కమలహాసన్ పాత్ర బాగుందయ్యా - అది పడితే సినిమా లేతమనసులు పట్టకపోతే పాల మనసులు అన్నారు. మూవీ మొఘల్ గురించి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన తెలుగు నిర్మాతగా ప్రపంచ ఖ్యాతి పొందిన ఆయన గురించి నేను ఈ ఆర్టికల్ రాయడం- సూర్యుడిని చూపించడం లాటిది. కాని ఆయనలో ఉన్న కొన్ని సుగుణాలు ఇప్పుడు వచ్చే యువనిర్మాతలు తెలుసుకోదగినవి. కథ వినేవారికి ఆ రోజున ట్రెండ్ ఏం నడుస్తోంది అనుకోకుండా వినే కథ నాకు అద్భుతమనిపిస్తే చాలు. కథ నమ్మాలా వద్దా అనే డోలాయమాన స్థితిలో ఉన్నవారిని ఈరోజుల్లో ఎక్కువగా చూస్తున్నాం. విమర్శించే వాళ్ళు ఓ ప్రేమనగర్, ఓ దేవత డిసైడ్ చేయలేరు. ఎందుకు చేసావీ పని? అని హీరో తన ప్రేయసిని అడిగే ఒక్కమాట ప్రేమనగర్ కథని గొప్ప మలుపుతిప్పే ట్విస్ట్ - అంతదాకా జరిగే కథ నార్మల్‌గా ఓ తాగుబోతు, తిరుగుబోతు - జమీందారు గారి అబ్బాయి - ఓ ఎయిర్‌హోస్టెస్ పైన ఎలా ప్రేమ పెంచుకున్నారు అనే అంశాన్ని రామానాయుడు దృశ్య కావ్యంలా మలిచిన తీరు అద్భుతం.కథ పట్ల వారికున్న నమ్మకమే సినిమా గెలిచేలా చేసింది. నటించిన నాగేశ్వరరావుగారికీ, మాటలు, పాటలు రాసిన ఆత్రేయగారికి, సంగీతం అందించిన మహదేవన్ గారికి నాయుడుగారి నమ్మకమే ఊపిరి, ప్రోత్సాహం. అదే 38మంది స్ట్రెయిట్ కథలు తెచ్చిన దర్శకులకి బ్రేక్ ఇవ్వగలిగిన దమ్ము ఆయనకిచ్చింది. ఓ సురేష్ సంస్థలో బ్రేక్ తెచ్చుకున్న అందరూ అందరూ బయట ప్రపంచంలో సూపర్ అనిపించుకొన్న దర్శకులే - కాని నాయుడు గారి గురించి తెలిసిన ఏ టెక్నీషియన్ అయినా ఆయనలో ఉన్న ఓ భోజ రాజుని, ఓ కృష్ణదేవరాయలని కళాతృష్ణ ఉందని చెప్పకమానరు. హ్యాట్స్ ఆఫ్ టుడే. రామానాయుడు గారు.

క్రెడిట్ కార్డులతో కోటిన్నర స్వాహా

● పదిమంది సభ్యుల పట్టివేత



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కథ, స్క్రీన్‌ప్లే దర్శకత్వం అంతా తానై కథ నడిపించాడు. బావమరిదితో జత కట్టాడు. కొందరు జీహెచ్‌ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ఓ ఇంటర్నెట్ సెంటర్ ఓనర్‌ను మచ్చిక చేసుకున్నాడు. కూతురు పేరుతో పర్నిక నానో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో బోగస్ కంపెనీ స్టార్ట్ చేశాడు. వివిధ పేర్లతో నకిలీ వోటర్ ఐడీ, పాన్ కార్డులను సృష్టించి 48 మంది బోగస్ ఉద్యోగులకు మూడు నెలల పాటు జీతాలు ఇస్తున్నట్లుగా బ్యాంకులను నమ్మించాడు. అనంతరం మొత్తం నాలుగు బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఎస్‌సీబీ, ఆర్‌బీఎల్ బ్యాంకుల నుంచి 125 క్రెడిట్ కార్డులను తీసుకుని మొత్తంగా రూ.1,52,10,705 రూపాయలకు బురిడీ కొట్టాడు. కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు కుంభం రంగారెడ్డి (32), తిప్పర్తి వినయ్‌కుమార్ రెడ్డి (ప్రధాన నిందితుడు రంగారెడ్డి బావమరిది), మేకా సంతోష్ రెడ్డి (ఇంటర్‌నెట్ సెంటర్ ఓనర్), జీహెచ్‌ఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వరికుప్పల శ్రీకాంత్, మక్కాల నరేష్, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ఇష్యూ చేసే ఉద్యోగులు గోపతోటి కిషోర్‌బాబు, గోరంట్ల శైలేష్‌కుమార్ (పార్క్ కన్సల్టెన్సీ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డ్ అప్లికేషన్ ఫ్రం వెరిఫికేషన్ ఏజెంట్) రెడ్డిపల్లి సంతోష్ కుమార్ (ఇన్నోవా గ్లోబల్ సర్వీసెస్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, అప్లికేషన్స్ కలెక్షన్ ఏజెంట్, ఎస్‌బీఐ బ్యాంకు లాగిన్ యూజర్), ఉప్పు ఆనంద్ (వీ అండ్ ఓ వెరిఫికేషన్ ఎగ్జిక్యూటివ్, అప్లికేషన్స్ వెరిఫికేషన్ ఏజెంట్ ఆఫ్ ఎస్‌బీఐ బ్యాంకు), ముద్దునూరు పరమేష్ కుమార్‌లను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితుల వద్ద నుంచి రూ.6,90,000 నగదు, 19 సెల్ ఫోన్‌లు, మూడు సీపీయులు, నాలుగు మానిటర్లు, రెండు కలర్ ప్రింటర్లు, ఒక లాప్‌టాప్, తొమ్మిది నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, కొన్ని క్రెడిట్ కార్డుల (ఒరిజినల్ అండ్ ఫోటో కాపీస్ ఆఫ్ ది ఓల్డ్ కార్డ్స్)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషిచేసిన పోలీసులను హైదరాబాద్ సీపీ వి.వి. శ్రీనివాసరావు అభినందించి రివార్డులను అందజేయనున్నట్లు తెలిపారు.

ఏసీబీ కస్టడీకి పురుషోత్తంరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అక్రమాస్తుల కేసులో రిమాండ్‌లో ఉన్న హెచ్‌ఎండిఎ అధికారి పురుషోత్తంరెడ్డిని ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు పురుషోత్తంరెడ్డిని విచారించవచ్చని కోర్టు పేర్కొంది. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలను ఎదుర్కొంటున్న పురుషోత్తంరెడ్డిని కస్టడీకి ఇవ్వాలంటూ ఏసీబీ అధికారుల పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు గురువారం తన నిర్ణయాన్ని వెలువరించింది. ఈనెల 2 వ తేదీన ఎసిబి అధికారులు పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులపై దాడులను ప్రారంభించిన విషయం తెలిసిందే. దాడులు జరిగినప్పటి నుంచి తప్పించుకున్న పురుషోత్తంరెడ్డి 15 రోజుల తర్వాత కోర్టులో లొంగిపోయిన విషయం తెలిసిందే. పురుషోత్తంరెడ్డి మరిన్ని చోట్ల ఆయనకు ఆస్తులున్నాయన్న అనుమానంతో కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరింది. పురుషోత్తంరెడ్డి చిక్కాడన్న సమాచారం తెలిసిన తర్వాత ఆయన బాధితులు కొంత మంది తమను వేధించిన వైనంపై ఏసీబీకి ఫిర్యాదు చేశారు. అదే విధంగా బినామీల నుంచి కూడా కొంత సమాచారాన్ని సేకరించారు. ఈ మొత్తం అంశాలపై సమగ్రంగా విచారించాల్సి ఉన్నందున కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోరింది.

శ్రీనివాస్‌రెడ్డికి కస్టడీ

పురుషోత్తంరెడ్డి బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని 14 రోజుల కస్టడీకి విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనను అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. పురుషోత్తంరెడ్డిని విచారిస్తున్న సమయంలోనే శ్రీనివాస్‌రెడ్డిని కూడా కస్టడీలోకి తీసుకోవాలని, అందుకోసం కోర్టులో పిటిషన్ వేయాలని అధికారులు నిర్ణయించారు. శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు.

తెలంగాణ తొలి ఎన్నికల ప్రధానాధికారిగా

రజత్‌కుమార్

● ఉత్తర్వులు జారీ



ఆంధ్రప్రభ, హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర తొలి ఎన్నికల ప్రధానాధికారిగా ప్రస్తుత అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి, 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఈఓ పోస్టుకుగానూ ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన జాబితాను ఈ నెల5న కేంద్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ ప్రభుత్వం పంపిన సంగతి తెలిసిందే. ఈ జాబితాలో రజత్ కుమార్‌తోపాటు కార్మిక శాఖ కార్యదర్శి శశాంక్ గోయల్, విద్యా శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ పేర్లతో సీఈసికి పంపారు. ఢిల్లీ నిర్వచన్ సదన్‌లో సమావేశమైన ఎలక్షన్ కమిషనర్ల పానెల్ తెలంగాణకు కొత్త సీఈఓను ప్రకటించింది.

మార్చిలో రైతు సమస్యలపై దీక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆందోళన వెలిబుచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతుకు లాభసాటి ధరలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 5నుంచి రాష్ట్రంలో రైతుల సమస్యలపై నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు, దళారులు కుమ్మక్కయి రైతును నిలువునా దోపిడీ చేస్తున్నారన్నారు. తాము ఇటీవల నారాయణఖేడ్ మార్కెట్ కమిటీని తనిఖీచేసి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని స్వయంగా పరిశీలించామన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని హోం శాఖమంత్రి నాయిని నరసింహారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రైతుల ఆత్మాభిమానాన్ని కించపరుస్తూ మాట్లాడిన మంత్రి నాయినిని ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల అంత చులకన భావంతో ఉన్న నాయిని ఆత్మహత్యచేసుకుంటే తన ఇంటిని విక్రయించి తానే ఆయనకు రూ.60లక్షల పరిహారంగా ఇస్తానని ప్రకటించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడితో మూర్ఛవ్యాధి

● చికిత్సతో శాశ్వత నివారణ: డాక్టర్ సీతాజయలక్ష్మి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మానసిక ఒత్తిడి, నిద్రలేమీతో మూర్ఛ వ్యాధికి గురవుతున్నారని, ఇది యుక్త వయసులో ఉన్నవారికే ఎక్కువగా వస్తోందని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సీతా జయలక్ష్మీ చెప్పారు. మానసికంగా ఒత్తిడి ఉన్న వారికి యుక్త వయసులో, తలకు గాయాలైన వారికి మధ్య వయసు నుంచి మూర్ఛ వ్యాధి సోకే అవకాశం ఉందని గురువారం విలేకరుల సమావేశంలో ఆమె చెప్పారు. ఈ సమావేశంలో అబార్ట్ ఫార్మా రీజినల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ బాలగోపాల్ నాయర్, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ రమేష్ కోణంకి కూడా పాల్గొన్నారు. మెదడు కణాల్లో పరిమితికి మించి విద్యుత్ విడుదలైనపుడు సొమ్మసిల్లిపోతారని, 30 సెకండ్ల పాటు శరీరం కంపించిపోతుందని జయలక్ష్మీ చెప్పారు. సొమ్మసిల్లిపోయినపుడు దృష్టి, వినికిడి కోల్పోతారని, జ్ఞానేంద్రియాలు పని చేయవని ఆమె చెప్పారు. ఒకసారి మూర్ఛ సోకితే అది తరచూ వచ్చే అవకాశాలు ఉన్నాయని, తగిన చికిత్స చేస్తే పూర్తిగా నివారించవచ్చునని ఆమె చెప్పారు. మూర్ఛ వ్యాధిగ్రస్తుల్లో 80శాతం మంది గ్రామీణ, మధ్య తరగతి వారే ఉన్నారని ప్రపంచ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని ఆమె చెప్పారు. చిన్న పిల్లల్లో పుట్టుకతో వచ్చిన మూర్ఛ వ్యాధి తాత్కాలికమేనని, సరైన ఆహారం అలవాట్లతో దీన్ని నివారించవచ్చునని పిడియాట్రిక్ న్యూరోలజిస్ట్ డాక్టర్ రమేష్ చెప్పారు. ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు మూర్ఛ వ్యాధిపట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఉందని డాక్టర్ బాలగోపాల్ నాయర్ చెప్పారు. మూర్ఛ వ్యాధి సోకిన వారికి ఆరోగ్యపరమైన సమస్యలకు దారి తీస్తుందని, సరైన సమయంలో చికిత్స తీసుకుంటే అసహజ మరణాలు నివారించవచ్చునన్నారు.

రైతు సమన్వయ సమితులు..

పదవుల జాబితా రెడీ

● ముఖ్యమంత్రి వద్దకు చేరిన నేతల లిస్ట్ ● జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశాలు ● ఏకాభిప్రాయంతో ప్రతిపాదనలు ● రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతు సమన్వయ సమితుల ఏర్పాటు దాదాపు కొలిక్కి వచ్చింది. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాలతో జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూర్చుని.. ఏకాభిప్రాయంతో పలు పేర్లు ప్రతిపాదించారు. రెండు, మూడు జిల్లాల్లో ఏకాభిప్రాయం వ్యక్తం కాని చోట ముఖ్యమంత్రికే నిర్ణయాన్ని వదిలేస్తూ పేర్లన్నీ పంపారు. భవిష్యత్ రాజకీయాలకు ఉపయోగపడే నేతలను.. సమర్థులు, చురుకైన వారిని ఈ పదవులకు సూచించాలని సిఎం ఆదేశించగా, అందుకు అనుగుణంగానే నేతలను ఎంపిక చేశారు. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల జాబితాలు సిఎం వద్దకు చేరగా, ఒకటి.. రెండు రోజుల్లోనే వీటిని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈనెల 25,26తేదీల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించనుండడంతో అంతకు ముందుగానే జాబితా ప్రకటించాలా.. సదస్సుల సందర్భంగా మరింత ఫీడ్‌బ్యాక్ తీసుకుని ప్రకటించాలా అన్న దానిపై సిఎం నేతలతో చర్చిస్తున్నారు. రైతు సమన్వయసమితిని కార్పొరేషన్‌గా గురువారం ముఖ్యమంత్రి కెసిఆర్ ఖరారు చేయగా, దీనిని లాభాపేక్ష లేని సంస్థగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో రాష్ట్రచైర్మన్‌గా ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డికి లైన్‌క్లియరైనట్లేనని భావిస్తున్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్యాల మండలంలోని ఒక గ్రామ సమితి సభ్యుడిగా పేరునమోదుచేసుకున్నట్లు తెలిసింది.ఇక జిల్లా పదవులకు సంబంధించి తీవ్ర పోటీ నెలకొంది.

చైర్మన్లు వీరేనా?

రైతుసమన్వయ సమితులు భవిష్యత్తులో కీలక భూమిక పోషించే అవకాశం ఉండడంతో ఈ పదవులకు తీవ్ర పోటీపెరిగింది. జిల్లా స్థాయి కో-ఆర్డినేటర్ల నియామకం కొందరు మంత్రులకు తలనొప్పి తెచ్చిపెట్టగా, పలు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఈ పదవులనూ కొందరు నేతలు సద్వినియోగం చేస్తున్నారు. మంత్రి మహేందర్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యవహరించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల కో-ఆర్డినేటర్లను నేతలను సమన్వయం చేసుకుని ఐదు మాసాల క్రితమే ఖరారు చేశారు. తాజాగా ఒక జిల్లా పదవి విషయంలో విభేదాలు తలెత్తినట్లు తెలిసింది. సిరిసిల్ల జిల్లాకు సంబంధించిన ప్రతిపాదన తొలిసారి రాగా, ఆ తర్వాత వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి స్వయంగా ఫోన్‌లు చేయడంతో అన్ని జిల్లాల నుండి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఖమ్మం ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెండు పదవులను మంత్రి తుమ్మల, ఎంపీలు పొంగులేటి, సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు కూర్చుని ఏకాభిప్రాయానికి వచ్చారు.

ఆంధ్రప్రభకు అందిన సమాచారం ప్రకారం ఇప్పటివరకు అధిష్టానం పరిశీలనలో ఉన్న జిల్లాల కో-ఆర్డినేటర్లు..

జిల్లా పేరు	కో-ఆర్డినేటర్ పేరు
పెద్దపల్లి	కోట రాంరెడ్డి
వికారాబాద్	కొప్పుల మహేష్‌రెడ్డి
మేడ్చల్	నందారెడ్డి
ఖమ్మం	మందడపుసుధాకర్
కొత్తగూడెం	అంకిరెడ్డి కృష్ణారెడ్డి
ఆదిలాబాద్	అడ్డి భోజారెడ్డి
రాజన్న సిరిసిల్ల	గోపాల్ రావు
రంగారెడ్డి	వంగేటి లక్ష్మారెడ్డి
నిర్మల్	నల్లా వెంకట్రామిరెడ్డి
మంచిర్యాల	శ్రీనివాసరావు
కుమరంభీం	విశ్వనాథ్
నల్లగొండ	యడవెల్లి విజయేందర్‌రెడ్డి
యాదాద్రి	వంగాల వెంకన్నగౌడ్ లేదా రాజవర్ధన్ రెడ్డి
గద్వాల	సీతారాంరెడ్డి (లేదా) కృష్ణమోహన్‌రెడ్డి
మహబూబ్‌నగర్	మల్లునర్సింహారెడ్డి (లేదా) బస్వరాజ్‌గౌడ్
నాగర్‌కర్నూల్	దొడ్డ ఈశ్వర్‌రెడ్డి (లేదా)జెట్టి వెంకటేశ్వర్లు

జైకామ్‌తో టీటా భాగస్వామ్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం శాంతి భద్రతలకు పెద్ద పీట వేస్తోందని హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. సురక్షితమైన శాంతిభద్రతల కోసం జైకామ్ ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సిస్టమ్స్ తెలంగాణ ఐటీ అసోసియేషన్ ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమని ప్రశంసించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముందుకు వచ్చే సంస్థలకు మద్దతు ఇస్తామని ప్రకటించారు. మేక్ యువర్ సిటీ సేఫ్ పేరుతో జైకామ్ రూపొందించిన ప్రాజెక్టుకు తెలంగాణ రాష్ట్రంలో టీటా (తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్) ను భాగస్వామిగా చేసుకుంది. ఈ మేరకు మంత్రి నాయిని, తెలంగాణ భూగర్భ జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వి.ప్రకాశ్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. తెలంగాణ ఐటీ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల, ఉపాధ్యక్షుడు రాణా ప్రతాప్, జైకామ్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమోదరావు, టీటా కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ ఐటీ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ దేశంలో రక్షణపరమైన సేవలు అందించే సంస్థల్లో అగ్రగామిగా ఉన్న జైకామ్ ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సిస్టమ్స్‌తో కలిసి తెలంగాణ ఐటీ అసోసియేషన్ ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు. ప్రజలకు భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన మేక్ యువర్ సిటీ సేఫ్ అనే ప్రాజెక్టుకు తెలంగాణ రాష్ట్రానికి టీటాను భాగస్వామిగా చేసుకోవడం తమకు దక్కిన గుర్తింపు అన్నారు. డిజిథాన్ పేరుతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా టీటా ఆధ్వర్యంలో సాంకేతిక అక్షరాస్యతపై కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. బంజారాహిల్స్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆరు నెలలో ప్రారంభానికి నోచుకోనుందని తెలిపారు. జైకామ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమోద్‌రావు మాట్లాడుతూ మెరుగైన శాంతి భద్రతల కల్పన కోసం తమతో జట్టు కట్టేందుకు టీటా ముందుకు రావడం సంతోషకరమన్నారు.

టీఆర్‌టీ అభ్యర్థులకు మాక్ ఆన్‌లైన్ పరీక్ష

● వెబ్‌సైట్‌లో ఉంచిన టీఎస్‌పీఎస్సీ ● సమస్యలపై హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలి

తేది	పరీక్ష	దరఖాస్తు	డౌన్‌లోడ్
24/2/18 ఉదయం	తెలుగు లాంగ్వేజ్‌పండిట్	17970	15043
24/2/18 మధ్యాహ్నం	తెలుగు స్కూల్ అసిస్టెంట్	16827	12512
25/2/18 ఉదయం	తెలుగు ఎస్‌జిటి	56468	41921
25/2/18 మధ్యాహ్నం	ఇంగ్లీష్ ఎస్‌జిటి	29195	24867

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉపాధ్యాయ నియామక పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆన్‌లైన్‌లో మాక్ పరీక్ష పత్రాన్ని అందుబాటులో ఉంచింది. టిఆర్‌టి పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున నిరుద్యోగ అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని కమిషన్ తన వెబ్‌సైట్‌లో మాక్ ప్రశ్నాపత్రాన్ని ఉంచిందని, అభ్యర్థులు దీనిని ఉపయోగించుకోవాలని కమిషన్ కార్యదర్శి ఏ వాణిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఇన్‌స్ట్రక్షన్స్ టు క్యాండిడేట్స్ ఆన్ సీబీఆర్‌టీ ఎగ్జామ్స్ అని టైప్ చేస్తే మాక్ పరీక్షపత్రం వస్తుందని దీనిని ఉపయోగిం చుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వచ్చే ఇబ్బం దులు, సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఫోన్ నంబర్ 8333923740కు సమస్యలను చెప్పి పరిష్కరించుకోవచ్చిని హెల్ప్ డెస్క్ ఉదయం 10. 30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 24, 25 తేదిల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ల డౌన్‌లోడ్ చేసుకున్న వారి వివరాలను కమిషన్ ప్రకటించింది.

నిమిషం ఆలస్యం అయినా అనుమతి లేదు


- 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రంలో ఉండాలి
- 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తప్పనిసరి

టిఆర్‌టి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు. పరీక్షా కేంద్రానికి 15 నిమిషాలు ముందుగానే హాజరు కావాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచించింది.

హాల్‌టికెట్‌తోపాటు ఒరిజినల్ గుర్తింపు కార్డును చూపించాలి. రెండు పాస్ట్‌పోర్ట్ ఫోటోలు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్ష సమయం ముగిసే వరకు అభ్యర్థులను బయటికి పంపించరు. ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు ఆభరణాలను అనుమతించరు. వేలిముద్రలు సేకరిస్తున్న నేపథ్యంలో అమ్మాయిలు చేతులకు మెహందీని పెట్టుకోకుండా ఉండటం మంచిదని సూచించింది.

సంస్కరణలతో రూ. 1810 కోట్లు ఆదా

● 16,812 షాపుల్లో ఈ-పాస్ మెషిన్లు ● జూన్ నుంచి రాష్ట్రంలో ఎక్కడైనా సరకులు తీసుకోవచ్చు ● 15 మందిపై త్వరలో పీడీ చట్టం ● త్వరలో లక్ష రేషన్ కార్డులు: పౌర సరఫరాల కమిషనర్ సీవీ ఆనంద్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: పౌరసరఫరాల శాఖలో ప్రవేశపెట్టిన సంస్కరణల మూలంగా ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ. 1810 కోట్లు ఆదా అయిందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. రేషన్ షాపుల్లో జరిగే అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలోని 16,812 రేషన్ షాపుల్లో ఈ- పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) మెషిన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తద్వారా ప్రతి నెలా 15 శాతం మిగులు అవుతోందని ఆయన చెప్పారు. గడిచిన 23 నెలల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులుతోందని చెప్పారు. తద్వారా రూ. 578 కోట్లు ఆదా కానుందని తెలిపారు. ఈ-పాస్ మిషన్ ద్వారా జరిగే ప్రయోజనాల గురించి డిప్యూటీ కమిషనర్ కె వెంకటేశ్వరరావుతో కలిసి ఆనంద్ గురువారం పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మీడియాకు వివరించారు.

మహబూబ్ నగర్ జిల్లాలో 2017 ఏప్రిల్‌లో ప్రయోగాత్మకంగా 800 షాపుల్లో అమలు చేయడం ప్రారంభించామన్నారు. ప్రయోగం విజయవంతం కావడంతో దశల వారీగా 10 నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 16,812 షాపుల్లో ప్రస్తుతం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఎటువంటి నెట్‌వర్క్ పనిచేయని రేషన్ షాపులు రాష్ట్ర వ్యాప్తంగా 184 ఉండగా, మరో 28 షాపుల్లో సిగ్నల్ తక్కువగా ఉందని తెలిపారు. త్వరలోనే వీటిలో కూడా ఈ-పాస్ మెషిన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ-పాస్ మెషిన్ల ఏర్పాటు మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏడాదికి రూ. 800 కోట్ల నుంచి రూ. 850 కోట్ల వరకు ఆదా అవుతుందని స్పష్టం చేశారు. మార్చి నుంచి జిల్లాలోని ఏ షాపు నుంచైనా రేషన్ సరుకులు పొందేలా రేషన్ పోర్టబిలిటీని 31 జిల్లాల్లోనూ ఏర్పాటు చేశామన్నారు. జూన్ నుంచి రాష్ట్రంలో ఏ షాపులోనైనా రేషన్ పొందేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు.

ప్రతి నెలా 1వ తేది నుంచి 15వ తేది వరకు రేషన్ షాపుల్లో సరుకులు అందుబాటులో ఉంటాయని కమిషనర్ ఆనంద్ తెలిపారు. 16వ తేదిన జిల్లాలకు సరుకుల కేటాయింపు జరుగుతుందన్నారు. 16 నుంచి 18 వరకు డీడీలు చెల్లించాలని, ఆ తరువాత సరుకుల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. 30లోపు అన్ని రేషన్ షాపులకు సరుకులను పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్‌కు లబ్ధిదారులు తీసుకున్న సరుకుల వివరాలకు సంబంధించిన సంక్షిప్త సమాచారం అందుతుందన్నారు. తూకంలో తేడాలు లేకుండా ఉండటం కోసమే ఇటువంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదాముల్లో అక్రమాలు జరగకుండా ఉండటం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రేషన్ కార్డులు కావాలని 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని కమిషనర్ తెలిపారు. వాటిలో లక్ష వరకు అర్హత ఉన్నట్టు పరిశీలనలో తేలిందని వారికి త్వరలోనే కార్డులను జారీ చేయనున్నట్టు చెప్పారు. రేషన్ డీలర్లకు ఇచ్చే కమిషన్ పెంపు అంశం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పరిధిలో ఉందన్నారు. రేషన్ బియ్యం వ్యాపారం చేసే వారిపై పీడీ యాక్ట్‌లు పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే 5 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని, మరో 20 మంది వరకు పిడీ యాక్ట్ నమోదుచేసే అవకాశం ఉందని కమిషనర్ మీడియాకు తెలిపారు.

వ్యవసాయ వర్సిటీలో జాబ్‌మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని గృహ విజ్ఞాన్ కళాశాల్లో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనిని కళాశాల అసోసియేట్ డీన్ విజయలక్ష్మీ ప్రారంభించారు. బీస్సీ హోంసైన్స్‌కు చెందిన ఫుడ్‌సైన్స్, న్యూట్రిషన్, ఫ్యాషన్ టెక్నాలజీతోపాటు ఎంఎస్సీకి చెందిన సుమారు 200 మంది విద్యార్థులు జాబ్‌మేళాలకు హాజరయ్యారు. 35 పేరొందిన సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొని విద్యార్థులను రిక్రూట్ చేసుకువడానికి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. భారత ప్రభుత్వ రంగం సంస్థ డైరెక్టరేట్ ఆఫ్ హ్యాండ్లూమ్స్ ప్రతినిధులు పాల్గొని తమ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోయే చేనేత క్లస్టర్స్‌లో పనిచేసేందుకు అవసరమైన బీఎస్సీ టెక్స్‌టైల్స్ విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. అలాగే ఫుడ్స్ అండ్ న్యూట్రిషన్ విభాగం, అప్పారెల్ అండ్ టెక్స్‌టైల్స్, ఎక్స్‌టెన్షన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్ విద్యార్థులతో ఆయా సంస్థల ప్రతినిధులు సెమినార్ నిర్వహించి తమ సంస్థల అవసరాలను విద్యార్థులకు తెలియజేశారు.

26న ఎంసెట్ కమిటీ భేటీ

● అదే రోజు ఈ-సెట్ కమిటీ సమావేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎంసెట్-2018 కమిటీ సమావేశం 26న (సోమవారం) జరగనుంది. కూకట్‌పల్లిలోని జెఎన్‌టియులో సమావేశం జరగనుంది. కమిటీ కన్వీనర్ జెఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఎంసెట్-18ను మొదటి సారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నందున ఈ సమావేశానికి ప్రాధ్యానత సంతరించుకుంది. సమావేశంలో పరీక్షా పత్రంతో పాటు, ఇతర అంశాలను చర్చించనున్నారు. సమావేశం అనంతరం ఎంసెట్-18 షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. అదేరోజు ఇంజనీరింగ్ సెట్(ఈసెట్)-18 కమిటీ సమావేశం కూడా జరగనుంది. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ ఇంజనీరింగ్-18 సెట్ సమావేశం కూడా అదే రోజు నిర్వహించాలని నిర్ణయించారు. వీటికి సంబంధించిన షెడ్యూల్ కూడా విడుదల కానుంది.

నీట్, జేఈఈ, ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నీట్, జేఈఈ, ఎంసెట్‌కు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు. నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. శిక్షణను మార్చి 19 నుంచి ఏప్రిల్ 19 వరకు ఉంటుందన్నారు. పాత ఉమ్మడి 10 జిల్లా కేంద్రాల్లో ఈ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 50 మంది బాలురు, 50 మంది బాలికలకు ఉచిత శిక్షణ ఇస్తారు. శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయులకు గురువారం అవగాహన తరగతులను నిర్వహించారు.

తెలుగులో ఈ-మెయిల్ అడ్రస్‌లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇప్పటి వరకు ఇంగ్లీష్‌కే పరిమితమైన ఇ-మెయిల్ అడ్రస్ ఇప్పుడు తెలుగులో కూడా అందుబాటులోకి వచ్చింది. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైక్రోసాఫ్ట్ ఈ నిర్ణయం తీసుకుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, ఉర్దూ, మరాఠీ, బెంగాలీ, గుజరాతీ, సింధీ, బోడో, డోగ్రి, కొంకణి, మైథిలి, మణిపురీ, నేపాలీ భాషల్లోనూ ఇ-మెయిల్ అడ్రస్‌లను అందుబాటులోకి వచ్చాయి. భవిష్యత్తులో యాప్‌లు, ఇతర సర్వీసుల్లోనూ ఈ భాషలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో మాతృభాష అవరోధం కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా సీవోవో మిథుల్ పటేల్ చెప్పారు.

ప్రాంతీయ భాషల్లో ఆరోగ్య సమాచారం

● పల్సస్ సీఈవో డా. శ్రీనుబాబు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వైద్య, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన సమాచారం ప్రాంతీయ భాషలోకి అనువదించి ఆన్‌లైన్‌లో ఉంచుతున్నట్లు పల్సస్ గ్రూప్ సీఈవో డాక్టర్ శ్రీనుబాబు గేదెల చెప్పారు. ప్రాంతీయ భాషల్లో మారుమూల పల్లెలకు విజ్ఞానం అందించి తద్వారా ఆరోగ్య సంరక్షణతో సామాజిక అభివృద్ధిని సాధించవచ్చునని ఆయన పేర్కొన్నారు. నొయిడాలో పల్సస్ గ్రూపు ఆధ్వర్యంలో వెయ్యి మందికి ఉపాధి కల్పించే కేంద్రాన్ని నెలకొల్పుతున్నామని, యువతలో నైపుణ్యాలను వెలికితీసి శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా తమ సంస్థ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఇంగ్లీష్‌లో ఉన్న శాస్త్రీయ, హెల్త్‌కేర్ సమాచారాన్ని భారతీయ భాషల్లోని జర్నల్స్‌లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది పూర్తయితే శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానానికి భారత్ అంతర్జాతీయ కేంద్రం కానుందని శ్రీనుబాబు పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న మాఫియాను అరికట్టి, సామాన్యులకు ఉచితంగా అందుబాటులోకి ఉంచేందుకు ఓపెన్ యాక్సస్ జర్నల్స్‌ను చారిత్రక అవసరంగా తీసుకువచ్చానని శ్రీనుబాబు చెప్పారు.

ఏటా 50వేల ఇళ్లకు డిమాండ్

● క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు రాంరెడ్డి




హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లో విస్తరిస్తున్న వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో ఏటా 50వేల ఇళ్ళకు డిమాండ్ పెరుగుతోందని క్రెడాయ్ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ఎస్.రాంరెడ్డి చెప్పారు. ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగానికి మంచి ప్రోత్సాహం ఉంటుందని, అందుకు తగ్గట్టుగా బిల్డర్లు నిర్మాణాలు పెంచాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఐటి, ఐటిఇఎస్ సంస్థలు, గేమింగ్, యానిమేషన్ పరిశ్రమలు, ఆరోగ్య సంరక్షణా రంగానికి హైదరాబాద్ కీలక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులకు మరింత అవకాశం ఉందని గురువారం విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో క్రెడాయ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ పి.రామకృష్ణారావు, ట్రెజరర్ కె.రాజేశ్వర్ కూడా పాల్గొన్నారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చాక 6.25శాతం పన్ను పెరిగిందని, ఇది నిర్మాణాల వ్యయంపై అదనపు భారంగా పడిందని రాంరెడ్డి చెప్పారు. గత ఏడాది 20 శాతం ధరలు పెరిగాయని, ఈ ఏడాది కూడా మొదటి త్రైమాసికంలో 10శాతం ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. బెంగళూరు, పూణెలతో పోల్చితే హైదరాబాద్‌లోనే తక్కువ ధరకు ప్లాట్స్ ఉన్నాయని ఆయన చెప్పారు.

మార్చి 2 నుంచి ప్రాపర్టీ షో

వచ్చే నెల 2 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్లు రామకృష్ణారావు చెప్పారు. ఈ షోలో 120 మంది డవలపర్లు, రియల్టర్లు, బిల్డింగ్ మెటీరియల్ మ్యానుఫ్యాక్చరర్స్, కన్సల్టెంట్స్, ఆర్థిక సంస్థలు పాల్గొంటాయని ఆయన చెప్పారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

● బస్ భవన్ ముట్టడిలో పాల్గొన్న ఆర్. కృష్ణయ్య



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణాసంస్థ(ఆర్‌టిసి)ను ప్రభుత్వంలో విలీనం చేయాలని, అందులో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నిర్వహించిన బస్‌భవన్ ముట్టడిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బహిరంగ సభకు బివికె రావు అధ్యక్షత వహించగా హనుమంతు ముదిరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు కీలక భూమిక పోషించారని ఆర్ కృష్ణయ్య గుర్తు చేశారు. కండక్టర్, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 16 వేల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో అద్దె బస్సులను తొలగించి ప్రభుత్వమే బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



భారత్ డైనమిక్స్, ఐఆర్ఈఏడీ
ఐపీఓకు సెబీ ఆమోదం

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన రెం డు కంపెనీలు భారత్ డైనమిక్స్, ఇండియన్ రెవన్యువల్ ఎనర్జీ డెవలెప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ ఈడీఏ)లకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ఐపీవోకు అనుమతులు మంజూరు చేసింది. ఈ రెండు కంపెనీలు జనవరి, డిసెంబర్‌లలో ఐపీ వోకు దరఖాస్తు చేసుకున్నాయి. భారత్ డైనమిక్స్ విషయానికి వస్తే ఈ కంపెనీ



నుంచి ప్రభుత్వం తమ వాటాలను విక్రయించుకుంటుంది. దీంతో కంపెనీ షేర్లు బీఎస్ఈలో లిస్ట్ అవుతాయి. కాగా కంపెనీ విలువ మార్చి 2017 నాటికి రూ.2, 212.46 కోట్లుగా ఉంది. ఐఆర్ఈడీఏ ఐపీవో విషయానికి వస్తే 13.90 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచింది. మొత్తం 6.95 లక్షల ఈక్వి టీ షేర్లను అర్హులైన ఉద్యోగులకు అందుబాటులో ఉంచింది. సేకరించిన నిధుల ను రుణాలు తీర్చ డానికి కార్పొరేట్ సాధారణ అవసరాల కోసం వినియోగిస్తుంది.

ఆదిత్య బిర్లా ఐడియా
చెల్లింపు బ్యాంకు ప్రారంభం

•ఆర్‌బీఐ నుంచి అన్ని అనుమతులు

•22 నుంచి లావాదేవీలు షూరు

న్యూఢిల్లీ : సుమారు పది నెలల పాటు ఎదురుచూసిన తర్వాత ఆదిత్యబిర్లా ఐడియా పేమెంట్ బ్యాంకు లిమిటెడ్ ఫిబ్రవరి 22, 2018 నుంచి పేమెంట్ బ్యాంకు లావాదేవీలు ప్రారంభించిందని రిజర్వుబ్యాందు వెబ్‌సైట్‌లో గురువారం నాడు ప్రకటించింది. ఆదిత్యబిర్లాతో పాటు మొత్తం ఏడు బ్యాంకులు రిజర్వుబ్యాంకు నుంచి లైసెన్స్ దక్కించుకున్నాయి. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు లిమిటెడ్ జనవరి 2017 నుంచి లావాదేవీలు మొదలుపెట్టింది. అటు తర్వాత ఇండియాపోస్ట్ ప్రారంభించాయి. అయితే ఇప్పటి వరకు ఎయిర్‌టెల్, పేటియం, ఇండియా పోస్ట్ ఫినో పేమెంట్స్ బ్యాంకులు తమ లావాదేవీలు మొదలుపెట్టేశాయి. ఇదిలా ఉండగా ముంబైకి చెందిన ఆదిత్యబిర్లా నువో లిమిటెడ్‌తో పాటు మొత్తం 11 దరఖాస్తు దారులకు ఆర్‌బీఐ ఆగస్టు 19, 2015న సూత్రప్రాయంగా చెల్లింపుబ్యాంకులు లేదా పేమెంట్ బ్యాంకు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించింది. అయితే ఇక్కడ చెల్లింపుబ్యాంకులు ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు ఏమిటంటే ఈ బ్యాంకులు కెవైసీ పూర్తి స్థాయి నిబంధనలు ఫిబ్రవరి 28వ కంటే ముందే ఆర్‌బీఐ ముందుంచాల్సి ఉంటుంది. ఆదిత్యబిర్లా నువోకు ఏప్రిల్ 3, 2017న, ఆదిత్యబిర్లా పేమెంట్ బ్యాంకు లిమిటెడ్‌కు ఆర్‌బీఐ లైసెన్స్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా అన్నీ సవ్యంగా ఉండి నియంత్రణా సంస్థల అనుమతులు లభిస్తే ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలోనే చెల్లింపుబ్యాంకును ప్రారంభిస్తామని గతంలో తెలిపింది. కాగా ఈ చెల్లింపుబ్యాంకును కొత్తగా ఏర్పాటు చేసిన ఆదిత్యబిర్లా ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను గ్రాసిం ఇండస్ట్రీస్, ఆదిత్యబిర్లా నువోతో విలీనం చేసింది. అటు తర్వాత చెల్లింపుబ్యాంకు లైసెన్స్ దక్కించుకుంది. ఇదిలా ఉండగా వోడాఫోన్ ఇండియాతో ఐడియా సెల్యూలార్, వోడాఫోన్ ఎం-పెసా లిమిటెడ్‌తో విలీనం కాబోతోంది. చెల్లింపుబ్యాంకు లైసెన్స్ కోసం వోడాఫోన్ ఎంపెసా కూడా దరఖాస్తు చేసుకుంది. విలీనం తర్వాత వోడాఫోన్ చెల్లింపు బ్యాంకుకు లైసెన్స్ దక్కుతుందో లేదో వేచి చూడాల్సింది. ఐడియా త్రైమాసికం నివేదిక ప్రకారం చూస్తే.. చెల్లింపుబ్యాంకు ద్వారా వివిధ రకాల బ్యాంకు ప్రొడక్టులు సర్వీసులు తీసుకొస్తామని దీంతో పాటు కరెం టు, పొదుపు ఖాతా లు, దేశీయ రెమిటె న్స్, మర్చంట్ పేమెం ట్స్ తదితరాలు ఉం టాయనివివరిం చింది.

!dea Payments Bank

ఏడాదికో బీఎండబ్ల్యూ పోర్టుపోలియో

ముంబై : గత కొన్ని సంవత్సరాల నుంచి అమ్మకాల్లో వెనుకబడ్డ బీఎండబ్ల్యూ అమ్మకాలు 2017లో జోరందుకున్నాయి. దీంతో రెట్టించిన ఉత్సాహంతో ప్రతి ఏడాది ఒక కొత్త సెగ్మెంట్‌ను ఏర్పాటు చేసి అమ్మకాల జోరును అదే స్థాయిలో కొనసాగించాలని నిర్ణయించినట్లు కంపెనీ ఉన్నతాధికారి తెలిపారు. గతేడాది అమ్మకాలు 25 శాతం పెరిగాయి. కొత్తగా 9,800 కస్టమర్లకు తమ ఖాతాలోకి చేర్చుకున్నామని ఆయన చెప్పారు. అయితే లగ్జరీ కార్ల మార్కెట్లో నెంబర్ వన్‌స్థానాన్ని దక్కించుకోలేకపోతోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో మెర్సిడెజ్ బెంజ్.. 2012 నుంచి తన హవాను కొనసాగిస్తోంది. రెండో స్థానంలో ఆడి ఉంది.

భారత్ మిలియనీర్ల సంపద దేశ
జీడీపీలో 15 శాతం!

•సంపన్నులు మరింత పైపైకి • పేదవాడు మరింత కిందికి

•పెరిగిపోతున్న ధనిక-పేద తారతమ్యం • ఓక్సాఫామ్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ : గత మూడు దశాబ్దాల నుంచి దేశంలో ధనిక - పేదవర్గాల మధ్య తారతమ్యం విపరీతంగా పెరిగిపోతోంది. సంపన్నుల సంపద ఎంత మేరకు పెరిగిపోయిందంటే దేశ సంపద లేదా స్థూలదేశీయోత్పత్తి లేదా జీడీపీలో 15 శాతమంత సంపద ఆక్రమించింది. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వం తీసుకొస్తున్న సరళతరమైన ఆర్థిక విధానలే కారణమని ఓక్సాఫామ్ గురువారం నాడు విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటుండటంతో సంపన్నులు మరింత సంపన్నులవుతున్నారు. సమాజంలో అట్టడుగువర్గాల వారి సంపద మరింత కుంగిపోతోంది. దేశంలో ధనిక - పేదల మధ్య తారతమ్యాలు పెరిగిపోవడానికి ప్రధాన కారణం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఉదారంగా సంపన్నులకు అనుకూలంగా ఉండే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నాయి. 1991 నుంచి భారత్ సంస్కరణలకు తలుపులు బార్లా తెరిసింది. అటు నుంచి వీరి సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోందని ఓక్సాఫామ్ ఇండియా సీఈవో నిషా అగర్వాల్ తెలిపారు. తాజా అంచనాల ప్రకారం చూస్తే దేశంలోని బిలియనీర్ల సంపద మొత్తం జీడీపీలో 15 శాతం ఆక్రమిస్తోంది.



ఐదేళ్ల క్రితం ఇది పదిశాతం ఉండేది. ఇదిలా ఉండగా 2017లో దేశంలో మొత్తం బిలియనీర్ల సంఖ్య 101గా తేలింది. పెరిగిపోతున్న వ్యత్యాసాలు... భారత్‌లో ఆర్థిక అసమానతల నివేదిక 2018'లో ఈ వివరాలు అందజేసింది. ప్రపంచంలోని అన్నీ వర్గాల కొలమానం ప్రకారం చూస్తే... వినియోగం, సంపద, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తీసుకొనే విధానపరమైన నిర్ణయాల వల్ల ధనిక -పేదల మధ్య తారతమ్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని నివేదికలో వివరించింది. ప్రభుత్వాలు తీసుకొనే నిర్ణయాలు కార్మికుల ప్రయోజనాల కంటే పెట్టుబడిదారులకే అనుకూలంగా ఉంటున్నాయి. నైపుణ్యం కల వారికి ప్రయోజనం కలిగించకుండా నైపుణ్యం లేని వారికి ఎక్కువ ప్రయోజనం కల్పిస్తున్నారని నివేదికలో వివరించింది. ఈ నివేదికలో పలు వర్గాల నుంచి తీసుకున్న గణాంకాలపై పెద్దెత్తున విశ్లేషణ జరిపింది. 1980లో దేశంలోని ధనిక - పేదల మధ్య ఉన్న వ్యత్యాసం నుంచి 1991 నాటికి చూస్తే ఈ వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయింది. అటు నుంచి చూస్తే ఈ వ్యత్యాసం 2017 నాటికి మరింత జోరందుకుంది.

సమాజంలో పెరిగిపోతున్న ధనికపేదల మధ్య వ్యత్యాసం ఒక పక్క ఆందోళన కలిగిస్తుంటే.. మరో పక్క సమాజంలో కులం, మతం, ప్రాంతం, లింగభేదం అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఈ వ్యత్యాసాలను తగ్గించాలంటే ప్రపంచం లోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం దేశంగా ఘనతకెక్కిన ప్రభుత్వాలే దీనికి నడుంబిగించాలని నివేదిక రచయిత ప్రొఫెసర్ హిమాంషు పేర్కొన్నారు.

అసమానతలు తగ్గించాలంటే

దేశంలో ధనిక - పేదల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలంటే ప్రభుత్వమే దీనికి నడుంబిగించాలని అగర్వాల్ నివేదికలో గుర్తు చేశారు. దీనికి ఒక్కటే ఒక మార్గం ఏమిటంటే ప్రత్యక్ష పన్ను వసూళ్లను పెంచుకోవాలని.. ఎందుకంటే వంశపారంపర్యంగా వస్తున్న సంపదపై పన్ను విధించాలని, ఆ డబ్బుతో ప్రభుత్వం వైద్య, విద్య, పేదవారికి పోషకాహారం సమకూర్చాలని సూచించింది. ముఖ్యంగా పేదవారిపై పిల్లలకు పౌష్టికాహారంపై ప్రభుత్వం ఫోకస్‌పెట్టాలని కోరింది. దీంతో పాటు ప్రభుత్వం అందరికి సమానావకాశాలతో పాటు ఎక్కువ అవకాశాలు కల్పించాలని, సంపదను అందరికి సమానంగా పంచాలని అగర్వాల్ సూచించారు. ఇదిలా ఉండగా అంతర్జాతీయ రైట్స్ గ్రూపు ఓక్సాఫామ్ ప్రపంచ ఆర్థిక సదస్సు దావోస్ ప్రారంభమైనప్పుడు ఈ నివేదికను విడుదల చేసింది. దావోస్‌లో విడుదల చేసిన నివేదికలో భారత్‌లోని ఒక శాతం సంపన్నులు 72 శాతం సంపదను 2017లోనే సృష్టించారని పేర్కొంది. ఇదే సర్వేలో భారత్‌లోని ఒక శాతం సంపన్నుల సంపద 2017లోనే సుమారు రూ.21 లక్షల కోట్లు పెరిగిందని గుర్తు చేసింది. మరో పక్క దేశంలోని 67 కోట్ల మంది జనాభాలోని పేదల్లో సగం మంది సంపద కేవలం ఒక శాతం మాత్రమే పెరిగిందని నివేదికలో గుర్తు చేసింది.



బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ విలీనం లేదు

MTNL BSNL Connecting India

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌ల విలీనం ప్రతిపా దనలు లేవని టెలికంమంత్రి మనోజ్ సిన్హా గురువారం నాడు స్పష్టం చేశారు. ఈ రెండు సం స్థలను మరింత బలోపేతం చేసి లాభాలబాట పట్టిస్తామని ఆయన అన్నారు. ప్రస్తుతానికి రెండు కంపెనీలను విలీనం చేసే ప్రతిపాదన ఏదీ లేదని, అయితే రెం డు సంస్థలను ఒక దానితో ఒకటికి మంచి సంబంధాలు నెరిపి రెండు బలోపేతం అయ్యి లాభపడేలా చర్యలు తీసుకుంటామని సిన్హా చెప్పారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఈ రెండు సంస్థలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి వాటిని పూర్తిగా వినియోగించు కునే అధికారం కట్టబెడుతున్నామని, మానవ వనరులతో పాటు భవనాలను వా రు స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని ఆయన వివరించారు. ప్రస్తుతం సీఓఏ ఐకు టెలికం నియంత్రణా సంస్థ ట్రాయ్‌ల మధ్య కొనసాగుతున్న వివాదంలో జోక్యం చేసుకుంటారా అని ప్రశ్నించగా.. ట్రాయ్ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని తెలిపారు. తన మంత్రిత్వశాఖ ఎలాంటి తారతమ్యాలు చూపకుండా నిజా యితీగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. సెల్యూలార్ ఆపరేటరేటర్స్ అసో సియేషన్స్ ఆఫ్ ఇండియా (సీఓఏఐ) ట్రాయ్ ఆదేశాలపై పలు ఆరోపణలు గుప్పిం చింది. ట్రాయ్ ఆదేశాలు ఎలా ఉన్నాయంటే ప్రత్యేకంగా ఒక ఆపరేటర్‌కే కొమ్ము కాస్తుందని, రిలయన్స్‌జియోను దృష్టి లో పెట్టుకొని ఆరోపించింది. రిలయన్స్ జియో రాకతో మార్కెట్లోని మిగిలిన టెలికం కంపెనీల లాభాలు పూర్తి తుడిచి పెట్టుకుపోయిన విషయం తెలిసిందే.

సనోఫీ లాభంలో 44శాతం వృద్ధి

• క్యూ4లో రూ.76 కోట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఔషధ కంపెనీ సనోఫీ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన నాలుగవ త్రైమాసికంలో నికరలాభంలో 44.48 శాతం వృద్ధితో రూ.76 కోట్లు ఆర్జించింది. అమ్మకాల విషయానికి వస్తే రూ.670.4 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.604.9 కోట్లని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇది ఉండగా బోర్డు రూ.10 ముఖ విలువ కలిగిన షేరుపై తుది డివిడెండ్ రూ.53 గా ప్రకటించింది.

తేలికగా డిజిటల్ నగదు బదిలీ యాప్

వాషింగ్టన్ : ప్రతిష్టాత్మకమైన కార్నెల్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు వారిలో భారత్‌కు చెందిన వారు కలిసి స్మార్ట్‌ఫోన్ ఆధారిత యాప్‌ను అభివృద్ధి చేశారు. దీంతో గ్రామీణ భారత్‌లో ప్రతి పౌరుడి జేబులోకి ఎటీఎం అందుబాటులోకి వస్తుంది. డిజిటల్ లావాదేవీల ద్వారా 470 లక్షల కోట్ల డాలర్ల కొనుగోలుశక్తి గల ఆర్థిక వ్యవస్థగా భారత్ మారిపోతుందని ఈ యాప్‌ను అభివృద్ధి చేసిన భారతీయ విద్యార్థి సిప్రిహా భండారి చెప్పారు. ఈ యాప్‌కు పాకెట్ చేంజి అని పేరుపెట్టారు. ఈ యాప్‌తో చాట్ చేసుకుంటేనే డిజిటల్ మోడ్‌లో నగదు బదలీ కూడా చేసుకోవచ్చునని ఆయన అన్నారు. 18 సంవత్సరాల భండారి ఈ యాప్‌ను బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ కోరినట్లు అభివృద్ధి చేశామని అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజల లావాదేవీలు మొత్తం నగదు ద్వారానే కొనసాగుతాయని రోజు రెండు డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో వీరు బతుకు వెళ్లదీస్తున్నారని, వారికి కూడా ఈ ఫలాలు అందించాలనే ఉద్దేశంతో ఆ యాప్‌ను అభ్రిద్ధి చేసినట్లు భండారి చెప్పారు.

ప్రీమియం కార్ల అమ్మకాల్లోనూ
మారుతి నెక్సాదే హవా

• మహీంద్రా, టాటామోటార్స్ కంటే అధికం

•మారుతి అమ్మకాల్లో 20 శాతం నెక్సావే ...



న్యూఢిల్లీ : మారుతి సుజుకి ప్రీమియం కార్ల అమ్మకాల కోసం ప్రత్యేకంగా నెక్సా డీలర్ల షిప్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా విక్రయాలు మొదలుపెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వర కు మొత్తం 2, 70,651 యూనిట్లు విక్రయించింది. మహీంద్రా విషయా నికి వస్తే 1,99,968 యూ నిట్లు విక్రయిస్తే.. టాటా మోటార్స్ 1,67,208 యూనిట్లు విక్రయించింది. ఇవన్నీ ఏప్రిల్ 2017 నుంచి జ నవరి 2018 వరకు పరిగణనలోకి తీసుకున్న గణాంకాలు. ఈ గణాం కాలన్నీ సియామ్ అందజేసింది. దేశీయ మార్కెట్లో మారుతి సుజుకి మొత్తం విక్రయించిన వాహనాలు నెక్సాతో పాటు ఎరినా డీలర్‌షిప్‌లను కలుపుకొంటే 13,59,649 యూనిట్లు విక్రయించింది. హ్యుందాయ్ మో టార్ ఇండియా 4,43,727 యూనిట్లు విక్రయిం చింది. కాగా మారుతి సుజుకి ప్రీమియం కార్ల విక్ర యాల కోసం ప్రత్యేకంగా నెక్సా షోరూంల ద్వా రా విక్రయాలు మొదలుపెట్టింది. జులై 2015 నుంచి ఈ షోరూంలను ప్రారంభించింది. 20 20 నాటికి రెండు మిలియన్ యూని ట్లు విక్రయిం చాలని లక్ష్యంగా పెట్టుకొంది. ముందుగా ఎస్-క్రాస్‌తో ప్రీమి యంకార్ల అమ్మ కాలకు శ్రీకా రం చుట్టింది. అటు తర్వా త బలెనో రాకతో నెక్సా దశ తిరిగిందని చెప్పవచ్చు. బలెనో అమ్మకాలు ఇబ్బడిముబ్బడి పెరు గు తూ పోతున్నాయి. కాగా 2017 లో మారుతి సుజుకి ఇగ్నిస్‌ను తీసుకొచ్చింది. అటు తర్వాత సియాజ్ తీసుకురావ డంతోపాటు ప్రస్తుతం ఉన్న డీలర్‌షిప్‌లను అప్‌గ్రేడ్ చేసి మారుతి సుజుకి ఎరినా డీలర్‌షిప్‌తోను అమ్మకాలు మొద లుపెట్టింది. దీంతో పాటు నెక్సా సర్వీస్ వర్కుషాప్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. గత మూడు సంవత్సరాల్లో నెక్సా 171 నగరాల్లో 299 షోరూంలను ప్రారంభించింది.

అవినీతి సూచీలో
భారత్ గ్లోబల్ ర్యాంకు 81

• ఆసియా పసిఫిక్‌లో పెరిగిపోయిన అవినీతి

•పత్రికా స్వాతంత్ర్యంపై ఆంక్షలు

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది అవినీతి సూచిలో భారత్ 81వ ర్యాంకును ఆక్రమించింది. ఈ నివేదికను ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషన్ విడుదల చేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అవినీతి, పత్రికా స్వాత్రంత్యంపై ఆంక్షలు ఎక్కువగా ఉన్నాయని నివేదికలో తేల్చి చెప్పింది. మొత్తం 180 దేశాలను పరిగణనలోకి తీసుకుంటే వాటిలో పభుత్వరంగ సంస్థల్లో అవినీతి భారీగా పేరుకుపోయిందని, అవినీతిలో భారత్ 81వ స్థానాన్ని ఆక్రమించిందని తెలిపింది. కాగా 2016లో భారత్ మొత్తం176 స్థానాల్లో 79వస్థానా న్ని ఆక్రమించింది. ఈ సూచి స్కేల్లో 0 నుంచి 100 వరకు లెక్కిస్తే 0 వి షయానికి వస్తే అత్యంత అవినీతకరమైన దేశంగా పరిగణనలోకి తీసుకుంది. 100 అయి తే పూర్తి క్లీన్ లేదా అవినీతి రహితం గా పరి గణనలోకి తీసుకుంది.

తాజా ర్యాంకింగ్ ను పరి గణనలోకి తీసుకుంటే భారత్ ర్యాంకు 40గా ఉంది. అదే 2015లో 38వ స్థానంలో ఉంది. ట్రాన్స్ పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదక ప్రకారం ఆసియా పసిఫిక్ దేశాల్లో జర్నలిస్టులు, కార్యకర్తలు, ప్రతి పక్ష నాయకులు, చట్టాన్ని అమలు చేసే సిబ్బందికి బెదిరింపులు తప్పడం లేదు. దీంతో పాటు వారిపై హత్యలు కూడా జరుగుతున్నాయి. ఆసియా పసిఫిక్‌దేశాలు ఉదాహరణకు పిలిపీన్స్, ఇండియా, మాల్దీ వుల్లో ఇవి ఎక్కువగా జరుగుతన్నాయని తెలిపిం ది. ఈ దేశాల్లో అవినీతి తారాస్థాయి కి చేరిందని పత్రికా స్వాతంత్ర్యం లేదు.. పెద్దమొ త్తంలో జర్న లి స్టులను హత్యలకు గురికాబడుతు న్నారని నివేదికలో పేర్కొంది. గత ఆరు సంవత్సరాల నుంచి మొత్తం 15 మంది జర్నలిస్టులు హ త్య కా వింపబడ్డారు.

వీరంతా అవినీతికి వ్యతిరే కంగా వార్తలు సేకరిస్తుంటే హత్యకు గురికాబడ్డా రని కమిటి టు ప్రొటెక్ట్‌జర్నలిస్ట్స్ (సీపీజే) నివేదికలోపేర్కొంది. అత్యధిక స్కోరు సాధించిన దేశాల విషయానికి వస్తే న్యూజిలాండ్, డెన్మార్కులు న్నాయి. ఇవి వరుసగా 89,88 ర్యాంకులు సా ధించగా.. దీనికి వ్యతిరేకంగా సిరియా, దక్షిణ సూ డాన్, సోమాలియాలు వరుసగా అతి తక్కువ ర్యాంకు 14,12,9 సాధించాయి. ఇదిలా ఉండగా చైనా విషయానికి జాబితాలో 77వ స్థానంలో నిలి చి 41వ ర్యాంకు సాధించింది. కాగా బ్రెజిల్96వ స్థానంతో 37వ ర్యాంకు రష్యా 135వ స్థానంలో నిలిచి 29 వర్యాంకును సాధించింది. నివేదికపై




విశ్లేషణ జరిపిన సీపీజే కొన్ని దేశాల్లో పత్రికా స్వాతంత్ర్యంపై ఆంక్షలు విధించి, ప్రభుత్వేతర సంస్థలు (ఎన్‌జీవో)లకు రక్షణ లేకుండా ఉన్న దేశాలు అవినీతిలో అగ్రస్థానంలో ఉన్నాయి. గత ఆరు సంవత్సరాల నుంచి ఈ నివేదిక వెల్లడవుతోంది. సూచిలో స్కోర్ 45 లేదా అంత కంటే తక్కువ సాధించిన దేశాల్లో 10 మంది జర్నలిస్టుల్లో 9 మంది హత్యకు గురి కాబడుతున్నారని తెలిపింది. అవినీతి వ్యతిరేకంగా గళం విప్పే కార్యకర్తలకు, విలేకరులు తమ ప్రాణాలకు ముప్పు ఉందని బయపడాల్సిన అవసరం లేదని, అవినీతికి వ్యతిరేకంగా గళం విప్పే వారికి మరింత భద్రత కల్పించాలని ట్రాన్స్‌పెరెన్సీ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్యాట్రిషియా మెరెరియా చెప్పారు.


మార్కెట్ తీరు మారలేదు!

•సెన్సెక్స్ 25పాయింట్ల నష్టం

•ట్రేడింగ్ అంతం మాత్రమే

•34పైసలు క్షీణించిన రూపాయి





ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం నాడు ట్రేడింగ్ మందకొడిగా కొనసాగింది. బుధవారం నాడు కాస్తా కోలుకొని ఇన్వెస్టర్లను మురిపించినా.. రోజు తిరిగే సరికి తిరిగి యధాతథ స్థితికి చేరింది. దీనికి ప్రధాన కారణం డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డంతో పాటు పెరిగిపోతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్‌బీఐ వడ్డీరేట్లు యధతథంగా కొనసాగించింది. ఈ సమావేశం మినిట్స్ విడుదల చేయడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై దెబ్బకొట్టింది. దీంతో పాటు ఆసియా మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో పాటు యూఎస్ ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న సంకేతాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపించింది. ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టు గురువారంతో ముగిసింది. సెన్సెక్స్ 2,230.99 పాయింట్లే లేదా 6.18 శాతం, నిఫ్టీ 686.95 పాయింట్లు లేదా 3.20 శాతం క్షీణించింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్ మారకంతో రూపాయి 34 పైసలు క్షీణించింది మూడు నెలల కనిష్ఠానికి దిగివచ్చి ఇంట్రాడేలో 65.10 మార్కుకు దిగివచ్చింది. రూపాయి బలహీనపడ్డం, ద్రవ్యోల్బణం పెరిగిపోతుందన్న అంచనాతో 10 సంవత్సరాల బాండ్ ఈల్డింగ్ బాగా పెరిగిపోయిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 33,817.09 నుంచి 33,691.42 మధ్య ఊగిసలాడింది. దీనికి ప్రధాన కారణం విదేశీ పెట్టుబడులు మార్కెట్ల నుంచి తరలివెళ్లడమే. కాగా బుధ వారం నాడు విదేశీ ఇన్వెస్టర్లు రూ.1214.18 కోట్ల షేర్లు విక్రయించారు. దీనికి వ్యతిరే కంగా దేశీయ ఇన్వెస్టర్లు రూ.1375.48 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. సెన్సెక్స్‌లో అత్యధికంగా నష్టపోయింది డాక్టర్ రెడ్డీస్ 2.19 శాతం, అటు తర్వాత ఒఎన్‌జీసీ 2.05 శాతం గా ఉన్నాయి. వాటిలో పాటు పవర్‌గ్రిడ్, టా టామోటార్స్, మారుతి సుజుకి, యాక్సిస్ బ్యాంకు, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, ఏషి యన్ పెయింట్స్, భారతి ఎయిర్‌టెల్, రిల్, టాటాస్టీల్, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్ సీ, ఐటీసీ, హిందుస్తాన్ యూనీలీవర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హీరోమోటోకార్ప్, ఎస్‌బీఐ, టీసీఎస్‌లు 1.88 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా సన్‌ఫార్మా, అదానీపోర్ట్స్, కొటక్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఎంఅండ్ఎం, ఎస్ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టి, కోల్ ఇండియాలు లాభపడ్డాయి. పీఎన్‌బీ 2.09 శాతం క్షీణిస్తే, గీతాంజలి జెమ్స్ 5 శాతం వరకు నష్టపోయాయి. గత వారం నుంచి 58.5 శాతం వరకు షేరు నష్టపోయింది.

రోల్స్‌రాయిస్ ఫాంథమ్

ధర రూ. 9.50 కోట్లు

• కున్ ఎక్స్‌క్లూజివ్ ద్వారా విక్రయాలు



చెన్నై : లగ్జరీకార్ల తయారీ కంపెనీ రోల్స్ రాయిస్ గురువారం నాడు ఎయిట్త్ జనరేషన్ పాం థా మ్ కారు మార్కెట్‌కు పరిచయంచేసింది. దీని ధర రూ. 9.50 కోట్లు. కాగా రోల్స్ రాయిస్ భారత్‌లో తమ పో ర్టుపోలియోను విస్త రించాలని నిర్ణయిం చింది. కున్ ఎక్స్‌క్లూ జివ్ భాగస్వామ్యంతో ఈ కార్లను విక్రయి స్తుందని రోల్స్‌రాయిస్ మోటార్ కార్స్, ఆసియా పసిఫిక్ ప్రాంతీ య డైరెక్టర్ పాల్ హారిస్ చెప్పారు. కున్ ఎ క్స్‌క్లూ జివ్ రోల్స్ రాయి స్‌మోటార్స్ కార్స్‌కు అధికృత డీలర్‌గా వ్యవ హరిస్తుంది. చెన్నై, హైద రాబా ద్‌లలో కున్ షో రూంలలో ఈ కార్లు అందుబాటులో ఉంచుతుం ది. కాగా రోల్స్‌రాయిస్ దక్షిణాది రాష్ట్రాల్లో ఐదు ఔట్లెటున్నా యి. గత ఏడాది వ్యాపారం ఎలా ఉం ద ని ప్రశ్నించగా..ఆయన కొంత అసం తృప్తిని వ్యక్తం చేశారు. గత ఏడాది పలు మార్పులు జరిగాయని.. వాటిలో సుంకాలు పెంచ డంతో పాటు జీఎస్టి పెద్ద నోట్ల రద్దు తదితర అంశాల వల్ల అమ్మ కాలపై ప్రభావం పడిందని వివరిం చారు. ఆటోమొబైల్ రంగం మొత్తానికి చూస్తే గత ఏడాది అస్థిరంగా ఉందనే చెప్పా లని.. ఇంకా ఆటో రంగం స్థిర పడలేద న్నారు. ప్రభు త్వం కారు ధరపై 214 శాతం దిగు మతి సుం కంతో పాటు జీఎస్టిపన్ను విధిస్తు న్నారని ఇది త మ వ్యాపారానికి పెద్ద దెబ్బ అని పేర్కొన్నారు. భారత్ మార్కె ట్లో రాబోతున్న ప్రొడక్టుల గురిం చి వివరిస్తూ.. ఈ ఏడాది చివరి నాటికి కుల్లినన్ విడుదల చేస్తామని.. తర్వాత పాంథా టమ్, ఘోస్ట్ ఆధారి త ప్లా ట్‌ఫాంపై వ్రైత్, తర్వాత డాన్, బ్లాక్ బ్యా డ్జ్ కార్ల ను ఈ ఏడాది చివరికల్లా మార్కెట్లో అందుబాటులో ఉంచుతామన్నారు. పాంథామ్ -8 విషయానికి వస్తే 6. 75 లీటర్ల ట్విన్ టర్బో చార్జ్‌డ్ వీ12 ఇంజిన్.. ఇది 563 హెచ్‌పీ పవర్‌తో పాటు 900ఎన్ఎం ఆఫ్ టర్క్ విడు దల చేస్తుందన్నారు. 0-100 కిలోమీటర్లు కేవలం 5.4 సెకనక్లు చేరుకుంటుందన్నారు. గతంలోని పాంథా మ్‌తో పో ల్చుకుంటే బరువు 30 శాతం తే లికగా ఉంటుందన్నా రు. భద్ర తా ప్రమాణాల తో పాటు రాత్రిపూట600 మీ టర్ల రేంజి వ రకు లైట్ ప డేలా డిజైన్ చేసి నట్లు చె ప్పారు. పాంథామ్ స్టాం డర్డ్ వీల్ బేస్ ధర రూ. 9.50 కోట్లు, పాం థామ్ ఎక్సెటెండె డ్ వీల్ బేస్ రూ. 11.35 కోట్లు నిర్ణయిం చింది.

త్వరలో 'భగీరథ' ట్రయల్ రన్: ఈఎన్‌సీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మిషన్ భగీరథ నిర్మాణ పనులు పూర్తయిన చోట వెంటనే ట్రయల్‌రన్ చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తన కార్యాలయం నుంచి వివిధ జిల్లాల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భగీరథ పనులు సమీక్షించారు. ప్రధాన పనులు పూర్తయి ఇప్పటికే ట్రయల్ రన్ కూడా విజయవంతం అయిన ప్లాంట్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇంట్రా పనులు సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మిషన్ భగీరథ పనుల వివరాలు ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. తాగునీరు, పారిశుద్యంపై ఆర్‌డబ్ల్యుఎస్ రూపొందించిన కరదీపికను ఈ సందర్భంగా ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, సీఈలు కృపాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విడాకుల కోసం వేధిస్తున్నాడు

● కార్ డీసీపీ బాబూరావుపై డీజీపీకి ఫిర్యాదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పోలీసు శాఖలో మరో అక్రమ సంబంధ బాగోతం వెలుగు చూసింది. హైదరాబాద్ కార్ డీసీపీ బాబురావుపై భార్య వేదశ్రీ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. తనతో 25 ఏళ్లు కాపురం చేసి నలుగురు పిల్లలకు తండ్రి అయిన తర్వాత వేధింపులకు గురిచేస్తున్నాడని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొంది. మతం మార్చుకుని విడాకులు ఇవ్వకుండానే సహజీవనం చేస్తున్న డీసీపీ బాబురావు సౌత్ జోన్ అడిషినల్ డీసీపీగా పనిచేసినప్పుడు చాలామందితో అక్రమ సంబంధాలున్నాయని భార్య వేదశ్రీ ఆరోపిస్తోంది. ఐదు లక్షలు ఇస్తాను.. విడాకు లివ్వాలని బాబురావు తనపై ఒత్తిడి తెస్తున్నాడని వేదశ్రీ చెబుతోంది. పోలీసు శాఖకు మచ్చతెచ్చేలా వ్యవహరిస్తున్న బాబురావుపై చర్యలు తీసుకోవాలని ఆమె తాను డీజీపీకి అందజేసిన ఫిర్యాదులో పేర్కొంది. విజయవాడలో కోటి రూపాయల విలువ చేసే భూమిని తానే వేదశ్రీ అని బాబురావు రెండో భార్య తయ్యబా అక్రమంగా అమ్ముకున్న తీరును సైతం ఆ ఫిర్యాదులో ఆమె స్పష్టపర్చింది. తాను పలు సందర్భాల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ తనకు ప్రస్తుతమున్న పలుకుబడితో వాటిని బయటకు రాకుండా చూస్తున్నారని సైతం వేదశ్రీ ఆరోపించింది. తనను బాబురావు, తయ్యబాలు దూషిస్తున్నారని సైతం ఆమె ఆరోపించింది. తనకు తగు న్యాయం చేయాలని కోరుతూ ఆమె డీజీపీకి అందజేసిన ఫిర్యాదులో పేర్కొంది.

వర్గీకరణ కోసం 13న తెలంగాణ బంద్

● మంద కృష్ణమాదిగ పిలుపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఈ నెల 13 న తెలంగాణ బంద్‌కు మంద కృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో అనుసరిస్తున్న నిర్లిప్త వైఖరికి నిరసనగా బంద్‌కు పిలుపు నిచ్చామన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బంద్‌కు మద్దతు కోరుతూ ఇప్పటికే అన్ని పార్టీల నేతలకు తెలిపామని, బంద్ పిలుపునకు అన్ని పార్టీలు కలిసి వస్తాయని భావిస్తున్నామన్నారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో ఎంఆర్‌పిఎస్ పూర్తి స్థాయిలో పాల్గొందని, ఎన్ని పర్యాయాలు బంద్‌కు పిలుపునిచ్చినా ఏ కార్యక్రమం చేపట్టిన ముందుందన్నారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన ఎంఆర్‌పిఎస్ తన లక్ష్య సాధనలో భాగంగా నిర్వహిస్తున్న బంద్‌కు అన్ని వర్గాలు, ప్రజలు సహకరించాలని మంద కృష్ణ విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి నాలుగేళ్ళైనా హామీని నిలబెట్టుకోలేదని, బిజెపి నేతల మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉందని ఆయన ఆరోపించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు వర్గీకరణ కోసం ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకు వెళ్ళాలని కోరుతూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు లేఖ రాసినట్లు మంద కృష్ణ తెలిపారు. ఈ మేరకు లేఖ ప్రతులను మీడియాకు ఇచ్చారు. అసెంబ్లీలో వర్గీకరణకు తీర్మానం చేసినప్పటికీ కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకు వెళ్తానని చెప్పినప్పటికీ ఇప్పటికీ నెరవేరలేదని గుర్తు చేశారు.

పార్టీకోసం ఈసీకి కోదండరాం దరఖాస్తు

● మార్చి 10న కొత్త పార్టీ ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజకీయ పార్టీ నమోదు కోసం తెలంగాణ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ జన సమితి పేరుతో పార్టీ ఏర్పాటుకు అనుమతి కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన లేఖలో పేర్కొన్నారు. పార్టీ గుర్తు బాణం ఇవ్వాలని ఆయన కోరారు. కోదండరాం లేఖపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈసి పరిశీలనలో కోదండరాం పార్టీ పేరు ఉందని, త్వరలో పార్టీ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని ఆయన సన్నిహితుల ద్వారా తెలుస్తోంది. జాతీయ రాజకీయాల నిపుణుడు యోగేంద్ర యాదవ్‌తో కోదండరాం బృందం పలు సార్లు చర్చలు కూడా జరిపినట్లు సమాచారం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో భాగంగా నిర్వహించిన మిలియన్ మార్చ్‌ను మార్చి 10 వ తేదీన నిర్వహించిన సరిగ్గా అదే రోజున పార్టీని ప్రకటించేందుకు కోదండరాం సన్నాహాలు చేస్తున్నారు.టిజెఏసి వర్గలు తెలిపిన సమాచారం ప్రకారం మార్చి 10 న నవిర్వహించేసభ ఏర్పాట్ల కోసం 200 మందితో స్టీరింగ్ కమిటీని కూడా నియమించినట్లు తెలిసింది.

కొత్త పార్టీ వైపు టిఆర్ఎస్ నేతల చూపు

కోదండరాం కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న పలువురు టిఆర్ఎస్ నేతలు ఆరా తీయడం ప్రారంభమైంది. కోదండరాం పార్టీని కొంత మంది స్వాగతిస్తూనే ఎంత మేరకు పార్టీని నడపగలరనే అంశంపై కూడా చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పెట్టే పార్టీ ప్రభావం టిఆర్ఎస్‌పై ఏ మేరకు ప్రభావం చూపుతుందన్న అంశంపై కూడా చర్చ మొదలైంది.

ఇసుక మైనింగ్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఇసుక అక్రమ మైనింగ్‌పై దాఖలైన పిటీషన్‌పై విచారణ మార్చి 14కు వాయిదా పడింది. గురువారం న్యూఢిల్లీలో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఈ పిటీషన్‌ను విచారించింది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోందని రేలా అనే స్వచ్ఛంధ సంస్థ పిటీషన్ దాఖలు చేసింది. గత విచారణ సందర్భంగా ఏయే కాంట్రాక్టర్లు, ఎంత మేర ఇసుకను ఉచితంగా తీసుకున్నారో వివరాలివ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని ఎన్‌జిటి ఆదేశించింది. ఆ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం తరపున ఉచిత ఇసుక తవ్వకాలకు సంబంధించిన వివరాలు సమర్పించింది. ప్రభుత్వ ఇసుక విధానానికి అనుగుణంగా ఆయా శాఖల వారీగా ఇసుక తవ్వకాలకు వివరాలను అందజేసింది. అయితే ఇందులో వివరాలు స్పష్టంగా లేవని పిటీషనర్ తరపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు పలు అంశాల్లో సర్వీసు పూర్తికాకపోవడంతో కేసు విచారణను వాయిదా వేశారు.


విద్యార్థుల ఆత్మహత్యలపై వివరాలివ్వండి

● తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఉభయ తెలుగు రాష్ట్రాలలో విద్యార్థుల ఆత్మహత్యలపై వివరాలు పంపాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ కోరింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు పంపింది. ఏపీ, తెలంగాణలలో వరుసగా ఇటీవల కాలంలో కార్పొరేట్ విద్యా సంస్థలలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితిపై న్యాయవాది శ్రవణ్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులపై చదువుల ఒత్తిడి, కనీస వసతుల లేమీ తదితర కారణాలతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు రాసింది. నాలుగు వారాల్లోగా తమకు వివరాలు పంపాలని కోరింది.

స్పెషల్ పీపీల నియామకంలో

సర్కార్‌దే తుది నిర్ణయం



● వాకపల్లి కేసులో హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని హైకోర్టు తేల్చి చెప్పింది. అలాగే ఆరుగురు సీనియర్ న్యాయవాదుల జాబితాను సిద్ధం చేసి తమకు సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ను ఆదేశించింది. ఈ జాబితాలో ఏపీ నుంచి ముగ్గురు, తెలంగాణ నుంచి ముగ్గురు న్యాయవాదులుండేలా చూడాలని హైకోర్టు స్పష్టం చేసింది. వారిలో ఒకరిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంచుకోవాలని బాధితులకు హైకోర్టు సూచించింది. బాధితులు ఎంపిక చేసిన న్యాయవాదిని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూర్ గా నియమించాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని హైకోర్టు పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

విశాఖ జిల్లా జి.మాడ్గుల మండలం వాకపల్లి గ్రామ గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారం కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్‌పీపీ)గా డాక్టర్ పల్లా త్రినాథరావును నియమించాలంటూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ధర్మాసనం ముందు రెండు అప్పీళ్లు దాఖలయ్యాయి. వాకపల్లి గ్రామ గిరిజన మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు అత్యాచారం చేశారనే ఆరోపణపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులైన 18 మంది పోలీసులు ఒక అప్పీల్‌ను దాఖలు చేయగా, మరో అప్పీల్ ను ఏపీ ప్రభుత్వం తరపున న్యాయశాఖ, హోంశాఖల ముఖ్యకార్యదర్శులు, విశాఖ జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గిరిజన మహిళల తరపు న్యాయవాది వసుధనాగరాజు వాదనలు వినిపిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టంలోని నిబంధనల మేరకు బాధితులు తమకు నచ్చిన వ్యక్తిని ఎస్‌పీపీగా నియమించాలని కోరే హక్కుంటుందన్నారు. అందుకే గిరిజన సంప్రదాయాలు, భాష తెలిసిన త్రినాథరావును వారు ఎంచుకున్నారని తెలిపారు. దీనిపై ఏపీ హోంశాఖ తరపు ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ.. త్రినాథరావు పోలీసు కేసును ఎదుర్కొంటున్నారన్నారు. అతని వద్ద నిందితుల ఫోటోలున్నందువల్ల వాకపల్లికి వెళ్లి బాధిత మహిళలతో సమావేశం నిర్వహించలేరని తెలిపారు.

ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ...ఎస్‌పీపీ నియామకం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని అని వ్యాఖ్యానించింది. అయితే ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సహకరించేందుకు త్రినాథరావును అనుమతించాలని తాము ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. కూంబింగ్ పేరుతో ఆగస్టు, 2007న తమ గ్రామానికి వచ్చిన గ్రేహౌండ్స్ పోలీసులు తమపై అత్యాచారం చేశారని, ఈ కేసులో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణలో ఉందని వాకపల్లి గిరిజన మహిళలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ఎస్ పీపీగా త్రినాథరావును నియమించాలని అధికారులను ఆదేశిస్తూ జనవరి 4న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా న్యాయసేవాధికార సంస్థ గతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పల్లా త్రినాథరావుతో కలిసి పాల్గొన్నందువల్ల ఈ కేసు విచారణ నుంచి తప్పుకోవాలనుకుంటున్నట్లు ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రకటించారు. ఈ అప్పీల్ వ్యాజ్యాలను మరో ధర్మాసనం ముందుకు బదిలీ చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. సుదీర్ఘమైన న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటున్న ఈ కేసు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చివరికి విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానానికి చేరింది.

తెరాస కుటుంబ పాలన

● కేసీఆర్ సర్కార్‌పై బీజేపీ నేతల ధ్వజం

● అట్టహాసంగా బీజేపీ ఓబీసీ మహాగర్జన బహిరంగ సభ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భాజపా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మండల అధ్యక్షుల ఒకరోజు సమావేశం గురువారం బంజారాహిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్లోజరిగింది. ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహా యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భాజపా శాసనసభా పక్షనాయకుడు జి. కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్, పార్టీ నగర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని తెరాస ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకపడుతూనే... మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏకరవు పెట్టారు. దేశాన్ని అభివృద్ధిగా దిశగా తీసుకవెళ్ళేందుకు మోదీ తీసుకున్న పలు సాహసోపేత నిర్ణయాలు ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వ్యాఖ్యానించారు.

కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని తెరాస, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే హక్కులేదన్నారు. తెరాస పాలన ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను పార్టీ ఫిరాయింపులను ప్రొత్సహించడం సిగ్గుచేటని విమర్శించారు అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంపాలన మొదలై... రాష్ట్రాన్ని ఇష్టానుసారంగా దోచుకుంటున్నారని మండిపడ్డారు. తెరాస ప్రభుత్వంలో తెలంగాణ ద్రోహులపెత్తనమే కొనసాగుతోందన్నారు. ఉద్యమకారులను అవహేళన చేసిన వారే మంత్రులుగా ఉన్నారని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని ఏ సంఘాలను కదిపినా ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహాయాదవ్ మాట్లాడుతూ, 70 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బీసీల చట్టబద్ధత కలిగిన కమిషన్‌ను ఏర్పర్చిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌కు రూ. 20వేల కోట్ల ఇస్తామని బీసీ ప్రజాప్రతినిధులకు చెప్పి తెరాస ప్రభుత్వం ఆ తరువాత రూ.8వేల కోట్లు మాత్రం ఇస్తాందని....చివరకు అది కూడా ఇవ్వలేదని ఆయన తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేసీఆర్ చిత్తశుద్ధికి నిదర్శమని మండిపడ్డారు. ఇందుకు నిరసనగా మార్చి 24న బీసీల మహాసంగ్రామ బహిరంగ సభను నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో బీబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్, చారి, నీలకంతరాజు, మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటరాములు, మోర్చా రాష్ట్ర కార్యదర్శులు కటకం నర్సింగ్‌రావు, సత్యనారాయణ గౌడ్, మల్లేష్ యాదవ్, అధికార ప్రతినిధి సుభాష్ చంద్రబోస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వైద్యుల రిటైర్‌మెంట్ వయస్సు పెంచొద్దు

గాంధీలో జూడాల ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రిటైర్‌మెంట్ వయస్సు పెంచొద్దంటూ గాంధీ ఆస్పత్రిలో వైద్యులు గురువారం ఆందోళనకు దిగారు. దీనివల్ల తమకు అన్యాయం జరుగుతుందంటూ వారు గంట పాటు నిరసన వ్యక్తం చేశారు.

వయోపరిమితి పెంపువలన జూనియర్ డాక్టర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానే రిటైర్‌మ్మెంట్ తీసుకోవాల్సి ఉంటుందని వారు ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంలో క్లారిటీ ఇవ్వాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. దీనివల్ల నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకొని వెంటనే ప్రమోషన్లను ఇవ్వాలని, రిటైర్‌మ్మెంట్ వయో పరిమితి పెంపును మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రతిరోజు దీనిపై గంట పాటు ఆందోళన చేస్తామని వారు తెలిపారు.

'కుటుంబ సలహా కేంద్రాల పనితీరు భేష్'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కుటుంబ సలహా కేంద్రాల ద్వారా ఎంతో మంది మహిళలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్‌పర్సన్ రాగం సుజాత యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్రసాంఘిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో హైదరాబాద్ పాతబస్తీ తెలంగాణ తాజ్ మహిళా వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గురువారం ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు.

కుటుంబ సలహా కేంద్రం నిర్వహణకు ప్రస్తుతం ఇస్తున్న నిధులు సరిపోవడంలేదని, బడ్జెట్‌ను పెంచేలా కృషి చేయాలని కోరారు. 25 సంవత్సరాలుగా కుటుంబ సలహా కేంద్రాన్ని నడుపుతున్నామని, సిల్వర్ జూబ్లీ వేడుకలకు హాజరుకావాలని కోరారు. వారి అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన ఛైర్‌పర్సన్ రాగం సుజాతా యాదవ ఈ విషయాన్ని బోర్డు దృష్టికి తీసికెళతానని హామీ ఇచ్చారు.

మహిళా దినోత్సవం నాడు

సామాజిక సేవలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని లైన్స్‌క్లబ్ అధ్యర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర లైన్స్‌క్లబ్ విభాగం హెచ్‌జెఎం శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం మీడియా సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భగా పలు స్పెషాలిటీల్లో ప్రముఖ వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలు , మందుల పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించున్నట్టు తెలిపారు. చిక్కడ్‌పల్లి త్యాగరాయ గానసభను లైన్స్‌క్లబ్ కార్యక్రమాలకు వేదికగా ఎంచుకున్నట్టు తెలిపారు.

ఈ సమావేశంలో మణికొండ లైన్స్‌క్లబ్ విభాగం అధ్యక్షురాలు లలిత , శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

రూ. 200 కోట్లతో క్యాన్సర్ ఆస్పత్రి

● ఉచిత వైద్యం అందించిన బెంగళూరు వ్యాపారి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బెంగళూరుకు చెందిన ఓ వ్యాపారవేత్త విజయ్ టాటా, ఆయన సతీమణి అమృత టాటా తమ కుమార్తె జన్మదినోత్సవాన్ని అందరిలా కాకుండా చరిత్రలోనే గుర్తుండిపోయేలా సరికొత్త విధంగా నిర్వహించారు. క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఓ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి దానికి రూ.200 కోట్ల నిధిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. బెంగళూరులో రూ.100 కోట్ల విలువైన 50 ఎకరాల భూమి, రూ.100 నగదును విరాళంగా ప్రకటించి న్యూ ఇండియా స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి దాని ద్వారా క్యాన్సర్ ఆసుపత్రి నిర్మించనున్నట్లు విజయ్ టాటా తెలిపారు. ఈ దంపతులు ఇప్పటికే గత ఆరేళ్ళుగా 40 మంది పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ వారి ఆలనా పాలన చూస్తున్నారు. పేదరికంలో మగ్గుతున్న పిల్లలకు ఆరోగ్యం పరిరక్షించాలన్న లక్ష్యంతోనే ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలకు క్యాన్సర్ వ్యాధికి, చిన్న పిల్లలకు సోకే ప్రమాదకరమైన వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఈ ఆసుపత్రిని నిర్మించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగులకు ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స అందిస్తామని, దేశంలోనే మొదటిసారిగా నగదురహిత ఆసుపత్రిగా నిలుస్తుందని అమృత టాటా పేర్కొన్నారు.

ఆకుల రాజేందర్‌కు మాతృవియోగం

మల్కాజిగిరి, ప్రభ న్యూస్: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, కార్పొరేటర్ ఆకుల నర్సింగ్‌రావు తల్లి ఆకుల ఈరమ్మ(78) గుండెపోటుతో బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మైనంపల్లి హన్మంతరావుతో పాటు పలువురు సందర్శించి భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలుంచి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, తెదేపా నాయకులు మండల రాధాకృష్ణ యాదవ్, కార్పొరేటర్లు జగదీశ్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

చావు బతుకుల్లో యాకయ్య

● ప్రియుడి సహాయంతో కాబోయే భర్తపై దాడి

● కటకటాల పాలైన ప్రేమ జంట



వరంగల్, ప్రభన్యూస్‌బ్యూరో: వరుసకు సోదరుడితో ప్రేమాయానం కొనసాగించి అతన్నే పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చి తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్లి సంబంధాన్ని తెంచుకోవడానికి కాబోయే భర్తపై హత్యప్రయత్నం చేసిన సంఘటన జనగామ జిల్లాలో కలకలం రేపింది. సభ్య సమాజం తలదించుకునే రీతిలో చోటుచేసుకున్న ఈ సంఘటనలో పెళ్లి కాకముందే ఆ ప్రేమ జంట కటకటాల పాలైంది. పెళ్లికావాల్సిన వరుడు చావు బతుకుల మధ్యన కొట్టుమిట్టాడుతున్నాడు. తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధం ఇష్టంలేని పెళ్లికూతురు దారుణానికి ఒడిగట్టిన సంఘటన మానవత్వాన్ని మంట కలిపేలా ఉంది.

జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన గొంగళ్ల యాకయ్యకు మాధారం గ్రామానికి చెందిన అరుణతో పెళ్లి సంబంధం కుదురింది. ఈనెల 21న పెళ్లి జరగాల్సి ఉంది. పెళ్లికి ముందే అరుణ అదే గ్రామానికి చెందిన ఆరూరి బాలస్వామితో ప్రేమయానం కొనసాగిస్తోంది. రెండేళ్లుగా వారి ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వరుసకు బాలస్వామి అరుణకు సోదరుడు అవుతాడు. ఈ విషయం తెలియని అరుణ తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి సంబంధం నిశ్చయించారు. 21న పెళ్లి చేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. యాకయ్యతో పెళ్లి జరిగితే బాలస్వామి దూరమవుతాడనే ఉద్దేశంతో అరుణ కాబోయే భర్తను హతమార్చేందుకు నిర్ణయం తీసుకున్నది. గత ఆదివారం రాత్రి పథకం ప్రకారం యాకయ్యతో ఫోన్ మాట్లాడింది. ఫోన్ సంభాషణ సక్రమంగా లేనందున వేరే చోటుకు రమ్మని యాకయ్యను పిలిచింది. ఇరువురు సంభాషణ కొనసాగుతుండగా ఫోన్ సిగ్నల్ సరిగాలేదంటూ బయటకు రావాల్సిందిగా యాకయ్యను కోరింది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించని యాకయ్య అరుణ పిలుపుతో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అప్పటికే వేచిచూస్తున్న అరుణ ప్రియుడు బాలస్వామి యాకయ్యపై పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. ఊహించని సంఘటనతో అయోమయానికి గురైన యాకయ్య కుటుంబ సభ్యులు ప్రాణపాయస్థితిలో ఉన్న యాకయ్యను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. 50 శాతానికి పైగా కాలిన గాయాలతో ఆయన పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. యాకయ్య పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ జరిపిన పోలీసులు యాకయ్యపై హత్యాప్రయత్నం చేసింది ఆరూరి బాలస్వామి, అరుణలుగా గుర్తించారు. వారిద్దరు బుధవారం నాడు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్వయాన పెద్దమ్మ కుమారుడు ఐన బాలస్వామితో ప్రేమయానం కొనసాగించి కాబోయే భర్తపై హత్యప్రయత్నం చేసిన అరుణ సంఘటన రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసింది.

రిటైర్డ్ ఉద్యోగుల సర్వీస్ పెంపు వ్యవహారం..

కౌంటర్లు దాఖలు చేయండి

● తెలంగాణ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సర్వీసు పెంపు వ్యవహారంలో వారం రోజుల్లో కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వారం రోజులు వాయిదా వేసింది. రిటైరైన అధికారులను అదే శాఖలో సర్వీసును పొడిగించడం/కాంట్రాక్టు/అడ్ హాక్ పద్ధతి లో పనిచేయడం సర్వీసు నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ సామాజిక కార్యకర్త, భాజపా పాలసీ రీసెర్చ్ సెల్ విభాగం అధ్యక్షుడు జీ ఆర్ కరుణాకర్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..రెగ్యులర్ ఖాళీలలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను నియమించడం వల్ల, పదోన్నతుల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రెగ్యులర్ ఉద్యోగులు ప్రమోషన్ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణ సాధారణ పరిపాలన శాఖ, టీఎస్ పీఎస్సీ, పంచాయతీరాజ్, పురపాలక శాఖ, ఇంజినీర్-ఇన్-ఛీఫ్ శాఖలో ఈ నియామకాలు కొనసాగుతున్నాయని విన్నవించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ..ఈ వ్యవహారంలో వారంలో కౌంటర్లు దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేసేందుకు ఇదే చివరి అవకాశమని హెచ్చరించింది.

కృష్ణా ట్రిబ్యునల్‌లో క్రాస్ ఎగ్జామినేషన్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కృష్ణా జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదంపై కృష్ణా ట్రైబ్యునల్‌లో గురువారం విచారణ ప్రారంభమైంది. రెండు రోజుల పాటు సాగే ఈ విచారణలో తొలి రోజు ఆంధ్రప్రదేశ్ తరపు సాక్షి కేవీ సుబ్బారావు అనారోగ్యం కారణంగా రాకపోవడంతో, ఆయనకు బదులుగా వ్యవసాయ రంగ నిపుణుడు పీవీ సత్యనారాయణ హాజరయ్యారు. నిజానికి గత నెల 31న జరగాల్సిన విచారణకు అనారోగ్య కారణాలతో కేవీ సుబ్బారావు హాజరుకాలేదు. ఈ కారణంగా విచారణను గురువారానికి వాయిదా వేయగా, అప్పటికీ ఆయన పరిస్థితి మెరుగుపడక పోవడంతో, వ్యవసాయ రంగ నిపుణుడు పీవీ సత్యనారాయణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపించింది. సత్యనారాయణను తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది వి. రవీందర్ రావు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణుడిగా వరిలో సాగు చేస్తున్న వివిధ రకాల వంగడాలు, వాటి పంట కాలంపై ప్రశ్నలు అడిగి సమాధానాలు నమోదు చేసుకున్నారు. అలాగే వరి పంటలో సాగు కాలంపైనా వివరాలు రాబట్టారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సాగుకు సంబంధించి క్రాస్ ఎగ్జామినేషన్లో వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆగ్రోక్లైమాటిక్ జోన్ల గురించి అడిగి, ఆయన గతంలో దాఖలు చేసిన అఫిడవిట్లోని సమాచారానికి, క్రాస్ ఎగ్జామినేషన్లో చెప్పిన సమాధానాలకు మధ్య వ్యత్యాసాలను గుర్తించారు. తెలంగాణలో నేల స్వభావాల గురించి కూడా రవీందర్ రావు ప్రశ్నలు సంధించారు. ఈ విచారణ నేడు కూడా కొనసాగనుంది.

కొండలరావు మామ ఇంటిపై ఏసీబీ దాడులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆదిలాబాద్ మునిసిపల్ డీఈ కొండల్‌రావు వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ దాడులు నిర్వహిస్తున్న క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని రామాంజనేయ కాలనీలో ఉన్న ఆయన మామ ఉటూకూరి ఆంజనానందం ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించారు. ఇంట్లో కొన్ని డాక్యుమెంట్లన్న స్వాధీనం చేసుకున్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఈ దాడులు నిర్వహించిన ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు రమణమూర్తి, రామలింగారెడ్డిలు చెప్పారు.

ఏసీబీకి చిక్కిన మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్

లంచం తీసుకుంటూ షాద్‌నగర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి, డ్రైవర్ బాలయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వాహనదారుడి నుంచి ఐదు వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో వల పన్నిన ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎవరైనా లంచం కోసం డిమాండ్ చేస్తే తమను సంప్రదించాలని ఏసీబీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అవినీతి అధికారికి రెండేళ్ల జైలు శిక్ష

ఖమ్మం డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ విజయ్‌కుమార్‌కు రెండేళ్ల జైలు శిక్ష పడింది. జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. 2009లో చొప్పదండి సీఐగా పనిచేస్తుండగా ఓ వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

మాంసం పరిశ్రమపై

మరిన్ని పరిశోధనలు జరగాలి

● ఐసీఏఆర్ డైరెక్టర్ డా. ఛటర్జీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో 98.2 శాతం మంది ప్రజలు మాంసాన్ని ఆరగిస్తారని ఐసీఏఆర్ డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌యాన్ ఛటర్జీ పేర్కొన్నారు. గురువారం భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, జాతీయ మాంస పరిశోధనా సంస్థ హైద రాబాద్ 11వ వ్యవస్థాపక దినోత్సవం చెంగిచెర్లలో జరిగింది. ఈ సందర్భంగా ఛటర్జీ మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు మాంసాన్ని ఎక్కువ తినడం వల్లే కేంద్రం మాం సం పరిశ్రమను ఇక్కడ నెలకొల్పిందన్నారు. శాస్త్రవేత్తలు మాంసం పరిశ్రమపై మరిన్ని పరిశోధనలు చేసి నాణ్యత పెరిగేలా చూడాలన్నారు. వివిధ రకాల మాంసాలకు సంబంధించిన జాతులను గుర్తించడానికి కొత్త సాంకేతిక అభివృద్ధిని సాధించామన్నారు. మహబూబ్‌నగర్, నెల్లూరు జిల్లాల్లో గొర్రెల పెంపకం దారుల కొరకు దాణా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సేంద్రీయ మాంసాన్ని ఉత్పత్తి చేయడానికి ప్రోటోకాల్ విధానాన్ని తయారు చేశామన్నారు. తిరుపతి పశు వైద్యకళాశాలలో మోడల్ పశువధ శాలను నెలకొల్పా మన్నారు.

ఆదాయం రెట్టింపునకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ

ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ కోరుకున్నట్టుగా రైతుల ఆదాయం రెట్టింపు చేసేందుకు అవలంభించాల్సిన వ్యూహాలు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నవీన మాంస పరిశోధనా రంగంలో ఉన్న అవకాశాలను వివరించగా, మరో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బసవరెడ్డి మాంసం పరిశ్రమలో వ్యాపార అవకాశాలపై ప్రసంగించారు. పౌల్ట్రీరంగంలో వ్యాపార అవకాశాలపై ఆర్ఆర్ ల్యాబ్ డాక్టర్ రవీందర్ రెడ్డి ప్రసంగించారు.

పరిశోధనలను ప్రోత్సహించాలి

● పంజాబ్ వర్సిటీ వీసీ అరుణ్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యారంగంలో పరిశోధనలకు ప్రభుత్వం చేయూత నివ్వాలని పంజాబ్ యూనివర్శిటీ వీసీ ప్రొ.అరుణ్ కుమార్ వెల్లడించారు. గురువారం సీఎస్ఐఆర్-సీసీఎండిలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి వీసీ అరుణ్‌కుమార్ ముఖ్యఅతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా సీసీఎండీ డైరెక్టర్ రాకేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో స్వతంత్ర్యానికి ముందు, అతరువాత విద్యారంగం ఏవిధంగా ఉండేది, ఉన్నత విద్యలో వచ్చిన మార్పులను వివరించారు. స్వాతంత్ర్యానంతరం ఉన్నత విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. ప్రయోగశాలల్లో పరిశోధనలు కూడా పెరిగాయన్నారు. దేశంలోని పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఈ దిశగా ఎంతో కృషి చేశాయన్నారు. అందులో పంజాబ్ విశ్వవిద్యాలయంతోపాటు ఉస్మానియా విశ్వవిద్యాయలం, నాగపూర్, ఢిల్లీ విశ్వవిద్యాలయాలు మొదటి వరుసలో ఉంటాయన్నారు. డా.శాంతిస్వరూప్ బట్నాగర్, డా.హోమి బాబా వంటి వారెందరో విద్యారంగంలో పరిశోధనలు సాగించి ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు.

మాకివ్వాల్సింది ఇవ్వండి..

- కేంద్రానికి ఆ బాధ్యత ఉంది
- మా మనోభావాలు గౌరవించాలి
- అప్పుడే ఇచ్చి ఉంటే మరింత ముందుకెళ్లే వాళ్లం
- ఇవ్వనందుకే గట్టిగా అడుగుతున్నాం
- ప్రత్యేక హోదాపై ఏపీ సీఎం చంద్రబాబు పెదవివిరుపు



అనంతపురం, ప్రభన్యూస్ బ్యూరో: 'రాష్ట్రప్రతిష్టపెంచే దిశగా ప్రవర్తించే వారికి సంపూర్ణ సహకారం అందిస్తాం. రాజకీయ లబ్ధి కోసం తప్పుడు వైఖరి ప్రదర్శిస్తే.. సహించను. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన పూర్తి స్థాయి సహకారం ఇచ్చి తీరాల్సిందే. 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని పేర్కొన్నట్లు అప్పట్లో ప్రధాని చెబితేనే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించాం. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి న్యాయం జరగలేదు. పలుమార్లు ప్రధానితో ఈ విషయాన్ని చర్చించా. మా మనోభావాలు దెబ్బతీయొద్దు. కేంద్రం తన బాధ్యతను గుర్తెరిగి హామీల అమలు చేయాలి. వాటినిచ్చే వరకు గట్టిగా అడుగుతామని' ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా పెనుకొండ సమీపంలోని ఎర్రమంచి వద్ద గురువారం కియా మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కియా రూపకల్పన ప్రక్రియ ప్రారంభ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కేంద్రం ఇస్తామన్న నిధులు సకాలంలో ఇచ్చి ఉంటే రాష్ట్రం మరింత అభివృద్ధి బాటలో పయనించేదన్నారు. ప్రత్యేక హోదా ద్వారా లభించే అన్ని వెసులుబాట్లు రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఇస్తామని ప్రధాన మంత్రి చెప్పారన్నారు. అందులోనూ.. ఇతర రాష్ట్రాలకు కూడా ప్రత్యేక హోదా ఇవ్వడం లేదన్న విషయాన్ని 14వ ఆర్థిక సంఘం సూచించిందన్నారు. అందుకే ప్రత్యేక హోదా లేకపోయినా.. ప్యాకేజీ ద్వారా న్యాయం జరుగుతుందని విశ్వసించానన్నారు. అయితే.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లో ప్రత్యేక హోదాను కొనసాగిస్తుండటం చూస్తుంటే ఆ రోజు చెప్పింది నిజం కాదని తేలిపోయిందన్నారు. అలాంటప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎందుకివ్వరో చెప్పాలన్నారు. రాష్ట్రం నిలదొక్కుకునే పరిస్థితుల్లో కేంద్ర వైఖరి ఇబ్బందికరంగా మారిందన్నారు.

సంపూర్ణ సహకారం ఇవ్వాలి

విభజన హామీలకు బాధ్యత తీసుకుని సంపూర్ణ సహకారం అందించాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలు గౌరవించే విధంగా నడుచుకోవాలని హితవు పలికారు. కొందరు ఇప్పటికే.. రోడ్లపైకొచ్చి ఆందోళన చేస్తున్నారని.. అడ్డదిడ్డమైన విభజనతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు చేస్తున్న పనులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. అనంతపురం జిల్లాలో కియా సంస్థ తమ కార్ల ఉత్పత్తిని జనవరి 2019 నుంచి చేపడుతుందన్నారు. ఏడాదికి 3 లక్షల కార్ల తయారీ లక్ష్యంగా పెట్టుకుందని, అయితే.. భారత మార్కెట్ లో విస్తృతంగా ఉన్నందున ఏడాదికి 10 లక్షల వరకు మార్కెటింగ్ అవకాశం వస్తుందన్నారు. ఉద్యోగాభివృద్ధిలో ఆంధ్ర రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన ఓ సర్వే స్పష్టం చేసిందన్నారు. విభజన ద్వారా ఏర్పడ్డ నష్టాలను అధిగమనించి అభివృద్ధి బాటలో పయనింపజేసేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తున్నామన్నారు. రాష్ట్రం నిలదొక్కుకుని పరిస్థితుల్లో కేంద్రం బాధ్యాతాయుతంగా వ్యవహరించి ఉంటే మరింత అభివృద్ధి జరిగేదన్నారు. సాంకేతికతను అన్నింటిలో సమ్మిళితం చేయడం ద్వారా అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. సెన్సార్ ద్వారా అగ్నిప్రమాదాలను నివారించడం, వర్షపు నీటితో నిండిన ప్రాజెక్టులకు నీటి మళ్లింపు, ప్రమాదాలను నివారించేందుకు ఆటో బ్రేకింగ్ వ్యవస్థ, సోలార్‌తో నడిచే వాహనాలు లాంటి అనేక వినూత్నంగా ఆలోచించడమే ఏపికి ఉన్న శక్తి అని వెల్లడించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా సాంకేతికతను జోడించి ఎక్కడ ఏ సమస్యలున్నా.. వెంటనే తెలుసుకుని పరిష్కార మార్గం చూపడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం దూర దృష్టితో తీసుకుంటున్న నిర్ణయాలతో సత్ఫలితాలు లభిస్తున్నాయన్నారు.



కియాకు అభినందనలు..

నిత్యం కరవుకాటకాలతో సతమతమవుతున్న అనంతపురం జిల్లా రూపు రేఖలు మారిపోనున్నాయని.. చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కియా కార్ల రూపకల్పన ప్రక్రియ ప్రారంభ వేడుకను గురువారం చంద్రబాబు ప్రారంభించారు. కియా మోటార్స్ ప్రెసిడెంట్, సిఇఒ హాన్ హూ పార్క్‌తో కలిసి ఆయన కియా మోటార్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏపి అభివృద్ధిలో కియా ఓ మలుపవుతుందన్నారు. ఉత్తర కొరియాకు చెందిన కియా ఇక్కడికి రావడం ఆనందించదగ్గ విషయమన్నారు. 45 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో 16 ప్రాంతాల్లో కియా 35 లక్షల కార్లు ఉత్పత్తి చేస్తుందని, వీటి వల్ల 51 వేల మందికి ఉద్యోగాలు లభించాయని చంద్రబాబు తెలియజేశారు. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న కియా పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 4 వేల మందికి, పరోక్షంగా 7వేల మందికి ఉపాధి లభిస్తుందని, ఇక్కడి ప్రాంతానికి 80 శాతం ఉపాధి కల్పించనున్నారన్నారు. ప్రస్తుతం ఏడాదికి 3 లక్షల కార్ల ఉత్పత్తి లక్ష్యంతో ప్రారంభమవుతున్న అనంతపురం కియా మోటార్స్ భవిష్యత్తులో 10 లక్షలకు విస్తరించాలని అభిలాషించారు. భారత దేశంలో కార్లకు డిమాండ్ అధికంగా ఉందన్నారు.

గుంటూరు రౌండ్‌టేబుల్‌కు రండి

- పవన్ కళ్యాణ్‌కు సీపీఐ ఆహ్వానం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంపై గుంటూరులో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో హాజరు కావాలని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు సిపిఐ నుంచి ఆహ్వానం అందింది. ప్రత్యేక హోదా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు సిపిఐ, సిపిఎంలు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా గుంటూరులో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి పవన్‌ను ఆహ్వానించి ఆందోళనను తీవ్రతరం చేయాలని సిపిఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం పవన్ కళ్యాణ్‌ను కలిశారు.

వ్యక్తిగత విమర్శలు పట్టించుకోను : పవన్

తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేసినా పట్టించుకోననీ, ప్రత్యేక హోదా కోసం నిరసన వ్యక్తం చేసే వారిపై దాడుల చేయడం సరికాదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. ఎవరైనా తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉందనీ, భిన్నాభిప్రాయాలు ఉంటే చర్చించుకోవాలేగానీ దాడులు చేయవద్దని అన్నారు. విద్యుత్, అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నాన్నారు. మార్చి 1న గుంటూరులో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరవుతానో, లేదో రెండు రోజుల్లో చెబుతానని అన్నారు. మహాన్యూస్ మీడియా వాహనాలపై దాడి చేయడం కాదని, ఈ సందర్భంగా ఆయన ఖండించారు.

రామకృష్ణ మాట్లాడుతూ.. పవన్‌తో వివిధ అంశాలపై చర్చించామని, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు చేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినందున న్యాయం చేయాలని కోరుతామన్నారు. ప్రత్యేక హోదా అంశంపై టీవీల్లో చర్చ జరిపే వాళ్ళపై దాడులు చేయడం సరైన వైఖరి కాదన్నారు. దాడులు చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

బాబుతో అప్రమత్తంగా ఉండాలి

- వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా ఉద్యమంలో చొరబడాలని ప్రయత్నిస్తున్న సీఎం చంద్రబాబుతో ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అభిప్రాయపడ్డారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును అవసరాన్ని బట్టి, అవకాశాన్ని బట్టి రంగులు మారుస్తా ఉంటారన్నారు. ఊసరవెల్లిలా రంగులు మార్చడం చంద్రబాబుకు వెన్నతోపెట్టిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు ఎప్పటికప్పుడు తన పనితీరుపై సర్వేలు చేయించుకునే అలవాటుందన్నారు. ఇటీవల సర్వే జరిపినప్పుడు ప్రత్యేక హోదా విషయంలో బీజేపీ, టీడీపీలు మోసం చేశాయనే భావనలో ప్రజలున్నారన్నారు. రెండురోజులుగా ఆయన ఒక అడుగు ముందుకేసి ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలు వస్తాయని చెబుతున్నారని తెలిపారు. ప్రత్యేక హోదాను చంపేసి, ప్యాకేజీనే ముద్దని ఊరూరా ప్రచారం చేశారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల రాజీనామాల ప్రకటన నేపథ్యంలో ప్రజల భావోద్వేగాలు ఉన్నాయన్నాయని గుర్తించి నిన్నటి నుండి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే..తద్వారా పరిశ్రమలు వస్తాయంటున్నాడన్నారు. ఈ రోజు అనంతపురంలో సైతం అదే రీతిలో హోదా వల్ల పరిశ్రమలు వస్తాయంటూ చంద్రబాబు చెబుతున్నారన్నారు. చంద్రబాబుది నోరా తాటిమట్టా అనేది అర్థం కావడంలేదని అంబటి విస్మయం వ్యక్తంచేశారు.

కానిస్టేబుల్‌కు రేవంత్ పరామర్శ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మంత్రి కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ప్రమాదానికి గురైన ఏఆర్ కానిస్టేబుల్ గురునందగౌడ్‌ను గురువారం కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు పాల్గొన్న కార్యక్రమంలో గౌడ్ విధి నిర్వహణలో ఉన్నారు. కొస్గీ మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి గ్రామంలో పర్యటన పూర్తి చేసుకుని వెళ్ళిపోతున్న ఒక మంత్రి వాహనం గురునంద్‌గౌడ్ కాలిపై వెళ్ళడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ కానిస్టేబుల్ ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడిని రేవంత్‌రెడ్డి కలిసి పరామర్శించారు. కానిస్టేబుల్‌కు అన్ని రకాల అండగా ఉంటానని హామీ ఇవ్వడంతో పాటు ఆర్థికసహాయాన్ని అందించారు. ఈ ప్రమాదానికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, గాయపడ్డ కానిస్టేబుల్‌కు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వెంట కొడంగల్ కాంగ్రెస్ నేత, ఎంఎల్ఏ సోదరుడు తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

పాక్‌పై వేటుపడకుండా..
చైనా, టర్కీ, సౌదీ అండ



వాషింగ్టన్ : ఉగ్రవాద సంస్థలకు అంతర్జాతీయంగా సహాయం అందిస్తున్న దేశాల జాబితాలో పాకిస్తాన్‌ని చేర్చేందుకు ట్రంప్ ప్రభుత్వం పారిస్‌లో జరిగిన ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఓటిఎఫ్) సమావేశంలో చైనా, టర్కీ, సౌదీ అరేబియాలు అడ్డుపడ్డాయి.ఈవిషయాన్ని అమెరికన్ మీడియా ప్రకటించింది.ఇది తమ దేశం సాధించిన విజయంగా పాక్ గొప్పగా చెప్పుకుంది.దీంతో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం అమలుకు అవరోధం ఏర్పడింది. ఉగ్రవాద సంస్థలకు సాయం అందిస్తున్న దేశాలపై వేటు వేసేందుకు ఉద్దేశించిన తీర్మానాన్ని టాస్క్ ఫోర్స్ సమావేశంలో చర్చించి ఆమోదించాల్సి ఉండగా, ఈ మూడు దేశాలూ పాక్ పక్షాన నిలబడటంవల్ల పాక్‌పై వేటు పడలేదు.

ఈ మూడు దేశాల్లో సౌదీ అరేబియా అమెరికా మిత్ర దేశమైనప్పటికీ, సౌదీ ప్రభుత్వానికీ, ట్రంప్ ప్రభుత్వానికీ మధ్య ఈ విషయంలో అవగాహన కుదరకపోవడం వల్ల సౌదీ పాక్‌కి అండగా వెళ్ళిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక పేర్కొంది.సౌదీ అరేబియా గల్ఫ్ కౌన్సిల్ ప్రోద్బలంపై పాక్ పక్షాన నిలిచిందని ఆ పత్రిక పేర్కొంది. ఎఫ్‌టిఎఎఫ్ అనే సంస్థ ఇరవై తొమ్మిదేళ్ళ క్రితం ఏర్పడింది.ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయంఅందించే దేశాలపైనా, మనీ ల్యాండరింగ్ వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే దేశాలపైనా వేటు వేసేందుకు ఈ సంస్థ ఏర్పడింది. ఆఫ్ఘనిస్థాన్‌లో హఖానీ గ్రూపు ఉగ్రవాదులపైనా, తాలిబన్లపైనా చర్యలు తీసుకోనందుకు పాక్‌కి అమెరికా 2 బిలియన్ డాలర్ల భద్రతా సహాయాన్ని నిలిపివేసింది.అయితే, పాకిస్తాన్ ఈ ఆరోపణలను ఖండించింది.టాస్క్ ఫోర్స్ సమావేశంలో పాక్‌కి వ్యతిరేకంగా వ్యవహరించాలని సౌదీపై అమెరికా తీవ్రమైన ఒత్తిడి తెచ్చినా, గల్ఫ్ కౌన్సిల్ మాటనే సౌదీ మన్నించిందని వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. టాస్క్ ఫోర్స్ సమావేశం పారిస్‌లో ఈరోజు ప్రారంభమైంది.రేపటితో కొనసాగుతుంది.

'ప్రాణదాన'కు రూ.కోటి విరాళం

తిరుమల, ప్రభన్యూస్: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రాణదాన పథకానికి గురువారం కోటి రూపాయలు విరాళంగా అందింది. ఈ మేరకు మలేషియాకు చెందిన ప్రవాస భారతీయుడు ఇందుకు సంబంధించిన చెక్కును తిరుపతిలోని తిరుమల జేఈవో శ్రీనివాసరాజు స్వగృహంలో జేఈవోను కలసి అందచేశారు.



ఏపీని అత్యుత్తమ రాష్ట్రంగా చేస్తాం

- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

అనంతపురం, ప్రభన్యూస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోని అత్యుత్తమ ఐదు రాష్ట్రాల్లో ఒక్కటిగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. అనంతపురం జిల్లా పెనుకొండలో గురువారం ఆయన కియా మోటార్స్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కియా మోటార్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నామన్నారు. నీరు, విద్యుత్, భూమి తదితర మౌలికసుదపాయాల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. నైపుణ్యంకలిగిన మానవవనరులు అందుబాటులో వుండటం వల్ల రాష్ట్రానికి విరివిగా పరిశ్రమలు వస్తున్నట్లు చెప్పారు. అలాగే వ్యాపారానికి అనువైన ప్రదేశంగా ప్రపంచ పటంలో స్థానం సంపాదించగలిగామన్నారు. తద్వారానే కియా మోటార్స్ ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం వీలైందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పరిశ్రమలు రానున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులసాధనలో భాగంగా హంద్రీ నీవాను యుద్ధప్రాతిపాదికన పూర్తిచేసేందుకు కృషి చేశామన్నారు. ప్రాజెక్టులు, కెనాళ్లవద్ద నిద్రించి పనులు వేగంగా జరిగేలా చేశామన్నారు. వ్యవసాయంలో సుస్థిరత సాధించేందుకు నీటి వనరులను తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు పండ్ల తోటల ద్వారా ఆనందంగా జీవించగలుగుతున్నారన్నారు. మార్కెటింగ్ మేనేజర్ పాత్రను కూడా తాను పోషిస్తూ రాష్ట్రానికి అనేక పరిశ్రమలు రావడానికి ప్రయత్నిస్తున్నానన్నారు. పరిశ్రమల తయారీ కేంద్రంగాను, ఎక్స్‌లెన్స్‌కారిడార్, ఎరోస్పేస్, డిఫెన్స్, హార్డ్‌వేర్, ఎలక్ట్రానిక్స్‌ద్వారా రాష్ట్రాన్ని ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా మారుస్తామన్నారు. బెంగుళూరు-హైదరాబాదు, బెంగళూరు-చెన్నై, చెన్నై-విశాఖ, చెన్నై-కృష్ణపట్నం ఓడరేవు పారిశ్రామిక వాడల ద్వారా పరిశ్రమల ఉత్పత్తిని మెరుగుపరచే అవకాశాలు వున్నాయన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఎనర్జీ యూనివర్సిటీ విషయాలు కేంద్రంతో చర్చిస్తున్నామన్నారు. గతంలో పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన భూములు కోర్టు వివాదంలో వున్నాయన్నారు.

ప్రత్యేక హోదాపై ఆఖరి పోరాటం

- పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి



ఏలూరు, ప్రభన్యూస్ : ప్రత్యేక హోదా కోసం తెలుగోడు ఆఖరి పోరాటం చేయాల్సిందేనని పీసీసీ ఉపాధ్యక్షుడు తులసిరెడ్డి పిలుపిచ్చారు. ఏపీకి బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఐపీ టోపీ పెట్టిందని ఆయన విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో గురువారం కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గురునాథరావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక హోదా డిమాండ్ నిరసన విజయవంతమయ్యింది. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ వైసీపీలను దుష్టత్రయంగా అభివర్ణించారు. హోదా, విభజన హామీల కింద సుమారు రూ. 5 లక్షల కోట్లు ఇచ్చేందుకు నాడు కాంగ్రెస్ హామీలిచ్చిందని, అలాగే వెనుకబడ్డ ఏడు జిల్లాలకు రూ. 24.350 కోట్లు ఇచ్చేందుకు కూడా కాంగ్రెస్ సిద్ధపడిందని తులసిరెడ్డి స్పష్టం చేశారు. అయితే రూ.5 లక్షల కోట్లకు గాను కేవలం కంటి తుడుపుగా రూ.11,667 కోట్లు, అలాగే రూ. 24,350 కోట్లుకుగాను కేవలం రూ.1,050 కోట్లే ముష్టిగా కేంద్రం ఇచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీకి ఏపీలోని టీడీపీ, వైసీపీలు అధికార, అనధికార మిత్రపక్షాలుగా మారాయన్నారు. ఇచ్చింది గోరంతైతే.. తాము కొండంతగా నిధులు చెల్లించామంటూ బీజేపీ ప్రకటనలు చేయడాన్ని తులసిరెడ్డి తప్పుపట్టారు. ప్రత్యేక హోదా ఏపీకి ఖచ్చితంగా వస్తుందన్నారు. ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కాదంటే రానున్న కాంగ్రెస్ సారథ్యంలోని యూపీయే ప్రభుత్వం ఇస్తుందంటూ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

జగన్ పాదయాత్రకు బ్రేక్

- 94వ రోజు గంటపాటే సాగిన యాత్ర
- నేడు కోర్టుకు హాజరయ్యేందుకు విరామం



ఒంగోలు, ప్రభ న్యూస్‌బ్యూరో: ప్రకాశం జిల్లాలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్రకు గురువారం బ్రేక్‌పడింది. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరు కావాల్సి ఉన్న నేపథ్యంలో జగన్ తన పాదయాత్రకు విరామం ఇచ్చి హైదరాబాద్‌కు పయనమయ్యారు. కనిగిరి నియోజకవర్గంలోని అలవలపాడు వద్ద బుధవారం రాత్రి విశ్రాంతి తీసుకున్న జగన్ గురువారం కేవలం ఒక గంటపాటు పాదయాత్ర కొనసాగించి హాజీస్‌పురం వద్ద నుంచి కారులో కనిగిరి మీదుగా రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లిపోయారు. అక్కడనుంచి విమానంలో హైదరాబాద్ చేరుకుంటారు. గత శుక్రవారం ప్రకాశం జిల్లాలో పాదయాత్రను ప్రారంభించిన జగన్ ఈ వారం రోజుల్లో కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లో విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి కనిగిరి నియోజకవర్గం అలవలపాడు వరకు పాదయాత్ర నిర్వ హించి అక్కడే బస చేశారు. అలవలపాడు నుంచి గురువారం ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించిన జగన్ రామాపురం, హాజీస్‌పురం వద్దకు చేరుకోగానే పాదయాత్రను నిలిపివేశారు. వాస్తవానికి మరో రెండుకిలోమీటర్ల దూరంలో మధ్యాహ్నం బ్రేక్ తీసుకోవాల్సి ఉంది. అయితే పాదయాత్రకు ప్రజల హాజ రు కూడా తక్కువగా ఉండటంతో కేవలం ఒక గంటసేపు మా త్రమే పాదయాత్ర నిర్వహించిన జగన్ అక్కడి నుంచే వాహ నంలో బయలుదేరి వెళ్లిపోయారు. జగన్ పాదయాత్ర గురు వారం పూర్తిగా ఉండదని తెలుసుకున్న ప్రజలు కూడా పెద్ద సం ఖ్యలో హాజరుకాలేదు. నియోజకవర్గ నాయకులు మాత్ర మే జగన్ వెంట ఉన్నారు. ఈ గంటలో ఆయన దారి వెంట ఉన్న ప్రజానీకాన్ని పలక రించుకుంటూ ముందుకుసాగారు. పెద్దగా జనసంచారం కూడా లేకపోవ డంతో పాదయాత్ర త్వరగా ముగిసిపోయిందని నాయకులు చెబుతున్నారు.

24న పున: ప్రారంభం

జగన్ పాదయాత్ర కనిగిరి నియోజకవర్గం హాజీస్‌పురం వద్ద 24వ తేదీ ఉదయం ప్రారంభమవుతుంది. అక్కడినుంచి మధ్యాహ్నానికి కనిగిరి చేరుకుంటా రు. అనంతరం నియోజకవర్గంలో మిగతా ప్రాంతాలు పర్యటిస్తారు. 25వతేదీనుంచి మార్కాపురం నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహిస్తారని వెంకటరెడ్డి తెలిపారు.

ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువే..

జాతీయస్థాయి సదస్సు ముగింపులో శేషగిరిబాబు



అమరావతి ఆంధ్రప్రభ: ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. వడగాలులపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం అని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా చర్యలు చేపట్టేందుకు అధికారులకు సమాచారాన్ని చేరవేస్తామన్నారు. వాతావరణంలోని మార్పులు కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఉష్ణోగ్రత్తలో మార్పులు, వడగాలుపై సంసిద్ధత మరియు ఉపశమన చర్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్ రూపొందించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ(ఏపీఎస్‌డీఎమ్ఏ), జాతీయ విపత్తుల నిర్వహణ శాఖ(ఎన్‌డీఎమ్ఏ) సంయుక్త ఆధ్వర్యంలో వడగాలులపై సంసిద్ధత, ఉపశమన చర్యలు అంశంపై రెండు రోజుల నేషనల్ వర్క్‌షాప్ గురువారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శేషగిరిబాబు మాట్లాడారు. శాఖల వారీగా అమలు చేయాల్సిన ప్రణాళికలు ఈ యాక్షన్ ప్లాన్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో హెచ్చరికలు మాస్ మేసేజింగ్, లోకేషన్ బేస్ మేసేజ్‌ల ద్వారా సమాచారాన్ని పంపించడం జరుగుతుందన్నారు. సదస్సులో పాల్గొన్న వారి సలహాలు, సూచనలతో వడగాలులతో సంభవించే నష్టాన్ని తగ్గించడానికి కృషి చేస్తామన్నారు.

రేపటి నుంచి విశాఖలో ప్రతిష్టాత్మకంగా
భాగస్వామ్య సదస్సు



సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గంటా, తదితర అధికారులు

- రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యం
- అభివృద్ధి చెందిన దేశాలను తలదన్నేలా మూడు రోజుల వేడుక

విశాఖపట్నం, ప్రభ న్యూస్: విదేశాలను తలదన్నే కార్పొరేట్ ఏర్పాట్లుతో విశాఖలో ఈ నెల 24 నుంచి జరిగే మూడో భాగస్వామ్య సదస్సు టాక్ ఆఫ్ ది కంట్రీగా మారింది. నవ్యాంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులకు కేంద్రంగా మలచి ఇప్పటికే రెండు పర్యాయాలు భాగస్వామ్య సదస్సులను నిర్వహించిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 3వ భాగస్వామ్య సదస్సు నిర్వహణకు అగ్రతాంబూళం ఇవ్వడం సదస్సుకున్న ప్రాముఖ్యతను చర్చనీయాంశంగా మార్చింది. ప్రధాన ప్రతిపక్షంతో పాటూ ఇతర పార్టీలూ, వామ పక్షాలు, ప్రతినిధులూ భాగస్వామ్య సదస్సుల పేరుతో ముఖ్యమంత్రి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లుగా విమర్శల బాణాలు సంధిస్తున్నప్పటికీ చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో మిన్నంటి జోష్‌తో చంద్రబాబు మళ్లీ ఇదే విశాఖపట్నంలో మూడో భాగస్వామ్య సదస్సుకు శ్రీకారం చుట్టారు. 2016-17 సంవత్సరంలో జరిగిన భాగస్వామ్య సదస్సు మంచి ఫలితాలను ఇవ్వడమే కాకుండా అప్పుడు జరిగిన ఎంఓయూలలో అత్యధికంగా 870కు పైగా ఎంవోయూలను సాధించడం, పెట్టుబడులను కూడా సుమారు రూ. 15 లక్షల కోట్ల రూపాయలు రాష్ట్రంకు వచ్చేలా చేసినట్లుగా ప్రభుత్వం చెబుతుంది. ఈ తొలి భాగస్వామ్య సదస్సుతో ఉపాధి కల్పన కూడా లక్షలాది మందికి కల్పించినట్లుగా పేర్కొంటున్న ప్రభుత్వం 2017-18 సంవత్సర భాగస్వామ్య సదస్సు కూడా అంతే విజయాన్ని సాధించింది. ఇటీవల చోటు చేసుకున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతోనూ, విడుదల చేసిన బడ్జెట్‌లో ఆంధ్రకు ప్రాధాన్యత లేకపోవడంతో మళ్లీ తెరపైకి వచ్చిన ప్రత్యేక హోదా నినాదంతో పాటూ ప్రత్యేక రైల్వే జోన్, పోలవరం ప్రాజక్టు, ఇతర ఆర్థిక లావాదేవీలతో కూడిన కేంద్ర ప్రభుత్వ వైఖరి, ఆ పార్టీతో మైత్రీ బంధం కలిగిన తెదేపా పరిస్థితిని పావుగా వినియోగించుకునే పనిలో పడ్డ ప్రతిపక్ష పార్టీల దూకుడు నేపథ్యంలోనూ 3వ భాగస్వామ్య ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహణ కేవలం మూడు రోజులే. తాత్కాలికమే. అయినా పక్కా ప్రణాళికాయుతంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మూడు లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 24వ తేదీన ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు ప్రారంభించే ఈ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరిగే మూడు రోజులూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తి స్థాయిలో విశాఖలోని ఈ వేదిక వద్దే ఉంటారన్న సమాచారం కూడా జరగబోయే సదస్సుల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతోందని అంటున్నారు. భాజపాతో మైత్రీ బంధం చెడిపోయి, సదస్సు నిర్వహణ సందేహాలను నివృత్తి చేస్తుందని కూడా తలపోస్తున్నారు.

మిత్రదేశంలో...

కెనడా ప్రధానికి దక్కని మోడీ కౌగిలి • ఎడముఖం పెడముఖంగా ఉభయ ప్రధానులు • ట్రూడోను పట్టించుకోని కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు • ఖలిస్తాన్ అంశమే విభేదాలకు ప్రధాన కారణం

అజ్ఞాతవాసి



న్యూఢిల్లీ: కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో భారత పర్యటన ఆసక్తికర చర్చకు దారితీసింది. శతాబ్దాల నాటి స్నేహం మౌనం దాల్చింది. విదేశీ ప్రధానికిచ్చే గౌరవ మర్యాదలూ, సాదర స్వాగతాలకు దూరంగా, కటుంబ సమేతంగా ఇండియాలో అజ్ఞాతవాసి మాదిరిగా పర్యటిస్తున్న వైనం చర్చనీయాంశమైంది. ట్రూడో పర్యటనను భారత ప్రభుత్వం విస్మరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక దేశ ప్రధాని, అందునా మనదేశంతో వందేళ్లుగా సత్సంబంధాలు కలిగివున్న కెనడా ప్రభుత్వ అధినేతకు మనమిచ్చే గౌరవం ఇదేనా? అన్న నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. భారత గడ్డపై కాలుమోపిన విదేశీ ప్రధానులు, అధ్యక్షులకు ఎదురేగి ఆత్మీయ ఆలింగనాలతో సాదరస్వాగతం పలికే నరేంద్ర మోడీ, ట్రూడో విషయంలో పూర్తి భిన్నంగా వ్యవహరించడం చర్చనీయాంశమైంది. కనీసం కేంద్రమంత్రులైనా ఆయన్ను సమీపించేప్రయత్నం చేయలేదు. ఫిబ్రవరి 17న నమస్తే అంటూ మన సంప్రదాయ పలకరింపుతో ట్రూడో ఢిల్లీలో అడుగుపెట్టారు. కానీ,



ఆయనకు మోడీ స్వాగతాలు కానీ, మోడీ ఆలింగనాలు కానీ లభించలేదు. పైపెచ్చు ఒక సహాయమంత్రిని విమానాశ్రయానికి పంపించి మొక్కుబడి స్వాగత ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రచారాలతో మోడీ బిజీగా ఉన్నాడని అనుకున్నా, కనీసం ట్వీట్ కూడా చేయక పోవడం గమనార్హం. ప్రపంచ దేశాధినేతలు వచ్చేటప్పుడు ట్విట్టర్ ద్వారా స్పందించే మోడీ, ట్రూడో పర్యటన గురించి ఒక్క మాట కూడా ట్వీట్ చేయలేదు. మొన్నటికిమొన్న జపాన్, ఇజ్రాయెల్ ప్రధానుల పర్యటన ఆసాంతం వెంటవుండి, వారికి మోడీ విశిష్ట తిథ్యం ఇచ్చారు. ప్రత్యేకంగా రోడ్ షో నిర్వహించి వారిని గౌరవించారు. ట్రూడో విషయంలో అందుకు భిన్నంగా వ్యవహరించడం అనేక సందేహాలను రేకెత్తిస్తోంది.

ఖలిస్థాన్ వ్యవహారమే కారణమా?

ట్రూడో కేంద్రం పట్టించుకోకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దీని వెనుక బలమైన కారణమే ఉందని అంటున్నారు. ప్రత్యేక ఖలిస్థాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోన్న సిక్కు వేర్పాటువాదులతో ట్రూడో సర్కారు అంటకాగుతోందని భారత్ భావిస్తోంది. అంతేకాదు కెనడాలో సిక్కు వేర్పాటువాదులు నిర్వహించిన ఖల్సా డే పరేడ్‌కు ట్రూడో హాజరుకావడం, అక్కడ గురుద్వారాల్లోకి భారత దౌత్య అధికారులను రానీయకపోవడం లాంటి సంఘటనలతో కేంద్రం గుర్రుగా ఉంది. సిక్కుల్లోని తీవ్రవాద శక్తులతో ట్రూడో సర్కారు అంటకాగుతోందని, వారికి పరోక్ష మద్దతు ఇస్తోందని ప్రధానితో పాటు పంజాబ్ ... సర్కారు క... డా భావిస్తోంది. ఈ కారణంగానే మోడీ ఆయనకు దూరంగా ఉన్నారని విశ్లేషకులు చెబుతున్నారు. పంజాబ్ ఖలిస్తాన్ ఉద్యమానికి కెనడా సిక్కుల్లో కొందరు మద్దతు ఇవ్వడాన్ని భారత్ జీర్ణించుకోలేకపోతోంది. ప్రత్యేక ఖలిస్థాన్ పేరుతో 1980లో కొందరు సిక్కు వేర్పాటువాదులు చేపట్టిన ఉద్యమం వల్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడమే కాదు నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు దారితీసింది. ఆమె మరణానంతరం చెలరేగిన అల్లర్లలో మూడువేల మంది సిక్కులు ఊచకోతకు గురయ్యారు. ఆ మరుసటి ఏడాది ముంబయి నుంచి ఎయిర్‌ఇండియా విమానంలో కెనడా చేరుకున్న ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఆ ప్రభుత్వం ఆశ్రయం కల్పించింది. ఈ ఘటనను కెనడా పార్లమెంటు 'మారణకాండ'గా అభివర్ణించింది. ఈ పరిణామాలన్నీ భారత్‌కు మింగుడు పడటంలేదు. ఈ కారణంగానే ట్రూడో పర్యటనకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులుగానీ పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు భారత ప్రభుత్వం తమ ప్రధానిని అవమానిస్తుదంటూ కెనడా పత్రికలు దుమ్మెత్తిపోస్తున్నాయి.



ముఖ్యమంత్రులూ ముఖం చాటేశారు!

ప్రధానమంత్రికే కాదు.. ముఖ్యమంత్రులు, మంత్రులు కూడా ట్రూడోకు స్వాగతం చెప్పేందుకు ముఖం చాటేశారు. విదేశీ ప్రధానమంత్రి తమ రాష్ట్రానికొస్తే గౌరవించాలన్న మర్యాదనూ పలువురు ముఖ్యమంత్రులు విస్మరించడం శోచనీయం. కెనడా ప్రధాని పర్యటన పర్యవేక్షణకు మంత్రులు కూడా దూరంగా ఉండిపోయారు. చివరకు జిల్లా స్థాయి అధికారులకు ట్రూడో పర్యటన బాధ్యతలను అప్పగించి మొక్కుబడి తంతును కానిచ్చేశారు. ప్రసిద్ధ తాజ్‌మహల్ సందర్శన సమయంలో కానీ, మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో సబర్మతి ఆశ్రమంలోకి అడుగుపెట్టినప్పుడు కానీ ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులెవరూ అటువైప కన్నెత్తికూడా చూడలేదు. సహజంగా ఎవరైన విదేశీ ప్రముఖులు గుజరాత్‌కు వస్తే, వారిని స్వయంగా గాంధీ ఆశ్రమయానికి తోడ్కొనివెళ్లి, అక్కడి విశేషాలను వివరించి చెప్పడం, వాళ్లతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చిన సందర్భాలు కోకొల్లలు. కానీ ఈ సారి ట్రూడో కుటుంబం ఒంటరిగానే పర్యటన కొనసాగించింది. భారత సంప్రదాయ దుస్తులు ధరించి పలు హిందూ ఆలయాలను దర్శించింది.

ట్రూడో సర్కారుకు.. సిక్కు ఓట్లే కీలకం

భారత సంతతి కెనడియన్లలో సిక్కులు అతిపెద్ద గ్రూపుగా ఉన్నారు. దాదాపు 15 లక్షల మంది సిక్కులు కెనడాలో నివాసం ఉంటున్నారు. ట్రూడో కేబినెట్‌లోని ప్రతి నలుగురు భారత సంతతి మంత్రుల్లో ఒకరు సిక్కు వ్యక్తే. మోడీ కంటే తనే ఎక్కువ మందికి కేబినెట్‌లో చోటిచ్చానని ట్రూడో బహిరంగంగా చెప్పడం ద్వారా సిక్కులకు తానిస్తున్న ప్రాధాన్యమేంటో చెప్పకనే చెప్పారు. తాజా పర్యటనలో పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ ట్రూడోతో భేటీ అయ్యారు. ఖలిస్తాన్ తీవ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం పట్ల అసంతృప్తిని, అభ్యంతరాన్ని తెలిపారు. కొద్దిరోజుల కిందట ఇండియా కొచ్చిన సిక్కు మంత్రులతో సమావేశం అయ్యేందుకు అమరీందర్ నిరాకరించారు కూడా. అందుకే ఈసారి ట్రూడో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఇదిలావుంటే, సిక్కులను ప్రసన్నం చేసుకునేందుకు, వారి ఓటు బ్యాంకు కోసమే ట్రూడో భారత పర్యటన చేస్తున్నాడన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.



భిన్నత్వంలో ఏకత్వం భారత్ ప్రత్యేకత



ఇండియా-కెనడాల మధ్య ఖలిస్తాన్ అంశం అడ్డుగోడగా ఉన్న సమయంలో, భారత ప్రభుత్వం ట్రూడో ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీని ఆశిస్తోంది. భారత ఐక్యతకు, సమగ్రతకు సంపూర్ణ మద్దతివ్వాలని డిమాండ్ చేస్తున్నది. సిక్కు వేర్పాటు వాదులను దూరంపెట్టాలని కోరుతోంది. కానీ ట్రూడో ప్రభుత్వం మాత్రం సిక్కుల వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనను అణచివేసేందుకు సిద్ధంగా లేమని చెబుతోంది. కాగా, భారత్ ప్రత్యేకతలను కెనడా ప్రధాని కొనియాడారు. బహుళత్వంలో ఏకత్వ విధానం విశిష్టమైనదని చెప్పుకొచ్చారు.

మహిళలు.. మానవతకు పొత్తిళ్ళు ప్రపంచాన్ని నిర్భయంగా ఎదుర్కోవాలి

కెనడా ప్రధాని భార్య సోఫీ గ్రెగొరి ట్రుడో

బాలికలు, మహిళలు మానవతకు పొత్తిళ్ళు.. వారు పూర్తి స్థాయి పౌరులుగా వ్యవహరించాలి. సమానత్వం కోసం సాగించే అన్వేషణలో మగవారు మన భాగస్వాములు అని కెనడా ప్రధాని భార్య సోఫీ గ్రెగొరి ట్రుడో పేర్కొన్నారు. షి విల్ గ్రో ఇన్‌టూ ఇట్ పేరిట ఆసియాలో అంతర్జాతీయ ప్రచార ప్రారంభ కార్యక్రమంలో భారతీయ మహిళలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. అనేక సాంస్కృతిక విశ్వాసాలు మహిళలను సమాజంలో కొంతమేరకే భాగస్వామ్యం వహించాలని లేదా కొన్ని సార్లు సంపూర్ణ ప్రాతినిధ్యం లేకుండా వ్యవహరించాలని ఆదేశిస్తుంటాయని, కానీ ఇకపై అలా జరగరాదని సోఫీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లో పటాన్ జిల్లాకు చెందిన 12 మంది విద్యార్థినులు కెనడా ప్రధాని భార్యతో ముచ్చటించారు. కవయిత్రి కావాలనే ఆకాంక్ష కలిగిన 11వ తరగతి విద్యార్థిని చెప్పిన మాటలకు ట్రుడో కదిలిపోయారు. భావోద్వేగంతో కన్నీరు చిందిస్తూ.. ఒక బాలికగా మీరు ఎదుగుతున్నప్పుడు ఎన్నింటినో ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీకు భయం కూడా వేస్తుంది. భయపడటం సర్వసాధారణం. అయితే ప్రపంచాన్ని ఎదుర్కొనేటప్పుడు మీరు తెగువ ప్రదర్శించాలి. నిర్భయంగా ఉండాలి అని సోఫీ వ్యాఖ్యానించారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో తెలంగాణకు పసిడి పంట

డల్లాస్ పోటీల్లో మూడు బంగారు పతకాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తైక్వాండో జాతీయ అకాడమీ ఏర్పాటు అంశంపై ముఖ్యమంత్రి కెసి ఆర్‌తో చర్చిస్తామని రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, పద్మారావు తెలిపారు. ఈ మేరకు టైక్వాండోకు తెలంగాణలో ఉన్న భవిష్యత్ అవకాశాలు, ప్రభుత్వపరంగా కావాల్సిన సహకారం, జాతీయ అకాడమీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు, 2024లో పారిస్, 2028లో లాస్ ఏంజిల్స్‌లోనూ జరగనున్న ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడం వంటి పూర్తి వివరాలతో ప్రతిపాదనలను క్రీడల మంత్రి పద్మారావుకు ఇవ్వాలని మంత్రి హరీష్ రావు అధి కారయంత్రాంగానికి సూచించారు. గురువారం జలసౌధలో అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులను మంత్రులు హరీష్‌రావు, పద్మారావులు సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ మాట్లాడుతూ టైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మూడు బంగారుపతకాలు సాధించడం గర్వకారణమన్నారు. ఈనెల 10,11 తేదీలలో అమెరికాలోని డల్లాస్‌లో ఈ పోటీలు జరిగాయి. మొత్తం 21దేశాలు పోటీల్లో పాల్గొనగా, 54కిలోల కేటగిరీలో కొండా సహదేవ్ (ముషీరాబాద్, హైదరాబాద్), 62-67కిలోల కేటగిరీలో అబ్దుల్ ఖలీల్ (నార్సింగ్, రాజేంద్రనగర్) 67-73కిలోల కేటగిరీలో కె.సింధు తపస్వి (పాల్వంచ, కొత్తగూడెం జిల్లా)లు బంగారు పతకాలు సాధించారు. గ్రాండ్‌మాస్టర్ జయంత్‌రెడ్డి కోచ్‌గా వ్యవహరించారు.



గోవర్ధనగిరిధారిగా యాదగిరి నృసింహుడు

యాదగిరికొండ, ప్రభన్యూస్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఐదవ రోజు ఆలయ అర్చకులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని గోవర్ధనగిరిధారిగా అలంకరించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాలు మారుమ్రోగుతుండగా...పారా యాణికులు పారా యాణాలను పఠిస్తుండగా బాలాలయంలో భక్తుల దర్శనార్థం ఊరేగించారు.

యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులు

ఖరీఫ్ నుండి పూర్తి ఆయకట్టు
జాప్యం చేసే ఏజెన్సీలపై చర్యలు తీసుకోండి
పాలమూరు ప్రాజెక్టులపై మంత్రి హరీష్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశించారు. వచ్చే ఖరీఫ్‌నాటికి నాలుగు ప్రాజెక్టులు పూర్తిచేసి నిర్దేశిత పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఆయన ఆదేశించారు. పాలమూరులోని కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ నాలుగు ప్రాజెక్టుల పురోగతిని గురువారం జలసౌధలో ప్యాకేజీల వారీగా సూక్ష్మస్థాయిలో సమీక్షించారు. శుక్ర,శనివారాల్లో రెండురోజుల పాటు పాలమూరు ఉమ్మడిజిల్లాలో పర్యటిస్తానని ప్రకటించారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టరేట్‌లో పాలమూరు ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తానన్నారు. పెండింగ్ భూసేకరణ, ఇసుకరీచ్‌ల సమస్యతో పాటు ఇతరత్రా సమస్యలన్నీ చర్చిస్తానన్నారు. నాలుగు ప్రాజెక్టులకు సంబంధించి ఇంకా భూసేకరణ పక్రియ పెండింగ్‌లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే భూసేకరణ పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించకుండా జాప్యం చేస్తున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ పాలమూరు ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తున్నారని, ఎప్పటికపుడు పనుల పురోగతిని తెలుసుకుంటున్నారన్నారు. నత్తనడకన పనిచేస్తున్న ఏజెన్సీలను గుర్తించి 60సి నిబంధన కింద టర్మినేట్ చేసి వేరే ఏజెన్సీలకు పనులు అప్పగించాలని ఆదేశించారు.



జూలైకి కల్వకుర్తి

కల్వకుర్తి నుండి నీటివిడుదల కొనసాగుతున్నందున గత మూడుమాసాలుగా నిర్మాణపనులకు అంతరాయం ఏర్పడిందని ఇరిగేషన్ ఇంజనీర్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నెలాఖరులో నీటివిడుదలను నిలిపి పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ మంత్రి కోరారు. కల్వకుర్తి లిఫ్ట్ 3లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని, 5వ పంపు బిగింపు పనులు వేగవంతం చేసి మార్చి చివరికల్లా పూర్తిచేయాలని హరీష్‌రావు ఆదేశించారు. లిఫ్ట్ 2 నుండి లిఫ్ట్ 3వరకు తవ్విన టన్నెల్‌లో 1.2కిమీ లైనింగ్ పనులను జూలై వరకు పూర్తిచేయాలని కోరారు. జూలై తర్వాత ఏజెన్సీలకు గడువు పెంచేది లేదన్నారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయల్‌సాగర్ ప్రాజెక్టుల కింద 5లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని మంత్రి హరీష్ తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలో 15వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశ్యంతో తలపెట్టిన చంద్రసాగర్ ఎక్స్‌టెన్షన్ కెనాల్ నిర్మాణ పనుల ఆమోదానికి ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్‌సి మురళీధర్, మహబూబ్‌నగర్ ప్రాజెక్టుల సిఈ ఖగందర్‌రావు, ఎస్ఈలు భద్రయ్య, రంగనాధరావు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణలో.. బాగుపడింది ఆ నలుగురే




• కేసీఆర్ పాలనతో ప్రజలకు ఒరిగిందేమి లేదు
• కాంగ్రెస్ సేవాదళ్ సమ్మేళనలో కార్యకర్తలకు రాష్ట్ర ఇంచార్జ్ కుంతియా పిలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆరు దశాబ్ధాల పోరాటానికి స్వస్తి పలుకుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాకు ఈసారి విజయం సాధించి కానుకగా ఇవ్వాలని ఎఐసిసి కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ రామచంద్రకుంతియా అన్నారు. బంగారు తెలంగాణలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కెసిఆర్ కుటుంబం మాత్రమే బంగారంగా మారిందన్నారు.

ప్రవాస భారతీయులను ఆదుకోవాలి

కువైట్ ప్రకటించిన అమ్నెస్టీ పథకం నేపథ్యంలో ప్రవాస భారతీయులకు సహాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ రామచంద్ర కుంతియా అన్నారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి వి. హనుమంతరావు, తెలంగాణ పిసిసి ప్రవాస భారతీయుల కన్వీనర్ వినోద్‌కుమార్, మంద భీంరెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. అక్కడ చిన్న చిన్న కార ణాలతో జైళ్ళలో మగ్గుతున్న వారిని, విచా రణ ఎదుర్కొంటున్న వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.ఎ ఖాన్, మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ, ఉప నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపి వి. హనుమంతరావు, పిసిసి కోశాధికారి గూడూరి నారాయణరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎం. కోదండరెడ్డి, సేవాదళ్ కన్వీనర్ కనుకుల జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ వైఫల్యాలే ఎజెండాగా యాత్రలు



పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళైనా కెసిఆర్ ప్రభుత్వం ఏ హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపైనే పిసిసి ఈ నెల 26 నుంచి యాత్రలను నిర్వహిస్తోందని, ప్రజలను చైతన్యం చేయడమే యాత్రల ప్రధాన ఉద్దేశ్యమన్నారు. యాత్రలో సేవాదళ్ కార్యకర్తలు ప్రధాన భూమికను పోషించాలన్నారు. దళితులకు మూడెకరాల భూమిని ఇస్తామన్న కెసిఆర్ మాట తప్పారని, అర్హులైన వారందరికీ భూమిని ఇవ్వని ప్రభుత్వం ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 15లక్షలు చెల్లించాలన్నారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిల డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇందుకోసం వచ్చేబడ్జెట్‌లో కేటాయింపులు జరపాలన్నారు.

రోబో కప్ పోటీలకు జైశ్వాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటర్నేషనల్ రోబో కప్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 18 నుంచి 22 వరకు కెనడాలో జరుగనున్న టోర్నమెంట్‌కు అర్నవ్ జైశ్వాల్ ఎంపికయ్యాడు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఇండియన్ రోబో కప్ టోర్నీలో అద్భుతంగా రాణించి బంగారు పతకం సాధించాడు. ఇంటర్నేషనల్ రోబ్ కప్ టోర్నీకి ఎంపిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. గురువారం శాట్స్ ఛైర్మన్ కార్యాలయంలో అర్నవ్ జైస్వాల్‌ను ఘనంగా సన్మానించారు. ఇంటర్నేషనల్ రోబో కప్ టోర్నీలో రాణించాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే ట్రాఫిక్ నియంత్రణ వంటి పనులు రోబోలు చేస్తున్నాయని పేర్కొంటూ, జపాన్, అమెరికా వంటి దేశాలలో విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి అక్కడ కేజీ నుండే రోబోలపై శిక్షణ ఇచ్చి సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తారని తెలియజేస్తూ, ఇటువంటి పద్ధతిని మన దేశంలో కూడా అమలు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్ జైస్వాల్, సంజయ్ కుమార్ జైస్వాల్, రాజు యాదవ్ పాల్గొన్నారు.



టీఎన్జీవో మహిళా క్రీడల పోస్టర్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఎన్జీవో కేంద్ర సంఘం, మహిళా విభాగం వారి అధ్వర్యంలో 27 నుండి ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న క్రీడా పోటీలు-2018 పోస్టర్‌ను శాట్స్ ఛైర్మన్, అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్, చెస్, క్యారమ్స్, టగ్-అఫ్-వార్, నీడిల్ త్రేడ్, టెన్నికాయిట్, మ్యుజికల్ ఛైర్స్, వాటర్ పాట్ వాకింగ్, లెమన్ స్పూన్ మొత్తం 13 క్రీడా విభాగాలలో తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల నుండి 400 మంది టీఎన్జీవో కేంద్ర సంఘం మహిళా ఉద్యోగుల క్రీడాకారులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ళ రాజేందర్, కన్వీనర్ ఆర్.విజయలక్ష్మి, ఛైర్‌పర్సన్ బి.రేచల్, కో-కన్వీనర్ మనోహర, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి కె. వనజ రెడ్డి, హైదరాబాద్ కోశాధికారి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'నాగం చేరికను వ్యతిరేకిస్తాం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్న బిజెపి సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డికి అప్పుడే సహాయ నిరాకరణ మొదలైంది. నాగం చేరికను తీవ్రంగా వ్యతి రేకిస్తున్నామని, ఆయనను చేర్చుకోవద్దని పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి కూడా స్పష్టం చేసి వచ్చామని ఎంఎల్‌సి దామోదర్‌రెడ్డి చెప్పారు.



సీఎంకు గవర్నర్ పరామర్శ

ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గురువారంనాడు గవర్నర్ నర్సింహన్ పరామర్శించారు. సోదరి మృతితో విషాదంలో ఉన్న సీఎం కేసీఆర్‌ను ఆయన ప్రగతి భవన్‌లో కలిశారు. బుధవారంనాడు సీఎం రెండో సోదరి పివిమలాబాయి సోమాజిగూడలోని యశోదా ఆస్పత్రిలో కన్ను మూసిన సంగతి తెలిసిందే. తిరుమలగిరిలోకి స్వర్గ్ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు బుధవారమే జరిగాయి. ఈ నేపథ్యంలో తీవ్రంగా కలత చెందిన ముఖ్యమంత్రిని గురువారం గవర్నర్ కలిసి పరామర్శించారు.

మహిళా విశ్వవిద్యాలయంగా..
కోఠి ఉమెన్స్ కాలేజ్!

- సీఎం ఆమోదంతో వచ్చే ఏడాది నుంచి ప్రారంభం
- వర్శిటీగా మార్చడానికి వసతులున్నాయి
- నెలరోజుల్లో నివేదికివ్వండి
- ఉప ముఖ్యమంత్రి కడియం



ఉమెన్స్ కాలేజీ విద్యార్థినితో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, అధికారులు.

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కోఠిలో ఉన్న మహిళా కళాశాలను తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా మార్చడానికి అన్ని వసతులు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆమోదంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి కోఠి ఉమెన్స్ కాలేజీని తెలంగాణ మహిళా యూనివర్సిటీగా మార్చుతామని మంత్రి తెలిపారు. గురువారం మంత్రి కోఠి ఉమెన్స్ కాలేజీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంత్రితో పాటు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ఎస్ రామచంద్రం, రిజిస్ట్రార్ ఎస్ గోపాల్‌రెడ్డి, కోఠి ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రశాంత్ ఆత్మ తదితరులు పాల్గొన్నారు.

కోఠి ఉమెన్స్ కాలేజీ సుమారు 40 ఎకరాల్లో విస్తరించి ఉందని కడియం శ్రీహరి తెలిపారు. కాలేజీలో ప్రస్తుతం 42 డిగ్రీ, పీజీ కోర్సులు కొనసాగుతున్నాయని అన్నారు. కాలేజీలో మంచి వాతావరణం ఉంటుందని చెప్పారు. బోధనావసతులు బాగున్నాయన్నారు. కాలేజీలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచే కాకుండా విదేశాలకు చెందిన విద్యార్థినులు కూడా విద్యను అభ్యసిస్తున్నారని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకటే మహిళా యూనివర్సిటీ ఉండేదని, అది కాస్త విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు ప్రత్యేకంగా ఒక మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, అందుకు తగిన సాయం చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్‌జవదేకర్‌ను కోరామని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీకు అవసరం అయిన వసతులు అన్ని కోఠి ఉమెన్స్ కాలేజీలో ఉన్నాయని గుర్తించినట్టు చెప్పారు. ఈ విషయాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన అనుమతితో వచ్చే విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంగా మార్చే ప్రయత్నం చేస్తామన్నారు. నెల రోజుల్లో మహిళా విశ్వవిద్యాలయం ప్రారంభించడానికి కావల్సిన మౌలిక వసతులు, సదుపాయాలపై స్పష్టమైన నివేదికను ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ రూ. 200 కోట్లను కేటాయించారని అందులో రూ. 37 కోట్లను కోఠి ఉమెన్స్ కాలేజీకి కేటాయించినట్టు చెప్పారు. ఆ నిధుల ద్వారా జరుగుతున్న మరమ్మత్తు పనులను మంత్రి పరిశీలించారు.

మిర్చిధర ఘాటు!

- రైతుల ఆందోళన
- అధికారులతో చర్చలు
- రేటు పెంపునకు అంగీకారం
- కొనుగోళ్లు యధాతథం

ఖమ్మం, ప్రభ న్యూస్ సిటీ బ్యూరో : ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డులో జెండా పాట ప్రకారం రేటు అమలు చేయకపోవడంతో వ్యాపారుల తీరును నిరసిస్తూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెండా ప్రకారం ఖరారైన రేటు అమలు చేయాలని ఒక్క సారిగా రైతులంతా మూకుమ్మడిగా మార్కెట్‌లో ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మిర్చి సీజన్ ఊపందుకోవడంతో గురువారం ఒక్కరోజే మార్కెట్‌కు 50వేల బస్తాలకు పైగా ఎండు మిర్చి వచ్చింది. రోజువారీగా జెండా పాట నిర్వహించగా, రూ.9,700చొప్పున క్వింటా రేటు ఖరారైంది. అయితే వ్యాపారులు ఆ రేట్‌ను అందరు రైతులకు వర్తింపచేయకుండా నామమాత్రంగా రేట్‌ను ఖరారు చేసి మిగిలిన మిర్చి బస్తాల లాట్‌లకు రూ.7,500ల నుండి 8,900ల వరకు మధ్యస్తంగా కొనుగోళ్లు చేయడంతో రైతుల ఆగ్రహానికి దారి తీసింది. జెండా రేటుకు కొంచెం అటు, ఇటు రేట్ల తో కాకుండా రూ. 2వేలకు పైగా తగ్గించి బేరాలు చేస్తుండడంతో రైతులు వ్యాపారులను నిలదీశారు. రైతులంతా మార్కెట్ మెయిన్ గేట్, ప్రధాన కార్యాలయం వద్దకు చేరి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. దీంతో మార్కెట్‌లో వ్యాపారులంతా కొను గోళ్లను నిలిపివేసి వెళ్ళిపోయారు. రైతుల ఆందోళన విషయం తెలియడంతో సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పొన్నం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాదినేని రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా నాయకులు తోటకూర శివయ్య తదితరులు మార్కెట్ కు చేరి రైతులకు జరుగుతున్న అన్యాయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మద్దతుగా ఆందోళన చేపట్టారు. మార్కెట్ డీఎంవో ఆర్.సంతోష్‌కుమార్, మార్కెటింగ్ సిబ్బంది చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోగా పరిస్థితి ఉద్రిక్తంగా ఉండడంతో భారీగా పోలీసు బలగాలు మార్కెట్‌కు చేరి బందోబస్తు చేపట్టారు. ఖమ్మం ఆర్డీవో టి.పూర్ణచంద్ర, అర్బన్ తహసీల్దార్ శ్రీలత, అదనపు డీసీపీ కె.సురేష్‌కుమార్, రూరల్ ఏసీపీ పీ నరేష్‌రెడ్డి, పలువురు సీఐలు వెంకన్న బాబు, తిరుపతిరెడ్డి, నాగేంద్ర చారి మార్కెట్‌లో తిరిగి పరిస్థితిని సమీక్షించారు. వ్యాపారులంతా తమ ఫోన్‌లను స్విచ్ ఆఫ్ చేయడంతో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి గుడవర్తి శ్రీనివాసరావు, కురువెళ్ళ ప్రవీణ్, మిర్చి శాఖ బాధ్యులు మెంతుల శ్రీశైలం, గీతా వెంకన్న, తూములూరి లక్ష్మీనర్సింహారావు, నున్నా కోదండ రాములు తదితరులతో మార్కెట్ చాంబర్‌లో చర్చలు జరిపారు. రెండు గంటల పాటు జరిపిన చర్చల అనంతరం బలవంతంగా వ్యాపారులను ఒప్పించి రూ.8, 900లకు దిగువన తక్కువ రేట్లతో కొనుగోలు చేసిన మిర్చికి రూ.200చొప్పున ఒక్కో క్వింటాకు అదనంగా వ్యాపారులు చెల్లించే విధంగా ఒప్పించి మధ్యాహ్నం 2.30 గంటల నుండి కాటాలు పెట్టించి కొనుగోళ్లు చేయించడంతో రైతులు ఆందోళన విరమించారు.



మార్కెట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం.



భారీగా కందులు స్వాధీనం

- బయటపడ్డ అధికారులు, వ్యాపారుల అక్రమ దందా
- ప్రభుత్వ గోదాముల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 2వేల కింటాళ్ల కందులు స్వాధీనం

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : మార్క్ ఫెడ్ అధికారుల, వ్యాపారుల అక్రమాలు బయటపడ్డాయి. వ్యాపారులు మార్క్ ఫెడ్ అధికారులతో కుమ్మక్కై ఇతర ప్రాంతాలనుంచి అక్రమంగా తీసుకువచ్చిన కందులను ఏకంగా ప్రభుత్వ గోదాముల్లోనే నిలువ ఉంచి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రభుత్వ గోదాముల్లో కందుల అక్రమ నిలువలు ఉన్నాయని సమాచారం అందడంతో బుధవారం రాత్రి అధికారులు ప్రభుత్వ గోదాములపై దాడులు నిర్వహించి రెండువేల క్వింటాళ్ల కందుల నిలువలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ దందా బయటపడకుండా వ్యాపారస్థులు మార్క్ ఫెడ్‌కు చెందిన సంచుల్లోనే కందులు నింపి మార్కెట్ యార్డులో ఉన్న నాలుగు గోదాముల్లో నిలువ ఉంచారు. అయితే అధికారులు దాడులు జరిపి అక్రమ కందులను స్వాధీనంచేసుకున్నారు. గురువారం జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి మార్కెట్ యార్డును సందర్శించి అక్రమంగా కందులు నిలువ చేసిన గోదాములను పరిశీలించారు. అనువణువున తనిఖీ చేశారు. మార్కెడ్ అధికారులు తమకేమి తెలియదని మార్క్ ఫెడ్ అధికారులు నిలువ ఉంచారని అక్రమ నిలువలతో సంబంధం లేదని చేతులెత్తేశారు. మార్క్ ఫెడ్ అధికారులు మాత్రం బిన్న కథనాలు వినిపిస్తున్నారు. తమ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారు. రైతులే గోదాముల్లో నిలువ ఉంచారని చెపుతున్న మార్క్ ఫెడ్ అధికారులు రైతుల పేర్లు మాత్రం వెల్లడించలేదు. దీంతో మార్క్‌ఫెడ్ అధికారులు వ్యాపారస్థులు కుమ్మక్కై అక్రమంగా కందులు నిలువ చేశారని అధికారులు నిర్ధారణకు వచ్చారు. రూ. కోటి కి పైగా విలువ గల కందులను స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి. మహారాష్ట్ర నుంచి అక్రమంగా కందులను ఇక్కడి వ్యాపారులు తీసుకువచ్చి మార్క్‌ఫెడ్‌కు విక్రయిస్తున్నారు. అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి అక్రమ కందులను స్వాధీనం చేసుకుంటున్నప్పటికి వ్యాపారుల అక్రమ దందా ఆగలేదు. గురువారం భారీ ఎత్తున కందులు స్వాధీనంచేసుకోవడంతో తీవ్ర సంచలనం నెలకొంది.



టీఎంఆర్ పాఠశాలలో
తొలి రోబోటిక్స్ ల్యాబ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం మెరుగైన విద్యను అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా తొలి రోబోటిక్స్ ల్యాబ్‌ను సైదాబాద్‌లోని టిఎంఆర్ స్కూల్ బాలల పాఠశాలల్లో నెలకొల్పారు. ఇంజనీరింగ్ స్కిల్స్‌పై నైపుణ్యం పెంచడం కోసం దీనిని ఏర్పాటు చేశారు. దీనిని గురువారంనాడు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, టిఎంఆర్‌ఈఐఎస్ వైస్ చైర్మన్, అధ్యక్షుడు ఏ.కె. ఖాన్ ప్రారంభించారు. మెకానికల్, ప్లబింగ్, ఎలక్ట్రికల్,కార్పెంటరీ, రోబిటిక్స్ తదితర అంశాలల్లో విద్యార్థులు నేర్చుకునే అవకాశాన్ని కల్పించారు.

ఆదిలాబాద్ మునిసిపల్ డిప్యూటీ ఈఈ ఇంట్లో ఏసీబీ సోదాలు



ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : ఏసీబీకి మరో అవినీతి తిమింగలం చిక్కింది. అక్రమ ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదుతో ఆదిలాబాద్ మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొండల్ రావ్ ఇంట్లో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో ఆదిలాబాద్, వరంగల్, కొత్తగూడెంలలో ఆయన ఇళ్లపై ఏసీబీ అధికారులు దాడులుచేసి అక్రమ ఆస్తులు గుర్తించినట్లు సమాచారం. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో నివాసముంటున్న మున్సిపల్ డిప్యూటీ ఇఇ కొండల్ రావ్ ఇంటిపై ఉదయం 5.30 గంటలకు చేరుకున్న ఏసీబీ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఆయన ఇంట్లో రూ.రెండు లక్షల 60వేల నగదును, 13 తులాల బంగారం, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. మూడు చోట్ల జరిగిన సోదాల్లో సుమారు ఆరుకోట్లకు పైగా అక్రమ ఆస్తులున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

'కార్మికుల హక్కులను కాలరాసేందుకే ప్రైవేటీకరణ కుట్ర'

మందమర్రి, ప్రభన్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు గనులను ప్రవేటీకరణ చేపట్టి కార్మికుల హక్కులను కాల రాసేందుకే కుట్రలు పన్నుతున్నాయని ఎస్‌సిడబ్ల్యూయు ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. ఏఐటియుసి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు అనేక పోరాటాలు చేశారని, మరో సారి మోదీ ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు బిల్లు తీసుకురావడం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. నైజాం కాలంలో బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శేషగిరి రావు లాంటి మహనీయుల సారథ్యంలో ఉద్యమాలు చేపట్టి విరమింపజేశామని అన్నారు. అప్పటి ప్రధానులు ఇందిరాగాంధీ, పి.వి.నర్సింహారావులు సంస్కరణల పేరుతో గనుల ప్రైవేటీకరణకు మొగ్గు చూపినా కార్మికులు చేపట్టిన ఉద్యమాల ఫలితంగా విరమించుకున్నాయని అన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల ధనదాహం
కడుపు కోత



- అవసరం లేకున్నా సిజేరియన్లు
- ప్రభుత్వాసుపత్రుల పనితీరు అంతంత మాత్రం
- దీంతో ప్రైవేటు ఆసుపత్రుల నిలువుదోపిడీ
- ఆంధ్రప్రదేశ్‌లో 40 శాతం పైనే
- భారంగా మారిన వైద్య ఖర్చులు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రసవం అంటే కోతే అన్న భావన సర్వసాధారణమైంది. రాష్ట్రంలో ప్రతి ఇద్దరిలో ఒకరికి సిజేరియన్ ఆపరేషన్‌లు జరుగుతున్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. కేంద్ర గణాంకాలు తెలుగు రాష్ట్రాల్లో కోత ప్రసవాలు దేశంలో మిగిలిన రాష్ట్రాల్లో కన్నా అత్యధికంగా జరుగుతున్నాయని వెల్లడించాయి. దేశ సగటు సిజేరియన్ ప్రసవాల రేటు 17.2 శాతం ఉంది. ఈ జాతీయ సగటు కంటే రెండున్నర రెట్లు అంటే 40.1 శాతం అధికంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వైద్యో నారాయణ హరి... అనే ఆర్యోక్తి భిన్నంగా వైద్యులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రులలోనే ప్రసవాలు జరగాలని ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ప్రయోజనం మాత్రం శూన్యం. ప్రభుత్వం ఒకవైపు మాతా శిశు మరణాల తగ్గింపునకు ఆసుపత్రిలో ప్రసవాలకు ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు నమ్మకాన్ని కలిగించలేకపోతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు నిలువుదోపిడీ చేస్తున్నాయి. సాధారణ ప్రసవాన్ని సైతం సిజేరియన్ చేస్తూ డబ్బులు దండుకుంటున్నాయి. ఇదిలావుంటే మరికొందరు జాతకాల పిచ్చితో నక్షత్రం, తిథి చూసుకుని ఆ సమయంలోనే సిజేరియన్‌లు చేయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రుల కాసుల దందాకు హద్దు, అదుపు లేకుండా పోయింది. పెద్ద సంఖ్యలో సిజేరియన్ కాన్పులు జరగడంపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి 2005లో నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ 3వ సర్వేలో దేశంలో సగటును 8.5 శాతం మాత్రమే సిజేరియన్ కాన్పులు జరుగుతున్నట్లు తేలింది. అయితే ఈ పదేళ్ల కాలంలో ఈ కాన్పుల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. 2015లో నిర్వహించిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ 4వ సర్వేలో ఇది 17.2 శాతానికి ఎగబాకింది. ఇక తెలుగు రాష్ట్రాల పరిస్థితి మరింత ఘోరంగా తయారయింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాల్లో సైతం ప్రసవాల్లో సిజేరియన్ 10 శాతం దాటకపోవడం గమనార్హం. నాగాలాండ్‌లో అతి తక్కువగా 5.8 శాతమే సిజేరియన్ కాన్పులు నమోదయ్యాయి. అదే సమయంలో వైద్య రంగంలో ముందున్నట్లు చెప్పుకొనే తెలుగు రాష్ట్రాలు సహా దక్షిణాదిలోని తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర కత్తెర కాన్పులు జాతీయ సగటు కంటే ఎంతో అధికంగా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో సిజేరియన్ ప్రసవాల రేట 10 శాతం మించితే మాత్ర, శిశు మరణాల రేటు తగ్గించడం సాధ్యపడదని మూడేళ్ల కిందట ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్‌ను హెచ్చరించింది. పలు రాష్ట్రాల్లో సిజేరియన్ ఆపరేషన్‌ల సగటు 30 శాతం దాటడంతో అప్పట్లో ఈ సంస్థ అప్రమత్తం చేసింది. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సూచనలు, హెచ్చరికలను కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులు, మిషన్ డైరెక్టర్లకు అందించింది. సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు కృషి చేయాలని సూచించింది. అయితే వైద్యుల ధన దాహంతో మహిళలు కడుపుకోతలు కొనసాగుతునే ఉన్నాయి. అవసరం ఉన్నా లేకపోయినా ప్రసవం కోసం వచ్చిన వారికి ప్రైవేట్ ఆసుపత్రులు కడుపు కోతనే ఎంచుకుంటున్నాయి. బిడ్డ అడ్డం తిరిగిందనో, కాన్పు కష్టంగా ఉంది పెద్ద ప్రాణానికే ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందని వైద్యులు గర్భిణీ బంధువులను భయాందోళనకు గురిచేస్తున్నారు. సాధారణంగా ప్రసవం జరిగే అవకాశం ఉన్నా ఇదే పద్ధతి వ్యవహరిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సిజేరియన్‌కు ఒప్పుకుంటే ఆసుపత్రి నుంచి తల్లీబిడ్డ బయటకు వచ్చేసరికి వేల రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో సగటు జీవి ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమవుతోంది. ఇలా ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రసవం కోసం వెళ్లిన వారిలో అధిక భాగం కోతలే ఉంటున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాల్లో అత్యధిక భాగం సాధారణంగా కావడం చూస్తే పరిస్థితి ఏమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ ఆసుపత్రులలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం గమనార్హం.

కాన్పు కేసు వస్తే చాలు ప్రైవేట్ వైద్యశాలలకు కాసుల వర్షం కురిసినట్లే. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రసవం కోసం కేసులను పంపించేందుకు పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రైవేట్ ఆసుపత్రులు ఆర్‌ఎంపీ వైద్యులు, ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న కొందరిని ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. ఆయా ఏరియాలో ఉండే గర్భిణులను ప్రసవం కోసం ప్రైవేట్ వైద్యశాలలకు పంపిస్తు కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారు. మరికొంత మంది మూఢనమ్మకాలతో మంచి నక్షత్రం, సమయంలో ప్రసవం జరిగితే బిడ్డ జాతకం బాగుటుందనే ఆశతో ప్రసవం సాధారణంగా అయ్యే అవకాశం ఉన్నా సిజేరియన్ వైపు మొగ్గు చూపుతున్నారు. నక్షత్రం, తిథి, సమయం చూపించి మరి ఆ సమయంలో ప్రసవం అయ్యే అవకాశం లేకపోతే సిజేరియన్ చేయిస్తున్నారు. ఒక వేళ ప్రసవం ముందుజరిగే అవకాశం ఉంటే నొప్పులు రాకుండా మందులు వాడుతున్నారు. అవసరం ఉన్నా లేకపోయిన ఆపరేషన్ చేయించడం వల్ల మహిళల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు ప్రోత్సాహాలు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రోత్సాహాలు అందిస్తున్నా, ప్రజలు మాత్రం ప్రైవేటు ఆసుపత్రులవైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ కోసం అనేక పథకాలను అమలు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు జరుగుతున్న జాతీయ ఆరోగ్యమిషన్ పథకం కింద ఏటా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం బేబి కిట్స్, పౌష్టికాహారం అందిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం ఉచితంగా నిర్వహించడంతో రూ.6 వేల వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. బిడ్డను తల్లిని క్షేమంగా ఇంటికి చేర్చేందుకు తల్లి బిడ్డా ఎక్స్‌ప్రెస్ వాహనాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

కాపులకు జాబ్ గ్యారంటీ శిక్షణ

- ఏపీలో 20 వేల మందికి నైపుణ్య శిక్షణ - ఉద్యోగం
- హైదరాబాద్-చెన్నైలోని ఇనిస్టిట్యూట్‌లతో ఒప్పందాలు
- ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ ఎండీ శివశంకర్

అమరావతి, ఆంధ్రప్రభ : కాపు సామాజికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. అందులో భాగంగా చదువుకున్న ప్రతి కాపు, తెలగ, బలిజ,ఒంటరి సామాజికవర్గానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు జాబ్ గ్యారంటీ ఇస్తూ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల మంది కాపు నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా ప్రభుత్వం భారీ కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన చేసి,అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పలు సంస్థలతో ఈమేరకు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. జాబ్ గ్యారంటీ పద్ధతిలో ఈ ఒప్పందాలు జరిగాయి.కాపు సామాజిక వర్గంలో నిరుద్యోగ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఉపాధి కల్పించడంతో పాటు వారిలో సంపూర్ణ నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేకించి, శిక్షణా కార్యక్రమాలు కూడా చేపట్టబోతున్నది. కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజిక వర్గాలకు చెందిన 20వేల మందికి ఉద్యోగాలు ఇప్పించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం రాష్ట్రంతో పాటు హైదరాబాద్,చెన్నైలలోని 50 ఇనిస్టిట్యూట్‌లతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. వీటిల్లో నిరుద్యోగులకు కొత్త తరహాలో శిక్షణ కార్యక్రమాలుండేలా చర్యలు తీసుకుంటున్నారు.చదువు తగ్గట్టు శిక్షణ ఇచ్చి, ఉద్యోగం గ్యారంటీ ఇస్తున్నారు. అయితే ఈ తరహా శిక్షణ తీసుకునే వారు ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారై ఉండాలి. అంతే కాకుండా వారి వార్షికాదాయం సంవత్సరానికి రూ.6వేలు మించకూడదు. ఇంకా అభ్యర్థి నిరుద్యోగై ఉండాలి. గతంలో ఈ తరహా శిక్షణ పొంది ఉండ కూడదని నిబంధన విధించారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు అభ్యర్థులకు పూర్తిగా ఉద్యోగాలు ఇచ్చిన తర్వాతనే వాటికి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవడం గమనార్హం.

శిక్షణ తీసుకుంటున్న సమయంలో నెలకు రూ. 5వేలు ఉపకారవేతనంగా చెల్లిస్తారు. 5 తరగతి చదివిన వారికి కుట్టు మిషన్‌లో శిక్షణ ఇస్తారు. పదో తరగతి అభ్యర్థులకు టెలికాం టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, ఆటో మోటివ్ సేల్స్ అండ్ సర్వీస్, ఒఎఫ్‌సీ టెక్నీ షియన్, టెక్స్‌టైల్ డిజైనర్, ఎల్ ఈడీ టెక్నీషియన్, బ్యూటీ స్పా కోర్సు, హాస్పిటాలిటీ కోర్సు, పూర్తి వివరాలకు 733117 4453 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఇప్పటికే 1600 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు.

రహదారుల నిధుల సేకరణ ఎలా?



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో చేపట్టనున్న రహదారుల నిర్మాణాలకు నిధుల సేకరణపై రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఈ శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇంజినీర్ ఇన్ చీఫ్ రవీందర్‌రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, కెనడాకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ రహదారుల అభివృద్ధి పథకం (ట్రాక్) ద్వారా రాష్ట్రంలోని 31 జిల్లాలను కలుపుతూ 3,963 కి.మీ. కొత్తగా చేపట్టాలని నిర్ణయించారు. ఈ రహదారుల నిర్మాణానికి గానూ నిధుల సేకరణ, బ్యాంకులతో రుణం తీసుకోవడం తదితర అంశాలపై చర్చించారు.

ఎన్నికల బాండ్లు వచ్చేశాయ్

- మార్చి1 నుంచి 10 వరకు అమ్మకాలు
- ఎస్‌బీఐ బ్రాంచీల్లో అందుబాటు
- కొనుగోలు తేదీ నుంచి 15 రోజులకే చెల్లుబాటు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: రాజకీయ పార్టీలకు ఇక విరాళాలు కొత్త మార్గంలో రానున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్స్ అమ్మకానికి సిద్ధమయ్యాయి. మార్చి 10వ తేదీ నుంచి ఎలక్టోరల్ బాండ్స్ ను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించిన నాలుగు శాఖలలో ఎలక్టోరల్ బాండ్స్ ను అందుబాటలో ఉంచనున్నారు. దేశంలోని నాలుగు మెట్రో నగరాలలో వీటిని తొలిదశలో అమ్మేందుకు ఏర్పాట్లు చేశారు. చెన్నైలోని ఎస్‌బిఐ చెన్నై మెయిన్ బ్రాంచీ, ఎస్‌బిఐ కోల్‌కతా ప్రధాన శాఖ, ఎస్‌బిఐ ముంబయి మెయిన్ బ్రాంచీ, ఎస్‌బిఐ న్యూఢిల్లీ ప్రధాన శాఖలలో ఎలక్టోరల్ బాండ్స్ ను అమ్ముతారు. జనవరి 2వ తేదీనే కేంద్రప్రభుత్వం గెజిట్ ద్వారా ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని నోటిఫై చేసింది. దేశంలోని పౌరులుగానీ, సంస్థలుగానీ వీటిని నేరుగా కొనుగోలు చేయవచ్చు. వ్యక్తిగతంగా, ఉమ్మడిగా కూడా బాండ్స్‌ను కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం కింద రిజిస్టరై, లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఒకశాతం ఓట్లు సాధించిన రాజకీయ పార్టీలకు మాత్రమే ఈ ఎలక్టోరల్ బాండ్స్ ను తీసుకునే అధికారం కల్పించారు. అధీకృత బ్యాంకు ఖాతా ద్వారానే ఈ బాండ్స్‌ను రాజకీయ పార్టీలు నగదుగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఎలక్టోరల్ బాండ్స్‌ను జారీ చేసే అధికారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన నాలుగు శాఖలకు అప్పగించారు. మార్చి 1వ తేదీ నుంచి మార్చి 10 వరకు ఎలక్టోరల్ బాండ్స్ ను ఆయా శాఖాలలో అమ్మనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఎస్‌బిఐ శాఖలలో కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్స్ 15రోజుల పాటే చెల్లుబాటు అవుతాయి. గడువు ముగిసన తర్వాత వీటిని రాజకీయ పార్టీలు తమ ఖాతాల్లో డిపాజిట్ చేస్తే చెల్లవని కేంద్రం స్పష్టం చేసింది. అర్హత కలిగిన రాజకీయ పార్టీ గడువులోగా ఎలక్టోరల్ బాండ్స్ ను తమ బ్యాంకు ఖాతాలలో జమ చేసిన వెంబడే అదే రోజున నగదుగా మారుతాయి.

ఎలక్టోరల్ బాండ్స్‌పై వివాదాలు

రాజకీయ పార్టీలకు కొత్త మార్గంలో ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా నిధులు సమకూర్చు కనే మార్గాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీని వల్ల రాజకీయ పార్టీలకు వచ్చే నిధులలో పారదర్శకత ఉంటుందని ప్రభుత్వం వాదన. అయితే దీనితో సీపీఎం విభేదిస్తోంది. ఎలక్టోరల్ బాండ్స్ తో మరింత రాజకీయ అవినీతి పెరుగుతుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అంటు న్నారు. కార్పొరేట్ సంస్థలు పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేసి రాజకీయ పార్టీలలో పెట్టుబడులు పెడతాయని ఆరోపిస్తున్నారు. ఈ వివరాలు బయటికి వెల్లడయ్యే అవకాశం లేకపోవడం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుందని అంటున్నారు. తమకు అనుకూల విధానాల కోసం కార్పొరేట్ సంస్థలు ఆయా రాజకీయ పార్టీలలో ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో పెట్టుబడులు పెడతాయన్నారు.



రజనీతో రహస్య భేటీ నిజమే: కమల్



చెన్నై : తమిళనాడులో రోజురోజుకూ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. తన శ్రేయోభిలాషి, మిత్రుడు రజనీకాంత్‌తో రహస్యంగా భేటీ అయినట్టు ప్రముఖ సినీ నటుడు, రాజకీయ నాయకుడు కమల్‌హాసన్ అంగీకరించారు. రాజకీయ రంగప్రవేశంలో భాగంగా ఎలా ఉండాలి..? ఏవిధంగా హుందా గా వ్యవహరించాలనే అంశాలపై చర్చించినట్టు కమల్ వివరించారు. తన పార్టీ పేరును మక్కల్ నీతి మయ్యం అని మధురైలో కమల్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన వీక్లి మ్యాగజైన్ ఆనంద వికాతన్‌లో రహస్య భేటీ విషయాన్ని ప్రస్తావించారు. ఇక రజనీకాంత్ మాత్రం డిసెంబర్‌లో రాజకీయ రంగప్రవేశంపై నిర్ణయం ప్రకటించనున్నారు. బిగ్‌బాస్‌కు యాంకర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో రాజకీయ రంగప్రవేశం గురించి మాట్లాడుకున్నారు. ఓ ప్రయివేటు స్టూడియో సుబర్బన్ పూనమల్లీలో బిగ్‌బాస్ చిత్రీకరణ జరుగుతున్నది. దీనికి సమీపంలోనే రజనీకాంత్ కూడా కాలా సినిమా చిత్రీకరణ జరుగుతున్నదని హసన్ తెలిపారు. ఓ కారులో కూర్చొని రాజకీయం గురించి మాట్లాడాం. దీనిపై నా విషయాన్ని రజనీకాంత్‌కు వివరించాను. ఒకప్పుడు సినీరంగంలో కలిసి పనిచేశాం. అందుకే నా నిర్ణయాన్ని రజనీకాంత్‌కు వివరించాను. తన అభిప్రాయం ఏంటో కూడా తెలుసుకున్నాను. ఈ విషయమై చర్చిస్తున్న సమయంలో రజనీ చాలా ఆశ్చర్యంగా ప్రశ్నించారు. ఎప్పటి నుండో అనుకున్న రాజకీయ ఆరంగ్రేటాన్ని ప్రస్తుతం కార్యరూపం దాల్చింది. మున్ముందు ఎలాంటి పరిణామాలు ఎదురైనా ఒకరికి ఒకరు గౌరవించుకుంటూ ముందుకు వెళ్తామని నిర్ణయించుకున్నాం. రాజకీయ రంగప్రవేశం విషయాన్ని రజనీ కూడా సమ్మతించాడు. మళ్లీ ఓ సారి సమావేశమైనప్పుడు... నీచ రాజకీయాలను ప్రోత్సహించాల్సిన అవసరం లేదని రజనీ చెప్పారు. పార్టీ అధ్యక్షుడిగా నేను కొనసాగుతాను. ఎన్నికల కమిషన్‌లో తన పార్టీ పేరును రిజిస్టర్ చేసిన తరువాత ఏప్రిల్ 4న తిరుచిరాపల్లిలో మక్కల్ నీతి మయ్యం వేదికగా సమావేశం నిర్వహిస్తానని కమల్‌హాసన్ చెప్పారు.

నాగాలో సుస్థిర సర్కార్ అవసరం



- అప్పుడే రవాణా రంగంలో అభివృద్ధి సాధ్యం
- రాష్ట్ర వ్యాప్తంగా 10లక్షల ఎల్‌ఈడీ బల్బులు పంపిణీ
- ప్రతీ ఇంటికి విద్యుత్ అందించడమే లక్ష్యం
- రవాణా వ్యవస్థ అభివృద్ధే మా ధ్యేయం
- బీజేపీ- ఎల్‌డీపీపీకే మీ అమూల్యమైన ఓటు
- ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని మోడీ పిలుపు

కోహిమా : నాగాలాండ్ అభివృద్ధి బాటలో పయనించాలంటే సమర్థ, సుస్థిర ప్రభుత్వం అవసరం అని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. నాగాలాండ్‌లో గత ప్రభుత్వాలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాయని, బీజేపీ-ఎన్‌డీపీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అదే ధనాన్ని రోడ్డు అభివృద్ధికి ఉపయోగించి రవాణా రంగానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ట్యూన్‌సంగ్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో మోడీ మాట్లాడారు. నాగాలాండ్ నుండి సుమారు 360 కి.మీ దూరంలో ఈ సభ కొనసాగింది. ఈశాన్య రాష్ట్రాల్లో రవాణా వ్యవస్థ చాలా దుర్భరంగా ఉంది. దీన్ని బాగు చేయడమే నా లక్ష్యం. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 500 కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధికి సుమారు 10వేల కోట్లు ఖర్చుపెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమికి ఓటు వేసి గెలిపిస్తేనే ఇంత పెద్ద మొత్తం నిధులు ప్రజల దరి చేరుతాయి. శాస్త్ర సాంకేతిక రంగాన్ని ఉపయోగించుకుని ప్రజా ధనం ఎక్కడు దుర్వినియోగం అవుతున్నదో తెలుసుకుని సవరిస్తామని తెలిపారు. గత ప్రధానుల నేతృత్వంలో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రూపాయి విడుదల అయితే.. కేవలం 15 పైసలు మాత్రమే దరి చేరేవి. ఇలాంటి పరిస్థితుల్లో నుండి గట్టెక్కాలంటే మార్పు ఎంతో అవసరం. నాగాలాండ్‌లో అధికారంలోకి రవాలని ఎన్‌డీఏ ప్రభుత్వంతో పాటు కేంద్రం ఆశిస్తున్నది. ఇప్పటికీ చాలా గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేదు. అంధకారంలో మగ్గుతున్నాయి. ప్రతీ ఇంటికి విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో సౌభాగ్య యోజన పథకాన్ని తీసుకువస్తున్నాం. ఇప్పటి వరకు నాగాలాండ్ వ్యాప్తంగా పది లక్షల ఎల్‌ఈడీ బల్బులను సరఫరా చేయడం జరిగింది. కోహిమాను స్మార్ట్ సిటీగా మార్చేందుకు గాను కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.1,800 కోట్లు వెచ్చిస్తున్నది. నాగాలాండ్ సేంద్రియ వ్యవసాయానికి పెట్టింది పేరు. ఇక్కడి సరుకులు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుంటాయని మోడీ అన్నారు. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. బీజేపీ 20 స్థానాలు కేటాయించగా, ఎన్‌డీపీపీకి 40 స్థానాలు కేటాయించడం జరిగింది. రెండు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి నాగాలాండ్ ఎన్నికల బరిలో దిగనున్నాయి.


ప్రేమ వివాహాల్లో మా జోక్యం ఉండదు

- ఎవరు మంచి... ఎవరు చెడ్డో చెప్పలేం
- హదియా కేసులో సుప్రీం వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కేరళకు చెందిన 25 ఏళ్ల హదియా అనే అమ్మాయి ముస్లింలోకి మారి ముస్లిం యువకు డిని పెళ్లి చేసుకోవడం దేశ వ్యాప్తంగా సంచలనం దుమారం చెలరేగింది. ఈ లవ్ జిహాద్ కేసులో సుప్రీం కోర్టు గురువారం పలు ఆసక్తికర విషయాలను చెప్పుకొచ్చింది. ఓ మహిళ వివాహం రద్దు చేసే హక్కు కేరళ హైకోర్టు న్యాయమూర్తికి ఉంటుందా..? అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఇద్దరు మేజర్లు పెళ్లి చేసుకునే విషయంలో న్యాయ స్థానం జోక్యం ఉండబోదని సుప్రీం కోర్టు చెప్పుకొచ్చింది. 25 ఏళ్ల హదియా తండ్రి ఉత్తర్వును సమర్థించిన తరువాత హైకోర్టు వివాహాన్ని రద్దు చేయవచ్చా..? అని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టును ప్రశ్నించింది. భాగస్వామి ఎంపికలో నిర్ణయాన్ని తాము చెప్పలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇతన్నే వివాహం చేసుకోవాలని ఇతన్ని చేసుకోవద్దనే చెప్పే హక్కు సుప్రీం కోర్టుకు ఉండదని వివరించింది. యువతి, లేదా యువకుడు మేజర్ అయిన తరువాత తమ భాగస్వామిని ఎంచుకునే హక్కు వారికి ఉంటుందని తెలిపింది. సరైన వ్యక్తిని ఎంపిక చేసుకోలేదనే కారణంతో వారి వివాహాన్ని రద్దు చేసే హక్కు ఏ న్యాయస్థానానికి లేదని విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపింది. ఇద్దరు మేజర్లు పెళ్లి విషయంలో తాము జోక్యం చేసుకోలేమని మరోసారి తెలిపింది. వివాహం చెల్లదని గతేడాది కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో హదియా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. హదియా ఇష్టంగానే మతం మార్చుకుని పెళ్లి చేసుకున్న తెలిపిం ది. ఆమె ఈవిధంగా చెప్పడంతో కేరళ హైకోర్టుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసులో వాదనలు మిగిలి ఉన్న కారణంగా విచారణను మార్చి 8కి వాయిదా వేసింది.

ద.కొరియాకు ఇవాంక



వాషింగ్టన్: మొన్నటిదాకా కయ్యానికి కాలుదువ్విన అగ్రరాజ్యం అమెరికా, ఉత్తరకొరియా దేశాలు దూకుడు తగ్గించా యి. ద్వైపాక్షిక చర్చలతో విభేదాల పరిష్కా రానికి మొగ్గుచూప తున్నట్లు కనిపిస్తోంది. ద.కొరియా ఆతిథ్యం ఇస్తున్న శీతాకాల ఒలింపిక్స్ లో ఉత్తర కొరియా పాల్గొన్న నాటి నుంచి కిమ్- ట్రంప్ మధ్య మాటల యుద్ధానికి తెరపడింది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు, కుమార్తె అయిన ఇవాంక ట్రంప్ ద.కొరియా పర్యటన ఉభయదేశాల మధ్య దౌత్యచర్చలకు వేదిక కానుందన్న ప్రచారం జరుగుతోంది. ప్యొంగ్యాంగ్‌లో ఆదివారం జరగనున్న శీతాకాల ఒలింపిక్స్ ముగింపు వేడుకల్లో ఇవాంక పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉత్తర కొరియా జనరల్‌తో సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో ఇవాంక వెంట ఉన్నతాధికారుల బృందం ద.కొరియా వెళ్తుందని బుధవారం శ్వేతసౌధం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ వేడుకలకు ఉత్తర కొరియా కూడా ఉన్నతాధికారుల బృందాన్ని పంపనుంది. ఈ విషయాన్ని ద.కొరియా అధికారు సైతం ధ్రువీకరించారు. ఉత్తర కొరియా అధికార వర్కర్స్ పార్టీ (డబ్ల్యూపీకే) వైస్ చైర్మన్ కిమ్ యాంగ్ - చోల్ నేతృత్వంలో 8 మంది సభ్యుల బృందం మూడు రోజులు సియోల్‌లో మకాం వేస్తుంది. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ హాజరవగా, ఉత్తర కొరియా తరఫున కిమ్ సోదరి కిమ్ యొ జోంగ్ పాల్గొన్న సంగతి తెలిసిందే. "ముగింపు వేడుకల్లో అమెరికా బృందానికి నాయకత్వం వహించేందుకు గర్వపడు తున్నాను. ఒలింపిక్స్‌లో మా దేశ అథ్లెట్లు అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నారు. వారి పోరాట పటిమ అమెరికన్లకు స్ఫూర్తిదా యకం. విజేతలకు ప్రత్యేక అభినందనలు" అని ఇవాంక వ్యాఖ్యా నించింది. ద.కొరియా-అమెరికా సంబంధాలపైనా చర్చించే అవ కాశం ఉందని శ్వేతసౌధ సీనియర్ అధికారి ఒకరు వెల్లడిం చారు. త్వరలో లాస్‌ఏంజెల్స్‌లో మెగా ఈవెంట్ జరగనున్నం దున, ఒలింపిక్ కమిటీతో ఇవాంక ప్రత్యేకంగా సమావేశం అవుతారు.

అసెంబ్లీ బరిలో కోటీశ్వరులు

- నాగాలాండ్ పోరులో 59% కుబేరులే..
- జేడీయూ అభ్యర్థి లోథాకు రూ.38.92 కోట్లు
- అఫిడవిట్లు సమర్పించిన 196 మంది అభ్యర్థులు
- 114 మంది కోటీశ్వరులుగా గుర్తింపు
- 3 అభ్యర్థులపై కేసులు.. మరో ముగ్గురు నిరాక్షరాస్యులు
- ది అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ రిపోర్టులో వెల్లడి



కోహిమా : నాగాలాండ్‌లో ఎన్నికల వాతావరణం నెలకొం ది. ఎన్నికల కమిషన్ ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిం చనుంది. 196 మంది ఎన్నికల బరిలో నిల్చున్నారు. వీరిలో 59 శాతం మంది అభ్యర్థులు కోటీశ్వరులుకావడం విశేషం. నాగాలాండ్ ఎన్నికలకు సంబంధించిన పలు ఆసక్తికరమైన అంశాలను ది అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. జనతా దళ్ యునైటెడ్ (జేడీయూ) తరఫున నామినేషన్ వేసిన రామోంగో లోథా రూ.38.92 కోట్ల ఆస్తులతో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కమిషన్‌కు అందజేసిన అఫిడవిట్లను ఏడీఆర్ విశ్లేషించింది. 196 మంది అభ్యర్థుల్లో 193 మంది అఫిడవిట్లను పరిశీలించగా కోటీశ్వరుల జాబితా వెలుగులోకొచ్చింది. మరో ముగ్గురు అభ్యర్థులు అందజేసిన వివరా లు అసంపూర్తిగా ఉండటంతో ఏడీఆర్ వారి అఫిడవిట్లను పరిశీలించే అవకాశం లభించలేదు. 114 మంది కోటీశ్వరులుగా ఉన్నట్టు ఏడీఆర్ తేల్చింది. నాగాలాండ్‌లోని ఓ యువజన సంస్థ నాయకుడు హెకానీ జఖాలు కోటీశ్వర అభ్యర్థులకు సంబంధించి వివరాలను వెల్లడించారు. లోథా ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఈయన చరాస్తుల విలువ రూ.22,81, 960 ఉండగా, స్థిరాస్తుల విలువ రూ.38,69,40,000గా ఉంది. మొత్తంగా రూ.38.92 కోట్లు లోథా ఆస్తి విలువ. ఈయన వోఖా జిల్లాలోని సనీస్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిల్చున్నారు. ఆప్ నుండి టికెట్ పొందిన అఖ్వి ఎన్ జిమోమీ ఘస్పని-1 నియోజకవర్గం నుండి ఎన్నికల బరిలో ఉన్నారు. ఈయనకు ఎలాంటి స్థిర, చరాస్తులు లేవని ఏడీఆర్ విశ్లేషణతో వెల్లడైంది. నాగాలాండ్ సీఎం టీఆర్ జీలియంగ్, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) తరఫున ఎన్నికల బరిలో ఉన్నారు. పరేన్ నియోజకవర్గం నుండి ఈయన పోటీ చేస్తున్నారు. స్థిర, చరాస్తుల విలువ మొత్తం రూ.3.52 కోట్లుగా అఫిడవిట్‌లో పొందుపర్చడం జరిగింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉండి, ఎన్‌డీపీపీ అభ్యర్థిగా ఉన్న నిఫియో రియో ఉత్తర అగామై-2 నియోజకవర్గం నుండి బరిలో ఉన్నారు. ఈయనకు సంబంధించిన చరాస్తుల విలువ రూ.15.37 కోట్లుగా పొందుపర్చడం జరిగింది. మరో మాజీ ముఖ్యమంత్రి కేఎల్ చిషి మొత్తం ఆస్తులు రూ.38.20 కోట్లుగా నిర్ధారించడం జరిగింది. టినగంపై, చిన్యాయ్ కొన్య, కెకికో కొనియాక్‌లు తక్కువ ఆస్తులు కలిగి ఉన్నవాళ్లుగా వెల్లడైంది. నాంపాంగ్ అనే అభ్యర్థి కాంగ్రెస్ నుండి పోటీలో ఉన్నాడు. ఫూంచింగ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన బరిలో ఉన్నారు. ఈయన ఆస్తి కేవలం రూ.5వేలు మాత్రమే అని అఫిడవిట్‌లో పొందుపర్చడం జరిగింది. ఎన్‌పీఎఫ్ అభ్యర్థి కోన్యా, టిహోక్ నియోజక వర్గం నుండి పోటీ చేస్తున్నారు. ఈయన ఆస్తి విలువ రూ.10వేలు కాగా, ఎన్‌డీపీపీ అభ్యర్థి కె కికో కోన్యాక్, మోకా అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నాడు. ఈయన ఆస్తి విలువ రూ.20వేలుగా ఉంది. 46 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ.5కోట్లపైన ఉంది. 42 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ.2కోట్లకు పైగా ఉంది. 60 అభ్యర్థుల ఆస్తుల విలువ రూ.50లక్షలకు పైగా ఉంది. 26 మంది ఆస్తి విలువ రూ.10లక్షలకు పైగా ఉన్నాయి. 19 మంది అభ్యర్థుల ఆస్తుల విలువ రూ.10లక్షలకు తక్కువగా ఉన్నాయి. మరో 27 మంది అభ్యర్థులు ఆస్తులకు సంబంధించిన వనరులను అఫడవిట్‌లలో ప్రకటించలేదు.

అదేవిధంగా ముగ్గురు అభ్యర్థులు తమపై కేసులు నమోదై ఉన్నట్టు కూడా వివరించారని ఏడీఆర్ రిపోర్టులో వెల్లడైంది. వీరిలో ఎన్‌పీఎఫ్, ఎన్‌డీపీపీ నుండి ఒక్కొక్కరు కాగా, బీజేపీ నుండి మరొకరు ఉన్నారు. ముగ్గురు అభ్యర్థులు నిరాక్షరాస్యులుగా ఉన్నారు. 16 మంది అభ్యర్థులు కేవలం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉన్నారు. ఐదుగురు డాక్టరేట్ పట్టాలు పొంది ఉన్నారు. ఏడుగురు సభ్యులు 25 నుంచి 30 ఏళ్ల వయస్కులు ఉండగా, 29 మంది అభ్యర్థులు 31 నుండి 40 ఏళ్ల వయస్సు మధ్య ఉన్నవారు ఉన్నారు. మిగిలిన వారు అందరూ... 40ఏళ్లపైబడిన వారు ఉన్నట్టు ఏడీఆర్ తన విశ్లేషణలో వెల్లడించింది.

ఆస్పత్రి నుంచి నేరుగా అసెంబ్లీకి..

- బడ్జెట్ చదివిన గోవా సీఎం పారికర్



పనాజీ: గోవా సీఎం మనోహర్ పారికర్ ముంబై ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం గోవా చేరుకున్న ఆయన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతవారం అస్వస్థతతో ముంబై ఆసుపత్రిలో చేరిన గోవా ముఖ్యమంత్రిని ఒక వారం తరువాత వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఆసుపత్రి నుంచి విడుదలైనవెంటనే సీఎం పారికర్ గోవా చేరుకుని అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. గతవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఐదు నిమిషాలకే పారికర్ అస్వస్థతకు గురవటంతో సభను వాయిదావేశారు. తాజాగా గురువారం అసెంబ్లీలో బడ్జెట్‌ను తిరిగి ప్రవేశపెట్టారు. ఈసందర్భగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడుతూ అనారోగ్యానికి గురవటంతో పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నా మన్నారు. కాగా పారికర్ అనారోగ్య రీత్యా ముంబై లీలావతి ఆసుపత్రిలో ఈ నెల15న చేరారు. వైద్య చికిత్స అనంతరం ఆయన గురువారం విడుదలయ్యారు. అనంతరం ముంబై నుంచి గోవా చేరుకున్న సీఎం పారికర్ తన నివాసం చేరుకుని అక్కడ నుంచి అసెంబ్లీకి వెళ్లారు. తన అధ్యక్షతన మంత్రి మండలి సమావేశం నిర్వహించి అనంతరం సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ మొత్తం 17,123 కోట్లు కాగా గత ఏడాదితో పోలిస్తే 6.84శాతం ఎక్కువగా ఉంది. తొలుత గోవా డిప్యూటీ సీఎం మైఖెల్ లోబో బుధవారం అసెంబ్లీ వద్ద విలేఖరుల సమావేశం నిర్వహించి గురువారం సీఎం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అవుతున్నారని, సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారని ముందుగానే తెలియజేశారు.

సవాజ్ షరీఫ్‌కు ఎదురు దెబ్బ

- నాడు ప్రధాని పదవికి దూరం
- నేడు పార్టీ చీఫ్ నుంచి తొలగింపు
- ప్రశ్నార్థకంగా రాజకీయ భవితవ్యం
- రంగంలోకి భార్య లేదా కుమారుడు..!



ఇస్లామాబాద్: పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు రాజకీయ సన్యాసం తప్పేలా కనిపించడం లేదు. పనామా పేపర్ల కేసు కారణంగా రాజకీయ జీవితానికి ఫుల్‌స్టాప్ పడేలా కనిపిస్తున్నది. ఈ కేసు కారణంగానే నవాజ్ షరీఫ్ ప్రధాని పీఠానికి దూరమైన విషయం తెలిసిందే. ఆర్టికల్ 62 ప్రకారం గతేడాది జూలైలో సుప్రీం కోర్టు ఈ తీర్పును వెలువరించింది. గురువారం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో నవాజ్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ముస్లిం లీగ్ నవాజ్ (పీఎంఎల్ఎన్)కు నవాజ్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఈ పదవికి నవాజ్ అర్హుడు కాదని స్పష్టం చేస్తూ సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో నవాజ్ రాజకీయ జీవితం కొనసాగుతున్నది. సుప్రీం మరికొన్ని కీలక నిర్ణయాలను వెల్లడించింది. పార్టీ చీఫ్‌గా తీసుకున్న నిర్ణయాలన్నీ అమలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 62, 63 ప్రకారం.. ఓ పార్టీ చీఫ్‌గా ఉండే వ్యక్తికి లక్షణాలు ఉండాలని సూచించింది. పార్లమెంట్ గౌరవం పెంచేలా వ్యవహరించాల్సింది పోయి అవినీతికి పాల్పడటంపై సుప్రీం ఒకింత అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసింది. చీఫ్‌గా ఉన్న సమయంలో బాధ్యతగా వ్యవహరించాలని పాక్ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సాకిబ్ నిసార్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. అనంతరం ఆయన కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇలాంటి తీర్పు ఇస్తుందని అనుకోలేదు. ముందు ఎగ్జిక్యూటీవ్ నుండి తప్పించారు.. నేడు పార్లమెంటరీ అధికారాలు నా నుండి లాగేసుకున్నారు. మున్ముందు ఏం చేస్తుందో అర్థం కావడం లేదు. నా పేరు మహ్మద్ నవాజ్ షరీఫ్. ఇలాగే కొనసాగితే మాత్రం నా పేరును కూడా నా నుండి లాగేసుకుంటారేమో అనిపిస్తున్నది. మీ ఇష్టం ఉన్నట్టు చేయండి. ఈ నిర్ణయాలు మాత్రం నా పై కక్ష సాధింపు, కోపంతో తీసుకోబడ్డాయి అని షరీ అసహనం వ్యక్తం చేశారు. నవాజ్ కూతురు మర్యం, అతని అల్లుడు మహ్మద్ సఫ్దర్ కూడా మూడు కేసుల్లో ఒక దాంట్లో నిందితులుగా ఉన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన అనంతరం పార్టీ నేతలతో నవాజ్ షరీఫ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడి ఎంపికలో భాగంగా ఈ సమావేశం కొనసాగినట్టు తెలుస్తున్నది. షరీఫ్ భార్య కుల్‌సూమ్ నవాజ్, పెద్ద కుమారుడు షహబాజ్‌లో ఎవరినో ఒకరిని పార్టీ పగ్గాలు అప్పజెప్పేందుకు చూస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

యూకేలో సిక్కు జాతీయుడిపై దాడి

లండన్: భారత సంతతికి చెందిన సిక్కు జాతీయుడిపై యూకేలో జాత్యహంకార దాడి జరిగింది. ఈ దాడి యూకే పార్లమెంటు ఎదుటే జరగటంతో ఆ వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశానికి చెందిన పర్యావరణ ఉద్యమకర్త రన్వీత్ పాల్ సింగ్ (37) యూకే సందర్శనకు వెళ్లగా తనపై ఆ దేశ పార్లమెంటు ఎదుటే జాత్యహంకార దాడి జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్వేత జాతీయుడు ఒకరు తలపాగాతో ఉన్న సింగ్‌ను చూసి ముస్లిం గో బ్యాక్ అంటూ అరుస్తూ దాడికి దిగాడన్నారు. పార్లమెంటు హౌస్‌కు అనుబంధంగా ఉన్న పోర్టుక్యూలిస్ హౌస్‌కు వెళ్లేందుకు సెక్యూరిటీ క్యూలో ఉండగా తెల్లజాతీయుడు ఒకరు తనపై దాడి చేశాడని ఆ వ్యక్తి ఇంగ్లీష్‌లోకాక మరో భాషలో మాట్లాడుతూ తనపై దాడి చేసి పారిపోయాడన్నారు. అయితే పారిపోయేముందు అతని మాటల్లో ముస్లిం గోబ్యాక్ అనే అర్థం వచ్చేలా అతని వ్యాఖ్యలు ఉన్నాయని అర్థమైందని సింగ్ తెలిపారు. అతను ఎందుకు తన తలపాగా చూస్తూ దాడికి దిగాడో, ఎందుకు ఆగ్రహంతో అరిచాడో తనకు ఖచ్చితంగా తెలియదని సింగ్ అన్నారు. అయితే అతని దాడిని నేను అడ్డుకొని గట్టిగా అరవటంతో దాడికి పాల్పడిన వ్యక్తి అక్కడ నుంచి పారిపోయాడన్నిరు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ జరిగిన సంఘటన సీసీ టీవీలో రికార్డు అయిందన్నారు. నిందితుడిని గుర్తించామన్నారు. మెట్రోపాలిటన్ పోలీసులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, అయితే ఇప్పటివరకూ నిందితుడిని అరెస్టు చేయలేదని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

తాలిబన్ల దాడిలో 8మంది పోలీసులు మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో తాలిబాన్లు జరిపిన ఉగ్రదాడిలో 8మంది పోలీసులు మృతి చెందారు. ఈ ఉగ్రదాడిపై అఫ్గాన్ పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సాయుధ తాలిబాన్ ఉగ్రవాదులు సెంట్రల్ ఘజనీ ప్రాంత పోలీస్ సెక్యూరిటీ పోస్టుపై దాడి చేయడంతో ఎనిమిది మంది పోలీసులు మరణించారన్నారు. ఈ సందర్భంగా గురువారం గవర్నర్ ఆరిఫ్ నూరీ మాట్లాడుతూ ఉగ్రవాదులు మంగళవారం రాత్రి దాడికి పూనుకున్నారని తెలిపారు. తిరుగుబాటు దారులు పోలీసు పోస్టును నలువైపుల నుంచి చుట్టుముట్టి అత్యాధునిక ఆయుధాలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో 8మందికి ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. అనంతరం రక్షక దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చాయన్నారు.

భారత్, చైనా, నేపాల్‌ల మధ్య చర్చలు జరగాలి

బీజింగ్: భారత్,నేపాల్,చైనాలు వివిధ అంశాలపై అరమరికలు లేకుండా చర్చలు జరిపి,పరస్పరం గౌరవం,సమాన ప్రతిపత్తి కాపాడుకునే రీతిలో సమస్యలు పరిష్కరించుకోవాలని చైనా సూచించింది. నేపాల్ ప్రధానిగా ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బాధ్యతలను స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని చైనీస్ ప్రభుత్వం ఆయనకు అభినందనలు తెలిపింది.ఇరుగుపొరుగు దేశాల మధ్య సమస్యలు ఉండటం సహజమనీ, వాటిని ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువనే రీతిలో కాకుండా అరమరికలు లేని విధంగా చర్చలు జరిపి సమాన స్థాయిలో పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి జెంగ్ షాంగ్‌ని ఉటంకిస్తూ హాంకాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మార్నింగ్ పోస్టు పత్రిక పేర్కొంది. భారత్‌తో చిరకాల బంధాన్ని కొనసాగిస్తూనే,చైనాతో వాణిజ్య సంబంధాలను నెలకొల్పుతామని ఓలి అన్నారు. చైనా గతంలో ప్రతిపా దించిన 2.5 బిలియన్ డాలర్ల జల విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను వెనకటి ప్రభుత్వం రద్దుచేసినప్పటికీ,దానిని తిరిగి పరిశీలిస్తామని చెప్పారు.

కాంగ్రెస్ నేతలను ఫాలో అవుతున్న బిగ్ బీ



న్యూఢిల్లీ: బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ సీనియర్ కాంగ్రెస్ నేతలను ట్విట్టర్లో ఫాలో అవుతున్నారు. కొన్నిరోజుల క్రితం ట్విట్టర్‌కు గుడ్ బై చెపుతున్నట్టు బిగ్ బీ అమితాబ్ పేర్కొన్నారు.అయితే తాజాగా ఆయన ట్విట్టర్‌ను పునః ప్రారంభం చేయటం కాంగ్రెస్ నేతలను ఫాలో అవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అనంత రం ఆయన సీనియర్ కాంగ్రెస్ నేతలు చిదంబరం, కపిల్ సిబాల్, అహ్మద్ పటేల్, అశోక్ గెహ్లాట్, అజయ్ మాకెన్, జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలట్, సీపీ జోషి ఖాతాలను ఈ నెల నుంచి ఫాలో అవుతున్నారు. కాగా ఇప్పుడు తాజాగా ఆయన మనీశ్ తివారీ, షేక్ అహ్మద్, సంజయ్ నిరుపమ్, రణదీప్ సూర్జీవాలా, ప్రియాంక చతుర్వేది, సంజయ్ ఝాలకు మైక్రో బ్లాగింగు సైట్ ద్వారా టచ్‌లో ఉన్నారు. అమితాబ్ బచ్చన్ గతంలో నెహ్రూ -గాంధీ కుటుంబంతో సన్నిహితంగా ఉండేవారు. అంతేకాక రాజీవ్ గాంధీతో ఆయన స్నేహంగా ఉండేవారు. అయితే ప్రస్తుతం ఆయన గుజరాత్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. బిగ్ బీ అమితాబ్‌కు 33.1 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా ఆయన కేవలం 1,689మందిని మాత్రమే ఫాలో అవుతున్నారు. అకస్మాత్తుగా అమితాబ్ కాంగ్రెస్ నేతలపై ప్రేమ కురిపించడంపై నేతల్లో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

యూకే నుంచి సబ్ మెరైన్ల భద్రతా వ్యవస్థ


లండన్ భారత నౌకాదళానికి జలాంతర్గాముల భద్రతా వ్యవస్థను స్కాట్‌లాండ్‌కి చెందిన కంపెనీ రూపొందించింది.ఆపదల నుంచి కాపాడేందుకు ఈవ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుంది.నౌకాదళానికి ఈ కొత్త వ్యవస్థను యునైటెడ్ కింగ్‌డమ్ కి చెందిన ఆ కంపెనీ వచ్చేనెలలో అందజేస్తుంది.అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ వ్యవస్థలు రెండింటిని భారత నౌకాదళానికి యూకే కంపెనీ అందజేయనుంది. వీటిని రూపొందించడం కోసం ఆకంపెనీ భారత నౌకాదళంతో 193 మిలియన్ టన్నుల ఒప్పందాన్ని కుదుర్చుకుంది.డీప్ సెర్చ్ అండ్ రెస్క్యూ వెహికల్స్‌గా వీటికి పేరు.ఈ వెహికల్స్ లో సమీకృత విడిభాగాలను అమర్చారు. జలాంతర్గాములకు ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించేందుకు వీలుగా ఈ కొత్త భద్రతా వ్యవస్థను దిగుమతి చేసుకోవాలని నౌకాదళం నిర్ణయించింది.

క్రీడాప్రభ

వాన చినుకులే ముంచాయి

బౌలర్లు బంతిపై నియంత్రణ కోల్పోయారు

సఫారీలు అద్భుతంగా ఆడారు: కోహ్లీ



'దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లు ముఖ్యంగా క్లాసెన్, డుమినిలు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. వారి సకారత్మక ఆలోచనలు ఫలించాయి. ఆశావహ దృక్పథంతో ముందుకు సాగి విజయం సాధించా రు' అని కోహ్లీ ప్రశంసించాడు. వారు ప్రతికూల పరిస్థితులను ముందే

బ్యాటింగ్ అమోఘం

వూహించి ఆడారు. ఎక్కువగా బౌండరీలనే లక్ష్యం చేసుకుని ఆడారు. వారు విజయానికి అర్హులే. వారు ప్రతిఘటించాలని మేము కోరుకున్నాము అదే జరిగిందని కోహ్లీ తెలిపాడు.

సెంచూరియాన్: వాన దేవుడు తమ ఆటగాళ్ల పట్ల ప్రతికూల పాత్ర పోషించాడని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ వ్యాఖ్యానించాడు. రెండో టీ20 మ్యాచ్‌లో 188 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోవటంలో జట్టు బౌలర్లు విఫలమయ్యారని పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్, తొలి టీ20 మ్యాచ్‌లో రాణించిన స్పిన్నర్లు రెండో టీ20లో విఫలం కావడం పట్ల విరాట్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆగి ఆగి పడుతున్న వర్షపు జల్లులతో సూపర్ స్పోర్ట్ పార్క్ పిచ్‌లో మార్పులు వచ్చాయని కోహ్లీ అన్నాడు. చాహల్ బంతిని తిప్పడంలో విఫలమ య్యాడని పేర్కొన్నాడు. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా ఉన్నప్పుడు చాహల్ 4 ఓవర్లు బౌలింగ్ చేయగా 64 పరుగులు ఇచ్చాడు. వికెట్లు పడగొట్టలేక పోయాడు. సఫారీలు తేలికగా విజయాన్ని పొందారు. బౌలర్స్ కఠిన పరీక్షను ఎదుర్కొన్నారు. 'మా బ్యాటింగ్ విషయానికి వస్తే.. వికెట్లు పడిపోవడం చూసి మా ఇన్నింగ్స్ 175 పరుగులకే పరిమితమవుతుందని అనుకున్నాము. మనీష్, రైనాలు బాగా రాణించారు. మనీష్, ధోని చూపిన ప్రతిభ అమోఘం. వారిద్దరూ కలిసి భారత్ స్కోరును 190 దాకా పోనిచ్చారు. అది గెలవడానికి సరిపోయే స్కోరే.. అయితే వాతావరణం బౌలర్లపై ప్రతికూల ప్రభావం చూపింది. 12 ఓవర్లదాకా మేము గెలుస్తామని భావించాము. వర్షపు జల్లులు వచ్చినప్పటికి ఆటను కొనసాగించాము. పిచ్ ని స్పత్తువుగా మారి బ్యాట్స్ మన్లకు అనుకూలించింది. ఆపై బౌలర్లు బంతిపై పట్టును కోల్పోయారు' అని కోహ్లీ అన్నాడు. వర్షపు జల్లుల మధ్య ఇక ఇన్నింగ్స్ సాగినప్పుడు అనంతరం ఆటను నిలిపివేయాలని కోరుకోలేము. మనకు తెలుసు జల్లులు కొనసాగు తాయని.. అయితే ఆ పరిస్థితులతో మాకు ఎలాంటి కష్టం లేదు. అవి స్థిరంగా కొనసాగాయి. ఆడటానికి అనువైన పరిస్థితి ఉందని అని కోహ్లీ చెప్పాడు.

విజయం సులువుగా లభించింది: డుమిని



విజయంకోసం తమ జట్టు సమష్టిగా కృషి చేసిందని దక్షిణాఫ్రికా కెప్టెన్ డుమిని అన్నాడు. టాస్‌కు వెళ్లినప్పుడే ఈ పిచ్ పరిస్థితిని అంచనా వేశాం. స్పిన్, లేదా ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలవూ అన్న విషయం పరిశీలిం చామన్నాడు. అయితే వూ బౌలర్ల ప్రారంభం బాగానే ఉంది. చివరి ఐదోవర్లలో వారు పూపును అందుకున్నా రు. అయితే మా బ్యాట్స్‌మన్ పరిస్థితి తగ్గట్టుగా ఆడి రాణించి విజయాన్ని తేలిక గా అందిం చారు అని డుమిని అన్నాడు. వర్షపు జల్లులు కొనసా గుతుండటంతో వూ బ్యాట్స్‌మన్లు డి/ఎల్ నిబంధనలను దృష్టిలో ఉంచుకునే బ్యాటింగ్‌ను కొనసాగించారని డుమిని తెలిపాడు.

విజయ్ హజారే ట్రోఫీ

సెమీ ఫైనల్లో ఆంధ్ర, సౌరాష్ట్ర జట్లు

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా గురువారం జరిగిన మూడు, నాలుగు క్వార్టర్ ఫైనల్స్ మ్యాచుల్లో ఆంధ్ర ప్రదేశ్, సౌరాష్ట్రలు సెమీస్‌కు చేరాయి. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో మహారాష్ట్ర, కర్నాటకలు ఇప్పటికే సెమీస్‌కు చేరిన విషయం తెలిసిందే. గురువారం ఇక్కడి ఫిరోజ్‌షాకోట్లా మైదానంలో జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సౌరాష్ట్ర 3 వికెట్ల తేడాతో బరోడాపై గెలిచింది. సౌరాష్ట్ర టాస్ గెలిచి బౌలింగ్ చేసింది. బ్యాటింగ్ ప్రారంభించిన బరోడా జట్టు తొలి వికెట్ 4వ ఓవర్లో పడింది.



కేదార్ దేవదర్ 14 పరుగులు చేసి సకారియా బౌలింగ్‌లో వాసవదకు క్యాచిచ్చి ఔటయ్యాడు. బరోడా బ్యాట్స్‌మన్లలో సోయబ్ త్యహి 71 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కృణాల్ పాండ్యా 61 పరుగులు చేశాడు. మొత్తానికి బరోడా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 247 పరుగులు చేసింది. సౌరాష్ట్ర బౌలర్లలో చిరాగ్ 4 వికెట్లు తీశాడు. మన్‌కడ్, సకారియాలు రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్య ఛేదన ప్రారంభించిన సౌరాష్ట్ర ఓపెనర్లు వ్యాస్, బారోత్‌లు దాటిగా బ్యాటింగ్ చేశారు. తొలి వికెట్‌కు వారు 20 పరుగులను చేశారు. బరోత్ 82 పరుగులు చేసి ఔట్ కాగా, వ్యాస్ 18 పరుగులు చేసి ఔటయ్యాడు. జట్టులో చెప్పుకోదగ్గ పరుగులు చేసిన వారిలో కెప్టెన్ చతేశ్వర్ పూజారా40, అర్పిత్ వాస్వాదా 45పరుగులు చేశారు. చివరి 5 ఓవర్లలో మ్యాచ్ ఉత్కంఠగా సాగినప్పటికి సౌరాష్ట్ర బ్యాట్స్‌మన్లు 48.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 251 పరుగులు చేసి విజయం సాధించారు.

సంక్షిప్త స్కోర్లు

బరోడా 247 ఆలౌట్ (50 ఓవర్లు) (కృణాల్ పాండ్యా 61, సోయబ్ తాహి 72, చిరాగ్ జాని 4/35, మన్కడ్ 2/29,సకారియా 2/73)

సౌరాష్ట్ర 251/7(48.4 ఓవర్లు) (బరోత్ 82, వాస్వాదా 45, చతేశ్వర్ పూజారా 40 , అతిత్ సేత్ 3/38, సోలంకి 1/6, రిషి అరోతే 1/37)

ఆంధ్ర 6 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలుపు

ఇక్కడి పాలం ఎ స్టేడియంలో ఆంధ్ర, ఢిల్లీల మధ్య జరిగిన నాలుగో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర 6 వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలిచింది. ఉదయం టాస్ గెలిచిన ఆంధ్ర బౌలింగ్‌ను ఎంచుకుంది. ఆరంభంనుంచే కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆంధ్ర బౌలర్లు ఢిల్లీని బెంబెలెత్తించారు. మూడో ఓవర్లో ఢిల్లీ తన తొలివికెట్‌ను పోగొట్టుకుంది. జట్టులో రిషబ్‌శాంత్ సాధించిన 38 పరుగులు అత్యధికం. కెప్టెన్ ఇశాంత్‌శర్మ 1 పరుగు, సీనియర్ ఆటగాడు గౌతం గంబీర్ 4 పరుగులు మాత్రమే ఔటయ్యారు. ఢిల్లీ ఆటగాళ్లు 32.1 ఓవర్లలోనే 111 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఆంధ్ర బౌలర్లలో దువ్వారపు శివకుమార్ 4 వికెట్లు తీయగా, బార్గవ దత్ 3 వికెట్లు, బండారు అయ్యప్ప రెండు, నరేన్ రెడ్డి ఒక వికెట్‌ను తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 4 పరుగులకే తొలి వికెట్ రూపంలో ఓపెనర్ శిఖర్ భారత్‌ను కోల్పోయింది. మరో ఓపెనర్ అశ్విన్ హెబ్బార్ 38 పరుగులు చేసి ఔటయ్యాడు. అనంతరం వచ్చిన బ్యాట్స్‌మన్లు మిగతా పరుగులను సాధించి ఆంధ్రకు విజయం సాధించి పెట్టారు. ఆంధ్ర తన లక్ష్యాన్ని 28.4 ఓవర్లలో పూర్తి ఛేదించింది.

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ 111 ఆలౌట్ (32.1 ఓవర్లు)(రిషబ్ పంత్ 38, ధ్రువ్ షోరే 21, శివకుమార్ 4/29, అయ్యప్ప 2/30,భార్గవ్ ధత్ 3/28, నరేన్ రెడ్డి 1/1)ఆంధ్రప్రదేశ్ 112/4(28.4 ఓవర్లు) (అశ్విన్ హెబ్బార్ 38, రిక్కుబుయ్ 31, సుమంత్ 25, ఇశాంత్ శర్మ 1/11, నవదీప్ సైనీ 1/14, పవన్ నేగి 1/20, నితిష్ రాణా 1/25)

స్ట్రాండ్జా బాక్సింగ్‌లో సెమీస్‌కు మేరీకోమ్



సోఫియా(బల్గేరియా): ఐదుసార్లు ప్రపంచ భాక్సింగ్ ఛాంపియన్ మేరీకోమ్ (48కేజీలు) ఇక్కడ జరుగుతున్న 69వ స్ట్రాండ్జా స్మారక బాక్సింగ్ టోర్నీలో సెమీస్‌కు చేరింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీలో మేరీకోమ్ రుమేనియాకు చెందిన బాక్సర్ స్టెలుటా డ్యూటాపై గెలిచింది. స్టెలుటా మూడు సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. యూరిపియన్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు సార్లు స్వర్ణపతకాలను ఒకసారి రజత పతకంను స్టెలుటా గెల్చుకుంది. ఇద్దరు బాక్సర్ల మధ్య పోటీ హోరీ హోరీగా సాగింది. మేరీ దూరాన్ని పాటిస్తూ అదను చూసి ప్రత్యర్థిపై పంచ్‌లు విసురుతూ పాయింట్లను పొందింది. ఈ పోటీలో ఇద్దరి మధ్య వైర భావన నెలకొంది. ఎట్టకేలకు మేరీ స్టెలుటాను మట్టికరిపించి సెమీస్‌కు చేరింది. పురుషుల పోటీలో 64 కేజీల విభాగంలో దీరజ్ రాంగి తన ప్రత్యర్థి లూయిస్ కోలిన్ రిచార్నో చేతిలో టోర్నీని వీడాడు. భారత్ తరఫున మెడల్స్ ఖరారు చేసుకున్న వారిలో మహిళల్లో సీమా పూనియా(81కేజీ) స్వీటీ బూరా(75కేజీ) మీనా కుమారి దేవీ(54కేజీ) భాగ్యవతి కచారి(81కేజీ) ఉన్నారు. స్వీటీ మీనాలు క్వార్టర్ ఫైనల్స్‌లో గెలిచారు. సీమా, భాగ్యవతిలకు బైస్ దొరికింది.

డుమిని నా భయాన్ని పోగొట్టాడు: క్లాసెన్

సెంచూరియాన్: దక్షిణాఫ్రికా కొత్త ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ తన ఆట వెనుక కెప్టెన్ డుమిని ఉన్నాడన్నాడు. భారత్‌తో రెండో టీ20 ఆడుతున్న సమయంలో తనను వెన్నుతట్టి నాలోని జంకును తొలగించాడనిచెప్పాడు. బుధవారం మ్యాచ్ అనంతరం క్లాసెన్ మీడియాతో ముచ్చటించాడు. క్లాసెన్ ఈ మ్యాచ్‌ల 30 బంతుల్లో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. డుమిని, క్లాసెన్ బ్యాటింగ్ వారి జట్టుకు 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సఫారీ జట్టు 1-1తో సమానంగా నిలిచింది. నా ఇన్నింగ్స్ మొత్తంలో డుమిని కీలక పాత్ర వహించాడు. ప్రతీ ఓవర్లో ఇన్ని పరుగులు సాధించాలి. సహజ సిద్ధమైన ఆటను ప్రదర్శించాలని



చెప్పాడు. బౌలర్లపై విరుచుకుపడమని పరోక్షంగా సూచించాడు. ఆ మాటలు నన్ను ప్రేరేపించాయి. విజయం సాధించాను అని క్లాసెన్ ఆనందంతో తెలిపాడు. టీ20ల్లో ఫాస్టెస్ట్ అర్ధశతకం చేసిన తొలి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్‌ను నేనే అని క్లాసెన్ చెప్పాడు. అదీ భారత్‌పై సెంచూరియాన్ మైదానంలో చేయడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించాడు.

హర్మన్ ప్రీత్‌కౌర్‌కు డీఎస్పీ ఉద్యోగం



చండీగఢ్: భారత మహిళా టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పంజాబ్ ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించనుంది. రాష్ట్ర పోలీస్ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ) ఉద్యోగంను ఆమెకు ఇచ్చింది. పోలీస్ బాధ్యతలను చేపట్టడం తన చిరకాల వాంఛ అన్న కౌర్ మార్చి 1 పదవీ బాధ్యతలను చేపట్టనుంది. అయితే కౌర్ ఇప్పటికే భారత రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్ పనిచేస్తోంది. రైల్వేలు ఆమెను రిలీవ్ చేస్తేనే డీఎస్పీగా కొత్త బాధ్యతలను చేపట్టగలుగుతుంది. ఈ అంశంపై పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ రైల్వే మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపారు. హర్మన్‌ప్రీత్‌ను బాధ్యతలనుంచి విముక్తంచేసి పంజాబ్‌లో డీఎస్పీగా బాధ్యతలను చేపట్టేందుకు వీలు కల్పించాలని రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. దీనిపై రైల్వే మంత్రిత్వ శాఖ కూడా సానుకూలంగా స్పందించిందని సీఎంవో కార్యాలయం వెల్లడించిది. కౌర్ డీఎస్పీ కావాలనే బలంగా కోరుకుంటోంది. ఇప్పటికే అమె అవసరమైన పరీక్షలతో పాటు వైద్య పరీక్షలో కూడా గట్టెక్కింది. కౌర్ భారత రైల్వేలతో ఐదేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఇప్పటికే మూడేళ్ల సర్వీస్‌ను పూర్తిచేసుకున్న కౌర్ గతేడాది డీఎస్పీ వైద్య పరీక్షకోసం రైల్వేలో తాను నిర్వహిస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టుకు రాజీనామా చేసింది. ఒకవేళ మధ్యలో ఒప్పందం రద్దుచేసుకుంటే ఇంత వరకు కౌర్ తీసుకున్న వేతనాలను రైల్వేకు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్‌లో

సింధుకు ఈజీ డ్రా

తొలి రౌండ్లో తాయ్‌జుతో సైనా ఢీ





బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ షిప్ ప్రారంభ మ్యాచ్‌లో భారత షట్లర్ సైనా నెహ్వాల్ తాయ్‌లాండ్ షట్లర్ తాయ్ జుతో తలపడనుండగా, పివి సింధుకు సుళువైన డ్రా లభించింది. సింధు తన ప్రారంభ మ్యాచ్‌ను థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్‌తో ఆడనుంది. పది లక్షల అమెరికన్ డాలర్ల ప్రైజ్‌మనీతో కూడిన ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు మార్చి14 నుంచి 18వరకు జరగనున్నాయి. 2015లో జరిగిన ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రపంచ నెం.11 సైనా నెహ్వాల్ ఫైనల్లో తాయ్ జు చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది జరిగే అదే టోర్నీలో సైనా ప్రారంభ మ్యాచ్‌లోనే తాయ్ జును ఢీకొననుంది. ఈ మ్యాచ్ సైనాకు తాయ్‌పై బదులు తీర్చుకునే అవకాశం కల్పిస్తోంది. కాగా సింధు తన ప్రారంభ మ్యాచ్‌లో ఎలాంటి సమస్య లేకుండా తేలికగా దాటిపోయే అవకాశాలున్నాయి. రెండో రౌండ్లో ఆమె అమెరికన్ షట్లర్ బెయ్‌వెన్ జాంగ్ జాంగ్‌తో పోటీలో నిలిచే అవకాశం ఉంది. జాంగ్ జాంగ్ ఇండియన్ ఓపెన్ ఫైనల్లో సింధును ఓడించింది. ఈ సింధు కూడా రెండో రౌండ్లో తన ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం ఏర్పడింది.పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెం.3 కిదాంబి శ్రీకాంత్ మూడో సీడెడ్ ఆటగాడిగా బరిలోకి దిగుతున్నాడు. గత సీజన్లో శ్రీకాంత్ నాలుగు టైటిళ్లను గెలుచుకున్నాడు. శ్రీకాంత్ తొలి రౌండ్లో ఫ్రాన్స్‌కు చెందిన బ్రైస్ లెవెర్‌డెజ్‌ను ఢీకొననున్నాడు. సింగపూర్ ఓపెన్ ఛాంపియన్ ప్రణీత్ వూజీ ప్రపంచ వన్ ఆటగాడు కొరియాకు చెందిన సన్ వ్యాన్ హోతో, ప్రపంచ నెం.11 ప్రణయ్ చైనాకు చెందిన ఎనిమిదో సీడ్ ఆటగాడు చో టెయిన్ చెన్‌తో తలపడనున్నాడు. డబుల్స్‌లో చిరాగ్ శెట్టి, సాత్విక్‌స్వరాజ్ రింకిరెడ్డి జపాన్‌కు చెందిన టకురో హాకి, యుగో కొబాయషీలతో పోటీపడనున్నారు. మరో జంట మను అత్తారి, బి సుమీత్ రెడ్డి ఇంగ్లండ్‌కు చెందిన మార్కస్ ఎల్లిస్, క్రిస్ లాంగ్రిడ్జ్‌లతో ఆడనుంది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి జంట జపాన్‌కు చెందిన రెండో సీడెడ్ జోడి మిసాక మటుసుటోమో, అయక తకహాషిలతో పోటీపడ నుంది. మరో జోడి జక్కంపూడి మేఘన, పూర్విషా ఎస్ రామ్‌లు జపాన్‌కు చెందిన షిహో తనాక, కొహ్రూ యోనమొటోలతో ఆడనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణయ్ జెర్రీ చోప్రా, ఎన్ సిక్కిరెడ్డి జోడీ జర్మనీకి చెందిన మార్విన్ ఎమిల్ సీడెల్, లిండా ఎఫ్లర్‌లతో తలపడనుంది.

ఆ 11 మందిలో చోటు కోసం నిరీక్షించాను: మనీష్ పాండే

సెంచూరియాన్: జట్టులో స్థానం పొంది చివరి 11 మందిలో స్థానం పొందటంలో చాలా అవాంతరాలు ఎదుర్కొన్నానని బ్యాట్స్‌మన్ మనీష్‌పాండే అన్నాడు. మిడిల్ ఆర్డర్‌లో తనను స్థిర ప్రాతిపాదికన ఎందుకు కొనసాగించలేక పోతున్నారన్న దానిపై మనీష్ స్పందిస్తూ.. నిజాయతీగా చెప్పలంటే అవకాశాలకోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూశాను. నా మనసు ఆందోళనలతో నిండిపోయింది. ముఖ్యంగా ప్రస్తుత పర్యటనలో ఈ బాధను అనుభవించాను. క్రికెట్‌లో ఇదంతా సంభవమే.. మనకు అవకాశం వచ్చేవరకు వేచిచూడాల్సిందే. జట్టులో స్టార్ క్రికెటర్లు, లెజెండ్లున్నారు. నా వంతు ప్రయత్నం చేశాను. అని మనీష్ బుధవారం టీ20 అనంతరం రాత్రి మీడియాతో వ్యాఖ్యానించాడు. పాండే ఈ టీ20లో 48 బంతుల్లో 79 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. పాండే తన కెరియర్ పలుమార్లు అద్భుత ఇన్నింగ్స్ ఆడి భారత జట్టుకు విజయాన్ని అందించాడు. పాండే తన కెరియర్ ప్రారంభంలో ఆస్ట్రేలియాలో ఆడిన తొలి వన్డేలో సెంచరీ చేశాడు. నంబర్ 4 బ్యాట్స్‌మన్‌గా కొన్ని అవకాశాలు మాత్రమే వచ్చాయి. వాటిని సద్వినియోగం చేసుకున్నాను. కొన్ని సార్లు ఐదవ బ్యాట్స్‌మన్‌గా కూడా బరిలోకి దిగాల్సి వచ్చింది. అప్పుడు కూడా నా కర్తవ్యాన్ని పాటించాను. జట్టు గెలుపే ముఖ్యం కదా అని పాండే అన్నాడు. భారత్‌కు టాప్ ఆర్డర్ పటిష్టమైనది. వారు 30-35 ఓవర్లు ఆడతారు. విరాట్, ధోనీ అనంతరమే నా వంతు వస్తుంది. అయినప్పటికి నాకు బాధలేదు. ఇంకా అవకాశాలు వస్తే ఇప్పటికన్నా బాగా రాణిస్తానని చెప్పగలను అని పాండే చెప్పారు. పాండే దక్షిణాఫ్రికాతో ఆడిన వన్డే సిరీస్‌లో పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. కేదార్ జాదవ్ గాయపడ్డప్పటికి పాండేను కాదని శ్రేయాస్ అయ్యర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన 2009 ఐపీఎల్ టోర్నీలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతూ సెంచూరియాన్ మైదానంలోనే పాండే 73 బంతుల్లో 114 పరుగులు చేసి ఐపీఎల్‌లో తొలి సెంచరీ చేసిన వ్యక్తిగా రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలోనే పాండేకు ఈ పర్యటనలో అవకాశం వచ్చింది. ఐదవ బ్యాట్స్‌మన్‌గా ఆడటం కష్టమే. నాకంటే ముందు రైనా, యువీలు ఈ స్థానాల్లో ఆడారు. వారిలాగా నేను ఆడటానికి శ్రమించాల్సి ఉంటుంది. గత రెండేళ్లుగా భారత బ్యాటింగ్ విజయవంతంగా కొనసాగుతోంది. నా వంతు వచ్చేదాకా ఆగాల్సి ఉంటుంది. అందుకు చాలా సహనం అవసరం. అదే నేను పాటిస్తున్నాను అని పాండే ముగించాడు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

పెళ్లి ఏ స్థాయిలో చేస్తున్నా...తమ పెళ్లి...భిన్నంగా ప్రత్యేకంగా ఉండాలని, నలుగురు ఆ విషయాలు గొప్పగా చెప్పుకోవాలని చాలామంది అనుకుంటారు. జీవితభాగస్వామితో మొదలైన ఎంపిక.... పెళ్లి పొడుగునా అన్ని విషయాల్లోనూ ఉంటుంది. అలా ప్రత్యేకతని కోరుకునేవారికి ఈ భిన్నమైన శుభలేఖలు తప్పకుండా నచ్చుతాయి. అందమైన ఎర్రని అట్టపెట్టెలో అనేక అరలు... అందులో గణేశుడు, స్వీట్లు, శుభలేఖలు...అన్నీ కలిపి... వెరసి...కనుల విందైన శుభలేఖ. అగ్గిపెట్టెమీద...పర్‌ఫెక్ట్ మ్యాచ్ అనే టైటిల్ తో వధువు వరుడు ఫొటోలు, లోపల మరికొన్ని కవర్లలో వివరాలు...అయ్యో ఇదేం శుభలేఖ అని ఆశ్చర్యపోనక్కర్లేదు...ఏ శుభకార్యానికి దీపం వెలిగించాలన్నా...అగ్గిపుల్లే కదా అవసరం. అలాగే బోర్డింగ్ పాస్, థియేటర్ టిక్కెట్లుకూడా శుభలేఖలైపోతున్నాయి. బెలూన్‌కూడా పెళ్లిపత్రిక అవతారమెత్తుతోంది. శుభలేఖ పేరుతో ఇంటికి గాలిలేని బెలూన్ వస్తుంది....దాని నిండుగా గాలి ఊదితే...దానిపైన ఉన్న అక్షరాల్లో వివరాలు తెలుస్తాయి. పాస్‌పోర్టు, రిబ్బన్ కట్టిన న్యూస్‌పేపరు స్టైల్ లో కూడా శుభలేఖలు అలరిస్తున్నాయి. మ్యూజిక్ థీమ్‌తో సీడీలో పాటలు పలుకులను కలిపి... పెళ్లి పిలుపు పంపడం మరొక రకం. అందమైన బొమ్మలు ఆడే పాపప్ శుభలేఖ, ఇంకా పర్సు మోడల్ లో, చాక్లెట్ బాక్స్ రూపంలో, ఫిల్మ్‌రోల్ ఆకారంలో, వెబ్ పేజీ స్టైల్ లో, సినిమా పోస్టర్ధరదాతో, కామిక్‌బొమ్మలతో, వాట్సాప్ స్ఫూర్తితో, అడవి వాతావరణ బ్యాక్‌గ్రౌండ్‌తో...ఇదీ అది అని ఏముంది..కాదేదీ శుభలేఖ థీమ్‌కి అనర్హం అన్నట్టుగా...ఎన్నో రకాలుగా...ఆకట్టుకుంటున్నాయి శుభలేఖలు.







శుభలేఖ!





వెడ్డింగ్ స్పెషల్

పెళ్లి, పిల్లలను కనడంపై పెరిగిన నిర్ణయాధికారం.. కానీ..

జన్మించే హక్కు చిక్కుల్లోనే!



పెళ్లయిన ఆడవాళ్లకు ఇల్లు పిల్లలు తప్ప మరొక జీవితం ఉండదని...ఉండాల్సిన అవసరం లేదని నేటికీ చాలామంది నమ్ముతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నవయసులో పెళ్లిళ్లు జరుగుతున్న, చిన్న వయసులో తల్లులు అవుతున్న ఆడపిల్లల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టింది. అలాగే భర్త నుండి హింస ఎదుర్కొంటున్న మహిళల సంఖ్య కూడా దశాబ్దం క్రితం 37శాతంగా ఉంటే అది నేడు 29శాతానికి తగ్గింది. ఇదంతా శుభపరిణామమే. అయితే ఈ విషయం పట్ల ఆనందించే లోపునే ఆడా మగా నిష్పత్తిలో తేడా అలాగే ఉందన్న సంగతి గుర్తొచ్చి తీరుతుంది. జన్మించేహక్కే లేనప్పుడు.. ఇక పెళ్లి, తల్లవటం విషయాల్లో నిర్ణయాధికారం పెరిగిందని, హింస కాస్తయినా తగ్గిందిలే అని ఎలా ఆనందించగలం. అందుకే నేటి స్త్రీ పరిస్థితి ఎలా ఉంది...అనే ప్రశ్నకు మెరుగవుతోంది...అనే సమాధానంతో పాటు...మార్పుకి ఆమడదూరంలోనే ఉందని కూడా చెప్పాల్సివస్తుంది.

ఆడపిల్ల ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి...అనే విషయాన్ని పుట్టింటివారు నిర్ణయిస్తే...ఎప్పుడు పిల్లలను కనాలి, ఎంతమందిని కనాలి...అనే విషయాన్ని అత్తింటి తరపువారు నిర్ణయిస్తారు. ఇంకో అడుగు ముందుకువేసి హాస్యాస్పదంగా...తమకు మగపిల్లలే కావాలని... గొంతెమ్మ కోరికలు కోరే వారూ ఎక్కువే. విజ్ఞానం ఇంతగా పెరుగుతున్నా...పుట్టబోయేది ఆడా మగా అనే దాన్ని...మగవారి శరీరంలోని ఎక్స్‌వై క్రోమోజోములే నిర్ణయిస్తాయనే నిజాన్ని...ప్రభుత్వం గ్రామాలు పల్లెల్లోకి విస్తృతంగా ప్రచారం చేయలేకపోతోంది. డిజిటల్ ఇండియాలో ఈ మాత్రం తెలిసినవారి సంఖ్య చాలా చాలా తక్కువ. కచ్చితంగా ఫోన్లు ఇంటర్‌నెట్‌లు వాడుతున్నవారి సంఖ్యకంటే ఇది తక్కువే ఉంటుంది. దీని పట్ల అవగాహన పెరిగితే...ఎంతోమంది మహిళల జీవితాలు బాగుప డ తాయి... ఆత్మహత్యలు ఆగుతాయి... కుటుంబాలు నిలబడతాయి. కానీ అది జరగటం లేదు.

ఆ మార్పు మంచిదే!

ఈమధ్యకాలంలో ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారని...కోడలిని అత్తామామలు వేధించగా...కొడుకు కోడలు ఇద్దరు పిల్లలు బలవంతంగా ప్రాణాలు తీసుకోవటం చూశాం. స్త్రీ పట్ల ఉన్న వివక్ష...తగ్గకపోవటం వలన జరుగుతున్న దయనీయమైన సంఘటనలు ఇవి. ఇప్పటికీ మగపిల్లవాడు పుడితేనే ఇంట్లోకి రానిస్తామని...ఖరాఖండిగా చెబుతున్న అత్తమామలు ఉన్నారు. అత్తవారిళ్లముందు...మౌనపోరాటాలు చేస్తున్న ఆడవాళ్లు ఉంటున్నారు. మనమెంత అనాగరిక ప్రపంచంలో ఉన్నామో ఈ సంఘటనలు రుజువు చేస్తున్నాయి. వివాహం అయిన మహిళ జీవితానికి...అత్తగారింటికి మగపిల్లలను అందించడం తప్ప మరొక పరమావధి లేదని చదువుకున్నవారు నాగరికత తెలిసినవారు సైతం నమ్ముతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీకి పెళ్లి, పిల్లలను కనడం విషయాల్లో కాస్త నిర్ణయాధికారం పెరిగిందని, చిన్నవయసులో పెళ్లవుతున్నవారు, తల్లవుతున్నవారు తగ్గుతున్నారనే వార్త శుభసూచకమే మరి.



మరి ఈ నిష్పత్తి సంగతేమిటి?

2015-16లో విడుదలైన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే- 4 ఫలితాల ప్రకారం దశాబ్దం క్రితం 1000మంది మగపిల్లల సంఖ్యకు ఆడపిల్లల సంఖ్య 914 ఉండగా...ప్రస్తుతం ఆ సంఖ్య 919కి మాత్రమే పెరిగింది. సగం ఖాళీగా ఉన్న గ్లాసుని సగం నిండుగాఉంది...అని ఆశావాదంతో చెప్పుకోవటంలా...ఆడపిల్లల సంఖ్య కాస్తయినా పెరిగిందని ఊరడింపు పొందడమే తప్ప ఈ పెరుగుదల నామమాత్రమే. ప్రతి ఒక్క ఆడపిల్లకు 1.9మంది మగపిల్లలు ఉన్నట్టుగా గుర్తించారు. చాలా రాష్ట్రాల్లో ఆడామగా మధ్య నిష్పత్తిలో తేడా మరింతగా పెరుగుతున్నది. ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ లాంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లోనూ...స్త్రీ పురుషుల సంఖ్యల్లో తేడాలు పెరుగుతున్నాయి. పుట్టబోయే శిశువు లింగనిర్ధారణ చేయరాదనే చట్టాలు ఉన్నా...ఆడపిల్లల పట్ల ఉన్న వ్యతిరేక దృక్పథం కొంచెం తగ్గుముఖం పడుతున్నా...మగపిల్లాడే కావాలనే సంస్కృతి మనదేశంలో అలాగే ఉంది. ఇరవై ఏళ్ల క్రితం ఆడపిల్లలకు టెక్నాలజీ మేనేజ్‌మెంట్ లాంటి రంగాల్లో అంతగా ఉద్యోగ అవకాశాలు లేవని కానీ ఇప్పుడు అమ్మాయిలకుకూడా అలాంటి ఉద్యోగాలు లభిస్తున్నాయని మాంచెస్టర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ బినా అగర్వాల్ అంటున్నారు... ఇలాంటి మార్పులు వస్తున్నా భారత్‌లో ఆడామగా నిష్పత్తిలో తేడా 2031నాటికి మరింతగా పెరుగుతుందని...అప్పుడు వెయ్యిమంది అబ్బాయిలకు 898మంది అమ్మాయిలు మాత్రమే ఉంటారని లెక్కలు చెబుతున్నాయి.



ఒక ప్రశ్న... రెండు సమాధానాలు..!

వరల్డ్ ఉమెన్స్ డే -2018

మరి స్త్రీ జీవితం మారిందా.... అంటే మారింది...అనే సమాధానంతో పాటు మారలేదు...అని కూడా చెప్పాల్సిందే.

పట్టుచీర... ఆకట్టుకునే నగ...

పెళ్లికూతురు... ధగధగ!







పెళ్లనగానే ఎవరికైనా ముందుగా గుర్తొచ్చేది షాపింగ్... అది కూడా పట్టుచీరలు, బంగారు నగలు. ఇవి రెండూ ఎక్కడ కొంటున్నారు, ఎంతలో కొంటున్నారు...అనేది అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. పెళ్లి కూతురి ముస్తాబులో పట్టుచీరదే మొదటి స్థానం. తమిళనాడు కాంజీవరం, కాశీ బనారస్, ఒడిషాకు చెందిన శంబల్ పురీ సిల్క్ చీరలు, అసోం సిల్క్ లేదా ముగా సిల్క్, దక్షిణ భారతమంతటా ఎక్కువగా కడుతున్న రేషం పట్టు చీరలు, పట్టుపై జర్దోసీ వర్క్ చేసిన చీరలు, ఔరంగాబాద్ నుండి పైతానీ పట్టుచీరలు...ఇలా ఎన్నో రకాల పట్టుచీరలు వధువులకు పెళ్లికళని తెస్తున్నాయి. అలాగే పెళ్లి కూతుళ్ల కోసమే తయారుచేసిన ప్రత్యేక నగలు సైతం మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో లాంగ్ చైన్లు, నెక్లెస్‌లు, వడ్డాణం, అరవంకీలు, జడ మరింత ముఖ్యమైనవి. ఇప్పుడు మెడని పూర్తిగా కవర్‌చేసే నెక్లెస్‌ల హవా నడుస్తోంది. ఇవి పెళ్లి కుమార్తె ముగ్ధమనోహరమైన మోముకి బంగారు పహారా కాస్తున్నట్టే నిండుగా ఉంటున్నాయి. పెళ్లి కుమార్తెకోసం వాడే నగలన్నింటితో బ్రైడల్ జ్యువలరీ సెట్స్ కూడా లభిస్తున్నాయి. పట్టుచీర రంగులకు తగినట్టుగా వీటిని ఎంపిక చేసుకోవచ్చు. మెరిసిపోయే పట్టుచీర...అందమైన డిజైన్లతో ఆకట్టుకునే నగలతో...పెదవులపై చిరునవ్వులు విరబూస్తుంటే..వధువు ధగధగమనకుండా ఉంటుందా.... ఇలా!



అహింసకు సాయి ఆలంబన


మహాత్ములు స్వయంగానే కాక ఏదో విధంగా తమ ఆదేశాన్ని భక్తుల ద్వారా పంపిస్తూ ఉంటారు. దానిని పాటించేలా పరిస్థితుల్ని కూడా వారే కల్పిస్తారు. ఎవరో వచ్చి ఇచ్చిన మంచి సలహా మనకు ఎంతో లాభించిన సందర్భాలుంటాయి. ఆ సమయంలో సలహా ఇచ్చినది మనకు చిర పరిచితులే కావచ్చు. అయితే వారి నుంచి వచ్చిన సలహా దైవ ప్రేరితం కావచ్చు.



నాగేశ్ ఆత్మారాం సావంత్ సాయి భక్తుడు. సాయి బోధనలను ఆచరించాలని తపన ఉన్న వ్యక్తి. అతను ఒకసారి చిన్నతనంలో సెలవులకు తన స్వగ్రామం వెళ్ళాడు. అతని తండ్రికి చేపలు పట్టడం సరదా. అది ఆయన వృత్తి కాదు. సరదా కోసం జీవ హింస చేస్తున్నాననే స్పృహ ఏ మాత్రం లేనివాడాయన. నాగేశ్ తన తండ్రిని, చేపలు పట్టవద్దని వారించాడు. అయితే ఆ తండ్రి తనయుని మాటను వినలేదు. ఒక సారి నాగేశ్ తండ్రి చేపలు పట్టి ఇంటికి వచ్చాడు. కాసేపటికి నాగేశ్‌కు జ్వరం వచ్చింది. నాగేశ్ తల్లితండ్రులు తల్లడిల్లిపోయారు. అప్పుడు నాగేశ్ ఇలా అన్నాడు. మీరు చేప పిల్లలను పట్టి చంపుతున్నపుడు వాటి తల్లులు కూడా ఇలానే బాధపడతాయి కదా! నేను జ్వరంతో బాధపడ కూడదనుకుంటే మీరు చేపలు పట్టడం మానండి' అన్నాడు. తల్లితండ్రులు అతని మాటల్లోని సత్యాన్ని గ్రహించారు. ఎవరికైనా తమ దాకా వస్తే గాని తెలియదు కదా! 'నా కుమారుని జ్వరం రేపు ఉదయానికి తగ్గితే నేను చేపలు పట్టటం, తినడం మానేస్తాను' అని అతని తండ్రి సాయికి వాగ్దానం చేశాడు. సాయి ఊదిని నాగేశ్ నుదుటిపై పెట్టాడు. సాయికి అది చాలు. జ్వరం తగ్గిపోయింది. జీవ హింసకు తెరపడ్డది. ఇదే సాయి మన నుంచి కోరుకునేది. నాగేశ్ తండ్రికి హితవు చెప్పడం నుంచి అంతా సాయి ప్రేరణతోనే జరిగి ఉండొచ్చు.

మానవులు జంతువులన్న భేద భావం లేదు

రక్షణ ఇవ్వడంలోనే కాదు, పశు పక్ష్యాదులకు ప్రేమగా ఆహారం ఇస్తూ మనుషులకు ఇచ్చి నట్లుగానే సత్పురుషులు సంతోషిస్తారు. మానవులు, జంతువుల మధ్య తేడా చూపని దృష్టి వారిది. సొరకాయల స్వామిగా పిలిచే ఒక మహాత్ముడు ఒకసారి నారా యణవనం సమీపాన ఉన్న అడవిలో తిరుగుతున్నాడు. ఒక మేక పిల్ల కాలికి దెబ్బ తగిలి కుంటుకుంటూ నడుస్తున్నది. దాని కాలును తోమి, ఏదో మందు కట్టు కట్టి నయ మయ్యేదాక దానిని సాకారు. తరువాత మందలో చేర్చారు. మరోసారి ఒక గాడిద కాలు విరిగి దీనంగా ఓండ్రు పెడుతోంది. సొరకాయల స్వామి దాని వద్దకు పోయి కట్టుకట్టి, తిండి పెట్టి, నీరు తాగించారు. ఒకసారి స్వామి చెంగల్రాయ మొదలి యారుతో 'వాడు తిండి లేక మాడిపోతు న్నాడు. పోదాం పద! ఏమైనా పెడదాము' అని అన్నారు. కొన్ని వీధులు తిరిగారు. ఒక చోట ఆగారు. అక్కడ కట్టి ఉన్న ఎద్దు కోసమే తాను వచ్చినట్లు ఆయన తెలిపారు. మొదలియారు కేక వేసి ఇంటి యజమానిని పిలిచారు. ఆయన వచ్చి కొన్ని దినాల నుంచి ఎద్దుకు రోగం పట్టు కున్నదని, నీరు, గడ్డి ముట్టటం లేదని రోజు రోజుకు శుష్కిం చి పోతోందని చెప్పారు. సొరకాయల స్వామి ఆ ఎద్దు చుట్టూ ఒకసారి తిరిగి, గడ్డి తినమని ఆజ్ఞాపించారు. అది వెంటనే గడ్డి తింది, నీరు తాగింది. ఇక్కడ 'వాడు' అంటే మానవుడే కానక్కర్లేదు. జీవులన్నీ ఆయనకు ఒక్కటే. ఒకే విధంగా ఆయన చూచేవారు, కాచేవారు, ఆపదల నుంచి ఇతర మహనీయుల వలె.



నారాయణ్ మహరాజ్

మహనీయుల సేవలో జంతువులు




సొరకాయల స్వామి

జంతువు కోసం ఆహారం వదిలిన నారాయణ్ మహరాజ్

ఖేడ్గాం భేట్ నారాయణ్ మహరాజ్ పుణ్య తీర్థాలను దర్శించే వారు. ఒకసారి కీకా రణ్యంలో ఉన్న శివ మందిరంలో చేరారు. అక్కడ శివుడు ఎప్పుడూ జాగ్రదావస్థలో ఉంటాడంటారు. ఆ మందిర పరిసరాలు ఎప్పుడూ ఫల పుష్పాలతో నిండి ఉంటాయి. మంగళ వాయిద్యాలతో శోభిల్లుతూ ఉంటుంది. దేవ గంధర్వుల గజ్జెల సవ్వడి కూడా వినబడుతుండేది. నారాయణ్ మహరాజ్ మొదటి రోజు ఆ ఆలయంలో ఉన్నారు. నిర్భయులై ఉన్నారు. రాత్రి అయింది. వారికి ఆకలయింది. శివుని సమక్షంలో గల ఫలహారాలను ప్రసాదంగా భావించి తిన్నారు. గుడిలో ఒక మూల కూర్చున్నారు. ఇంతలో ఒక పులి అక్కడకు వచ్చింది. మిగిలిన ఫలాదులను వాసన చూసింది. ఎవరైనా ఉన్నారేమోనని నాలుగు దిక్కులా చూసింది. నారాయణ్ మహరాజ్ కనిపించాడు. ఆ పులి ఆయన వద్దకు వచ్చి పాదాలను వాసన చూసి, తన దారిన తాను వెళ్లిపోయింది. ఆ పులి తన వద్దకు వస్తున్నప్పుడు నారాయణ్ మహరాజ్ భయపడలేదు. పులి ఆహారం కోసమే అక్కడకు వచ్చిందని గ్రహించారాయన. మర్నాటి నుంచి శివలింగం వద్ద ఉన్న ఫలాలను తినడం మానివేశారు. పులి ఆ రాత్రి వచ్చి అక్కడ ఉన్న ఫలాదులను తిని వెళ్లిపోయింది. ఇలా కొన్ని రోజులు గడిచిన తర్వాత నారాయణ్ మహరాజ్ ఇతర పుణ్య తీర్థాలను సందర్శించేందుకు వెళ్ళిపోయారు. సాయినాథుని కొలంబా నుంచి కుక్కలు, పిల్లులు యధేచ్ఛగా ఆహారాన్ని స్వీకరించేవి.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

అనుసరణే అసలైన ఆరాధన



ఏ పురాణం, ఇతిహాసం చదివినా దానిలోని ధర్మం గ్రహించాలి. వాటిని చదవాలని పెద్దలు చెప్పడంలో ప్రధాన ఉద్దేశం అదే. మహాభారతంలో అంతర్గతంగా భగవద్గీత అనే అనర్ఘ రత్నం ఉంది. శాంతి అనుశాసనిక పర్వాలు ధర్మాల గనులు. అలాగే రామాయణం విషయానికి వస్తే రాముడు అడుగడుగులో ధర్మం ఆచరిస్తూనే ఉన్నాడు. రాముడు పితృవాక్పరిపాలకుడు అని మనకు తెలును. ఈ సందర్భంగా రాముడు అరణ్యానికి వెళ్లే సమయంలో సీతతో అన్న మాటలు ఆ రోజుల్లో కన్నా ఈ రోజుల్లో మరింతగా శిరోధార్యం. ఆయన అరణ్యానికి వెడుతూ సీతను రావద్దని చెప్పటానికి ఎంతగానో ప్రయత్నించాడు. ఎంతో చర్చ జరిగాక ఆమె మాటలో ధర్మం ఉందని గ్రహించి చివరకు అనుమతిచ్చాడు. ఆ సమయంలో శ్రీరాముడు తనకు తల్లిదండ్రులు అంటే ఉన్న గౌరవం గురించి చెబుతూ ఇలా అన్నాడు. ఆ ధర్మమూర్తి నోటి నుంచి తల్లి దండ్రుల గురించి వచ్చిన పలుకులు ఇవి. 'సీతా! తల్లి, తండ్రి, గురువు మనకు ప్రత్యక్షదైవాలు. వారిని పూజించకుండా, కని పించని దేవతలను ఆరాధించడం ధర్మం కాదు. ముల్లోకాల్లో వెదికినా తల్లి, తండ్రి, గురువుకు మించిన దైవాలు కానరారు. అటువంటివారు భూలోకంలో మన కళ్లెదురుగా ఉండగా వారిని సేవించుకోవాలి. మనం ఎన్ని యజ్ఞ యాగాది కర్మలు చేసి విరివిగా దక్షిణలిచ్చినా అవేవీ తండ్రికి చేసే సేవకు సమానం కావు. తండ్రి ఆజ్ఞను శిరసావహించేవాడికి స్వర్గం, ధనం, విద్య, సంతానం మొదలైనవన్నీ సమకూరుతాయి... అందువలన నా తండ్రి నన్ను ఏమి చేయమని ఆజ్ఞాపించారో ఆ కార్యాన్ని శిరసా వహించి ఆచరిస్తాను. అదే సనాతన ధర్మం...సీతా! వన వాసానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకుని త్వరగా సిద్ధం కా, నువ్వు లేకుండా ఆ స్వర్గానికి కూడా పోను సుమా! నీ వద్ద ఉన్న విలువైన వస్తువులన్నీ నీ కింద పని చేసే వాళ్లకు ఇవ్వు. కొన్ని బ్రాహ్మణులకు దానం చెయ్యి. ఇంకా ఆలస్యం చేయకు. త్వరపడు' **(పుటలు 148 - 149 - అయోధ్యా కాండ, 30వ సర్గ).**

ఏనాడో రాముడు ఈ బోధ చేశాడు. ఆ రోజుల్లో తల్లిదండ్రుల్ని గౌరవించని వారు లేరు. అయినా చెప్పాడు. ఎందుకంటే ముందు తరాల వారి కోసం. రామాయణం అంటే కొంత మందికి ఎంతో గౌరవం ఉంటుంది. రాముడంటే అపరి మితమైన భక్తి ఉంటుంది. రామాయణ పారాయణానికి, ప్రవచనాలు వినటానికి, కళ్యాణాలు చేయించటానికి ముందుం టారు. ఆ ఉత్సవాలకు శ్రమదానాలు చేయడం వంటివి చేస్తుం టారు. అయితే రాముడు ఇవన్నీ చేశాడా, చేయమన్నాడా అంటే ఆయనపై భక్తితో మనం చేస్తున్నాం, అయితే ఆయన చేసి చూపిన పితృవాక్పరిపాలన, తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు క్రమంగా మృగ్యమవు తున్నాయి. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల పాలు చేసే స్థితి ప్రబలుతోంది. వారిని ఇంటిలో మంచాన పడేసి గుళ్లు గోపు రాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడుతోంది.

రాముడు చెప్పినది మరోటి కూడా ఉంది. సీత తన వద్ద ఉన్న విలువైనవస్తువులను ముందు పనివాళ్లకు, పేదలకు ఇవ్వమన్నాడు. ఇది తన వద్ద పనిచేసే వారి పట్ల, పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండాలనే విషయాన్ని తెలియజేస్తోంది. అది గ్రహించాలి. అదే ఆయనను మనం నిజంగా ఆరాధించడం అవుతుంది.

- రాచమడుగు శ్రీనివాసులు
9492748758

భగవద్గీత



కర్మఫల త్యాగం, ఏకాగ్రతలతో నన్ను పొందగలవు

అధ్యాయం 8

శ్లోకం 7

తస్మాత్ సర్వేషు కాలేషు
మామనుస్మర యుధ్య చ।
మయ్యర్పితమనోబుద్ధిః
మామేవైష్యస్యసంశయమ్॥

తాత్పర్యం

కావున ఓ అర్జునా! సర్వకాలములయందును నీవు నన్నే తలుస్తూ నీ విధ్యుక్తధర్మమైన యుద్ధము చేయి. నీ కర్మలను నాకు అర్పించటం ద్వారా, నీ మనోబుద్ధులను నా యందు నిలుపుట ద్వారా నీవు నన్ను నిస్సందేహంగా పొందగలవు.

భాష్యం

శ్రీకృష్ణుడు అర్జునునికి ఇస్తున్న ఈ ఉపదేశం భౌతిక కార్యాలలో నిమగ్నమై ఉన్న ప్రతి వ్యక్తికీ అత్యంత ముఖ్యమైనది. శ్రీ కృష్ణుడు అర్జునుని యుద్ధాన్ని విడనాడి, తనను స్మరించుమని చెప్పటం లేదు. అలాగే ప్రతి ఒక్కరూ తమ తమ ధర్మాలను నిర్వహిస్తూనే 'హరే కృష్ణ' ద్వారా కృష్ణుణ్ణి స్మరించవచ్చును. ఈ విధంగా భౌతిక కల్మషాల నుండి మనస్సు, బుద్ధి ప్రక్షాళన చెంది కృష్ణునిపై లగ్నము చేయటం సాధ్యమవుతుంది. ఇలా కృష్ణుని నామాలను జపించుట చేత తప్పక కృష్ణలోకానికి చేరుకుంటారు.


అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

android Google play | iOS iTunes

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

కృతి సమర్పణ



(గత సంచిక తరువాయి భాగం)

ఏం చిత్రం జరిగిందనుకున్నావు. నమస్కరించాలని వొంగేసరికి, పూలు,పళ్ళూ, అగరువత్తులూ, వక్కలూ, ఆకులూ మొదలైన శోభన సామగ్రితో నింపిన పెద్ద పళ్లెం పట్టుకొని ఒక భక్తుడు బ్రాహ్మణ బృందంతో సహా వచ్చి, ఈ పుస్తకాల పక్కనే ఆ పళ్ళెం పెట్టాడు. వంగినదాన్ని లేచి చూచేసరికి విభ్రాంతి కలిగింది. అంతా గుంపుగా నిలిచి **"న కర్మణా న ప్రజయా ధనేన"** అంటూ వేదమంత్రం పఠించారు. అనంతరం అంతా మళ్లీ నమస్కరించి లేచాం. కృష్ణస్వామి ప్రసాదమిచ్చి, వారిని పంపాడు. భగవాన్ పేపరు అవతల వుంచి సావధానులై ''ఈనాడు వారికి షష్టిపూర్తిట'' అన్నారు నాతో. ''అట్లాగా'' అన్నాను. ఎట్లాగైతేనేమి? తలవని తలంపుగా జరిగిన ఈ సన్నివేశం వల్ల నేనేమీ తేలేదన్న లోపం తీరినట్లుగా నాకు సంతృప్తి కలిగింది.

పుస్తకాలు అక్కడుంచాడు కృష్ణస్వామి. నేను భగవాన్ చేతికందించాను. ఇటూ అటూ తిప్పి చూచి ''సరే. ఆఫీసులో ఇవ్వు. ముద్రవేసి రానీ చూద్దాం'' అన్నారు. ప్రెస్సువారు, ఫోటో క్రింద భగవాన్ పేరు వేయటం మరచిపోయినారని తీసి చూపించాను. ''అరరే, పొరపాటయిందే, పోనీ, నామం రూపంలో కలిసిపోయిందిలే. ఆఫీసులో ఇవ్వు'' అన్నారు భగవాన్. చిత్తమని తీసుకున్నాను. ఆఫీసుకు వెళ్లి, నిరంజనానంద స్వాముల చేతికిచ్చి వచ్చాను. తొమ్మిది గంటలకు మౌనస్వామి రెండు పుస్తకాలు తెచ్చి భగవానునకిచ్చారు. భగవాన్ చూచి ''ఒకటి నాకూ, ఒకటి నాగమ్మకూనూ?''అంటూ సమీపస్థులతో ''ఏమోయ్. ఇది దానికివ్వు. అది వ్రాసింది. వాళ్ల అన్న అచ్చువేయించాడు. అదే పుస్తకాలు తెచ్చి మనకిస్తే అందులో ఒకటి దానికిస్తున్నాం. బెల్లంతో పిళ్లారిని చేసి, పూజానంతరం ఆ బెల్లమే గిల్లి నైవేద్యం పెట్టినట్లున్నది. పళ్లు తెచ్చిపెడితే, ప్రసాదం ఇవ్వటం లేదూ? అట్లాగే ఇదీను'' అన్నారు.

కరతల భిక్ష

20-6-47

నాలుగయిదురోజుల క్రితం ఆశ్రమంలో మాధవస్వామి నోటుబుక్కొకటి దొరికింది. శ్రీవారది చూస్తుంటే తామెప్పుడో వ్రాసిన తమిళపద్యమొకటి కంట పడింది. మళయాళపు అక్షరంలో ఉన్న ఆ పద్యం ఆరవ అక్షరంలో వ్రాస్తూ దాని భావం మాకిట్లా చెప్పారు: ''మనుష్యునకు జ్ఞానం కలిగిన వెనుక ఈ శరీరం మీద లక్ష్యం ఉండదు. ఎంత చక్కని విస్తరిగానీ భోజనానంతరం విసరిపారేసినట్లు ఈ భౌతిక శరీరం జ్ఞానోదయానంతరం ఎప్పుడు పారవేద్దామా అని చూస్తాడు. ఇదే ఈ పద్యంలోని సారాంశం''.

''ఏ కారణం వల్ల భగవాన్ ఈ పద్యం వ్రాశారో'' అన్నారొక భక్తులు. ''తమిళ్ భాషలో ప్రభులింగలీల అనే ఒక గ్రంథమందు ఇదే భావం నాల్గుపాదాల పద్యంగా ఉండటం చూచి, సంగ్రహంగా వ్రాస్తే మంచిదని తోచి ఈ చిన్నగీతం వ్రాశాను. రెండే పాదాలిది'' అని చెప్పి, దానిని తమిళాక్షరంలో వ్రాసి ముగించి, ''చూడండి, ఈ ఎంగిలాకు ఉపమానాలు ఎందరో చెప్పారు. ఎంత బాగా కుట్టిన విస్తరైనా, భోజనమయ్యేవరకే. ఆ వెనుక దానియందు లక్ష్యం ఉంటుందా? వెంటనే పారవేస్తాం. ధనవంతులైతే, వెండితో చేయించి, బంగారుపూలు వేయిస్తారు. భగవంతుడిచ్చిన చేతులుండగా అవన్నీ ఎందుకో. నేను కొండమీద ఉండగా, ఒకరు వెండితో విస్తరి చేయించి తెచ్చి 'స్వామీ దీనిలో భోజనం చేయా'లన్నారు. నాకెందుకని పంపేశాను. ఏమో చేతులో వేయించుకొని తింటే తీరేదానికి వెండీ, బంగారమూ ఎందుకూ. నేను చాలాకాలం విస్తరి వేయించుకొని తిననేలేదు. ఎవరన్నా ఆహారం తెస్తే, ఇట్లా చెయ్యి చాచి, చేతులో వేస్తే తినేవాణ్ణి. ఈ మధ్య గదా ఆకులో భోజనం'' అన్నారు భగవాన్.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. కుటుంబసఖ్యత పెరుగుతుంది. శారీరిక శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో చిరుజాగ్రత్తలు పాటించాలి. రుణ ఒత్తిడులు క్రమక్రమంగా తగ్గుతాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: వాహన నిర్ణయాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగుతాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసికధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో ఆయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదా యంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభరాశి: ఒత్తిడులు ఉద్యోగపరంగా పెరుగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

మీనరాశి: విద్యాప్రయత్నాలు కలసి వస్తాయి. నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి కాబట్టి జాగ్రత్తలు తప్పనిసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

Business సరిగమలు



ప్రతి నెలా మనకొచ్చే నెలజీతంలో 10శాతం అన్నా పొదుపు కోసం పక్కన పెట్టాలి. దీర్ఘకాలంలో ఇలా సమకూర్చుకున్న నిధులు మన అవసరాలను ఆదుకుంటాయి. పదవి విరమణ తర్వాత వృద్ధాప్యంలో ఆసుపత్రులకయ్యే ఖర్చులు ఆర్థిక ఇబ్బందుల్లో ఆదుకునేందుకు పొదుపు తోడ్పడుతుంది. ప్రతినెలా మన రాబడి ఎంత నెలకయ్యే ఖర్చు ఎంత బేరీజు వేసుకొని ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలి. ధనము విలువ తెలుసుకొనుట మానవ ధర్మం అని పెద్దలు చెప్పినట్టు నడుచుకోవాలి. అన్నిటికీ మించి మన జీవితంలో కొన్ని లక్ష్యాలు సాధించాలనుకొన్నప్పుడు ఖర్చులపై ఖచ్చితమైన నియంత్రణ ఉండాలి. ఒకవైపు ఆదాయం పెంచుకునే మార్గాలను తెలుసుకుంటూనే ఖర్చులు తగ్గించుకునే మార్గాలను వెదకాలి.

భవిష్యత్తుకు భరోసానిచ్చే పొదుపు

రమేష్ ఓ కార్పోరేట్ కంపెనీల్లో పనిచేస్తున్నాడు. నెలకు 40వేల రూపాయలకు పైగా ఆర్జిస్తున్నాడు. ఆయన తోటి ఉద్యోగులంతా ఆస్తులు సమకూర్చుకోవడం జరుగుతుంది. అయితే రమేష్ మాత్రం నెలాఖరు వచ్చేవరకు ఆఫీసులో అందర్ని అప్పులు అడుగుతుండేవాడు దీనితో అతనిపై కొలీగ్స్ అంతా గాసిప్ చేసేవారు. అతను పేకాట వీరుడని చిన్నిల్లు ఉందని గుసగుసలాడేవారు. అతనికి మంచి మిత్రుడైన ప్రశాంత్ ఓ రోజు ప్రశాంతంగా అడిగాడు. రమేష్ నెలాఖరు వచ్చేవరకు ఎందుకు ఆఫీసులో అందర్ని అప్పులు అడుగుతున్నావ్? నీ గురించి ఫ్రెండ్స్ అంతా రకరకాలుగా చెప్పుకుంటున్నారని దానితో రమేష్ అసలు రహస్యం చెప్పాడు. తనకే చెడు అలవాట్లు లేవని కేవలం అతని భార్యకున్న అమితంగా ఖర్చు చేసే అలవాటు వల్లే వున్న డబ్బంతా ఖర్చయిపోతుందని అవసరం లేకపోయినా లోన్ కారు,, తేలిక్కగా రిటైల్, వ్యక్తిగత రుణాలు దొరుకుతున్నాయి కదా అని అవసరం లేకపోయినా గృహోపకరణాలను కొంటూ నెల జీతం అంతా రుణాలు కట్టడానికే సరిపోతుంది.

దానివల్ల రమేష్‌కు 40వేల జీతం వచ్చినా ఏ మాత్రం సరిపోవడం లేదు. రమేష్ భార్యలాంటి వారు ఈ సమాజంలో చాలామంది కన్పిస్తారు. మగవాళ్లు సైతం విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ అప్పులపాలవడం నిత్యం గమనిస్తూనే ఉన్నాం. ఇంగ్లీషులో ఓ మంచి సామెత ఉంది. ''ఎపెన్నీ సేవ్డ్ ఈజ్ ఎపెన్నీ ఎర్న్‌డ్'' అంటే ఓ రూపాయి పొదుపు చేస్తే ఓ రూపాయి ఆర్జించినట్లేనని. పొదుపు ఆర్థిక భద్రత నిస్తుందని గమనించాలి. జీవించడానికి కావాల్సిన ధైర్యాన్ని ఇస్తుంది. పొదుపు చేసే దేశం ప్రగతిశీల దేశంగా పరిగణించబడుతుంది. భారతదేశ సంస్కృతిలోనే పొదుపు ఒక భాగంగా చెప్పుకోవచ్చు.

2008 సంవత్సరంలో అంతర్జాతీయ మాంద్యం వచ్చి అమెరికాలో సబ్‌ప్రైమ్ క్రైసిస్ ఏర్పడినప్పుడు అక్కడి ప్రజలు ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి వచ్చింది. బ్యాంకులు కుప్పకూలాయి. అయితే భారతదేశ ఆర్థిక వ్యవస్థ చెక్కు చెదరలేదు. దీనికి ప్రధానకారణం ఎక్కువమంది ప్రజలు పొదుపర్లు కావడమే. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సంపాదనలో కొంత పొదుపు చేసే అలవాటు మన తాత, ముత్తాతల కాలం నుంచి వస్తూనే ఉంది. అయితే అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో ఈ సంస్కృతి కనిపించదు. 'అనుభవించు రాజా' అన్న ధోరణి ఎక్కువగా ఉండటం వల్ల కన్స్యూమరిస్ట్ జీవన సరళి ఆదేశాన్ని అప్పుల పాలు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం అమెరికా అప్పులు ట్రిలియన్ డాలర్స్‌గా ఉంటాయని అంచనా వేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఇది 84శాతం ఎక్కువ. కారణం ప్రజల్లో పొదుపు చేసే అలవాటు లేకపోవడమే. 2008 సంవత్సరానికి పూర్వం అమెరికా స్థూల పొదుపు రేటు 5శాతం కూడా వుండేది కాదు. ఆర్థిక మాంద్యం తర్వాత బుద్ధి తెచ్చుకున్న ప్రజలు ఇప్పుడు పొదుపు చేయడం మొదలుపెట్టారు అందువల్ల వారి సేవింగ్‌రేటు 17శాతానికి పెరిగింది.

పొదుపు ఎందుకు, ఎలా?

ప్రతి నెలా మనకొచ్చే నెలజీతంలో 10శాతం అన్నా పొదుపు కోసం పక్కన పెట్టాలి. దీర్ఘకాలంలో ఇలా సమకూర్చుకున్న నిధులు మన అవసరాలను ఆదుకుంటాయి. పదవి విరమణ తర్వాత వృద్ధాప్యంలో ఆసుపత్రులకయ్యే ఖర్చులు ఆర్థిక ఇబ్బందుల్లో ఆదుకునేందుకు పొదుపు తోడ్పడుతుంది. ప్రతినెలా మన రాబడి ఎంత నెలకయ్యే ఖర్చు ఎంత బేరీజు వేసుకొని ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలి. ధనము విలువ తెలుసుకొనుట మానవ ధర్మం అని పెద్దలు చెప్పినట్టు నడుచుకోవాలి. అన్నిటికీ మించి మన జీవితంలో కొన్ని లక్ష్యాలు సాధించాలనుకొన్నప్పుడు ఖర్చులపై ఖచ్చితమైన నియంత్రణ ఉండాలి. ఒకవైపు ఆదాయం పెంచుకునే మార్గాలను తెలుసుకుంటూనే ఖర్చులు తగ్గించుకునే మార్గాలను వెదకాలి.



అప్పులు పొదుపుపై భారం పెంచుతాయి కాబట్టి అప్పులు పెరగకుండా చూసుకోవాలి. ప్రస్తుతకాలంలో ప్రయివేటు ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఈ ఉద్యోగాలు ఎప్పుడు ఊడిపోతాయో తెలియదు. చాలా కమెనీల్లో జీతాలు సక్రమంగా రావు. ఒక్కొక్కసారి ఉద్యోగం పోతే మళ్లీ రావడానికి చాలా సమయం పడుతుంది. కాబట్టి కష్టార్జితంలో కొంతైనా పొదుపు చేసుకుంటే భవిష్యత్తులో ఇబ్బంది పడకుండా వుంటారు.

ఆహారం, దుస్తులు, చెప్పులు, సబ్బులు, ప్రయాణ ఖర్చులు, విద్యుత్ బిల్లు, టెలిఫోన్, మొబైల్, ఇంటర్నెట్ బిల్లులు, ఆరోగ్యం కోసం మందులు, పిల్లల చదువు, అద్దెలు, వంటగ్యాస్, రెస్టారెంట్స్, వినోదం కోసం అయ్యే ఖర్చులు.. ఇలా నెలసరి ఖర్చుకు సరిపడా బడ్జెట్‌ను రూపొందించుకోవాలి. ఈ ఖర్చులను ఎంతవరకు తగ్గించుకోవచ్చో ప్రయత్నించాలి.

ఇంట్లో ఎలక్ట్రిసిటీ ఆదా చేయవచ్చా, మొబైల్ ఫోన్ వాడకం తగ్గించవచ్చా చూసుకోవాలి. షాపింగ్‌కు వెళ్లేటప్పుడు లిస్ట్‌తో వెళ్లాలి. లేకుంటే అక్కడ దొరికిన చెత్తంతా ఇంటికి తెచ్చే ప్రమాదం వుంటుంది. షోరూమ్స్ ఇచ్చే ఆఫర్స్‌తో మోసపోకండి. ఒకటి కొంటే రెండు ఉచితం లాంటి ఆఫర్ల ద్వారా మోసపోవడం తప్ప ఏమీ ఉండదు. ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్‌లో కొన్ని ఉత్పత్తులు బయట మార్కెట్ కంటే తక్కువకే వస్తాయి. వాటిని జాగ్రత్తగా కొనుగోలు చేయండి. అవసరం అయితేనే డబ్బులు ఖర్చు చేయండి. కొంతమంది అవసరం లేకపోయినా ఇల్లంతా వస్తువులతో నింపుతారు. దీనివలన డబ్బు వృధా, ఇల్లంతా చెత్తకుండీలా మారుతుంది.

పొదుపు చిన్నప్పటి నుంచి ప్రారంభం

ఎక్కువ మంది పదవీ విరమణ చేసే సమయంలో పొదుపు గురించి ఆలోచిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. చిన్న వయస్సు నుంచే తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవాటు చేయాలి. డబ్బు విలువ వారికి నేర్పాలి. చాలామంది తల్లిదండ్రులు ఈ రోజుల్లో చిన్నారులకు పాఠశాలకు వెళ్లేటప్పుడు వేలరూపాయలిస్తారు. ఇది వారిని పెడమార్గంలో పెట్టేందుకు దోహదపడుతుందని గ్రహించాలి. పెద్దవారైనప్పుడు వారు విచ్చలవిడిగా ఖర్చుచేయడం అలవాటు చేసుకొని జీవితాల్ని అప్పుల కుప్పగా మార్చుకుంటారు. చిన్నారులకు బాల్యంలోనే పొదుపు అలవాట్లను నేర్పాలి.

భారత్‌లో తగ్గుతున్న సేవింగ్‌రేటు

ఇటీవలి కాలంలో దేశాన్ని కలవరపెడుతున్న అంశాల్లో తగ్గుతున్న స్థూల సేవింగ్ రేటు ఒకటి. 2008లో 36.8శాతంగా ఉన్న భారత్ స్థూల పొదుపు రేటు 2017 నాటికి 30శాతంగా ఉంది. చైనా, సింగపూర్, రష్యాతో పోలిస్తే వెనుకపడ్డాం. ఇది కొంచెం ఆందోళన కలిగించే విషయమే. దీనికి ప్రధాన కారణం విరివిగా రిటైల్ క్రెడిట్ లభించడమే. అంటే అప్పు ఇచ్చే వాళ్లు ఎక్కువయ్యారన్నమాట. బజారుకెళితే మీరు పైసా కట్టకుండా ఉత్పత్తులు ఇంటికి తీసుకెళ్లండంటూ మాయమాటలు చెప్పే వాళ్లు ఎక్కువయ్యారు. చివరకు సెల్ ఫోన్ కూడా మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఇచ్చేస్తున్నారు. ఇది మోసపూరితమైన వ్యాపారం. దీన్నుంచి ప్రజలు బయటపడాలి. ఉత్పత్తుల ధరలను ఎక్కువచేసే ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఇస్తున్నారు. మధ్య తరగతి వారు, పేదవారు ఈ ఉచ్చులో పడి అధిక ధరకు ఉత్పత్తులు అవసరంలేకపోయినా కొంటున్నారు. మనకు ఆదాయం ఇవ్వని ఏ ఉత్పత్తి కోసం అప్పు చేయకూడదన్న నియమం పెట్టుకోవాలి.

నేటి యువత నెలకు ఒక మొబైల్ ఫోన్ కొంటున్నారు. ఇందుకు తగిన విధంగా విదేశీ కంపెనీలు రోజుకు ఒక మోడల్ మార్కెట్లో విడుదల చేస్తున్నాయి. అలాగే టీవీలు, గృ హోపకరణాలు లేటెస్ట్‌కావాలంటూ ఎడా పెడా తేలిక రుణ సౌకర్యంతో కొనేస్తున్నారు. ఇది కేవలం కుటుంబంపైనే ఆర్థిక భారం పడటమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుంది. నాణ్యతలేని దుస్తులు నేడు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు.

ఫ్యాషన్ పేరుతో ప్రతి వీధిలో గల్లీలో బట్టల దుకాణాలు వెలుస్తున్నాయి. ఐటి ఉద్యోగులు తమ విలాసవంతమైన జీవనం కోసం వచ్చిన రాబడి అంతా మాల్స్‌కే అంకితం చేస్తున్నారు. వీరిపై పాశ్చాత్య సంస్కృతి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ అలవాట్లన్నీ సేవింగ్ ఉద్యమానికి తూట్లు పొడుస్తున్నాయని గమనించాలి.

త్వరలో సేవింగ్స్ రక్షణ చట్టం

కేంద్ర ప్రభుత్వం త్వరలో సేవింగ్స్ ప్రొటెక్షన్ చట్టం తేనుంది. 1959 గవర్నమెంట్ సేవింగ్స్ సర్టిఫికేట్ చట్టం, 1968 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ చట్టం , 1873 గవర్నమెంట్ సేవింగ్ బ్యాంక్ చట్టాల స్థానంలో చిన్న మొత్తాల పొదుపు పథకాల కోసం ఒకే చట్టాన్ని తెచ్చేందుకు కృషి చేస్తుంది. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించేందుకు చట్టాన్ని మరింత సరళతరం చేయనుంది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాను అనారోగ్య పరిస్థితుల్లో పిల్లల ఉన్నత విద్యకోసం ఐదు సంవత్సరాలకు ముందే ఉపసంహరించుకునే అవకాశం, స్మాల్ సేవింగ్స్‌లో గార్డియన్‌కు సరిసమాన హక్కులు వర్తించేలా చర్యలు, చిన్నారుల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కొత్త చట్టం కృషి చేయనుంది. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు నామినిగా ఉన్న వారి హక్కుల పారదర్శకతపై సేవింగ్స్ ప్రొటెక్షన్ చట్టం దృష్టిసారించింది.

పొదుపు -మదుపు

పొదుపు మదుపు అక్క చెల్లెలు లాంటివి. మన కష్టార్జితాన్ని పొదుపు చేయడంతో పాటు వాటిని తగిన పథకాల్లో మదుపు చేసుకోవడం ఎంతో అవసరం. అందుకే కేంద్రం పలు చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది. వీటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా కాస్త వడ్డీ తక్కువైనా రిస్క్ ఉండదు.

పోస్టాఫీసు సేవింగ్స్, చిన్న మొత్తాల పొదుపు పథకాలతో పాటు ఇటీవల కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాండ్స్ మంచి పొదుపు పథకాలుగా చెప్పుకోవచ్చు. అయితే చాలామంది ఎక్కువ వడ్డీకి ఆశపడి చిట్ ఫండ్స్‌లో, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో పెట్టి నష్టపోయిన కేసులు ఎన్నో చూశాం. పేదవారు మధ్య తరగతివారు మదుపు విషయంలో జాగ్రత్త వహించాలి. ఆదాయం పెరిగే కొలది కాస్త ఈక్విటీ, డెట్, రియల్ ఎస్టేట్, గోల్డ్‌లోనూ పెట్టుబడులు విస్తరించుకోవచ్చు. చివరగా పొదుపు చేయడం జీవితంలో ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత మంచిదని గ్రహించాలి. ఆలస్యంగా ప్రారంభిస్తే మీ మీద ఆర్థిక భారం పెరగడమే కాకుండా అనుకున్న గోల్స్ సాధించలేరు. ఇంట్లో అత్యవసరాల కోసం అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోండి. అలా లేకపోతే కష్టకాలంలో ఉన్న డబ్బంతా కర్పూరంలా కరిగిపోతుంది. సేవింగ్ అకౌంట్స్‌లోనే ఎక్కువకాలం డబ్బు వృధాగా పడివుందా చూసుకోండి. ఇప్పుడు ప్రయివేట్ బ్యాంకులు మంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ అందిస్తున్నాయి. స్టాక్ మార్కెట్‌తో అనుసంధానం కాని, రిస్క్ లేని పథకాల్లో పెట్టుబడులు మంచి రిటర్న్స్ ఇస్తున్నాయి. కుటుంబానికి మంచి ఆరోగ్య బీమా పథకాన్ని తీసుకోండి. కార్పోరేట్ ఆసుపత్రులలో దోపిడి పెరిగిపోతున్న నేపథ్యంలో హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోతే లక్షల రూపాయలు వైద్యానికి చెల్లించి ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి రావచ్చు.

భవిష్యత్తు గురించి ఎవ్వరూ చెప్పలేరు కాబట్టి ఖచ్చితంగా పొదుపు మంత్రం పాటించి సుస్థిరమైన జీవితానికి పునాదులు వేసుకోండి.

పొదుపు మీ భవిష్యత్తుకు భరోసాగా గుర్తించండి.



- స్టెర్జి రాజన్ బందెల
ఆర్థిక విశ్లేషకులు

బీమా ఉంటే ధీమా

ఆర్థిక నిర్ణయాల్లో జీవిత బీమా తీసుకోవడానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. మనదేశంలో కేవలం 10శాతం మందికి మాత్రమే బీమా ఉంది. ఇప్పుడు మనం సంపాదించే దాంట్లో భవిష్యత్తులో ఎంత మిగులుతుందో మనకే తెలియనిప్రమాదాలు, ఇతర కారణాలతో చాలామంది జీవితకాలం తీరకముందే దురదృష్టవశాత్తు లోకం విడిచి వెలుతున్నారు. సంపాదించే కుటుంబ పెద్ద ఆకస్మిక మరణం పాలైతే ఆ కుటుంబం అంతా చెల్లాచెదురైపోతుంది. ఇంటి అద్దెలు కట్టడానికి జీవిత భాగస్వామికి ఇబ్బందులు ఎదురవుతుంటాయి.

అప్పులు చెల్లించడానికి, రోజు గడవడానికి మనం ఎంతగానో ప్రేమించే జీవిత భాగస్వామికి అంతులేని కష్టాలు వస్తాయి. అందుకే కుటుంబాన్ని సురక్షితంగా ఉంచేందుకు జీవిత బీమా తీసుకోవడం తప్పనిసరి. అదే మీరు యుక్తవయసులో ఉంటే ఇంకా అత్యవసరం.

అనివార్యం

మృత్యువు అనివార్యం. అలాంటి విపత్కర పరిస్థితిలో మీరు మీ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందివ్వాలంటే పాలసీ తీసుకోవడం మంచిది. చిన్న మొత్తానికే పాలసీ తీసుకున్న అది ఏదో ఒక సమయానికి అవసరం వస్తుంది. కుటుంబ రక్షణకు, క్రమశిక్షణగా డబ్బులు ఆదా చేసుకోవడానికి జీవిత బీమా అనువైన పనిముట్టు. ఇది డబ్బు మిగులుస్తుంది. జీవిత చక్రం తిరుగుతున్నా కొద్దీ అవసరాలు, ఆధారపడిన వారిని బట్టి బీమా పాలసీల అవసరం మారుతుంటుంది.

యుక్తవయసులో

జీవిత బీమా అనేది అనిశ్చితి ఆధారంగా ఉంటుంది. మీరు యుక్తవయస్సులో ఆరోగ్యంగా ఉన్నప్పుడు బీమా ప్రీమియం భారంగా అనిపించవచ్చు. కానీ మీరు అకస్మాత్తుగా అనారోగ్యం పాలైన తర్వాత బీమా తీసుకుందామంటే ప్రీమియాన్ని అమాంతంగా పెంచేస్తాయి కంపెనీలు. కొన్ని పాలసీలకు అనర్హులు కూడా అవుతారు. అందుకే ముందు బీమా తీసుకోవడం మంచిది. ముందే తీసుకుంటే కొన్ని రకాల రైడర్స్(అదనపు ప్రయోజనాలు) ఉండే అవకాశం ఉంటుంది. రైడర్స్ అనేవి బీమాదారుడికి అదనపు ప్రయోజనాలను కల్పిస్తాయి. ఉదాహరణకు ఒక వ్యక్తి పాలసీ తీసుకున్నాడని అనుకుందాం. అప్పుడే తనకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా ప్రీమియం కట్టలేనని ఒక రైడర్ ఎంచుకున్నాడు. దురదృష్టవశాత్తు ఆ వ్యక్తి అనారోగ్యానికి గురైతే ప్రీమియం చెల్లించలేని పరిస్థితి వస్తుంది. అప్పుడు మిగతా ప్రీమియం సంస్థే చెల్లిస్తుంది. ఇలాంటివి చాలా రైడర్స్ ఉంటాయి.

ఆదా

యూనిట్‌లింక్‌డ్ పాలసీలు తీసుకుంటే కట్టాల్సిన ప్రీమియం అధికంగా ఉంటుంది. కానీ ఆ డబ్బులతో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడతారు. ఆ డబ్బు విలువ పెరుగుతుంది. ఆ పాలసీ ద్వారా వచ్చే అదనపు ఆదాయాన్ని మీరు స్వీకరించవచ్చు. లేదంటే వాటాలను అమ్మి మొత్తం డబ్బు పొందవచ్చు.



పన్నుమినహాయింపు

ఎలాంటి జీవిత బీమా పాలసీ తీసుకున్నా ఆదాయపుపన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80సీ ప్రకారం మీరు కట్టిన ప్రీమియం మొత్తాన్ని రూ. 1.5 లక్షల లోపు మినహాయించుకోవచ్చు. ఆదాయపు పన్ను సెక్షన్ 10 డి 1961 ప్రకారం పాలసీదారుడు మృతిచెందిన తర్వాత వచ్చే మొత్తానికి ఎలాంటి పన్ను ఉండదు.

సెక్యూరిటీ

కొన్ని రకాల బీమా పాలసీలు మీకు, మీ కుటుంబానికే కాదు. మీ వ్యాపారానికి రక్షణగా ఉంటాయి. ఉదాహరణకు మీకో వ్యాపారసంస్థ ఉందనుకుందాం. మరో భాగస్వామి మీ వాటా కొనుగోలు చేశాడనుకుందాం. ఇప్పుడు వ్యాపార భాగస్వాములంతా కొనుగోలు, అమ్మకం ఒప్పందంలో ఉంటారు. సంబంధిత పాలసీ తీసుకుంటే భాగస్వామి చనిపోతే వారి వాటా అమ్మకుండానే నామినీకి సొమ్ము చెల్లించవచ్చు. జీవిత బీమా పాలసీలు రెండురకాలుగా ఉంటాయి. ఒకటి టర్మ్. రెండోది పెట్టుబడి తరహా. ప్రయోజనాలను బట్టి ఈ పాలసీలు ఉంటాయి. టర్మ్ బీమా అనేది మనం ముందుగా నిర్దేశించుకున్నంత కాలం ఉంటుంది. అంటే 10 ఏళ్లు, 20, 30 ఇలా.. ఇందులో బీమా చేయించుకున్న వ్యక్తి ఆ టర్మ్‌లో అనుకోని పరిస్థితిలో చనిపోతే బీమా మొత్తం నామినీకి అందుతుంది. సాధారణంగా టర్మ్ ముగిస్తే ఎలాంటి డబ్బులు రావు. ప్రీమియం చాలా తక్కువ ఉంటుంది. ఇక పెట్టుబడి కోసం చేసిన పాలసీలైతే టర్మ్ తీరిన తర్వాత ఏకమొత్తంలో డబ్బు చేతికి అందుతుంది. ఒకవేళ మధ్యలోనే పాలసీదారుడు మృతిచెందితే నామినీకి డబ్బు అందుతుంది. ఈ తరహా పాలసీలకు ప్రీమియం ఎక్కువ ఉంటుంది.

తక్కువ ప్రీమియం

అందరికీ బీమా అవసరం కాకపోవచ్చు. మన వద్ద సరిపడినంత అత్యవసర నిధి ఉంటే లేదంటే తల్లిదండ్రుల మీదనే ఆధారపడితే బీమా అంతా అత్యవసరం కాకపోవచ్చు. అదే మీరు ఏదైనా విద్యారుణం, అమ్మానాన్న తీసుకున్న రుణాల్లో భాగస్వామి అయి ఉంటే వెంటనే బీమా తీసుకోవడం మంచిది. ఒక్కరే ఉండి తక్కువ వయసులో ఉంటే ప్రీమియం రేట్లు తక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో బీమా ఏజెంటు మీకు అవసరం లేని పాలసీలు అంటగట్టే ప్రమాదం ఉంది. వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి.

ఆర్థిక సలహాదారు వద్దకు వెళ్లి మనకు సరిపడే బీమాను సూచించమంటే మంచిది. వారు మీ ఆస్తులు, అప్పులను పరిగణలోకి తీసుకొని ఎంత మొత్తానికి, ఎలాంటి అవసరమో చెప్తారు. మీకు పెళ్లికాకున్నా మీపైనే ఆధారపడ్డవారు ఉంటే బీమా తీసుకోవడం తప్పనిసరి. మనపై ఆధారపడ్డవారు ఉన్నట్టయితే ఎంత వయసులో పాలసీ తీసుకుంటే అంత మంచిదని ఫ్యూచర్ జనరల్ జీవితబీమా ఈసీవో ప్రదీప్ పాండే అంటున్నారు. యుక్తవయసులో ఉండి, చక్కని ఆరోగ్యంతో ఉంటే చాలా తక్కువ ప్రీమియం వర్తిస్తుందని చెబుతున్నారు.

రిటైర్‌మెంట్

ఉద్యోగానికి వీడ్కోలు పలికిన తర్వాత ఆదాయ ప్రయోజనాలను వదులుకోవాలని ఎవరు అనుకుంటారు చెప్పండి. అదే మీరు బీమా తీసుకుంటే ఉద్యోగ విరమణ తర్వాత నెలనెలా ఆదాయం పొందొచ్చు. పెన్షన్ ప్రణాళికలో క్రమానుగుణంగా పెట్టుబడులు పెట్టినట్టే బీమా పథకంలోను పెడితే విరమణ తర్వాత నిశ్చితంగా ఆదాయం పొందవచ్చు.

లక్ష్య సాధన


బీమాను దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాలు సాధించే పెట్టుబడిగా పరిగణించవచ్చు. బీమా పథకం నుంచి వచ్చే డివిడెండ్, క్యాష్ బ్యాక్ ద్వారా డబ్బు అందుతుంది. ఇంకా సుదీర్ఘ లక్ష్యాలైన సొంత ఇల్లు, రిటైర్‌మెంట్ ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇప్పుడు చాలా రకాల పాలసీలు వైవిధ్యమైన పెట్టుబడి అంశాలతో వస్తున్నాయి. అదే మనం స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే యూలిప్ లాంటి పథకాలు ఎంచుకుంటే దీర్ఘకాలంలో మనకు మంచి రాబడి అందుతుంది. అయితే ఇవి నష్టభయంతో కూడినవి కాబట్టి అన్నీ అంశాలను జాగ్రత్తగా పరిశీలించి ఎంచుకోవాలి.

అప్పులు తీర్చడానికి

కష్టాల్లో, కరవులో ఉన్నప్పుడు మన కుటుంబం ఇబ్బంది పడాలని ఎవరం కోరుకోము. అదే సరైన బీమా ఉంటే ఇంకా కట్టాల్సిన గృహరుణం, వాహన రుణం, వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డు బాకీలు చెల్లించవచ్చు. నిశ్చితంగా ఉండొచ్చు.


జీవితభాగస్వామికి

జీవిత బీమాలో ఇది అత్యంత కీలకమైన అంశం. సంపాదించే ఆ ఒక్కరూ పోతే ఆ ఇంటి ఇల్లాలు చాలా కష్టాలు పడాల్సి ఉంటుంది. ఎలాంటి ఆర్థిక ఏర్పాట్లు చేయకుంటే కుటుంబం, ఇల్లాలు ఇంకా పోయిన వారిపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఇలాంటి ఆపదలు రావాలని ఎవరూ కోరుకోరు. పిల్లలను పెంచి పెద్దచేయడానికి, వారికి విద్యాబుద్ధులు చెప్పించడానికి, ఇల్లు గడవడానికి డబ్బు ఉండదు. చాలా కష్టపడాల్సి ఉంటుంది. అదే జీవిత బీమా తీసుకున్నట్టయితే ఈ బాధలు ఉండవు. ఇంట్లో వారికి భరోసా ఉంటుంది.



రొమాంటిక్ థ్రిల్లర్ కథతో

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా మరో కొత్త చిత్రం ప్రారంభమైంది. వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంటినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు శ్రీనివాస్ ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. నాయికలు ఎవరన్నది త్వరలో ప్రకటించనున్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగింది. దర్శకులు వినాయక్, సి. కళ్యాణ్, కేఎస్ రామారావు, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ రామ్మోహన్ రావు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశం అనంతరం దర్శకులు శ్రీనివాస్ మాట్లాడుతూ....నేను కొన్నేళ్లుగా సహాయ దర్శకుడిగా పనిచేస్తున్నాను. ఇది నాకు దర్శకుడిగా తొలి చిత్రం. రొమాంటిక్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాను. నాకీ అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. మార్చి 2 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఇద్దరు కొత్త నాయికల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. త్వరలో వాళ్ల పేర్లు ప్రకటిస్తాం. అన్నారు. కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ...నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఇన్నాళ్లకు మంచి కథ కుదిరి సినిమా ప్రారంభించాం. నా కెరీర్‌లోనే కాదు ఇంతవరకు తెలుగు చిత్ర పరిశ్రమలో చూడని కొత్త కథాంశంతో ఈ సినిమా ఉంటుంది. కెమెరామెన్ ఛోటా కె నాయుడుతో మరోసారి పనిచేస్తున్నాను, థమన్ నా సినిమాకు తొలిసారి సంగీతాన్ని అందిస్తున్నారు. అన్నారు. ఛోటా కె నాయుడు మాట్లాడుతూ....దర్శకుడు శ్రీనివాస్ మాకో మంచి కథను, అంతకుమించి ఆశ్చర్యపరిచే కథనాన్ని వినిపించాడు. నిర్మాత భారీ బడ్జెట్‌లో సినిమా చేద్దామని ప్రోత్సహించారు. ఇది మంచి సినిమా అవుతుందని ఆశిస్తున్నాం అన్నారు.



దర్శకుడి పాత్రలో శ్రీకాంత్

శ్రీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రం రా..రా. నజియా నాయికగా నటించింది. హారర్ థ్రిల్లర్ కథతో విజి చెరిష్ యూనిట్ ఈ చిత్రాన్ని తెరకెక్కించింది. విజయ్ నిర్మాత కాగా...శ్రీమిత్ర చౌదరి సమర్పకులుగా వ్యవహరించారు. రా..రా...త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ....నేను తొలిసారి హారర్ కథలో నటిస్తున్న చిత్రమిది. పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ సినిమాలో హారర్ చిత్రాన్ని రూపొందించే దర్శకుడి పాత్రలో నటించాను. నన్ను ప్రేమించిన అమ్మాయి దెయ్యమని తెలుసుకుని ఆమె నుంచి ఎలా బయటపడ్డానన్నది కథాంశం. మనుషుల్లో మంచిని నన్ను చూసి ఆ అమ్మాయి తెలుసుకుని ఇష్టపడుతుంది. అయితే ఆమె దెయ్యమనే విషయం కథలో మలుపు. ఓ సందర్భంలో మనుషులే దెయ్యాలని ఆటపట్టిస్తారు,ఏడిపిస్తారు. ఇవన్నీ సరదాగా ఉంటాయి. పేరున్న హాస్యనటులు ఉన్నారు. మంచి పాటలున్నాయి. కొత్త నాయికలైనా బాగా నటించారు. ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది.

ఈ తరహా సినిమాలు చూస్తున్నారు కాబట్టి ఎక్కువగా రూపొందుతున్నాయి. రా..రా..నాకొక కొత్త తరహా అనుభవాన్ని ఇచ్చిన చిత్రం. ఇలాంటి సినిమా ఎప్పుడు వచ్చినా విజయం సాధిస్తుంది. సినిమా చూశాం. మాకు బాగా నచ్చిందీ సినిమా. ప్రేక్షకులకూ నచ్చుతుందని ఆశిస్తున్నాం. మా అబ్బాయిని రోషన్‌ను చిన్న వయసులో పరిశ్రమకు తీసుకొచ్చాం అనే భావన ఉంది. అయితే నాగార్జున గారిపై గౌరవంతో నిర్మలా కాన్వెంట్‌లో నటించేందుకు ఒప్పుకున్నాను. ఆ సినిమా ఫలితం ఎలా ఉన్నా....రోషన్ నటనపై మరింత ఇష్టం పెంచుకున్నాను. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో యాక్టింగ్ కోర్సు చదువుకుంటున్నాడు. మరో రెండు మూడేళ్లు ఆగి మళ్లీ రోషన్‌తో సినిమాలు చేయిస్తా. ఇక నేను హీరోగా రెండు మూడు చిత్రాలున్నాయి. ఇంతలో ఒక చిత్రంలో ప్రతినాయకుడిగా నటించాను. చాలా మంది అలాంటి పాత్రలకు అడిగారు కానీ అంగీకరించలేదు. ప్రస్తుతం హీరోగా చేస్తున్న సినిమాలు పూర్తయ్యాక తర్వాత ఎలాంటి పాత్రల్లో నటించాలన్నది నిర్ణయం తీసుకుంటా. అన్నారు.

రకుల్ తడబాటు

అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన రకుల్‌ప్రీత్‌సింగ్ నిన్నా, మొన్నటివరకు టాలీవుడ్‌లో సినిమాలపై సినిమాలు చేసిన సంగతి తెలిసిందే. కాలం ఎప్పుడూ ఒకే రీతిన ఉండదన్నట్లు టాలీవుడ్‌లో సినిమాలు సన్నగిల్లడంతో ఆమె తమిళ, హిందీ రంగాలపై దృష్టి సారించింది. అక్కడి సినిమాలు చేసినప్పటికీ తనను స్టార్ హీరోయిన్‌ను చేసిన తెలుగు చిత్ర పరిశ్రమను మరచిపోకూడదని ఆమె నిర్ణయించుకుంది. తెలుగులో ఎప్పుడు సినిమాలొచ్చినా చేసేందుకు తాను సంసిద్ధమేనని ఆమె కొన్ని సందర్భాలలో వెల్లడించింది కూడా. విన్నర్, జయ జానకి నాయక, స్పైడర్ చిత్రాలు అనుకున్నంతగా ప్రేక్షకుల ఆదరణను చూరగొనకపోవడంతో టాలీవుడ్‌లో ఆమెకు సినిమాలు సన్నగిల్లాయని అంటారు. మరోవైపు ఇతర భాషలలో బిజీ కావాలన్న రకుల్ ఆశయానికి ఇటీవల విడుదలైన బాలీవుడ్ చిత్రం కొంతమేరకు గండికొట్టింది. బాలీవుడ్‌లో నీరజ్‌పాండే దర్శకత్వంలో ఆమె నటించిన అయ్యారీ చిత్రం ఇటీవల విడుదలై, ఫ్లాప్ టాక్‌ను తెచ్చుకుంది. దాంతో బాక్సాఫీసు వద్ద ఆ చిత్రానికి ఓపనింగ్స్ బాగా రాలేదు. అంతేకాదు అంతకుముందు బాలీవుడ్‌లో రకుల్ నటించిన యారియాన్ చిత్రం కూడా బాక్సాఫీసు వద్ద తుస్సుమంది. ఇప్పటివరకు బాలీవుడ్‌లో ఆమె చేసిన రెండు ప్రయోగాలు ఫ్లాప్ అయ్యాయి. కాకపోతే తమిళంలో కార్తి సరసన నటించిన ధీరన్ అధిగారం ఒండ్రు చిత్రం తెలుగులో కాకి పేరుతో విడుదలై, రెండుచోట్ల విజయం సాధించింది. దాంతో తమిళంలో సూర్య, కార్తిల సరసన నూతన చిత్రాలలో నటించే అవకాశాలు ఆమెకు లభించాయి. ఇక బాలీవుడ్‌లో అజయ్‌దేవ్‌గన్ నటిస్తున్న ఓ చిత్రంలోనూ రకుల్ నటిస్తోంది. ఏదిఏమైనప్పటికీ టాలీవుడ్‌లో సినిమాలు సన్నగిల్లడం ఓ వైపు, బాలీవుడ్‌లో ఫెయిల్యూర్స్ రావడం మరోవైపు ఆమెకు చేదు అనుభవాలను మిగిల్చాయని పరిశ్రమలో అంటున్నారు.


రకుల్ ప్రీత్‌సింగ్


అల్లుఅర్జున్


మహేష్‌బాబు

స్టార్ హీరోల సర్దుబాటు

ఒకే రోజున రెండు భారీ చిత్రాలు విడుదలవడం తొలిరోజు వసూళ్లపై ప్రభావాన్ని చూపుతుంది. అది నిర్మాతలకు ఆర్థికంగా నష్టాన్నే తీసుకొస్తుంది. ఇలా నష్టపోకుండా టాలీవుడ్ పెద్ద నిర్మాతలు సయోధ్యకు వచ్చారు. మహేష్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న భరత్ అనే నేను, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న నా పేరు సూర్య చిత్రాల విడుదల తేదీలు మారాయి. వాస్తవానికి ఈ రెండు చిత్రాలు ఏప్రిల్ 26నే ప్రేక్షకుల ముందుకొస్తాయని ప్రచారం జరిగింది. ఇరు చిత్రాల నిర్మాతలు డీవీవీ దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీవాసు ఈ విషయంపై సమావేశమై చర్చించుకున్నారు. ఈ సమావేశంలో దిల్‌రాజు, కేఎల్ నారాయణ, నాగబాబు హాజరయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒకే తేదీన రావడం ఎవరికీ శ్రేయస్కరం కాదని నిర్ణయానికి వచ్చారు. సినిమా సినిమాకూ మధ్య కనీసం రెండు వారాల విరామ ఉంటాలనే నియమం ప్రకారం ఏప్రిల్ 20న భరత్ అనే నేను చిత్రాన్ని, నా పేరు సూర్య సినిమాను మే 4న విడుదల చేయాలని ఒప్పందానికి వచ్చారు. ఈ సందర్భంగా డీవీవీ దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ...ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాల గ్యాప్ ఉండాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 20న భరత్ అనే నేను, మే 4న నా పేరు సూర్య చిత్రాల్ని విడుదల చేయాలని నిర్ణయించాం. పరిశ్రమలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలనే అభిప్రాయంతో తీసుకున్న నిర్ణయమది. మా నిర్ణయానికి కథానాయకులకు, దర్శకులకు కృతజ్ఞతలు. అన్నారు. దిల్ రాజు, నాగబాబు, కేఎల్ నారాయణ మాట్లాడుతూ...సంక్రాంతి సీజన్ మినహాయిస్తే మిగతా సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య విరామం ఉండాలి. ఇద్దరు నిర్మాతల మధ్య సర్దుబాటు కుదరడం శుభ పరిణామం. అన్నారు.

ఆ కథనాల్లో నిజం లేదు


తన కొత్త సినిమాలకు సంబంధించి వస్తున్న కథనాల్లో నిజం లేదని హీరో నాగచైతన్య ట్వీట్ చేశారు. ప్రస్తుతం చందూ మొండేటి దర్శకత్వంలో సవ్యసాచి చిత్రంలోనూ, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న శైలజారెడ్డి అల్లుడు చిత్రంలోనూ నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ రెండు చిత్రాలు కాకుండా నూతన చిత్రాలేవీ తాను అంగీకరించలేదని ఆయన స్పష్టంచేశారు. తాను నూతనంగా ఓ చిత్రాన్ని అంగీకరించినట్లు వస్తున్న కథనాలు సత్యదూరమని, త్వరలోనే తన నూతన చిత్రాల విషయాన్ని తానే వెల్లడిస్తానని ఆయన పేర్కొన్నారు. సెట్స్‌పై ఉన్న రెండు చిత్రాలు విభిన్నమైనవి, వైవిధ్యమైనవని ఆయన చెబుతున్నారు. ఇదిలావుండగా...ప్రేమమ్ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత సాహసం శ్వాసగా సాగిపో చిత్రం చైతూను నిరాశపరచగా, రారండోయ్ వేడుక చూద్దాం వంటి విజయవంతమైన చిత్రం తర్వాత యుద్ధం శరణం నిరాశపరిచింది. ఇలా ఈ మధ్యకాలంలో ఒక హిట్, ఒక ఫ్లాప్ ఆయనను కలవరపెట్టినప్పటికీ, తాజాగా నటిస్తున్న రెండు చిత్రాలు వేటికవే ప్రేక్షకుల ఆదరణను చూరగొనే చిత్రాలన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.


నాగచైతన్య

సమ్మోహనం ఓ ఆకర్షణ

సుధీర్‌బాబు, అదితిరావు జంటగా నటిస్తున్న చిత్రానికి సమ్మోహనం అనే పేరు ఖరారు చేశారు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాత. దర్శకుడు మాట్లాడుతూ సమ్మోహనం అంటే మంత్రముగ్ధులను చేసే ఒక అందమైన ఆకర్షణ. మా చిత్రంలో హీరో హీరోయిన్ల మధ్య సమ్మోహనకరమైన రొమాన్స్ ఉండటంతో పాటు మిగతా పాత్రలకి ఉండే విభిన్నమైన ఆకర్షణలు మెప్పిస్తాయి. ఓ కొత్త పోకడ ఉన్న నవతరం ప్రేమకథా చిత్రంగా ఉంటూనే అద్యంతం హాస్యం, సజీవమైన కుటుంబ బంధాలు, ఉద్వేగ భరిత సన్నివేశాల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది అన్నారు.

నిర్మాత మాట్లాడుతూ ఇప్పటి వరకు మూడు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. తాజా షెడ్యూల్ మార్చి 3 వరకు జరుగుతుంది. ఆ తర్వాత జరిగే షెడ్యూల్ హిమాచల్ ప్రదేశ్, ముంబైలో చిత్రీకరిస్తాం. వివేక్ సాగర్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. మే మూడవ వారంలో సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు. ఇతర పాత్రల్లో నరేష్, తనికెళ్ల భరణి, పవిత్ర లోకేష్, కాదంబరి కిరణ్, హరితేజ నటిస్తున్నారు. ఛాయాగ్రహణం పి.జి.విందా.


అదితిరావు, సుధీర్‌బాబు


నేహాదేశ్‌పాండే, శివతాండేల్

వాడేనా గీతావిష్కరణ

శివతాండేల్, నేహాదేశ్‌పాండే జంటగా నటిస్తున్న చిత్రం వాడేనా. సాయిసునీల్ నిమ్మల దర్శకుడు. నిర్మాణి ఫిలిమ్స్ పతాకంపై ఓంసాయిరామ్ సమర్పణలో మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన దర్శక, నిర్మాత ఎన్.శంకర్ బిగ్ సీడీని విడుదలచేయగా, మరో అతిథిగా పాల్గొన్న నిర్మాత రాజ్ కందుకూరి థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ, ట్రైలర్, పాటలు, రీరికార్డింగ్ వంటివన్నీ బావున్నాయి. టైటిల్‌లో ఆసక్తిదనం ఉంటే సినిమా చూడాలన్న ఆతృత పెరుగుతుంది. అలాంటి ఆసక్తి ఈ సినిమా పట్ల కలుగుతోంది. మనం తరచుగా వాడే పదమే అయినప్పటికీ ఈ టైటిల్ చాలా క్యాచీగా ఉంది అని అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ, సైలెంట్‌గా వచ్చి మంచి విజయాన్ని సాధించే చిత్రంగా అనిపిస్తోంది. చిత్రబృందానికంతటికీ ఈ చిత్రం పేరు తెచ్చిపెట్టాలని కోరుకుంటున్నా అని అన్నారు. చిత్ర దర్శకుడు సాయిసునీల్ నిమ్మల మాట్లాడుతూ, ఎన్.శంకర్, రాజ్ కందుకూరి నాకు స్ఫూర్తి. అందుకే వారిద్దరినీ ఈ వేడుకకు ఆహ్వానించా. ఈ సినిమాకు రెండోభాగం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నేనే నాలుగు పాటలను రాయడంతో పాటు కొరియోగ్రఫీ కూడా చేశాను. నేను ఎవరి దగ్గరా పనిచేయలేదు. చాలా సినిమాలు చూసి, చాలామందిని ప్రేరణగా తీసుకుని ఈ సినిమాను చేయడం జరిగింది. కొత్తవాళ్లు చేశారని కాకుండా సినిమాలో విషయం ఉందో లేదో మాత్రమే చూడాలి. అదే కొత్త సినిమా పెళ్లిచూపులు నిరూపించింది. ఇది కూడా మంచి విషయం ఉన్న సినిమాగా నిలిచిపోతుంది అని అన్నారు. నిర్మాతల్లో ఒకరైన ధృవ్ మాట్లాడుతూ, పాటల విషయంలో చాలా సంతృప్తితో ఉన్నాను. దర్శకుడు మంచి క్వాలిటీతో సినిమాను తెరకెక్కించారు. పెద్ద సినిమాకు కష్టపడినట్లు కష్టపడ్డాం. ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుందని భావిస్తున్నాం అని అన్నారు. హీరోయిన్ నేహాదేశ్‌పాండే మాట్లాడుతూ, అడ్వెంచర్, ట్రెక్కింగ్ వంటివి ఈ సినిమాలో చేశాం. సినిమా చాలాబాగా వచ్చింది. అవకాశమిచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు అని అన్నారు. సంగీత దర్శకుడు కిరణ్ వెన్న మాట్లాడుతూ, ఇది నా తొలి చిత్రం. వందశాతం న్యాయం చేశాననే భావిస్తున్నా అని అన్నారు. ఇంకా ఈ వేడుకలో హీరో శివ తాండేల్, నిర్మాత మణిపాల్ మచ్చి, నటులు అజయ్‌ఘోష్, అపురూప్, టీఎన్ఆర్, రాకెట్ రాకేష్, గీత రచయిత కాసర్ల శ్యామ్, భీమేశ్వరచారి, లోబో, లిప్సిక తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ నేపథ్యంలో

పి.సి. క్రియేషన్స్ పతాకంపై మనోహర్ చిమ్మని దర్శకత్వంలో నమస్తే హైదరాబాద్ పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా నూతన గాయనీగాయకులను పరిచయం చేస్తున్నారు. సంగీత దర్శకుడు ప్రదీప్ చందర్ ఆధ్వర్యంలో గాయకులను ఎంపికచేసే కార్యక్రమం జరుగుతోంది. దర్శకుడు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆ ప్రాంతానికి చెందిన దర్శకుడిగా నేను రూపొందిస్తున్న తెలంగాణ చిత్రమిది. ఈ చిత్రంలో మంచి సందేశం ఉంటుంది. ఎంతో మందిని ఎన్నో విధాలుగా ప్రభావితం చేసిన చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరం నేపథ్యంలో నిర్మిస్తున్నాం. ఈ సినిమా కోసం తెలంగాణ నుండి గాయకులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వారిని ఎంపికచేస్తున్నాం అని తెలిపారు. సంగీత దర్శకుడు మాట్లాడుతూ తెలంగాణ యువతలో మంచి సంగీత పరిజ్ఞానం ఉన్న వాళ్ళ చాలామంది ఉన్నారు. వారిలో కొందరిని వెలికితీసే ప్రయత్నం చేస్తున్నాం అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం వీరేంద్రలలిత్, నిర్మాణం ప్రదీప్ చంద్ర, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం మనోహర్ చిమ్మని.

